Reffered Journal &
Peer Reviewed Journals

RNI No.
APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Web : www.bhavaveena.com

Vol : 23 Issue No. 07 Monthly July 2026 ISSN No. 2456-4702 Rs. : 15/-



## అల్లం రాజయ్య

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **జూలై - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***

Kolla Sri Krishnarao (Late)

***E-mail :***

bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 23 - Issue. 07 - July 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Former Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD, Dept. of Telugu
   Sri A.S.N.M. Govt. Degree College,
   Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002, Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# అల్లం రాజయ్య

తెలంగాణకు చెందిన ప్రముఖ విప్లవ రచయిత అల్లం రాజయ్య. ఆయన దళిత, పీడిత, రైతాంగ, శ్రామిక విముక్తి కోసం కలాన్ని ఆయుధంగా చేసుకుని నవలలు, కథలు, కవితలు, పాటలు, వ్యాసాలు, నాటకాలు రాశారు.

**జననం, కుటుంబ నేపథ్యం :**

జననం : 6 జూన్ 1952, జన్మస్థలం : కరీంనగర్ జిల్లా, మంథని తాలూకా గాజులపల్లి గ్రామంలో జన్మించాడు. తండ్రి : అల్లం నర్సయ్య, తల్లి: బుచ్చమ్మ. వీరికి ఇద్దరు తమ్ముళ్లు అల్లం వీరయ్య (టీచర్ పాటల రచయిత) అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్, నమస్తే తెలంగాణ మాజీ ఎడిటర్, తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్)

వీరు సాహితీ వేత్త మరియు రచయిత అల్లం రాజయ్య 1977 సెప్టెంబర్‌లో తొలి కథ రాశారు. ప్రజా ప్రతిఘటనోద్యమాల నేపథ్యంలో ఎదిగిన ఆయన ఇప్పటివరకు ఎనిమిది నవలలు, సుమారు వంద కథలు, అనేక కవితలు, పాటలు, వ్యాసాలు, నాటకాలు రచించారు.

**ప్రధాన రచనలు / రచనా శీర్షికలు :**

- కొలిమి అంటుకున్నది
- ఊరు
- అగ్ని కణం
- కొమరం భీం
- వసంత గీతం
- ఈతరం కోసం (కథాస్రవంతి సంపుటం, 2015)

ఆయన కథలన్నీ ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు, అక్కడి పేద రైతులు, రైతు కూలీలు, భూస్వాములు, కాంట్రాక్టర్లు, పోలీసులు, రాజకీయ బ్రోకర్లు, దోపిడీకి గురయ్యే పీడితుల జీవితాలను ప్రతిబింబిస్తాయి. ఆయన కథలు ఫాంటసీలు కావు; ప్రతి కథ వెనక ఒక నిర్దిష్ట సంఘటన ఉంటుంది. పాత్రలు వ్యక్తులు కాదు - దళిత, పీడిత వర్గాలకు ప్రతినిధులు.

**సాహిత్య దృక్పథం, ప్రభావం :**

అల్లం రాజయ్య రచనలు దళిత విముక్తి, రైతాంగ పోరాటాలు, శ్రామిక హక్కులు వంటి అంశాలపై కేంద్రీకరించబడ్డాయి. ఆయన కథల్లో వ్యక్తిగత విషాదం కూడా సామాజిక విషాదంలో భాగంగానే కనిపిస్తుంది. పాఠకులను ఆలోచింపజేయడం, ఉద్వేగభరితం చేయడం ఆయన రచనా శైలిలో ప్రధాన లక్షణం.

**మీడియా, ఇంటర్వ్యూలు :**

న్యూస్ హెరాల్డ్ టీవీ వంటి మీడియా సంస్థలు ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించాయి. అలాగే, చెరబండరాజు వంటి సాహిత్యవేత్తల జీవితం, వ్యక్తిత్వంపై ఆయన ప్రసంగాలు/వ్యాఖ్యానాలు కూడా వివిధ వేదికలపై జరిగాయి.

అల్లం రాజయ్య కలం ప్రస్తుత సమాజాన్ని ఆలంపజేసే రచనలు చేస్తుంది అని అనడం ఎంత మాత్రం సందేహం లేదు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ఓల్గా రాజకీయ కథలు - మహిళా చైతన్యం | - డా॥. దాసర విజయ కుమారి | 9 |
| 2. | తెలుగు వచన కవితా కథా కావ్యాలలో అన్యభాషా పద ప్రయోగాలు - ఒక పరిశీలన | - డా॥. ఇ. కోన ప్రభ | 22 |
| 3. | విలక్షణ భక్త కవి వడ్ల వెంకటాచార్యులు | - డా॥. వి. శంకరయ్య | 27 |
| 4. | సమకాలీన సాహిత్యం - వృత్తి జీవనంలో మానవ సంబంధాల కథలు | డా॥. ఎస్. రవి ప్రసాద్ | 33 |
| 5. | అముక్త మాల్యదలో మాలదాసరి సామాజిక జీవన వేదన : ఒక సమగ్ర పరిశీలన | - డా॥. పురుషోత్తం గణపతిరావు | 39 |
| 6. | తెలుగు సహజభాషా సంవిధానం (NLP) - బాలవ్యాకరణ సూత్రాల పునఃసమీక్ష : ఒక సమగ్ర సమాలోచన | - డా॥. వి. వి. సుబ్బారావు | 44 |
| 7. | విలాస కావ్యాలు - విజయ విలాసము విశేషాలు | - డా॥. చాట్ల కిషోర్ | 50 |
| 8. | జాతశ్రీ, నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ కథలు - కులవృత్తుల సామాజిక జీవన పరిస్థితులు | - జి. ప్రేమలత | 58 |
| 9. | కరీంనగర్ జిల్లా కథల్లో సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ | - డా॥. జ్యోతి అనుగుల | 64 |
| 10. | తెలంగాణ సంస్కృతి, సామాజిక దృక్పథ కథలు | - డా॥. సి.హెచ్. శేఖర్ | 70 |
| 11. | నాటి సామెతలు - నేటి కాలానికి చమత్కార అన్వయ పరిశీలన | - డా॥. బండి జగన్‌మోహన్ | 76 |
| 12. | తెలుగు సినిమాపై సాహిత్య ప్రభావం | - డా॥. శివయ్య రాజులపాటి | 81 |
| 13. | బంజారాల పాడుపు కథలు - ఆచార వ్యవహారాలు | - డా॥. తోట రామకృష్ణ | 86 |
| 14. | సామాజిక మాధ్యమాలు, సినిమాలు - జానపద గేయాల ప్రాముఖ్యత | - అద్దంకి శ్రీను | 91 |
| 15. | ప్రజా కళ - బుర్రకథ | - డా॥. లింగా శ్రీనివాస్ | 96 |
| 16. | తెలుగు - బంజారాల సామెతలు - ఒక పరిశీలన | - డా॥. భూక్యా వీరన్న | 103 |
| 17. | శేషప్ప త్రిశతి పూర్వకవుల ప్రభావం | - డా॥. గోలి శ్రీలత | 108 |

| | | |
|---|---|---|
| 18. ఉత్తర తెలంగాణ వాగ్గేయకారులు - గేయాల అధ్యయనం | - కొత్తపల్లి నవీన్ | 114 |
| 19. బాల గంగాధర తిలక్ గారి "అమృతం కురిసిన రాత్రి" - ఒక పరిశీలన | - మాచిరాజు దుర్గ | 118 |
| 20. ఎంకన్నను ఏడుకోలల బాయిలేసి గట్టిగా అరుసుకున్న నర్సన్న | - కళ్ళెం ధనోజ | 121 |
| 21. తెలుగు జానపద గీతాలు - సోషల్ మీడియా పాత్ర : ఒక విశ్లేషణ | - డోబిల విజయ<br>- జరుపుల రమేశ్ | 125 |
| 22. భూమి పుత్రుడు నవల - భాషా పరిశీలన | - డి. సరళ | 131 |
| 23. సాహిత్య సమాజంలో కవుల స్థానికతకు ప్రమాణాలు : జన్మస్థలమా? భాషా? ప్రాంతీయ చైతన్యమా? | - వొటారికారి సందీప్<br>- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 137 |
| 24. కస్తూరి మురళీకృష్ణ కథలు - అద్భుతరసం | - కర్ర రమేష్<br>- ఆచార్య జర్రా అప్పారావు | 146 |
| 25. షేక్ ఖాజావలి శ్రీ విశ్వనాథ శతకం - పరిశీలన | - బల్లంకి రాజశేఖర్<br>- ఆచార్య జర్రా అప్పారావు | 154 |
| 26. పల్లె జీవితాలకు అద్దం పట్టిన కథ - ఆక్రోశం | - అవ్వొల్లా అనీల్ కుమార్ | 159 |
| 27. చందమామ పత్రికలో భేతాళ కథల వైశిష్ట్యం - పరిశీలన | - కాపవరపు అనిల్ బాబు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 166 |
| 28. నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ "మా బతుకులు" కథా సంపుటి - ఒక సమగ్ర పరిశీలన | - దావనపెల్లి అనూష | 171 |
| 29. నిజామాబాద్ జిల్లా స్త్రీల సాహిత్యం ఒక పరిశీలన | - బాదరవేణి మహిపాల్ | 177 |
| 30. From "I" to "We": Collaboration and Collective Resistance in Dalit Feminist Life Writing | - Meenakshi | 185 |

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# ఓల్గా రాజకీయ కథలు – మహిళా చైతన్యం



డా॥. దాసర విజయ కుమారి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
సెల్ : 9491877705, E-mail : dasara.vijayakumar@gmail.com,
Vijaya_dasara@uohyd.ac.in

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం**

సమాజంలో స్త్రీలు అభివృద్ధిని సాధిస్తున్నట్టు అనిపించినా లింగ వివక్ష యధావిధిగా కొనసాగుతూనే ఉంది. కులం పరంగా, మత వ్యవస్థలో, సామాజిక జీవనంలో, కుటుంబ వ్యవస్థలో, స్త్రీలు పనిచేస్తున్న కార్యాలయాలలో పితృస్వామ్యం తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఇక్కడ పితృస్వామ్యం అంటే పురుషపెత్తనం. నేటి సమాజంలో స్త్రీలపై అత్యాచారాలు, వేధింపులు గృహహింసలు రోజురోజుకి పెరుగుతున్నాయనే విషయం అనేక ప్రసార మాధ్యమాల ద్వారా వెల్లడి అవుతుంది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని సందర్భాలలో సంఘర్షిస్తూ, రాజీపడుతూ, ప్రతిఘటిస్తూ, కొత్తపోరాట రూపాలను ఎన్నుకొంటూ, కొత్తచైతన్యాన్ని కూడగట్టుకుంటూ స్త్రీలు నిత్యజీవనం సాగిస్తున్నారు. ఆడపిల్ల పుట్టుకను అసహ్యించుకోవడం, భ్రూణ హత్యలకు పాల్పడే వ్యక్తుల వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొంటూ, అవరోధాలను అధిగమిస్తూ స్వయం సిద్ధులుగా స్త్రీలు తయారుకావడం వరకూ స్త్రీల జీవితంలోని ఎన్నో దశలు, స్థితులు, చలన చైతన్యాలు అన్నీ కథావస్తువులుగా ఉంటాయి. ఈ కథలను రాసిన వారుకూడ స్త్రీలే. ఓల్గా రాసిన రాజకీయ కథలలోని స్త్రీ చైతన్య పరిణామ క్రమాన్ని చర్చించడం ఈ వ్యాసంలోని ప్రధాన ఉద్దేశం.

**కీలకపదాలు**

మహిళాచైతన్యం, పితృస్వామ్యం, పురుషపెత్తనం, స్త్రీ చైతన్య పరిణామ క్రమం, స్త్రీవాద బావజాలం, భారతీయ పునర్వికాసదశ.

**ఉపోద్ఘాతం**

సృష్టిలో స్త్రీ పురుషులు సమానులయినా స్త్రీలు అన్ని రంగాలలోను వెనుకబడుతున్నారు. కాని వేదకాలం నుండి మహిళలకు అగ్రస్థానముంది. వారిలో రోమశ, లోపాముద్ర, విశ్వవార, శాశ్వతీ, అపారా, యమీ, వసుక్రపత్ని, ఘోషా, జుహు మొదలైనవారు మంత్ర ద్రష్టలు. అణులచ్చి, అసులద్జి, పహయీా, భేజ్జా, మాధవి, రేవా, రోహా, వద్దావహీ,

వోహా, ససిప్పహా మొదలైనవారు గాథాసప్తశతిలోని మహిళా రచయితలు. ఇంకా దక్షిణ సాహిత్యాన్ని పరిశీలిస్తే తమిళంలో కారైక్కాల్ అమ్మయార్, పొన్ముడియార్, నక్కణియార్, అవ్వైయర్, ఆండాళ్ మొదలైన వారు. కన్నడంలో అక్కమహాదేవి, నీలలోచనే, గంగాంబికె, లింగమ్మ మహాదేవమ్మ, సత్యక్క, హాళవనకట్టి, గిరియమ్మ, పోన్నమ్మ మొదలైనవారు ప్రాచీన కవయిత్రులు. 20వ శతాబ్దంలో అనేక సాహిత్య ధోరణులు వెలువడ్డాయి. వాటిలో స్త్రీవాద సాహిత్యం ఒక సంచలనాన్ని సృష్టించిందని చెప్పవచ్చు. స్త్రీవాద సాహిత్యం, సాహిత్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రాచీన సాహిత్యంలో కూడ అక్కడక్కడా స్త్రీవాద బావజాలం కనిపిస్తుంది. ఆ తరువాత భారతీయ పునర్వికాసదశలో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా స్త్రీలలో చైతన్యం వచ్చింది. తొలినాటి ఈ చైతన్యానికి గుర్తులుగా సరోజినీ నాయుడు, తోరుదత్ వంటి కవయిత్రులు మనకు కనిపిస్తారు. ఆ తరువాత కాత్యాయనీ విద్మహే, జయప్రభ, అబ్బూరి ఛాయాదేవి, రంగనాయకమ్మ, కన్నాభిరస్ వసంత, విమల మోర్తల, పి. సత్యవతి, మల్లాది సుబ్బమ్మ, భండారు అచ్చమాంబ, ఓల్గా, గోగుశ్యామలా, చల్లపల్లి స్వరూపరాణి మొదలైన వారు. స్త్రీ సమస్యలు భిన్నపార్శ్వాలలో ఉన్నాయి. వాటిని ఎలుగెత్తి చాటడానికి పునాది తెలుగు కథ అని చెప్పవచ్చు. ఓల్గా రాసిన రాజకీయ కథలు ఈ వ్యాసంలో చర్చనీయాంశాలు.

**రచయిత్రి పరిచయం**

ఓల్గా గా ప్రసిద్ధి చెందిన లలితకుమారి నవంబర్ 27, 1950 వ సంవత్సరం గుంటూరు జిల్లా, చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు పోపూరి వేంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ. ఆమె సహజ, స్వేచ్ఛ, మానవి, కన్నీటి కెరటాల వెన్నెల, ఆకాశంలో సగం, గులాబీలు, గగనమే, గమ్యం, యశోబుద్ధ మొదలైన నవలలు. రాజకీయ కథలు, ప్రయోగం, భిన్న సందర్భాలు, మృణ్మయనాదం, విముక్త కథలు మొదలైనవి. రచయిత్రి సంపాదకత్వంలో మాకుగోడలులేవు, నీలిమేఘాలు, నూరేళ్ళ చలం, సారాంశం, సరిహద్దులు లేని సంధ్యలు, మహిళావరణం, జీవితమే ఒక ప్రయోగం, అలజడి మాజీవితం, నవలా మాలతీయం, తడి ఆరని గాయాలు సమత మొదలైన కవితలు వెలువడ్డాయి. ఇంకా సామాన్యుల సాహసం, భూమి పుత్రిక, మిస్సింగ్, మూడుతరాలు, పుట్టని బిడ్డకు తల్లి ఉత్తరం, ఉరికొయ్యఅంచున, నేనూ సావిత్రిబాయిని, అక్షరయుద్ధాలు, పితృస్వామ్యం, నీల్ మాల్ కవిత్వం మొదలైన అనువాదాలు. యుద్ధం-శాంతి, లక్ష్మణరేఖ, ద్రౌపది వంటి నృత్యరూపకాలు. వాళ్ళు ఆరుగురు, చరిత్ర స్వరాలు మొదలైన నాటికలు. కొడుకో, తోడు, గాంధి మొదలైన సినిమాలు, ఆడపిల్లలం, పురిటినొప్పులు, ఒకపెళ్ళి కథ మొదలైన టెలిఫిలిమ్స్, వెలుగు నీడలు, సీతారామపురం అగ్రహారం, బాంధవులు, మానవి, రాణిగారి కథ వంటి సీరియల్స్. ఇంకా అనేక సవరించిన రచనలు, చలం రచనలపై విమర్శనాత్మక వ్యాసాలు, సారాంశం, సరిహద్దులు లేని సంధ్యలు వంటి సంకీర్ణ రచనలు కూడ చేశారు.

**సాహిత్య పురస్కారాలు**

1987 - ఉషోదయ పబ్లికేషన్స్ వారు ఉత్తమ నవల రచయిత అవార్డు స్వేచ్ఛ నవల

1990 - ఉదయం మాగ్జైన్ వారు ఉత్తమ నవల రచయిత అవార్డు.

1998 - ఆంధ్రప్రదేస్ వారు నంది అవార్డు, ఉత్తమ కథారచయిత తోడు కథ

1999 - తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ స్త్రీ రచయిత అవార్డు.

2014 - లోక్ నాయక్ పౌండేషన్ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు.

2015 - ఆమెరాసిన విముక్త కథల సంపుటి ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఎంపికైంది.

**రాజకీయ కథలు**

ఈ కథాసంపుటిలో 12 కథలున్నాయి. 1. సీతజడ కథ 2.కళ్ళుకథ 3.ముక్కుపుడక 4. నోర్ముయి కథ 5. రాతి గుండెలు 6. ఒక రాజకీయ కథ 7. ఆర్తి 8. పెళ్ళి, 9. భద్రత 10. గోడలు 11.ఎన్నికలలో 12. ఏం చేయాలి.

**సీతజడ కథ**

**పాత్రలు :** సీత వాళ్ళమ్మ, వాళ్ళ నానమ్మ, వదినలు, అన్నలు, స్నేహితురాలు సుభద్ర, భర్త ఇద్దరు పిల్లలు.

**ఇతివృత్తం :**

ఈ కథ మొత్తం సీత జడచుట్టూ తిరుగుతుంది. ఆ జడ వల్లే ఆకు గుర్తింపు వస్తుంది. సీతకు 60 ఏళ్ళ వయసులో ఒక జబ్బువచ్చి జుట్టు రాలిపోతుంటే, దానివల్ల ఆమె అనుభవించిన కష్టసుఖాలు ఒక్కసారి కళ్ళముందు తిరుగుతాయి. సీత తల్లి అనేక పోషక పదార్థాలను ఆ జుట్టుకు పట్టించేది. కానీ సీతకి ఒకసారి తన జుట్టుపై విరక్తి కలిగి గుండు కొట్టించుకుంటే బాగుండు అనిపిస్తుంది. వాళ్ళ అన్నయ్య ఎండాకాలం గుండు చేయించుకున్నప్పుడు ఆమెకు కూడ గుండు చేయించుకోవాలని అనిపించేది. ఒకసారి స్కూల్లో తప్పుచేసిన వారికి మాత్రమే గుండు చేయిస్తారని చెప్పిన విషయం గుర్తుకొస్తుంది. సీత జడమీద పెట్టిన శ్రద్ధ చదువుమీద పెట్టకపోవడంవల్ల ఫెయిల్ అవుతుంది. అందువల్ల ఆమెకు వివాహం చేస్తారు. కొంత కాలానికి ఆ జడకు అందించే పోషకాలు కేటాయించే కాలం చూసి అతను కూడ విసుగుచెందుతాడు. అప్పుడు సీత చాలా బాధపడుతుంది. ఆ తరువాత కొన్నిరోజులకు ఆమె భర్త చనిపోతాడు. ఇద్దరు పిల్లలుపుట్టాక భర్త చనిపోతే గుండు కొట్టించాలి అంటారు. సీత వాళ్ళ నానమ్మ, మరియు స్నేహితురాలు సుభద్ర, ఆమెకు గుండుచేయకుండ ఆపుతారు. కానీ ఆ తరువాత ఆ జుట్టుని ఎవరు పట్టించుకోరు. ఆమెకు వైధవ్యం వచ్చిన తరువాత ఆ జుట్టుకి నూనె రాయడానికి ఆమె వదినలు గేలిచేస్తుంటారు. ఆ జుట్టుని పోషించడంలో, నిర్లక్ష్యం చేయడంలో ఎంతమంది పెత్తనం చేశారు. ఆమె అనారోగ్యంగా ఉన్నపుడు అన్ని విషయాలు గుర్తుకు వస్తాయి. స్త్రీ జుట్టుని ఇంత గట్టిగా పట్టుకున్న సమాజం స్త్రీని ఇంకెంత గట్టిగా పట్టుకుంటుంది. ఆ పట్టులోనుంచి తప్పించుకోకుండా ఈ జుట్టులా పండి బలహీనమై రాలిపోవడమేనా అని ఆమె ఆలోచిస్తుంది.

**విశ్లేషణ :**

పై కథలో సీత తల్లి ఆమె జుట్టుకి ఎక్కువ పోషణచేస్తుంది. అందువల్ల ఆ జడ పొడవుగా పెరుగుతుంది. ఆ జడను చూసి ఆమె భర్త వివాహం చేసుకుంటాడు. ఆ తరువాత ఆ జుట్టు పోషణ, దానికి కేటాయించే సమయం చూసి విరక్తి చెందుతాడు. ఆమె భర్త భార్య మనసుకి విలువ ఇవ్వలేదు. ప్రాణం ఉన్న మనిషి కంటే అచేతనమైన, అశాశ్వతమైన జడకి ప్రాధాన్యతనిస్తాడు. అందుకే అతడు చివరి వరకు ఆమె పట్ల ప్రేమను కలిగి ఉండలేకపోయాడు. సీత భర్త చనిపోయిన తరువాత ఆమె వదినలు ఆ జుట్టుకి నూనె పెట్టడానికి విముఖత చూపుతారు. అంటే ఒక స్త్రీ భర్త చనిపోతే జుట్టు పెంచుకోకూడదు అనే అభిప్రాయం వారి మనసులో ఎంతో బలీయంగా నాటుకుంది. ఇక్కడ ఒకప్పటి సామాజిక నేపథ్యం వెల్లడి అవుతుంది. సీత నానమ్మ, ఆమె స్నేహితురాలు సుభద్ర ఆమె భర్త చనిపోయినపుడు గుండు చేయకుండా ఆపగలిగారు గానీ, మనుషుల ఆలోచనలను మార్చలేకపోయారు. స్త్రీ జడను కూడ పురుషుడితోనే ముడిపెట్టారు. ఈ కథలో రచయిత్రి సీత మనస్తత్వాన్ని, సామాజిక నేపథ్యాన్ని చాలా చక్కగా వివరించారు.

**కళ్ళు కథ**

**పాత్రలు :** కథానాయకురాలు, అమ్మ, వదిన, అన్న, రాముడు, (కల్యాణి, వాళ్ళ అక్క, వాళ్ళ నాన్న)

**ఇతివృత్తం :**

ఈ కథలో ఆడపిల్ల ఇంటి దగ్గర తల వంచితే, మళ్ళీ ఇల్లు చేరాకే తల ఎత్తాలి. ఆడపిల్లలు అరవకూడదు కన్నెత్తి ప్రపంచాన్ని చూడకూడదు. ఇలా అన్నింటికీ ఆంక్షలే. ఎందుకు అని ప్రశ్నిస్తే, గద్దింపులతో అణిచివేసే తల్లిదండ్రులు.

ఒకరోజు వాకిట్లో పెద్దగొడవ జరుగుతుంటే కథానాయకురాలు చూస్తుంది. అప్పుడే అక్కడకు వచ్చిన వాళ్ళ అన్నయ్య వచ్చి గబగబా ఇంట్లోకి లాక్కొచ్చి ఆడపిల్లవి భయంలేకుండ అట్లా నిల్చున్నావే అంటాడు. ఆ అరుపులు వింటేనే ఇంట్లో నుంచి వింటేనే నాగుండె దడ దడలాడుతుంది అని వదిన అంటుంది. కానీ కథా నాయకురాలికి భయం వేయలేదు అని చెబుతుంది. వాళ్ళ వదిన పిరికితనం చూస్తే వాళ్ళ అన్నయ్యకు ఎంతో ఆనందం. ఆమె ఎప్పుడూ అమ్మో నాకు భయం అని కళ్ళు మూసుకుంటుంది. ఏం లేదు అంటే కళ్ళు తెరుస్తుంది. ఆమె కళ్ళు కూడ చాలా అందంగా ఉంటాయి. కానీ ఏంలాభం ఎప్పుడు కళ్ళుమూసుకునే ఉంటుంది. కథానాయకురాలి అమ్మ, వదిన ఇంట్లోనుంచి బయటికి వస్తూనే తల ఎత్తకుండా వాళ్ళిద్దరు తల ఎత్తకుండ నేలవైపే చూస్తారు. ఆమె తల్లి ఆమెను అలా దిక్కులు చూస్తావేమని తిడుతుంది. అప్పుడామె తలవంచుకుంటుంది. నేలమీద చూడు అంటూ తలపై మొట్టికాయ వేస్తుంది. ఆమె తన ఒంటిని చూసుకున్నా అప్పుడే అమ్మ కేకలేస్తుంది. ఏంటా చూడడం అని పెద్ద అవుతున్నకొద్దీ మగవాళ్ళను అసలు చూడకూడదు. తన తోటి అబ్బాయి అయిన రాముడితో పదేళ్ళ వరకు ఆడుకోనిస్తారు. రెండేళ్ళ తరువాత ఆడుకోనివ్వరు. ఆడపిల్ల కళ్ళవెంట నీళ్ళు రాకపోతే రాతిగుండె చుక్కనీళ్ళుకూడ రావడంలేదు అంటారు. వాళ్ళ అన్నయ్య, వదిన, అమ్మానాన్న గొడవపడినప్పుడు ఆడాళ్ళే ఏడుస్తారు. ఈ కథలో కథానాయకురాలికి ఏడవడం ఇష్టం ఉండదు. ఎందుకంటే ఏడిస్తే కళ్ళకి పెట్టుకున్న కాటుక ముఖమంతా నల్లగా అవుతుంది. కాబట్టి తాను ఎప్పుడు ఏడవను అనుకుంటుంది. వాళ్ళ ఇంట్లో ఆడవాళ్ళు కళ్ళతో చూసిన నిజాన్ని కూడా అబద్ధంగా చెబుతారు. ఒకరోజు కథానాయకురాలి ఇంటికి ఆమె అన్నయ్య ఆఫీసు నుండి ఒకస్త్రీ వస్తుంది. ఆమె తన తల్లికి నచ్చదు ఎందుకంటే ఆ స్త్రీ బొట్టుపెట్టుకోదు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. ఆమె బొట్టులేని ముఖం నేను చూడలేను అని తల్లి అంటుంది. అప్పుడు కథానాయకురాలు నేను కూడ అమ్మ అంత అయితే నాకళ్ళు కూడా అమ్మకళ్ళ లాగా మారిపోతాయేమో! అనిపిస్తుంది. ఆమె తల్లి ఆమెను ఎక్కడెక్కడవన్నీ నీకళ్ళకే కనిపిస్తూ ఉంటాయి అంటుంది. కానీ అమ్మకళ్లకు ఏమి కనిపించినా కనిపించినట్టు కనబడనట్టు పట్టించుకోకుండ వెళ్ళిపోతుంది.

**విశ్లేషణ :**

సమాజం స్త్రీకి కొన్ని ప్రత్యేక లక్షణాలను అంటగట్టి. ఆమె చుట్టూ ఒక వలయాకారాన్ని గీసి, అందులోనే ఆమె జీవించాలి అని భావించింది. స్త్రీలు కూడ ఆ వలయంలో జీవించడానికి అలవాటు పడిపోయారు. ఆ విషయాలు ఈ కథలో స్పష్టంగా వ్యక్తమవుతున్నాయి. ఆడపిల్ల ఇంటి నుండి బయటికి వెళ్ళేటప్పుడు తలవంచుకుని మరల ఇంటికి వచ్చిన తరువాతే తలఎత్తాలి. స్త్రీ తాను చూసిన సంఘటనల గురించి ఇంటిలో చెప్పకూడదు. బయట ఏమి చూసినా చూడనట్టే వెళ్ళిపోవాలి. స్త్రీ ఏడవాలి అని భావించడం, భార్య కన్నీటిని చూసి ఆనందపడడం, స్త్రీ తలవంచుకుని ఒద్దికగా ఉండాలి. స్త్రీలు భయపడాలి వంటి పురుషాధిక్య భావజాలం గల సమాజం స్త్రీ పై ఆంక్షలు విధించింది. ఈ కథలో కథానాయకురాలు అందుకు భిన్నంగా ఆలోచిస్తుంది. వాకిట్లో వేరే వాళ్ళు అరుచుకున్నప్పుడు ఆ కేకలు విన్నా ఆమెకు భయంవేయలేదు. ప్రతి చిన్నవిషయానికి ఏడవదు. తాను బయట చూసిన విషయాల గురించి తన తల్లితో చర్చిస్తుంది. ఆమె చైతన్యవంతంగా ఆలోచిస్తుంది.

**ముక్కుపుడక కథ**

**పాత్రలు** : రమ, తల్లి, తండ్రి, నాయనమ్మ (స్నేహితులు శైల, మల్లికా, శోభ) సావిత్రి, సత్యనారాయణ

**ఇతివృత్తం :**

ముక్కుపుడక కథలో ప్రదానపాత్ర రమ, ఆమె ముక్కు కుట్టించుకోవడంవల్ల ఎదుర్కొనే సమస్యలు వాటిని అన్నింటినీ అనుభవించిన స్త్రీ. ఆమె ముక్కుపై ఇంట్లో వాళ్ళు, సమాజంలో వ్యక్తుల పెత్తనం ఎక్కువవుతుంది. ఆడపిల్లకు ముక్కుపుడకే అందం అని రమ నాయనమ్మ ఆమెకు బలవంతంగా ముక్కు కుట్టిస్తుంది. అది సరిగా

కుట్టకపోవడంవల్ల సెప్టిక్ అయ్యి ముక్కు మీద మచ్చ ముఖమ్మీద అందవిహీనంగా ఉండేది. ఆమెకు పదేళ్ళ వయస్సులో నాయనమ్మ చనిపోతే ఆ బేసరి రమ ముక్కుకి పడుతుంది. రమ తల్లి, ఊరిలో వాళ్లు వెక్కిరించడంవల్ల రమ దానిని తీసి పెట్టెలో పెడుతుంది. ఈ కథలో ప్రతి ఆడపిల్లకి తన ముక్కు గురించే బెంగ. అంతేగాక ఆడపిల్ల చదువు విషయంలో కూడ వివక్ష. అద్దెకున్న వాళ్ళు ఇంటి ముందు పెద్దచెట్లు నాటరు. ఎందుకంటే అవి పెద్దయ్యాక ఫలాలను యజమాని అనుభవిస్తాడు గాని, వారు అనుభవించరు కదా! అందుకే ఆడపిల్లకి కూడ మంచి చదువులు ఎలాగూ పెళ్ళి చేస్తే వేరే ఇంటికి వెళ్ళిపోతుందికదా! అని. రమ పదవ తరగతి చదువుతున్న దగ్గర నుండి పెళ్ళి సంబంధాలు చూస్తారు. కాని వారందరు ఆమె ముక్కుకే వంక పెడతారు. కాని ఆమె పెళ్ళిమాత్రం కుదరదు. ఆమె తన చదువు పూర్తిచేసి చిన్న ఉద్యోగం చేస్తున్న సమయంలో అతికష్టంగా ఒక సంబంధం కుదురుతుంది. పెళ్ళికొడుకుకి ముక్కుపుడక అంటే ఇష్టం. కానీ రమకు ముక్కుపుడకలేదు. రమ ముక్కు కుట్టించుకోమంటే అసలామె ముక్కు మీద అతని అధికారం ఏమిటి? అని అసలు రమ ఆ పెళ్ళి చేసుకోను అంటుంది చివరికి.

**విశ్లేషణ :**

ఈ కథలో రచయిత్రి ఒక స్త్రీ ముక్కు పుడకమీద కుటుంబం మరియు సమాజపు పోకడ ఎలా ఉందో కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. యుక్తవయసు వచ్చిన స్త్రీ ముక్కు కారణంగా ఎన్ని అవమానాలు భరించిందో సహజ సిద్ధంగా చిత్రించారు. సమాజంలో ఆమె గుణం కంటే అందానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు.

## నోర్ముయ్ కథ

**పాత్రలు** : జానకి, అమ్మ, నాన్న, అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ, అత్త, మామయ్య, పిన్ని, బాబాయ్, అన్నలు, తమ్ముళ్ళు, వెంకట్.

**ఇతివృత్తం :**

ఈ కథలో కథానాయకురాలు జానకి తన మనసులోని మాటను వ్యక్తపరిచే సందర్భంలో అందరూ అణచివేసేవారు. జానకి చిన్నతనంలో ఎక్కడ ఏమి చూసిన పట్టలేని సంతోషమో కోపమో బాధో కలిగేవి వాటిని అమ్మకో, నాన్నకో చెప్పాలని పరిగెత్తేది, వాళ్ళు వెంటనే నోరు మూసుకుని అవతలికి పో ఎక్కడలేని సంగతులు నీకే కావాలి అనేవారు. జానకి అత్త ఆడపిల్లకు అంత నోరు పనికిరాదు అనేది. అప్పుడు జానకి అద్దం ముందు నిలబడి చూసుకుంటే ఎర్రని పెదవులతో బుల్లి నోరు కనిపించేది. అంత చిన్న మూతిని పట్టుకుని ఎందుకు అలా అంటారు అని బాధపడేది. జానకి అన్నదమ్ములు బయట తిరిగి వేళకు వచ్చి తిని హాయిగా నిద్రపోవడం, హాయిగా అరుచుకుంటూ మాట్లడం అన్నీ చూసి మగపిల్లలకు ఉన్న స్వేచ్ఛ ఆడపిల్లలకు లేదు అనుకునేది. ఆమెకు ఊహ వస్తున్నకొద్ది పెద్దఆడవాళ్ళను కూడ మగవాళ్ళు నోర్మయి అంటారని తెలిసింది. జానకి తండ్రి భార్యను, తన తల్లిని కూడ చాలాసార్లు నోరు మూసుకోండి అనేవాడు. ఆడపిల్లలు ఎదుగుతున్నకొద్దీ తోటి ఆడపిల్లలతో నెమ్మదిగా మాట్లాడాలని, మగవాళ్ళ దగ్గర నోరుమూసుకుని ఉండాలని జానకి అనుకుంటుంది. ఆమెకు కొన్నాళ్ళకు మంచి అందగాడు, ఉద్యోగస్తుడైన వ్యక్తితో వివాహమవుతుంది. ఆమె అతని దగ్గర కూడా మౌనంగా ఉండేది. కొంత కాలానికి అతనికి కబుర్లు చెప్పడమంటే ఇష్టమని తెలుసుకుని, తన భర్తకి రోజూ కబుర్లు చెప్పేది. అది ఆమెకు నాలుకకి, పెదవులకు యుద్ధం జరుగుతున్నట్లు అనిపించేది. జానకి భర్త ప్రతిరోజు కబుర్లు వింటూ విసుగు వచ్చి, ఒకరోజు నోర్మయి అంటాడు. ఆ పదం వినగానే ఆమెకు విపరీతంగా నవ్వు, కళ్ళవంట నీరు వస్తుంది. అప్పుడు అతను ఇదేంటి ఇలా చేస్తున్నావ్ అని అడుగుతాడు. అప్పుడామె నా ఏడుపుని నవ్వురూపంలో ప్రదర్శిస్తున్నాను అంటుంది. జానకి చిన్నతనం నుంచి యుక్తవయస్సు వచ్చే వరకు జరిగిన విషయాలన్నీ భర్తతో చెబుదాం అనుకుంటుంది. అప్పుడు అతని నోటి

నుండి నోర్మూయి అనే పదం వినబడుతుంది. అప్పటి నుండి ఆమెకు నోర్మూయి అనే శబ్దం చెవులలో మార్మోగినట్టు అనిపిస్తుంది.

**విశ్లేషణ :**

సమాజంలో, కుటుంబంలో స్త్రీకి స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కూడ లేదని, ఆ సందర్భంలో ఆమె మనోభావాలు ఏవిధంగా ఉంటాయో రచయిత్రి చాలా వాస్తవికంగా చర్చించారు. ఈ కథలో జానకిని చిన్నతనం నుండి తల్లిదండ్రులు, వాళ్ళ అత్త మౌనంగా ఉండాలని, ఆడపిల్ల గట్టిగా మాట్లాడకూడదని ఆంక్షలు విధిస్తారు. జానకి భర్తకు కబుర్లు చెప్పడం ఇష్టమని తెలిసి, ఆమె తన చిన్ననాటి విషయాలన్ని అతనితో చెప్పాలనుకుంటుంది. చివరికి అతను కూడ నోర్మూయి అనడంతో ఆ పదం ఆమె చెవులలో మార్మోగుతూ ఉంటుంది. సమాజంలలో స్త్రీ పురుషుడికి నచ్చినప్పుడు మాత్రమే, అతనికి నచ్చిన విధంగా మాట్లాడాలనేది ఈ కథ ద్వారా రచయిత్రి వ్యక్తం చేశారు. సామాజిక నేపధ్యాన్ని రచయిత్రి ఈ కథలద్వారా వ్యక్తం చేశారు. కేవలం కుటుంబంలోనే కాక స్త్రీలు ఉద్యోగం చేసే కార్యాలయాలలో తమకు జరిగిన అన్యాయాన్ని స్త్రీ ఎవరికీ చెప్పకూడదని పై అధికారులు నిర్బంధిస్తుంటారు. అదే పని పురుషులు చేసినప్పుడు వారిని అడగడానికి కూడ ఆ అధికారి భయపడతాడు. స్త్రీలు ఎలా మట్లాడాలి, ఏమి మాట్లాడాలి అనే విషయాన్ని కూడ ఆ అధికారులే దిశానిర్దేశం చేస్తారు. ఇది కేవలం స్త్రీలకు మాత్రమే. పురుషాధిక్య భావజాలంగల కార్యాలయాలలో పనిచేసే స్త్రీలు ఇటువంటి సమస్యనే ఎదుర్కుంటున్నారు.

**రాతి గుండెలు కథ**

**పాత్రలు** : సుశీల, భర్త, పిల్లలు, ముసలి తల్లిదండ్రులు, శంకరం, మామయ్య, అత్తయ్య, పక్కింటి పిన్ని, బాబాయ్, డాక్టర్ హేమ

**ఇతివృత్తం :**

ఈ కథలో కథానాయిక సుశీల సహజ సిద్ధమైన తన అవయవాల వల్ల అనేక సమస్యలు ఎదుర్కునేది. ఆమెను తల్లిదండ్రులు స్వేచ్ఛలేకుండా పెంచారు. సుశీల తల్లికి ఏమైనా చెబుదామంటే పట్టించుకునేది కాదు. ఆడపిల్ల పెరిగే వయసుతో బాటు ఆమె శరీరంలో వచ్చే మార్పుల గురించి అవగాహనలేని చిన్న వయసు నుండి మనవాళ్ళ దృష్టిలో కామవాంచలు కలిగించే స్తనాల వల్ల బాల్యం నుండి టీచర్, మామయ్య, పక్కింటాయన ఇలా అందరి ప్రవర్తన వల్లా - పెళ్ళయ్యాక భర్తవల్ల తన దౌర్భల్యానికి కారణమైన స్తనాల మీద విరక్తి ఆమెకు. ఒక తల్లి పిల్లలకు పాలివ్వాలన్నా ప్రైవసీ ఇవ్వక ఆబగా చూసే జనాల కారణాన, స్తన్యమే ఎండిపోయిన అమ్మకథ. చివరికి కేన్సర్ వచ్చి స్తనాలను తొలగించేయాల్సి వస్తే, ప్రీ కౌన్సిలింగ్ లో డాక్టర్ తో వీటి పీడ వదిలితే ఆనందమే అని చెబుతూ ! నేను నా ఇద్దరు పిల్లలకు పాలివ్వలేదు. అందుకేనా నాకు కేన్సర్ వచ్చింది? అంటూ గిల్టీగా అడిగే అమ్మ రాతి స్తనాల వెనక ఉన్న ఓ హృదయం గురించి. సుశీల ఎప్పటికీ మరిచిపోలేని రోజు ఆమె ఎంతో శ్రద్ధగా లెక్కలు చేస్తున్నప్పుడు అటుగా వచ్చిన టీచర్ ఆమె గుండెల వంక చూసి ఇంకా బ్రా వేసుకోవడంలేదేం అని అడగడం. అతడు వెకిలి నవ్వుతో ఇక ఓణీలేసుకోవాలి అనడం. అలాగే సుశీల మామయ్య కూడ ఒక ఆమె గుండెల మీద చెయ్యి వేసి నొక్కి ఏమీ తెలియనట్టు అక్కచెప్పూ అంటూ ఇంట్లోకి వెళతాడు. అదేవిధంగా పక్కింటి బాబాయి పిన్నిగారికోసం వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు ఆమెను బలవంతం చేస్తాడు. ఆమె అతనిపై తిరగబడి పిడిగుద్దులు గుద్దితే అప్పుడు విడిచి పెడతాడు. ఆమెకు వివాహమైన తరువాత భర్తకు కూడ ఆమె కంటే ఆమె అవయవాల మీదే ఎక్కువ ప్రీతి. పై సంఘటనలన్నింటి వల్ల సుశీలకు తన శరీరంపై విపరీతమైన ద్వేషం. ఆమెకు పిల్లలు పుట్టినా కూడ స్త్రీకి సహజసిద్ధంగా మాతృత్వంలో వెలువడే పాలు లేకుండా పోతాయి.

**విశ్లేషణ :**

ఒక ఆడపిల్ల ఎదుగుతున్నప్పటి నుంచి ఆమెను పురుషుడు విలాస వస్తువుగానే చూస్తాడు. ఆమె అవయవాలను తాకడం, అశ్లీలంగా మాట్లాడడం చేస్తుంటాడు. పురుషుడి వెకిలి చేష్టలకు బలైపోయిన స్త్రీ కథను రచయిత్రి రచించారు. సమాజంలో అడుగడుగునా స్త్రీకి ఇటువంటి సంఘటనలు ఎదురవుతూనే ఉంటాయి. ఈ కథలో సుశీలకు ఎదురైన సంఘటనలవల్ల ఆమె తన ఉనికిని కోల్పోతుంది. సమాజంలో పురుషులు ఆమె పట్ల ప్రవర్తించిన తీరుకు ఆమె తల్లి అయినపుడు పాలు కూడ ఏర్పడని పరిస్థితి.

**ఒక రాజకీయ కథ**

**పాత్రలు** : మధుసూదన్ తన భార్య, తల్లి, స్నేహితులు

**ఇతివృత్తం :**

ప్రజలపై పొలిటికల్ లీడర్ల పెత్తనం ఏ విధంగా ఉంటుందో ఈ కథలో భర్త భార్యపైన అదేవిధంగా పెత్తనం చేస్తాడు. అందువల్ల రచయిత్రి ఈ కథకు రాజకీయకథ అని పేరు పెట్టారు. మధుసూదన్ ఓ ప్యాక్టరీలో పని చేస్తుంటాడు. అతని భార్య వాళ్ళ దాంపత్య జీవితం గురించి ఎన్నో కలలు కంటుంది. అతనితో ఎంతో అన్యోన్యంగా ఉంటుంది. ఉద్యోగ నిర్వహణలో అతని చేతివేళ్ళు తెగిపోతాయి. ఆ సమయంలో అతనికి అండగా ఉండి భార్య సపర్యలు చేస్తుంది. యూనియన్ వారి అండ, భార్య సేవలు అతనిని మామూలు మనిషిని చేస్తాయి. కానీ భార్య గర్భం ధరించాక ప్రమాదవశాత్తు అబార్షన్ జరిగి, గర్భసంచి కోల్పోతుంది. ఆ సమయంలో ఆమెకు భర్త, అత్తమామలు, కన్నవారూ ఎవరూ అండగా నిలవరు. ఒక భర్త తన జీవిత భాగస్వామికి మానసిక ఆసరా అవసరమైనప్పుడు తోడుగా ఉండకుండా ఆమెకు విడాకులిచ్చి, మరో పెళ్ళిచేసుకుంటాడు. అప్పుడు సమాజం ఆమె కెందుకు సాయపడదో అర్థంకాదు. ఈ క్రమంలో ఆమెలో కలిగిన సంఘర్షణ, ఆలోచనలను ఓల్గా ఈ కథలో హేతుబద్ధంగా చిత్రించారు.

**విశ్లేషణ :**

పై కథలో మధుసూదన్ యాక్సిడెంటల్ గా చేతివేళ్ళు కోల్పోయినప్పుడు, అతని భార్య అండగా ఉండి సేవ చేస్తుంది. కానీ ఆమెకు అబార్షన్ జరిగి యాక్సిడెంటల్ గా గర్భసంచి తొలగించినప్పుడు అతను ఆమెకు మానసిక ధైర్యాన్ని ఇవ్వకపోగా రెండో పెళ్ళికి చేసుకుంటాడు. ఈ కథలో ఇద్దరికి అనుకోకుండా జరిగిన సంఘటనలే. కానీ స్త్రీ అతనిని విడిచి వెళ్ళాలి అనుకోలేదు. కానీ పురుషుడు ఆమె జీవితం నుండి పూర్తిగా వైదొలగాలనుకుంటాడు. ఒక స్త్రీ పై ఎవరి ప్రచారం వాళ్ళుచేస్తూ రాజకీయ నాయకులవలె పెత్తనం చేస్తారు. ఈ కథలో పురుషుడి అవయవం తొలగించినపుడు స్త్రీ దానిని లోపంగా భావించలేదు. కానీ స్త్రీ అవయవాన్ని తొలగించినప్పుడు మాత్రం పురుషుడు తనకు తీరని నష్టం జరిగినట్టుగా భావిస్తాడు. ఇక్కడ పురుషుడి ఆలోచన, పురుషాధిక్య భావజాలానికి ప్రతీక.

**ఆర్తి కథ :**

**పాత్రలు** : కథానాయిక, తల్లిదండ్రులు, అన్నయ్య, భర్త, అత్త, స్నేహితులు, సుశీల, సుజాత, కరుణ

**ఇతివృత్తం :**

ఆర్తి కథలో సీత తల్లిదండ్రులు ఆమెకు స్వేచ్ఛ లేకుండా అనేక నిబంధనలు పెట్టేవారు. సీతకి ఒక మేనత్త ఉండేది. ఆమె అత్తగారింట్లో ఆరు నెలలు ఉంటే, వీళ్ళింట్లో ఆరునెలలు ఉండి పెత్తనం చేసేది. సుశీల వాళ్ళ అన్నయ్య స్వేచ్ఛగా తిరిగేవాడు. ఆమె తన సోదరుని చూసి పురుషులకు ఉన్న స్వేచ్ఛ ఆడపిల్లలకు లేదు అని అనుకుంటుంది. సుశీల స్నేహితురాళ్ళు సుజాత, కరుణ ఎప్పుడు అబ్బాయిల గురించి మాట్లాడుకునే వారు. సుశీల మగవాళ్ళ గురించి మాట్లాడుకోకూడదు అని తన స్నేహితులతో అంటుంది.

పై కథలో భార్యా భర్తలు విడాకులు తీసుకున్న అనంతరం తండ్రే చట్టప్రకారం సంరక్షకుడు. ఇప్పటికీ అదే న్యాయం. భార్య మీద కక్ష కట్టి సంతానాన్ని తనతో తీసికెళ్ళి తల్లికి గర్భశోకం కలిగించే భర్త. తమ సంతానానికి వేళకి అన్నం పెట్టాడో లేదో, చదివిస్తున్నాడో లేదో, వారికి ఆరోగ్యం బాగులేనప్పుడు ఎలాచూస్తాడో అని బెంగ పెట్టుకుని, ఆ రంపపు కోత భరించలేని తల్లికి లాయర్ ఈ విధంగా చెబుతాడు. "పొలం కౌలుకి తీసుకున్నామనుకో ... ఫలసాయం మీద హక్కు ఎలా అయితే యజమానిదో... పిల్లలమీద హక్కు కూడా తండ్రిదే, నువ్వుకేవలం క్షేత్రానివి. నీ స్థానం అదే! నువ్వు స్త్రీవనీ నీ బిడ్డలు నిన్ను చీల్చుకుని పుట్టారనీ, నీస్తన్యం, నీ రక్త మాంసాలని తాగి పెరిగారనీ న్యాయం గుర్తించదు. అనీబిసెంటుకే తప్పలేదు ఈ మాతృశోకం. అప్పుడు ఆ స్త్రీ "మేము తల్లులం కాదు -- ఆవులం, మేము చెల్లెళ్ళం కాదు -- గేదెలం, మేము ఇల్లాళ్ళం కాదు -- పందులం, మేం దేవతలం కాదు- పొలాలం. మాకే హక్కులేదు. మేం పెళ్ళాడాలన్న మా ఇష్టం కాదు. పెళ్ళిని కాదనాలన్న మా ఇష్టం కాదు. అంతెందుకు మా మీద సర్వహక్కులూ మీవే. మారక్తం మీద, మాకోరికలమీద, మా ఆలోచనలమీద, మా మీద, అన్నిటి మీదా, మీకే హక్కు, మేం ఆడవాళ్ళం." అని తన శక్తిని గుర్తు చేసుకుంటుంది.

"మాకీ మాతృత్వాన్ని ఏ ప్రకృతి ప్రసాదించిందో, ఆ హక్కును కూడా ఆ ప్రకృతే ఇచ్చింది. ఆ హక్కును కాల రాసిన ఏ శక్తి ఏదైనా, ఎంత రాక్షస బలంతో కూడినదైనా, దానితో నేను తలపడతాను. మళ్ళీ రక్తం ధారపోసైనా నా హక్కును నేను పొందుతాను. నేను జయించి తీరతాను. రాజీపడలేదు. ఈ పోరాటం చేయనిదే నాకున్న సృష్టి శక్తికి అర్థంలేదు. సార్థకతలేదు." అని ఆవేశంతో పాటూ ఎంతో ఆలోచనతో స్థిర నిర్ణయం తీసుకునే తల్లి కథ. తల్లి బిడ్డ "సంరక్షణా హక్కులు" పొందేందుకు చేసే పోరాటం గురించి ఈ కథ.

**విశ్లేషణ :**

రచయిత్రి ఒక స్త్రీ ఏ వయస్సులో కష్టాన్ని, సుఖాన్ని, దుఃఖాన్ని ఏ విధంగా అనుభవిస్తుందో ఈ ఆర్తి కథలో సర్వ సాధారణంగా వివరించారు. ఆడపిల్ల వేసుకునే జడ నుండి బట్టల వరకు ప్రతి విషయంలోను ఆంక్షలు విధిస్తారు. ఆడపిల్ల తనతోటి వారితో స్వేచ్ఛగా ఆడుకోలేని పరిస్థితి. స్త్రీ చదువుకునే సమయంలో కూడ అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. ఆడపిల్లను చదివించడం ఇంట్లో వారికి ఇష్టం ఉండదు. ఆ కుటుంబంలో మగపిల్లలను కార్పోరేట్ కాలేజిలో చదివిస్తారు. ఆడపిల్లకు వివాహం చేస్తారు. ఆమె గర్భం దాల్చాక అనేక సమస్యలు ఎదురవుతాయి. వాటన్నింటినీ సమర్థవంతంగా నిలువరిస్తుంది. స్త్రీకి మాతృత్వాన్ని ప్రకృతి ఇస్తుంది. ఆ సంతానాన్ని కాపాడుకునే హక్కుని కూడా ఆ ప్రకృతే ఇస్తుంది. ఆమె తన హక్కును కాలరాయడానికి ప్రయత్నించే ఏ శక్తితోనైనా తలపడుతుంది. స్త్రీ తన రక్తం చిందించి అయినా సంతానాన్ని కాపాడుకుంటుంది. స్త్రీ మానసికంగా పురుషుడు కంటే బలమైనది. సమాజంలో స్త్రీలు తమకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కరించుకుంటూ ధైర్యంగా జీవనం సాగించాలన్న ఒక సూచన రచయిత్రి చేశారు.

**పెళ్ళి కథ :**

**పాత్రలు** : రజనీ, వాళ్ళఅమ్మ, వాళ్ళ స్నేహితురాలు నిర్మల, రజనీభర్త వివేక్.

పెళ్ళి కథలో రజనీకి పెళ్ళి అంటే ఏహ్య భావం. ఆమె పెళ్ళిచేసుకునే ఆడవాళ్ళకి ఆ పెళ్ళివల్ల ఆ స్త్రీ జీవితం నాశనమవుతుందని పెళ్ళి చేసుకోవద్దని చెబుతుండేది. కానీ చివరికి ఆమె వివాహం చేసుకోకుండ వివేక్ అనే వ్యక్తితో కలసి బతకాలని నిర్ణయం తీసుకుంటుంది. ఆ విషయం రజని తన స్నేహితురాలైన నిర్మలకు చెబుతుంది. రజని పెళ్ళికంటే ప్రమాదంలో ఉందని, తన ఆలోచనలో మార్పు తీసుకురావాలని నిర్మల ప్రయత్నిస్తుంది. కానీ రజని తన స్నేహితురాలయిన నిర్మల మాట వినకపోవడంతో ఎవరి జీవితాలకు వారే బాధ్యులు అని ఆమె అనుకుంటుంది.

**విశ్లేషణ :**

పై కథలో రజనీ అనే స్త్రీకి పెళ్ళి అంటేనే విరక్తి. ఆమె తన స్నేహితుల వివాహం చేసుకుంటానని అన్నప్పుడు వారికి అనేక ఉపన్యాసాలిచ్చేది. ఆమె వివాహ వ్యవస్థను ఒక బిజినెస్ గా అభివర్ణిస్తుంది. చివరకు ఆమె వివేక్ అనే వ్యక్తితో వివాహం కాకుండా కలసి ఉండాలని నిర్ణయించుకుంటుంది. ఆమె తన జీవితాన్ని సమస్యలలోకి నెట్టు కుంటుంది. ఆమె స్నేహితురాలయిన నిర్మల హితవు చెప్పడానికి ప్రయత్నిస్తుంది. కానీ రజనీ ఆమె మాట వినదు. సమాజంలో కొంతమంది స్త్రీలు తమకు అన్నీ తెలుసనే భావనతో జీవిస్తూ, తమ జీవితాన్ని తామే అయోమయస్థితిలోకి నెట్టుకుని, చివరకు జీవితాన్ని కోల్పోతారు. అటువంటి స్త్రీల జీవితాన్ని రచయిత్రి ఈ కథలో ఆవిష్కరింపజేశారు. ఆధునిక సమాజంలో స్త్రీ పురుషులు వివాహం కాకుండ కలసి జీవిస్తూ అనేక సమస్యల పాలవుతున్నారు. అందువల్ల రచయిత్రి ఈ నేపథ్యాన్ని పాఠకులకు అందించి, సమాజానికి మేలుచేసే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు.

**భద్రత కథ :**

**పాత్రలు :** సుజాత, గీత, రాజారావు, భార్య ధనలక్ష్మి వాళ్ళ పిల్లలు

**ఇతివృత్తం :**

భద్రత కథలో ప్రధానపాత్ర సుజాత. ఆమె అవివాహిత. ఆమె చంచలమైన మనసు కలిగి ఉంటుంది. రాజారావు అనే వివాహమైన పురుషుని తన సొంతం చేసుకోవాలనుకుంటుంది. అతని భార్య ధనలక్ష్మి సహనశీలి. ఆమె భర్త రాజారావు సుజాత వైపు ఆకర్షితుడు అవుతాడు. సుజాత అతని మైకంలో పడి, తన స్నేహితులను కూడ దూరం పెట్టింది.. సుజాత రాజారావుని అతని భార్యకి విడాకులు ఇవ్వమని అడుగుతుంది. అప్పుడతడు సుజాతను కసురుకుంటాడు. ఆ విషయం ఆమె తన స్నేహితురాలు గీతకు చెబుతుంది. అప్పుడు గీత ఇలా అంటుంది. రాజారావుని కోరుకోవడం తప్పుకాదు. కానీ అతని భార్యను అతని నుండి దూరం చేయాలనుకోవడం తప్పు అని చెబుతుంది. సుజాత రాజారావు భార్య అందగత్తె కాదేమో, ఆమె అతనికి సరైన భోజనం పెట్టదేమో అనుకుంటుంది. రాజారావు తన భార్యను చాలా బాధపెడుతుంటాడు. ధనలక్ష్మి ఆ బాధను తట్టుకోలేని స్థితికి చేరుతుంది. ఒకరోజు ధనలక్ష్మి ప్రశాంతతను కోరుకుని ఒక పార్కుకి వెళుతుంది. అక్కడే సుజాత కూడ ఉంటుంది. ఆమె చాలా పెద్ద జడ కలిగి అందంగా ఉంటుంది. ఆమె తన వదినకు తన బాధను చెబుతుంది. సుజాత ఆ మాటలు వింటుంది. ఆ తరువాత సుజాత ధనలక్ష్మి తో మాట్లాడుతుంది. ఆ మాటలలో వారు ఒక స్త్రీ తన భద్రత కోసం ఒక పురుషుని కొరుకుంటుందని పదే పదే అనుకుంటారు. ధనలక్ష్మి తన భర్తతో విడాకులు తీసుకుంటుంది. ఆమె తన పిల్లలను రెసిడెన్షియల్ హాస్టల్లో జాయిన్ చేసి. సుజాత గీతల సహాయం తీసుకుని ఉద్యోగం చేసుకుంటుంది. ఆ తరువాత ఆమె తన కాళ్ళపై తను నిలబడి ఒక హాస్టల్ ని నిర్వహిస్తుంది. ఆ తరువాత హాస్టల్ ని కూడ నిర్మిస్తుంది. సుజాత నీ భర్త అలా చేయడానికి కారణం నేనే అని చెబుతుంది. అప్పుడు ధనలక్ష్మి ఒక చిన్న నవ్వు నవ్వి చాలా మంచి పనిచేశావు. అలా చేయడం వల్లే నేను ఈ స్థానంలో ఉన్నాను అని గర్వపడుతుంది. ఒక పురుషుడు ఒక స్త్రీ కాకపోతే మరొక స్త్రీతో జీవిస్తాడు. కానీ స్త్రీ మాత్రం అతని గురించి తెలిసిన తరువాత అతని గాలిసోకడానికి కూడ ఇష్టపడదు.

**విశ్లేషణ :**

భద్రత కథలో స్త్రీ భర్తే తన సర్వస్వంగా బతుకుతుంది. ఆ భర్త మాత్రం వేరొక స్త్రీతో సంబంధం పెట్టుకుంటాడు. ఇది చాలామంది జీవితాల్లో జరుగుతుంది. కానీ ఆ స్త్రీ కృంగిపోకుండా తన భద్రత కోసం ప్రయత్నిస్తూనే ఉంటుంది. కొంతమంది పురుషుల నీచత్వాన్ని చూసి, సమాజంలో వారికి సరైన గుణపాఠం చెప్పి, తన కాళ్ళపై తను నిలబడి తన జీవితాన్ని ఆనందమయం చేసుకున్న స్త్రీ కథ భద్రత. సమాజంలోని ధనలక్ష్మి వంటి స్త్రీలకు ఒకదారిని చూపి, ధైర్యాన్ని నింపి, ఆర్థికంగా నిలదొక్కుకుని ఏ విధంగా జీవించాలో రచయిత్రి ఈ కథ ద్వారా సూచించారు.

**గోడలు కథ :**

**పాత్రలు** : రేవతి, చంద్రిక, రవి, శరత్, భారతి, రమ

**ఇతివృత్తం :**

గోడలు కథలో రవి భార్య చంద్రిక. అతని తల్లి రేవతి. ఆమె తన భర్త నుండి విడిపోయి, ఒంటరిగా ఎన్నో సమస్యలు ఎదుర్కొని తన కొడుకు రవిని చదివించి సంస్కారవంతుడిగా తీర్చిదిద్దుతుంది. ఆమె తన కొడుకుకి ఆరోగ్యం బావుండనప్పుడు ఆఫీస్ లో పర్మిషన్ అడిగినప్పుడు చాలా చులకన భావంతో చూసేవారు. ఈ కథలో చంద్రిక వివాహమైన తరువాత అత్తతో కలిసి ఉండకూడదనే అభిప్రాయం గల వ్యక్తి. ఆమె దృష్టిలో అత్తలు పెద్ద కోడళ్ళను హింస పెడతారనే భావం గలిగి ఉంటుంది. అత్త అయిన రేవతి కోడలికి ఎంత దగ్గర కావాలని ప్రయత్నించినా. చంద్రిక ఆమెను దూరంగానే ఉంచుతుంది. ఆమె వేరుకాపురం పెడుతుంది. అపుడు రేవతి ఎంతో బాధపడుతుంది. అందరూ ఆమెను కోడలు ఎందుకు వేరు కాపురం పెట్టింది అని అడుగుతారు. మొదట కలసి ఉండి తరువాత విడిపోవడం కంటే వేరుగా ఉండడమే మంచిదని రేవతి చెబుతుండేది. చంద్రికకు ఒక కొడుకు పుడతాడు. ఆమెకు ఉద్యోగం చేస్తూ, చిన్నపిల్లవాడిని పెంచడం చాలా కష్టమనిపించేది. కానీ ఆమె తన అత్తగారి సహాయం మాత్రం కోరలేదు. ఆమె కొడుకు స్కూల్లో చాలా అల్లరి చేసేవాడు. అందువల్ల ఆమె అనేక సమస్యలకు గురయ్యేది. ఆడ వాళ్ళు సరిగా పనిచేయరు అనిపించుకోవడం చంద్రికకు ఇష్టం ఉండదు. కోడలిని ఆదుకోలేకపోతున్నందుకు అత్తగారయిన రేవతి చాలా బాధపడుతుంది. ఒకరోజు అత్తగారు అయిన రేవతి దగ్గరకు కోడలయిన చంద్రిక వస్తుంది. అత్తగారు ఆమెను చాలా ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆమెలో ఆందోళనలో ఉందని గ్రహించి, ఆమెని నెమ్మదిగా ప్రశ్నలు వేయడం మొదలు పెట్టింది. అప్పుడు చంద్రిక ఇలా చెబుతుంది. ఆమెకి కొడుకుని సరిగా పెంచడం రాదని తన భర్త అయిన రవి తిడుతున్నాడని, ఉద్యోగం మానేయమంటున్నాడని అత్తగారితో చెబుతుంది. అప్పుడు రేవతి చంద్రిక చాలా ఆత్మ విశ్వాసం గల మనిషి అని, అలాంటి కోడలు దొరకడం వాళ్ళ అదృష్టమని, తన కాళ్ళపై తాను నిలబడాలనుకుంటుంది. కాబట్టి చంద్రికని జాగ్రత్తగా చూసుకోమని రేవతి తన కొడుకుకి చెబుతుంది. చంద్రిక రేవతిని ఏదో అడగడానికి వెనకాడుతుంది. అప్పుడు రేవతి ఏమైంది చంద్రిక అని అడుగుతుంది. అప్పుడు చంద్రిక మనం కలసి ఉందాం అంటుంది. అప్పుడు అత్త మీ పెళ్ళైన కొత్తలో కొంచెం బాధపడ్డాను కాని ఇప్పుడు ఉండడం బాధగా ఉండేది. ఇప్పుడు ఒంటరిగా ఉండడం బాగా అనిపిస్తుంది. ఎవరికి ఇబ్బంది కలిగించకుండ, ఎవరితో ఇబ్బంది పడకుండా ఇలా ఉండడమే బాగుంది. మీరు నాకు పరోక్షంగా చాలా సహాయంచేశారు. మీరు బాధపడకండి ఇలా ఉండడంవల్ల అత్తాకోడళ్ళమధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయి అని రేవతి చంద్రికతో చెబుతుంది. ఆ అత్త తన కోడలు మొదటిసారి తనను ఒక అత్తలా మనిషిలా చూసిందని సంతోషిస్తుంది.

**విశ్లేషణ :**

స్త్రీలు ఒకనాటి సమాజంలో కోడలు కూడ తనతోటి స్త్రీయే అనే భావనను లేకుండా ప్రవర్తించేవారు. ఒక కోడలు అత్తగారు ఇలా ఉంటుంది, ఈ విధంగా మాట్లాడుతుంది. అత్త అంటే కోడలిని హింస పెడుతుంది అనే అభిప్రాయంతో చంద్రిక అత్తింట్లో అడుగుపెడుతుంది. వాటిని విడనాడి తాము ప్రధానంగా స్త్రీలమని, మనుషులమని, ఆ తర్వాత ఏర్పడే బాంధవ్యాలు అత్త, కోడలు, ఆడబిడ్డల సంబంధాలని గ్రహించరు. అటువంటి సామాజిక పరిస్థితులను రచయిత్రి ఈ కథలో ప్రస్ఫుటింపజేశారు. ఈ గోడలు కథలో అత్త అయిన రేవతి ఒంటరిగా తన కొడుకుని పెంచుకుంటు, ఉద్యోగం చేస్తూ అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. ఆమె తన కొడుకుకి వివాహం చేస్తుంది. ఆమె కోడలు చంద్రిక చిన్నపిల్లవాడిని పెంచుకుంటూ ఉద్యోగం చేస్తుంది. రేవతి తాను పడిన కష్టాలు కోడలు పడకూడదని, ఆమెకు తను అండగా ఉండాలని అనుకుంటుంది. కానీ చంద్రిక అత్తను దూరంగా పెట్టి, వేరుకాపురం

కూడ పెడుతుంది. చివరికి ఆపిల్లవాడిని సరిగా పెంచలేక అత్త దగ్గరకు వచ్చి తన సమస్యను చెప్పి మనం కలసి ఉందాం అంటుంది. అప్పుడు అత్త కోడలి అభ్యర్థనను నిరాకరిస్తుంది. అత్తా కోడళ్ళు దూరంగా ఉంటేనే అనుబంధం పెరుగుతుందని చెబుతుంది. ఈ కథలో రచయిత్రి కుటుంబ నేపథ్యాన్ని, సామాజిక నేపథ్యాన్ని చాలా చక్కగా వివరించారు.

**ఎన్నికలలో కథ :**

**పాత్రలు** : ఉమ, కమల, ప్రసన్న, విమల, రంగారావు, సుగుణ, తాసీల్దార్, ఓటర్ల పరిచయాలు, నాయకులు, ఆఫీసర్స్

**ఇతివృత్తం :**

ఈ కథలో ప్రధాన పాత్ర విమల ఆమె తన కళ్ళముందు జరుగుతున్న కూడా ఏం చేయలేని పరిస్థితిలో ఉంటుంది. ఒక స్త్రీ బయట ప్రయాణం చేసేటప్పుడు అనుభవించే బాధ మొత్తం ఆమె అనుభవిస్తుంది. విమల, కమల, ప్రసన్న, సుగుణ వీళ్ళందరూ ఒకేచోట ఉద్యోగంచేస్తుంటారు. రంగారావు అనే వ్యక్తి తోటివారికి సహాయం చేస్తుంటాడు. అతను స్త్రీలపట్ల సానుభూతి గల వ్యక్తి.

ఎన్నికల సమయంలో జరిగే అక్రమాలు, అరాచకాలు. మోసాలు, కుట్రలు, అన్ని, కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. లెక్చరర్స్ అందరూ కాలేజికి రాగానే అందిన కవర్లను తీసుకుని మగవాళ్ళందరూ ఎవరికి ఏ ఊరు వచ్చిందో చూసుకుని ఆ ఊర్లో దొరికే సౌకర్యాల గురించి తమ పాత అనుభవాల గురించి మాట్లాడుకుంటారు. ఆడవాళ్ళు మాత్రం చాలా కంగారుపడుతుంటారు. ఎలక్షన్ లో మహిళా ఉద్యోగులకు రక్షణ ఉండదు. విమల ఎలక్షన్ డ్యూటీలో జరిగిన అన్యాయాలను, అక్రమాలను కళ్ళతో చూసి, ఏమీచేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోతుంది. ఓటర్లపైకి నాయకులు రౌడీలను పంపించి, వారిని భయపెట్టి ఓట్లు వేయించుకుంటారు. ఆ సమయంలో అక్కడ డ్యూటీ చేసే స్త్రీకి సరైన రక్షణ కూడా ఉండదు. ప్రభుత్వం ఆ స్త్రీకి భద్రత కూడా కల్పించదు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొన్న విమల తలనిండా ఎన్నో ప్రశ్నలు.

**విశ్లేషణ :**

ఈ కథలో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సమయంలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. అప్పుడు జరిగే అక్రమాలు, అరాచకాలు, కుట్రలు అన్ని మన కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. ఓటర్లలో ప్రశ్నించే తత్వం లేనన్నిరోజులు అణచివేతకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుంది, ఈ కథలో కొంతమంది నాయకులు ఓట్లు వేసే సమయానికి రౌడీలను పంపించి ఓటర్లను బెదిరించి, అన్యాయంగా తమ మెజారిటీ పెంచుకుంటారు. అక్కడ డ్యూటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, మరియు నిజాయితీ పరులైన నాయకులు ప్రజలచేత న్యాయంగా ఓట్లు వేయించడానికి ప్రయత్నిస్తారు. ఎన్నికల సమయంలో డ్యూటీ చేసే స్త్రీలకు ప్రభుత్వం భద్రత కల్పించే ప్రయత్నం కూడా చేయదు. ఆమె ఆ పరిస్థితులను ఎదుర్కొని తట్టుకొని నిలబడి తన వృత్తికి న్యాయం చేస్తుంది. ఈ సమాజంలో జరుగుతున్న విషయాలు, జరుగుతున్న నిజాలు అన్ని రచయిత్రి ఈ కథలో చిత్రించారు.

**ఏం చేయాలి కథ :**

**పాత్రలు** : శాంత, (శాంత తల్లి సుందరమ్మ, తండ్రి నరసింహారావు), మోహన్ భార్యశోభ, (శోభ తల్లిదండ్రులు) రజని, సరస్వతి, భారతి, రామ్ కుమార్, లెక్చరర్స్ స్వరాజ్యలక్ష్మి, ఫిజిక్స్ విజయలక్ష్మి, రాజశ్రీ.

**ఇతివృత్తం :**

ఈ కథలో ప్రధాన పాత్ర శాంత. ఆమె ఒక ఆఫీసులో ఉద్యోగం చేస్తుంది. అందరితో సులువుగా కలసిపోయే స్వభావం గల స్త్రీ. కానీ ఆమె అవివాహిత. ఆమె ఇంటా బయటా తన ఉనికిని చాటుకోడానికి ఒక యుద్ధం

చేస్తుంది. చివరకు విజయం సాధిస్తుంది. అయినా ఆమె జీవితంలో ఒంటరితనం ఆమెను బాధిస్తాయి. పెళ్ళిచేసుకోక పోవడమే దానికి కారణమేమో, పిల్లలు, పెళ్ళిఇవి సంతృప్తినిచ్చేవేమో అని భావిస్తుంది. ఈ కథలో శోభ సహజీవనం చేయాలనే కోరిక కలిగి ఉంటుంది. చివరకు వివాహం చేసుకుని భార్యగా, అమ్మగా జీవితం గడుపుతుంది. వీరిరువురు తమ జీవితాలు ఇలా ఎందుకున్నాయో అని కారణాలకోసం అన్వేషిస్తారు. ఇద్దరిలోను ఇకపై ఏంచేయాలి? ఏం చేసి పరిపూర్ణజీవితం గడపాలి? ఏంచేస్తే తమ జీవితాలకు సార్ధకత లభిస్తుందని అలమటిస్తూ, పరిష్కారం కోసం ఆర్తిగా ఎదురుచూస్తుంటారు. ఆడవాళ్ళ హక్కులకోసం పోరాడుతూ ఊరేగింపుగా వెళుతున్నవారితో కలసి వెళ్ళి ఆ సభలో పాల్గొంటారు. ఆ సభకు వెళ్ళిన శాంత, శోభలకు తామేం చేయాలో బోధపడుతుంది.

**విశ్లేషణ :**

ఈ కథలో రచయిత్రి ఒక స్త్రీ జీవితంలో కలిగే మార్పులవల్ల ఏం చేయాలో తెలియని స్థితి నుండి తమ జీవితాన్ని తమకు కావలసిన విధంగా మలచుకోడానికి ప్రయత్నించిన స్థితిని చిత్రించారు. ఒక స్త్రీ తన ఉనికి కోసం ఇంటాబయట యుద్ధం చేయాల్సి వస్తుంది. ఆమె ఆ యుద్ధంలో విజయం సాదిస్తుంది. అయినా ఆమె జీవితంలో అసంతృప్తి, ఒంటరితనం బాధిస్తాయి. దానికి కారణం పెళ్ళి, పిల్లలు. భార్యగా, అమ్మగా జీవితం గడుపుతూ, తన హక్కుల కోసం పోరాడుతుంది. ఆ స్త్రీ తనకు తాను ఏమైనా చేసుకుని పరిపూర్ణ జీవితాన్ని గడపాలని తపనతో జీవిస్తుంది. నేటి సమాజంలో అన్ని వర్గాల స్త్రీలు సమాన హక్కులను పొందలేని నీచ స్థితిలో ఉన్నారు. రచయిత్రి ఈ కథలో స్త్రీ బానిసలా పడి ఉండే బావాజాలాన్నికలిగించిన పితృస్వామ్య వ్యవస్థ అసలు స్వరూపాన్ని బహిర్గతం చేయడం కోసం, ఆమె పడే ఆవేదన తపనను బహిర్గతంచేసే ప్రయత్నం చేశారు.

**ముగింపు :**

ఓల్గా "రాజకీయ కథలు" ఈ సంపుటి లో మొత్తం 12 కథలున్నాయి. ఆమె ఒక్కొక్క కథ స్త్రీలకు సంబంధించిన ఒక ప్రత్యేక సమస్య, వారి మనోభావాల గురించి తెలియజేశారు. స్త్రీ జీవితంలో ఎన్ని కోణాలుంటాయి. సమాజం, కుటుంబం ఆమెను ఎలా చూస్తుంది. కొంతమంది స్త్రీలకు తమ జీవితాన్ని వినూత్నంగా గడపాలనే ఆకాంక్ష. వాటిని నెరవేర్చుకునే క్రమంలో గెలుస్తూ, ఓడిపోతూ, ఒక్కొక్కసారి తమని తాము కోల్పోతూ, వారిలో వారే మధనపడుతూ జీవనం సాగించిన విధానాన్ని రచయిత్రి ఓల్గా ఈ కథల ద్వారా తెలియజేశారు. సమాజం స్త్రీ పట్ల చూపించే వివక్షను రచయిత్రి ఎంతో సహజంగా వర్ణించారు. 'సీతజడ' అనే కథలో స్త్రీ జడ గురించి వివరించారు. ఆమె జడను ఇష్టపడి వివాహం చేసుకున్న భర్త కూడ చివరకు అసహ్యించుకుంటాడు. అతను చనిపోయిన తరువాత ఆ జడకు పోషణ చేయడానికి ఆ స్త్రీ కుటుంబంలోని వ్యక్తులు భర్తలేని నీ జడకు పోషణ అవసరమా అని మాట్లాడుతుంటారు. ఆమెకు ఒక వ్యాధి వచ్చి ఆ జుట్టు ఊడిపోతున్నప్పుడు ఆ విషయాలన్ని గుర్తుకు వస్తున్నాయి. 'కళ్ళు కథ'లో ఆడపిల్ల కళ్ళెత్తి ప్రపంచాన్ని చూడకూడదు. ఆమె ఇంటినుండి బయటికి వచ్చిన దగ్గర నుండి మరల ఇంటికి వెళ్ళేంతవరకు తలవంచుకుని ఉండాలని కుటుంబ సభ్యులు చెబుతారు. ఆ కుటుంబంలో కొంతమంది వ్యక్తులు వారు చూసిన వాటికి కొన్నివిషయాలను కల్పించి చెబుతుంటారు. కానీ స్త్రీ మాత్రం తనకి ఏది కనిపించిన, అవి తను చూడనట్టే మెలగాలి. ఈ విధంగా రచయిత్రి కళ్ళు కథలో స్త్రీ జీవితాన్ని సమాజం ఎలా శాసిస్తుందో వివరించారు. 'ముక్కుపుడక కథ'లోని కథానాయకురాలు రమకు చిన్న తనంలో ముక్కు సరిగా కుట్టకపోవడం వల్ల గాయమై, అది మచ్చగా మిగిలిపోతుంది. ఆమె వివాహానికి అది చెరగని ముద్ర అయ్యింది. అందువల్ల ఆ స్త్రీ వివాహాన్ని తిరస్కరిస్తుంది. సమాజం ఒక ముక్కుపడక తో స్త్రీ జీవితాన్ని ముడిపెట్టిన విధానాన్ని, అందువల్ల ఆమెకు కలిగిన విరక్తిని రచయిత్రి కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు. 'నోర్ముయ్ కథ'లో స్త్రీ కి ఉన్న మాట్లాడే అర్హత కూడ ఉండదు. పురుషాధిక్య భావజాలాన్ని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. ఆ తరువాత కథ 'రాతి గుండెలు'. దీనిలోఒక

ఆడపిల్లకు యుక్తవయసు వచ్చిన దగ్గరనుండి వివిధ సందర్భాలలో ఆమె అవయవాలపై పురుషుడు చేసిన దాడివల్ల, ఆమె తల్లి అయినప్పుడు స్త్రీకి సహజ సిద్ధంగా వెలువడవలసిన పాలు కూడ రావు. అంతగా ఆమె మనసుకి గాయమయ్యింది. చివరకు ఆమెకు కాన్సర్ వచ్చి,అవయవాలను తొలగించవలసి వచ్చినపుడు కూడ ఆమెకు బాధ కలగకపోవడం గమనార్హం. ఈ కథ ద్వారా రచయిత్రి పురుషుడి మోహాంధకారపూరితమైన దుశ్చేష్టలకు స్త్రీ ఏ విధంగా బలైపోతుందో వెల్లడించారు. 'ఒక రాజకీయ కథ'లో కథానాయకుడు ఉద్యోగ నిర్వహణలో తన చేతివేళ్ళను కోల్పోతాడు. ఆమె ఆ సమయంలో భర్తకు సేవలు చేస్తుంది. కానీ ఆమెకే అబార్షన్ జరిగి, అనుకోని పరిస్థితిలో గర్భసంచిని కోల్పోతుంది. ఆ విషయాన్నికారణంగా చూపి పురుషుడు ఆమెను వదిలి వేరొక వివాహం చేసుకోవాలనుకుంటాడు. ఆ సమయంలో సమాజం ఆమెకు అండగా ఉండదు. ఆ క్రమంలో స్త్రీ లో కలిగిన మానసిక సంఘర్షణను ఓల్గా హేతుబద్ధంగా ఈ కథలో చిత్రించారు. ఈ విధంగా రచయిత్రి ఓల్గా ఈ కథా సంపుటి లో వైవిధ్యభరితంగా కథలను రచించారు. సమాజంలో స్త్రీలు ఒక ప్రబలమైన శక్తిగా ఎదగడానికి ఈ కథలు తోడ్పడతాయని చెప్పవచ్చు. స్త్రీలు అన్ని రంగాలనుంచి దూరం చేయబడుతున్న తీరును ఆమె పసిగట్టి విశ్లేషించారు. ముఖ్యంగా స్త్రీల అణచివేత వెనుక ఉన్న రాజకీయాలను బహిర్గతం చేశారు. ఈ రాజకీయాలకు పురుష స్వామ్యానికి ఉన్న రాజకీయాలను బహిర్గతం చేశారు. రాజకీయాలకు పురుష స్వామ్యానికి ఉన్న సంబంధాన్ని కూడా వెల్లడించారు. ఈ కథల ద్వారా ఓల్గా స్త్రీల జీవితాలకు ఒక దిశ నిర్దేశం చేశారని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. ఓల్గా. 1993. రాజకీయ కథలు. స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాదు.
2. కాత్యాయిని విద్మహే. 1984. భారత స్త్రీ సంకెళ్ళు -- స్వాతంత్ర్యం. సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. కాత్యాయిని విద్మహే. 1998. సంప్రదాయ సాహిత్యం స్త్రీ వాద దృక్పథం. స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్.
4. చలం, గుడుపాటి. 2011. స్త్రీ . ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాదు.
5. సత్యనారాయణ, ఎస్వీ. 2001. స్త్రీ వాద వివాదాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలుగు వచన కవితా కథా కావ్యాలలో అన్యభాషా పద ప్రయోగాలు - ఒక పరిశీలన



డా॥. ఇ. శోన ప్రభ
ప్రాజెక్ట్ అసోసియేట్, మహిళా అధ్యయన కేంద్రం, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి.

సమర్పణ **(D.O.S) : 20-06-2026** ఎంపిక **(D.O.A) : 28-06-2026** ప్రచురణ **(D.O.P) : 01-07-2026**

## పరిచయం

సమాజ అవసరాలకు అనుగుణంగా సాంఘిక ఉద్యమాలు ఆవిర్భవించినట్లే సాహిత్యంలోనూ వివిధ ఉద్యమాలు ఆవిర్భవించాయి. వచన కవిత్వ ఆవిర్భావానికి సామాజిక పరిస్థితులే ప్రధాన కారణమని చెప్పవచ్చు. తెలుగులో వచన కవిత్వం 1940 ప్రాంతంలో ప్రారంభమైనప్పటికీ, 1950 తర్వాత ఒక మహా ఉద్యమంగా విస్తరించింది. వచన కవిత్వం ఆవిర్భావంతో సంభవించిన ముఖ్యమైన మార్పు భాషాపరమైనదని చెప్పవచ్చు. వ్యవహారిక భాషా ఉద్యమం ప్రభావంతో వచనంలో ఏర్పడిన సరళత, సహజత్వం, సౌలభ్యం వంటి లక్షణాలను వచన కవిత్వం సమర్థవంతంగా స్వీకరించి మరింత విస్తరించింది.

వచన కవిత్వంలో ప్రవేశించిన ప్రక్రియల్లో వచన కవితా కథాకావ్యం ఒకటి. వచన కవిత్వంలో కథా ప్రధానంగా రూపొందిన కావ్యాల్ని వచన కవితా కథాకావ్యాలుగా పేర్కొంటారు. వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా పరిణమింపజేసిన కుందుర్తి ఆంజనేయులు గారు ఈ ప్రక్రియను సామాన్యుల జీవన వర్ణనకు, వివిధ భావాలు, రసాల వ్యక్తీకరణకు అనువైన రూపంగా భావించారు. అందువల్ల వచన కవిత్వంలో కథాకావ్య ప్రక్రియ యొక్క అవసరాన్ని గుర్తించి దానిని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. వ్యవహారిక భాషలో సులభబోధకంగా రచించబడిన కథారూపం సామాన్య పాఠకులను ఆకర్షించి సందేశాన్ని సమర్థవంతంగా చేరవేయగలదని ఆయన విశ్వసించారు. తెలుగు వచన కవిత్వంలో వచ్చిన తొలి కథాకావ్యం కుందుర్తి ఆంజనేయులు గారు రచించిన 'తెలంగాణా'(1956). అనంతరం ఆయన మార్గాన్ని అనుసరిస్తూ శీలా వీర్రాజు, సైబ పరంధాములు, రంథి సోమరాజు, సుధామ, ఎస్.ఆర్.పృథ్వీ తదితరులు వచన కవితా కథాకావ్యాలను రచించి ఈ ప్రక్రియను సుసంపన్నం చేశారు.

భాషలో మార్పు సహజమైన ప్రక్రియ. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలు భాషపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. తెలుగు భాష కూడా ఈ ప్రభావాలకు అతీతం కాదు. ముఖ్యంగా ఆధునిక యుగంలో ఇతర

భాషలతో ఏర్పడిన సంబంధాల ఫలితంగా అనేక అన్యభాషా పదాలు తెలుగులో ప్రవేశించాయి. వ్యవహారిక భాషకు ప్రాధాన్యత నిచ్చిన వచన కవితా కథాకావ్యాలలోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ రచనలలో కవులు ఉపయోగించిన అన్యభాషా పదప్రయోగాలను పరిశీలించడం ద్వారా ఆ కాలపు తెలుగు వ్యవహారిక భాషా స్వరూపం, భాషా పరిణామ దిశలు అలాగే ఇతర భాషల ప్రభావం వంటి అంశాలను అవగాహన చేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో వచన కవితా కథాకావ్యాలలో కనిపించే అన్యభాషా పదప్రయోగాలను విశ్లేషించడం, ముఖ్యంగా ఆంగ్ల, సంస్కృత, ఉర్దూ- హిందీ పదాల వినియోగ స్వరూపాన్ని పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఇందుకై కుందుర్తి ఆంజనేయులు గారు రచించిన 'తెలంగాణా'(1956) 'అముద్రిత కావ్యం' (1967), 'దండి యాత్ర' (1975) మరియు సాహసయాత్ర'; శీలా వీర్రాజు గారు రచించిన 'కొడిగట్టిన సూర్యుడు'. (1965) 'హృదయం దొరికింది' (1969); సైబ పరంధాములు గారు రచించిన 'జీవనంలో ముగ్గులు' (1970); రంథి సోమరాజు గారు రచించిన 'బూర్జువా పెళ్లికూతురు' (1972), 'సిన్నమ్మ వొచ్చింది' (1973), 'రోజీ' (1976) ; సుధామ గారు రచించిన 'పగిలిన ప్రతిమ'; ఎస్.ఆర్.పృథ్వీ గారు రచించిన 'కోర్కెలే గుర్రాలై తే' (1988) అనే వచన కవితా కథాకావ్యాలను పరిశీలించడం జరిగింది.

**కీలక పదాలు :**

వచన కవిత్వం, కథా కావ్యం, అన్యభాషా పదప్రయోగాలు, ఆంగ్ల పదాలు, సంస్కృత పదాలు, ఉర్దూ-హిందీ పదాలు, వ్యవహారిక భాష, భాషా పరిణామం, ఆధునిక తెలుగు సాహిత్యం.

**కుందుర్తి ఆంజనేయులు గారి వచన కవితా కథాకావ్యాలు :**

కుందుర్తి ఆంజనేయులు గారి వచన కవితా కథాకావ్యాలలో ఆంగ్ల పదాల వినియోగం గణనీయంగా కనిపిస్తుంది. కేలండర్లు, రేడియో, ఫైరింజను, సోడా బాంబు, రెడీమేడ్, రైఫిల్, పోలీసు వ్యాన్లు, పోలీసు బూట్లు, ప్రమోషన్, గ్యాస్ లైట్లు, హెల్, టార్చిలైట్, పోలీస్ స్టేషన్, బ్యాటరీ లైట్లు, సింపిల్‌గా, ఫుట్‌బాల్‌గా, గోల్ కీపర్, రిహార్సల్, జనవరి, సర్జన్, ఆపరేషన్, టెర్రరిస్టులు, ఆటంబాంబు, బర్మా పెట్రోలు, టికెట్ కలెక్టర్లు, కిరసనాయిల్, ఇంగ్లీషు సార్జెంటు, సెంట్రల్ జైల్, యూనియన్, అల్టిమేటం, సిగరెట్, కాటన్‌దొర, ఆంగ్లో ఇండియన్, సినిమా, సర్కసు, రోడ్లు, ప్లానులు, స్పార్టాకస్, నవంబరు, రెడ్ ఆర్మీ గార్డులు, రెడీగా, సైరన్, బంద్ మొదలై న ఆంగ్ల పదాలు విస్తృతంగా ప్రయోగించబడ్డాయి.

ఆంగ్ల పదాల తర్వాత సంస్కృత పదాలు, పదబంధాలు ద్వితీయ స్థానాన్ని ఆక్రమించుకొని కనిపిస్తాయి. మహావ్రణం, హరిణం, శతాధిక గ్రంథ కర్తలు, విశాల ధరిత్రి, ప్రభువరేణ్యుడు, ద్రోహపు సర్పం, ఆచంద్ర తారార్కం, చైతన్య ధనుష్పాణులు, గర్భచ్ఛేధన, శపథం, శత సహస్ర యోజనాల తస్కరులు, పద్మవ్యూహాలు, దత్త పుత్రుడు, వృద్ధ శాల్మలీవటాలు, భూత ధాత్రి, స్వైర విహారం, సహస్ర కరాల కరాళకరవాలాలు, అష్టాదశ వర్ణనలు, ఏకచ్ఛత్రాధి పత్యం, ధనుర్బాణాలతో, అధర్మ సౌధం కవాటాలు, క్రోధ పూరిత నేత్రాలు, అర్ఘ్య వాద్యాలు, సర్వ విశ్వవనాంతరాళ సంక్షుభ్యమానమై , పునస్సృష్టి, బాహుదర్ప ప్రదర్శనం, క్రమాక్రమాగత చైతన్య ధనుష్పాణులు, శత సహస్రకాంతి కిరణాలు, నవమాస దీర్ఘరాత్రి, బహు సహస్ర, దేదీప్యమానం, శరచ్చంద్ర భాండం, హర్ష భాష్పాల, భూత కరాళ దంష్ట్రాకాంతులు, మంత్ర ముగ్ధ భుజంగాల్లా ఉక్కు శిరస్త్రాణాల్లా, వంటి సంస్కృత పద బంధాలు ఈ కథా కావ్యాలలో నవ్యతను సృష్టించేవిగా కనిపిస్తాయి.

అలాగే బుఖారా, ముస్తాబు, తీవి, పహారా, హుషారు, గుడారా, చౌకీదారు, నవాబు, దర్బారు, పట్వారీ, షావుకారు, వీల్నామా, షికారు, కుస్తీ, కిరస్తానీ, మక్తా, హుజూర్, ఫిరంగు, బలాదూర్, షరతు, ఘూర్ఖా మొదలైన ఉర్దూ- హిందీ

పదాలు కూడా కనిపిస్తాయి. మొత్తంగా కుందుర్తి ఆంజనేయులు గారు తన వచన కవితా కథాకావ్యాల్లో తెలుగు పదజాలాన్ని ప్రధానంగా వినియోగిస్తూ, అవసరానుసారం ఆంగ్ల, సంస్కృత, ఉర్దూ-హిందీ పదాలను సమన్వయపరిచి తన పదప్రయోగ వైవిధ్యాన్ని ప్రదర్శించారు.

**శీలా వీర్రాజు గారి వచన కవితా కథాకావ్యాలు :**

శీలా వీర్రాజు గారి వచన కవితా కథాకావ్యాలలో ఆంగ్ల పదాల వినియోగం అధికంగా కనిపిస్తుంది. హాస్పిటల్ కాంపౌండు డ్యూటీ రూము, బ్లాంటింక్, సిరంజి, మార్ఫియా బాటిల్, గ్రౌండు డ్రైనేజి, మెర్కురీ బల్బు, వార్డు బోయ్, జామెట్రీ, నైట్ కాలేజి, పోస్టుమేన్, హోటలు, సెకండ్ షో, ఆఫీసు, జీపు ఏక్సిడెంటు, టవర్ క్లాక్, స్టూడియో సెట్టు, సిగరెట్టు, పోర్సలీను కప్పు, ఆల్‌రైట్, సెర్చిలైట్, ఫోకస్, మెషిన్ గన్, టీచర్లు, మెర్క్యురీ లైట్లు, రఫ్ స్కెచ్, కమ్యూనిస్టు, సైన్స్ టీచర్, టెలీ ప్రింటర్ల, స్టిల్ లైఫ్ ఫోటో గ్రాఫ్, ఫుట్‌పాత్, ఎమ్మెస్సీ టెక్నాలజీ, రోడ్ల కేన్వాసుల, షోకేసులు, ఆఫీసు ఎక్వేరియం, ఫిలింఫేరు, అవుట్ స్కర్ట్స్, బ్రాకెట్లాడి క్లోజింగ్, ఆల్సేషియన్లు, గార్డురూంలో స్పేర్‌గా, మల్టీపర్పస్ హోటల్లో, మీనియేచర్, విజిటర్స్ రూమ్ వంటి పదాలు కనిపిస్తాయి.

శీలా వీర్రాజు గారు వాడిన సంస్కృత పదబంధాలు, కొంచెం దీర్ఘమైనవిగా కనిపిస్తాయి. అర్ధనిమీలిత నేత్రుడై, సర్వ సంగ పరిత్యాగిలా, చతుర్ముఖ పారాయణం, మహార్యణం, కృత్రిమ గాంభీర్యం, నమస్కారాల నైవేద్యం, మూల విరాట్టు, భజంత్రీ దార్లు శృతులు, స్వైర విహారం, హవిస్సుగా, నివురు గప్పిన అతని హృదయాగ్ని మీద, యవ్వనాంగాలులకు, ప్రతిబింబాన్ని ప్రతిష్టించుకుని, అష్టపదుల్ని, రసహృదయం, అంతర్ముఖుడు, అనుభవ ప్రభంజనాన్ని, రాజసానికి దర్పణంగా, నిరీక్షిస్తోన్న దేవకన్య మొదలైనవి కన్పిస్తాయి.

ఉర్దూ-హిందీ పదాలలో రీవి, పహారా, పరదా, మజిలీ, చౌరస్తా, వరండా, జవాను, నకిలీ, మఫ్లర్లూ రగ్గులూ, ముస్తాబు, తాపీగా, టాంగాలు, లాంచీ, తివాసీ, బఠాణీ, సిపాయి, సవారీ, ఖేరీజు, చోరీ, కసాయి, టోపీ, తివాసీ, చిమ్నీ, అమీర్లు, ఇరానీ ఛాయ్, రిక్షా, గిరాకీ, బంగళా వంటి పదాలు వినియోగించబడ్డాయి.

ఈ విధంగా శీలా వీర్రాజు గారి కథాకావ్యాలలో తెలుగు పదాల తరువాత ఆంగ్ల పదాల ప్రభావం అధికంగా ఉండగా, ఉర్దూ-హిందీ పదాలు తదుపరి స్థానాన్ని ఆక్రమించాయి. సంస్కృత పదాల వినియోగం పరిమితంగానే కనిపిస్తుంది.

**సైబ పరంధాములు గారి వచన కవితా కథాకావ్యాలు :**

సైబ పరంధాములు గారు రచించిన "జీవనంలో ముగ్గులు" అనే వచన కవితా కథాకావ్యంలో హాస్పిటల్ బెడ్‌పై, ఫోటోగ్రఫీ ట్రిక్కులు, బిజినెస్, స్టేషన్, ఎన్‌లార్జింగ్, థర్మామీటరు, సిస్టర్, బస్సు, వ్యాన్, రోడ్డు, నేంప్లేటు వంటి ఆంగ్ల పదాలు.

స్వర లహరి జేయు లాస్యమ్మును, కన్నెలేడి క్రీగంటిలో, విరహగీతి, మదనకేళి, సౌహార్ద లేఖ, సమీరుడు, దినకరుడు, కమృత పానము, స్వర్గసౌఖ్యములు విస్మయ విహారం వంటి సంస్కృత పదాలు. పచార్లు, జావళీ, మహఫిల్ మొదలగు ఉర్దూ పదాలు కనిపిస్తాయి. ఈ వచన కవితా కథాకావ్యంలో తెలుగు పదాల తరువాత ఆంగ్ల పదాలు, ఆ తరువాత సంస్కృత పదాలు ప్రయోగించబడ్డాయి. అతి తక్కువగా హిందీ పదాలు వాడబడ్డాయి.

**రంథి సోమరాజు గారి వచన కవితా కథాకావ్యాలు :**

రంథి సోమరాజు గారి వచన కవితా కథాకావ్యాల్లో ప్లవరంత వెయిటుండు, వేనటి బేగూ, బెల్ బాటమూల, రైనుల్ల ప్లే సాంగూలూ, రివరీలో స్విమ్మూలు, గౌను, లిప్‌స్టిక్కీ, ఎక్స్ పోజ్డ్, పికాకీ ఫేనూ, కలర్డ్ పిక్చరూ, కారూలు స్టార్టించి, సినీ ఫీల్డూ, ఫుల్‌మూనీ, క్రిమీ ప్లెజరంత, యేర్ కండిషన్డ్, డాన్సింగ్ హాలూ, నియో మోడ్రన్ పొయిట్రిగ,

మదర్లీ ఎఫెక్షన్‌లా, ప్రామిసింగ్ నేచర్, ఆఏక్స్ ప్లేస్స్ లోని సెన్సిబిలిటీ, ఆ వుండర్‌పుల్ ఎక్స్‌ప్రెషన్ లోని సిన్సియర్ లాయెలిటీ, మేగ్నటిక్ ఫోర్సుల, లెక్చరర్లు, సోషలిస్టిక్ ప్లేటన్ ఆఫ్ సొసైటీ, డిగ్నిటీ ఆఫ్ లేబర్, సినీ మేగ్జైన్, రాడార్ బ్రైన్ హిస్టరీ క్రియేట్, కలకటేరు, ఆపీచరు, నక్స్ లేటు, కమ్మీనిట్టోడివే, కాంగిరేసు మొదలైన వైవిధ్యమైన ఆంగ్ల పదాలు కనిపిస్తాయి.

నవరత్న స్థగిత మణిహారంగ వరించి, జ్వాలా శిఖర చలత్ చలితలీలాకీల స్నిగ్ధ కిరణ్మయి, నమస్తాంబర పరివ్యాప్త జోత్స్నా విర్భూత స్థితి కారకుడు, సమస్త వాగ్జగత్తునూ, విన్నూత పద్ధతీ హృదయ స్పందనా విర్భూత, వైరుధ్యాల విన్యాసం, బృహత్ ప్రణాళికా విరాట్ స్వరూపం, అనంత కోటి తారకల, అనంతానంత జీవుల హృదయాక్రందన, అక్షయ తూణీరాల వంటి దీర్ఘసమాసాలతో కూడిన సంస్కృత పదబంధాలు, సంస్కృతీకృత వాక్య నిర్మాణాలు కూడా కనిపిస్తాయి. తర్వాత, ఖూనీ, గుమత్తా, గల్లీ, సిపాయి, రోజీ మహల్, సరంజామా, తమాస్‌గా, జిగేల్, ఆర్మోనీ, కైజారెట్టి, ఖరీదు, మున్సీబు మొదలై న ఉర్దూ, హిందీ పదాలు వినియోగించబడ్డాయి. ఇలా ఆంగ్ల పదాలు, సంస్కృత, హిందీ పదాలు రంథీ సోమరాజు గారి వచన కవితా కథాకావ్యాల్లో వాడబడ్డాయి.

**సుధామ గారి వచన కవితా కథాకావ్యాలు :**

సుధామ గారు రచించిన ''పగిలిన ప్రతిమ'' అనే వచన కవితా కథా కావ్యంలో ఎగ్జిబిషన్, ఆర్ట్ సెక్షన్, పెన్సిల్, రైల్వే క్వార్టర్సు సెక్షన్, ఎలక్ట్రిక్ సెక్షన్, షాక్ వంటి ఆంగ్ల పదాలు, నిదర్శన ప్రేమామృత జలాన్ని, సృష్టించిన చిత్ర ప్రకృతికి, భీత నేత్రాలతో, డగ్గుత్తిక, నెలరాజులు వర్షిస్తున్న అమృతాన్ని, నాహృదయ దర్పణం వంటి సంస్కృత పదాలు, సెంటు, తుఫాను, జవాను వంటి తక్కువగా ఉర్దూ పదాలు కనిపిస్తాయి.

**ఎస్.ఆర్.పృథ్వీ గారి వచన కవితా కథాకావ్యాలు :**

ఎస్. ఆర్. పృథ్వీ గారు రచించిన "కోర్కెలే గుర్రాలైతే" అనే కథాకావ్యంలో సినిమా విలన్, ఆఫీసు గేటు, ప్రెష్‌నెస్, ఆఫీసర్ క్యాంపు, స్టాఫ్, క్వాలిఫికేషన్, సిగరెట్, లాటరీ టికెట్టు, బ్లాక్ బోర్డు, గవాస్కర్‌లా టెస్ట్ మాచ్స్ లో క్రికెట్ బాట్, ఎంక్వయిరీ, మేజిస్ట్రేట్, జడ్జిమెంట్, జీరోవోల్టు, ప్రేయర్, ఫోటోఫిల్ములా, జోకులు, కేకులు వంటి ఆంగ్ల పదాలు కనిపిస్తాయి.

సంస్కృత పదాలలో నికృష్టపు తాపత్రయం, భవిష్యద్రాత, రుధిర జ్వాల, తన్మయత్వం, విరహాతిశయాన్ని, పరిహాసం, రౌద్రం, ప్రణయారాధన, పూర్ణ యవ్వన కాంతి, హృదయ కుహరాల్లో, శృంగార రసాన్వితమైన, కామకేళి విలాసం మొదలైనవి ఉన్నాయి. బంట్రోతు, ఫర్లాంగు, ఫిర్యాదు వంటి ఉర్దూ పదాలు తక్కువగా వినియోగించబడ్డాయి.

ఇలా వచన కవితా కథాకావ్యాల్లో కవులు సామాన్య ప్రజల భాషా స్థాయికి దగ్గరగా ఉండే సరళమైన తెలుగు పదాల్ని విరివిగా వాడుతూ తర్వాత ఆంగ్ల పదాల్ని, సంస్కృత పదాల్ని, ఉర్దూ పదాల్ని వినియోగించుకున్నారు.

**ముగింపు :**

తెలుగు వచన కవితా కథాకావ్యాలలో అన్యభాషా పదప్రయోగాలు ఒక ముఖ్యమైన భాషా లక్షణంగా రూపుదిద్దుకున్నాయి. పరిశీలించిన కథాకావ్యాల ఆధారంగా ఆంగ్ల పదాల వినియోగం అత్యధికంగా ఉన్నట్లు గమనించవచ్చు. దీనికి ఆధునిక విద్యా వ్యవస్థ, పరిపాలనా నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలు ప్రధాన కారణాలుగా నిలిచాయి. సంస్కృత పదాలు భావ గాంభీర్యాన్ని, ఉర్దూ-హిందీ పదాలు సామాజిక-సాంస్కృతిక వాస్తవికతను ప్రతిబింబించాయి. అంతేకాక, ఈ అన్యభాషా పదాల వినియోగం రచయితలు చిత్రించిన కాలానుగుణ జీవన వాస్తవాలను, సామాజిక పరిసరాలను మరింత సహజంగా వ్యక్తీకరించేందుకు తోడ్పడింది. అందువల్ల తెలుగు వచన కవితా కథాకావ్యాల భాష బహుభాషా ప్రభావాల సమ్మేళనంగా రూపుదిద్దుకున్నదని స్పష్టమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**


1. కుందుర్తి కృతులు - కుందుర్తి ఆంజనేయులు
2. కొడిగట్టిన సూర్యుడు - శీలా వీర్రాజు
3. హృదయం దొరికింది - శీలా వీర్రాజు
4. జీవనంలో ముగ్గులు - సైబ పరంధాములు
5. బూర్జువా పెళ్ళికూతురు - రంథి సోమరాజు
6. సిన్నమ్మ వొచ్చింది - రంథి సోమరాజు
7. రోజీ- రంథి సోమరాజు
8. పగిలిన ప్రతిమ - సుధామ
9. కోర్కెలే గుర్రాలైతే - ఎస్.ఆర్. పృథ్వీ


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# విలక్షణ భక్త కవి వడ్ల వెంకటాచార్యులు



డా॥. వి. శంకరయ్య
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎల్లారెడ్డి, జిల్లా. కామారెడ్డి, తెలంగాణ.
సెల్ : 9440798954

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**సంక్షిప్త పరిచయం :**

తెలంగాణాలోని మారుమూల ప్రాంతం ఫరీదు పేటలో వడ్ల వెంకటాచార్యులు అనే కవి, నాటక రచయిత ఉండేవారు. పెద్దగా చదువుకోకున్నా సాధన చేసి పద్యం, పాటల రచనలపై పట్టు సంపాదించుకున్నారు. ఎన్నో భజన కీర్తనలు, నాటకాలు రచించారు. ఆయన సాహిత్యాన్ని పరిచయం చెయ్యడం, భక్తి, ఆధ్యాత్మిక చింతనను పరిశీలించడం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు :**

తత్త్వకవులు, భక్తిపాటలు, వైరాగ్య ప్రబోధం, ఆధ్యాత్మిక చింతన, సామాన్య వస్తువుల్లోనూ ఒక పరమార్థం, ప్రబోధం, నాటకం, పరదర్శన మొ.

**ఉపోద్ఘాతం :**

ఎందరో తాత్త్వికులైన జానపద కవులు తెలంగాణ నేలను పునీతం చేశారు. స్వతహాగా, గురు ముఖతా నేర్చుకున్న జ్ఞానంతో జీవిత సారాన్ని కాచి వడబోసి అమృత గుళికలుగా ప్రజలకు పంచిపెట్టారు. అధికారం, కీర్తి, సంపదల జోలికి పోకుండా అత్యంత సాధారణ జీవితం గడుపుతూ మానవ విలువలు ప్రబోధించారు. తాము ఎరుక పరచుకున్న జ్ఞానానికి ఆత్మాన్వేషణ, అన్వయం, అనుభవాలు జోడించి నిండుకుండ లాగా ఆదర్శ జీవనం గడిపారు. తాము తెలుసుకున్న సత్యాన్ని పాటలుగా, పద్యాలుగా ప్రజలు పాడుకునే శైలిలో అందించారు. స్వీయ అధ్యయనంతో సంపాదించుకున్న పౌరాణిక పరిజ్ఞానంతో నాటకాలు, భజన కీర్తనలు కూడా రచించారు. భక్తిని, ఆధ్యాత్మిక శక్తిని, వైరాగ్య ప్రవృత్తిని మేళవించి ఈశ్వరుని చేరుకునే మార్గం తెలియజెప్పారు. భౌతిక సుఖాల వ్యామోహంలో పడిపోకుండా, విరాగి భావాలతోనే సంతృప్తికర జీవితం కొనసాగించడమెట్లో ఆచరించి చూపిన మహానుభావులు వీరు.

వేద, పురాణేతిహాసాల మీద పట్టు సంపాదించుకున్నా ఈ సహజకవులు తమ పాండిత్యం పెట్టుబడిగా పాలకులు, ధనికుల ప్రాపకం కోసం పాకులాడలేదు. కష్టజీవుల మధ్య శ్రమ సంస్కృతిలో భాగమై జీవించారు. ఈ కవులు ప్రజలను మూఢనమ్మకాల వైపు తోసి పబ్బం గడుపుకోవడం కాకుండా కులవృత్తులు, కర్షక జీవితం కొనసాగిస్తూనే సామాన్యుల్లో అసామాన్యులుగా వెలిగినారు. అలాంటి వారిలో కామారెడ్డి ప్రాంతంలో మయబ్రహ్మ వెంకటాచార్యులను ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

**విషయ వివరణ :**

వెంకటాచార్యులు కామారెడ్డి జిల్లా పల్వంచ మండలంలోని ఫరీదుపేట గ్రామంలో 1920 ప్రాంతంలో జన్మించారు. తల్లిదండ్రులు నరసమ్మ, రాజయ్యలు. తండ్రి వృత్తి వడ్రంగం. కొంత వ్యవసాయ భూమి కూడా ఉండేది. అయితే దానితో వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. నాగండ్లు, బండ్లు, కర్రతో వ్యవసాయ పరికరాలు తయారు చెయ్యడం, రైతుల పంట చేతికి వచ్చిన తర్వాత వాళ్ళు 'బిచ్చం'గా ఇచ్చిన ధాన్యం తీసుకోవడం - అవే వారి ఆదరువు. ఎవరైనా ఇండ్లు కట్టుకుంటే ఇంటికి దర్వాజాలు, ఇటికీలు, దూలాలు, వాసాలు, పైకప్పుకు పెండే పరవడం (అప్పుడన్నీ పెంకుటిండ్లే) చేస్తే మాత్రం చేతికి కొన్ని డబ్బులు వచ్చేవి. అయినా పేదరికం, అర్ధాకలి నిత్య అనుభవాలే. అవీ వెంకటాచార్యులు పుట్టి పెరిగిన నేపథ్యం.

వెంకటాచార్యులకు బాల్యంలోనే గంగవ్వతో వివాహం జరిగింది. కొన్నాళ్లకు రాజవ్వను రెండో భార్యగా చేసుకున్నాడు. పెద్ద భార్యకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు కలిగారు. చిన్న భార్యకు ఇద్దరు కూతుళ్లు. మొత్తం ఎనిమిది మంది సంతానం. ఇద్దరు భార్యలు వేర్వేరు ఊర్లలో ఉన్నా బతికినంత కాలం అందరినీ బాగానే చూసుకున్నాడు. ఆరుగురి పెండ్లిళ్లు చేశాడు.

కొంత అక్షరజ్ఞానం సంపాదించుకోవడం మినహా వెంకటాచార్యులు బడికి వెళ్లి పెద్దగా చదివింది ఏమీ లేదు. వారసత్వంగా నేర్చుకున్న వడ్రంగమే మొదటి ఆధారం. వ్యవసాయ పనులు కూడా చూసుకునేవాడు. అయితే, ఆయన వాటితోనే సంతృప్తి చెందలేదు. ఇంకేదో తెలుసుకోవాలనే కాంక్ష, ఏదో సాధించాలనే అన్వేషణ ఆయనలో రగులుతుండేవి. అప్పుడు దొరికింది యాదయ్య పంతులు శిష్యరికం. అదే ఆయనను కొత్త మార్గంలో నడిపించింది. మిగతావారిలో భిన్నంగా నిలబెట్టింది. అదే ఊరికి చెందిన యాదయ్య పంతులు బహుముఖ ప్రజ్ఞాశాలి. రోగం నాడి తెలిసిన ఆయుర్వేద వైద్యుడు. నాటక రచయిత. నటుడు. ప్రయోక్త. వాస్తు నిపుణుడు. ఇండ్లకు ముగ్గులు పోసేవాడు. జ్యోతిష్యం చెప్పేవాడు. ఆధ్యాత్మిక చింతనాపరుడు. హార్మోనియం వాయించేవాడు. తన దగ్గరకు వచ్చిన వారికి మంచి చెడులు చెప్పి ఊరందరి తలలో నాలుకలా 'పంతులు' గా చక్కటి పేరు తెచ్చుకున్నవాడు.

చిన్నప్పుడే యాదయ్య పంతులుతో ప్రభావితుడైన వెంకటాచార్యులు గురువు మనసు గెలుచుకుని అన్ని విద్యలూ నేర్చుకున్నాడు. కులవృత్తి చేసుకుంటూనే వాటిని సాధన చేశాడు. జ్ఞానాన్వేషణ చేస్తూ చుక్కాపురం సమీపంలోని అటవీ ప్రాంతాల్లో తపస్సు చేశాడు. యోగ సాధన చేశాడు. వాస్తుశాస్త్రం నేర్చుకొని ఇండ్లకు ముగ్గులు పొయ్యడం ప్రారంభించాడు. బావులు, చెరువుల్లో జల విద్యలు సాధన చేస్తూ గంటల తరబడి కదలకుండా నీటిపై తేలియాడేవాడు. ఆయన ఈత నైపుణ్యం తెలియని కొందరు చెరువులో కదలకుండా ఉన్న వెంకయ్యను చూసి చనిపోయాడనే ఆందోళనతో ఊరివాళ్లను పిలుచుకు వచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి. వాటి గురించి ప్రజలు ఇప్పటికీ చెప్పు కుంటారు. హార్మోనియం వాయిస్తే ఆయన తమ్ముడు వడ్ల రాములు పట్టుకొని తెచ్చిన నాగుపాము పడగ తీసి ఆడిన దృశ్యం ఈ వ్యాస రచయితతో పాటు ఆ ఊరి వాళ్లకు కంటిగతమైన విషయమే!

యోగ సాధన తర్వాత వెంకటాచార్యులు నెమ్మదిగా కవిత్వం వైపు దృష్టి సారించాడు. పాటలు, పద్యాలు రాయడం నేర్చుకున్నాడు. వాటిని నాటకాల రూపంలోకి తీసుకొచ్చాడు. కథల కోసం పురాణాలు, ఇతిహాసాలు చదివాడు.

బుద్ధుని చరిత్రనూ అధ్యయనం చేశాడు. ఆయన మదిలో మెదిలిన ఆలోచనలను ఎప్పటికప్పుడు తెల్ల కాగితాలపై రాసుకునేవాడు. ఆ కాగితాలు ఇప్పట్లాగా సైజుల్లో దొరికేవి కావు. ఠావులుగా పేపర్లను కొనుక్కొని, దారం సాయంతో తగిన సైజులో కోసుకుని రాత పేపర్లు సిద్ధం చేసుకునేవాడు. వాటిని సూది, దారంతో కుట్టుకుని నోటు పుస్తకం తయారు చేసుకునేవాడు. దళసరి కాగితాలతో అప్పుడు వచ్చే ఎరువుల సంచి ముక్కలను పుట్టగా అలంకరించేవాడు. రాసుకోవడానికి  ఇంకు పెన్ను, సిరాబుడ్డి అందుబాటులో ఉంచుకునేవాడు. ఎక్కడికి వెళ్ళినా వీటిని భుజానికి వేలాడే ఒక బట్ట సంచిలో వేసుకుని వెళ్లేవాడు. సమీప గ్రామాలకు వెళ్తే కాలినడకనే. నడుస్తూనే ఆలోచించేవాడు. మధ్యలో ఏదైనా రాయాలని గుర్తుకొస్తే దారిలో చెట్టుకిందనో, చెరువు గట్టునో కూచొని రాసుకునేవాడు. ఆయన రాసిన భజన పాటలు, నాటకాలు అట్లా రూపు దిద్దుకున్నవే!

వెంకటాచార్యులు తొలి ముద్రిత రచన రాజయోగానంద భజనమాల. 1978లో అచ్చయింది. ఆయన రచనల్లో ఇదొక్కటే పుస్తకంగా వచ్చింది. ఈశ్వర ప్రేమ భజనమాల పేరుతో మరో పాటల పుస్తకం రాసినా అదిప్పుడు అందుబాటులో లేదు.

1980 ప్రాంతంలో భజన పాటలతో పాటు వెంకటాచార్యులు నాటక రచన వైపు దృష్టి సారించాడు. అప్పుడు గ్రామాల్లో నాటకాలు విరివిగా ప్రదర్శించేవారు. ఇప్పట్లా ఇంటింటిలో టీవీలు, సెల్ ఫోన్లు చొరబడని కాలమది. రోజంతా శ్రమ చేసిన పల్లె ప్రజలు దానినుంచి సేదదీరడానికి నాటక ప్రదర్శనలను ఆశ్రయించేవారు. నాటకాలు ప్రదర్శించే బృందాలు చాలా ఊళ్లల్లో ఉండేవి. అదే ఊరికి చెందిన ఉత్సాహవంతులు నాటకాలు నేర్చుకుని, కొద్ది నెలల పాటు సాధన చేసి ఊరి మధ్యలో ప్రదర్శన ఏర్పాటు చేసేవారు. ఊళ్లలో ప్రదర్శించే నాటకాలను కొన్నిసార్లు టికెట్టు పెట్టి మరీ చూసేవారు. కానీ చాలా వరకు ఉచితంగానే ప్రదర్శించేవారు. అట్లా నాడు నాటకాలకు ఆదరణ బాగా ఉండేది.

ఆ పరిస్థితుల్లో వెంకటాచార్యులు నాటక రచనకు పూనుకున్నాడు. తొలుత ఆయన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం రచించాడు. అదే ఫరీదుపేటకు చెందిన వడ్ల భాగయ్య ప్రయోక్తగా ఊరిలో ప్రదర్శనకు పూనుకున్నారు. ఔత్సాహిక కళాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ రాత్రి భోజనం కాగానే భాగయ్య ఇంట్లో సాధన కొనసాగేది. పాత్రకు తగిన పాటలు, పద్యాలు చిట్టీల మీద రాసుకొని తబలా, తాళాలు, హార్మోనియం సంగీతంతో రిహార్సల్ చేసేవారు. ఆ బృందంలో ఈ వ్యాస రచయిత కూడా ఉన్నాడు. కొద్ది నెలల సాధన తర్వాత నాటకం ఊరి మధ్యలో ప్రదర్శించారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ రకంగా వెంకటాచార్యులు రాసిన ఆ నాటకంలోని పాటలు, పద్యాలు ఎంతో ప్రచారం పొందాయి. సాధన చేసిన కళాకారులతో పాటు ఇతరులు కూడా, పొద్దంతా చేన్లలో పనులు చేస్తూనో, పశువులు కాస్తూనో మళ్లీ మళ్లీ ఆ నాటకంలోని పాటలు, బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్త్వాలు పాడుకొనేవారు.

అది స్ఫూర్తిగా వెంకటాచార్యులు మరికొన్ని నాటకాలు రచించాడు. మార్కండేయ చరిత్ర, శ్రీ జ్ఞానేశ్వర చరిత్ర, గౌతమ బుద్ధ చరిత్రలను రమణీయమైన నాటకాలుగా మలిచాడు. కథోచిత దరువులు, రాగ, తాళాలతో మేళవించారు. అయితే దురదృష్టవశాత్తు ఇవేవీ ప్రచురణా భాగ్యం పొందలేదు. ప్రదర్శనలు కూడా జరిపినట్లు లేదు. ఆ రచనల కోసం అప్పటి నాటకాల్లో పాత్రలు పోషించిన వారి దగ్గర, బంధు మిత్రుల ఇండ్లలో వాకబు చేస్తే కొన్ని కాగితాలు, శిథిల ప్రతులు కొన్ని లభ్యమైనాయి. వాటిని పరిష్కరించి, ప్రచురించాల్సి ఉన్నది.

ఆయన మొదటి రచన రాజయోగానంద భజనమాలలోని పద్యాలు, పాటలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. ఈ గ్రంథం అభినవ పోతన వానమామలై వరదాచార్యుల ప్రశంసలు అందుకొన్నది. ఈ రచనకు ముందుమాటగా 'అభినందనలు' రాస్తూ వానమామలై 'వీరి భావాలు గంభీరములై జీవిత మర్మ స్పర్శకములై ఉపదేశాత్మకముగా

సాగినవి. శ్రీ వెంకటాచారి గారి కీర్తనలన్నియు భక్తి, జ్ఞాన, వైరాగ్యములను బోధించుచూ తత్త్వ దర్శకములై ఉన్నాయి' అని మెచ్చుకున్నారు.

వెంకటాచార్యుల పాటలు రాజయోగమనే ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ప్రకటిస్తున్నాయి. రాజయోగం ఒక విలక్షణమైన ఆధ్యాత్మిక భావధార. మనస్సు, ఇంద్రియాలను నియంత్రించడం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందే ధ్యానమార్గం. బాహ్య ప్రపంచం నుంచి మనసును మరల్చి అంతర్గత ఆత్మను తెలుసుకోవడం దాని లక్ష్యం. యోగ సాధన, విరాగి భావాలతో ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవడం ఇందులో ముఖ్యమైనది.వెంకటాచార్యుల పద్యాలు, పాటలలో సహజమైన నడక ఉంటుంది. రాగ తాళాల ప్రయోగం ఔచిత్యంతో శోభిస్తుంది. దరువులను ఎత్తుకోవడంలో కూడా విలక్షణత కనిపిస్తుంది. ఎక్కడా కృతకత్వం కనిపించదు. ధార సరళమైన భాషలో కుంటుబడకుండా సాగుతుంది. జానపద బాణీలలో ఉండే పునరుక్తి, తాళానుగుణమైన అధిక మాత్రా ప్రయోగం కూడా కనిపిస్తుంది. పల్లె పదాల వినియోగమూ పుష్కలం.

తన గురువైన యాదవాద్రిని తలచుకున్న ఈ చంపకమాల పద్యం ఆయన పద్య ధారను పట్టి ఇస్తుంది.

'పర వుపకారమెప్పుడును × బాయక జేయుచునుండు శ్రద్ధచే
నిరతము రామ నామమును × నిర్మల చిత్తము చేత ధ్యానమున్
మరువక జేయుచుండు కడు × మంచి గుణంబులు గల్గినట్టి మ
ద్గురుడగు యాదవాద్రి నతి × కూరిమి మీర దలంచి మ్రొక్కెదన్'

ఈ పద్యంలో కవి తన గురుభక్తి, గురువుకున్న రామభక్తి చక్కని పదాలలో రూపు కట్టించారు.

రాజయోగానంద భజనమాల తొలిపుటల్లో గణపతి, శివుడు, రాముడు తదితర దేవతలను కీర్తించిన గీతాలున్నాయి. రామభక్తి మాత్రం ఎక్కువ పాటల్లో వ్యక్తమైంది. కుటుంబ, నైతిక విలువలు ప్రబోధించిన పాటలు ఉన్నాయి. అరిషడ్వర్గాలను అధిగమించాలనే హితబోధ ఉన్నది. ఈ పాటలు ఆదితాళం, ఏక, ఏకధ్రువ, రూపక, ఆట తాళం గతులలో నడిచాయి. దర్వులను విషయ సాంద్రతను బట్టి నడిపించారు. 1970 దశకంలో అప్పుడప్పుడే చొరబడుతున్న సాంకేతికతను, సౌకర్యాలను కూడా వెంకటాచార్యులు సందేశాత్మకమైన గీతాలుగా మలిచారు.ప్రతి పాట చివరి చరణంలో తన పేరుతో పాటు తన ఊరును కూడా శాశ్వతం చేస్తూ మకుటంగా నిలుపుకున్నాడు.

వెంకటాచార్యులు సామాన్య విషయాల గురించి రాసినా వాటి నుంచి ఏదో ఒక తత్వాన్ని, పరమార్థాన్ని రాబట్టి ఆధ్యాత్మిక, ఉదాత్త విలువలు ప్రబోధించడం ప్రత్యేకంగా కనిపిస్తుంది. 'శివశంభో' అనే గీతంలో శివారధనతో మొదలుపెడతారు. వెంటనే 'గీతా బైబిలు ఖురానులు/ ప్రీతితో చదివెరు వేదాలు/ గీతార్థంబును నిజమును గన్న/ త్యాగ విరాగికి నమో నమో' అని మతగ్రంథం ఏదైనా త్యాగం, వైరాగ్యం అనే గుణాలు మనిషిని ఉన్నతునిగా నిలబెడుతాయని అంటారు. ఆ గ్రంథాల సారం అర్థం చేసుకుని ఆచరించడమే ముఖ్యం అన్నది కవి భావన.

అలాగే 'మోటారు కారును జూశారా' అన్న పాటలో ధ్వని గర్భితమైన ఆత్మప్రబోధం కనిపిస్తుంది. కారు అనే వాహనాన్ని జీవితానికి అన్వయిస్తూ 'బండిని చేతులో పట్టావోయ్/ ఆత్మకు సారథివైనావోయ్' అని ఎవరి బతుకు బండికి వారే సారథి అనే సత్యం తెలియజేస్తాడు. మంచైనా చెడైనా తన స్థితికి తానే కారణం, తప్ప ఇతరులను నిందించడం తగదంటాడు. ఎరుకతో అంటే జ్ఞానంతో మసలుకోవాలని హితబోధ చేస్తాడు. తన ఆత్మకు సారథిగా తన జీవితాన్ని వెలుతురు బాటలో నడపాలి అన్నది ఆయన సందేశం.

రైలుబండి మీద రాసిన పాటలోనూ ఇలాంటి సందేశమే మరింత తాత్వికంగా చెప్పాడు. 'రైలుబండి వచ్చె చూడండి' అని మనల్ని స్టేషనుకు తీసుకెళ్ళి జ్ఞానబోధ చేసినట్లు ఉంటుంది ఈ పాట. 'క్షణము సేపే నిల్చు

చూడండీ/ ఇచ్చోట రైలు/ చాల కాలము నుండబోదండీ' అనే మాటల్లో జీవితం క్షణభంగురమైనదని ఆ స్వల్ప కాలంలోనే ధార్మిక, సాత్విక గుణాలతో బతుకు కొనసాగించాలని ప్రబోధిస్తాడు. రైలుబండి లాంటి బతుకు ప్రయాణంలో అటూ ఇటూ చూస్తూ ప్రమత్తులైతే ప్రమాదాలు ముంచుకొస్తాయని హెచ్చరిస్తాడు. మర్మం తెలియకుండానే మనిషి జన్మ ఎత్తినామని, ఈ పయనంలో 'ధర్మమనియేడి భక్తిమూటలు నిర్మలముగా నుంచుకొనుడీ' అని నీతివర్తనం తెలుపుతాడు. భ్రమల్లో కూరుకుపోకుండా నడుచుకొమ్మంటాడు.

మరో సాంకేతిక అద్భుతం సినిమా. మొదటిసారి సినిమా చూసిన ఈ కవి దాన్ని కూడా నిజ జీవితానికి అన్వయించి చెప్పాడు. మర్మం తెలుసుకొని తెరమీద నడిచే ఆటను బతుకు నాటకంతో పోల్చి నిజం తెలుసుకొమ్మంటాడు. సూత్రధారుడు (డైరెక్టర్) మనకు మూడు గంటల పాటు సినిమా చూపిస్తాడనీ, కానీ పరమాత్ముడు మన బతుకు నాటకాన్ని జీవితకాలం నడిపిస్తాడని చెబుతాడు. అది తోలుబొమ్మలాట అనీ, కాలం రీతిగా కథ నడిపిస్తాడనే సంగతి అర్థం చేసుకోవాలంటాడు. అందుకే 'బట్టపైననే నాటకము/ గుట్టు తెలిసితే బూటకము' అనే సత్యం తెలుసుకోవడం అవసరమంటాడాయన.

గారడీ గురించి రాసిన పాటలోనూ వెంకటాచార్యులు జీవిత సత్యాలను చక్కగా ఆవిష్కరించాడు. పాముకు, ముంగీసకు కొట్లాట పెట్టడం, బాలుని పెట్టెలో పడుకోబెట్టి పెద్దపులిని చేయడం, ఇనుపగుండ్లను గుద్దుకునేలా చేయడం, కాశీలోని విగ్రహాలను రప్పించడం, బోకె పెంచులను నాణాలు చేయడం వంటి విద్యలు బతుకుదెరువు విన్యాసాలు తప్ప నిజాలు కావు అంటాడు కవి. డబ్బులు సృష్టించిన వాడు ప్రదర్శన పూర్తి కాగానే చిల్లర అడుక్కోవడం ఎందుకో అనే తార్కిక ప్రశ్న వేసుకోవాలంటాడు. 'కన్నులకుండిన పొరలను దీసితే/ కల్ల నిజము దెలుసు' అనే అవగాహన అవసరం అంటాడు. భ్రమలు వదిలిపెట్టాలని చెబుతాడు.

మనిషి స్వార్థపరుడనీ దాన్ని వదిలిపెడితేనే మోక్షం లభిస్తుంది అంటాడు వెంకటాచార్యులు. 'నాది నాది యని పల్కకు రోరి నరుడా' అనే పాటలో 'పంచ భూతంబులు నైదూనూ/ పెంచగా పెరిగి పాయేనూ/ పంచీకరణ దెలుసు కొనీ/ పంచ వింశతి తత్వములను/ పంచి వేసితే నన్నిటీపై/ మించి యున్నది యంత దానిదే' అని పరమాత్మ తత్వాన్ని తెలియపరుస్తాడు. మరో పాటలో జీవితం ఎప్పుడు పేలుతుందో తెలియని 'నీటిబుగ్గ' అంటాడు. కనుక 'నరులకు కిరాయిదీ గృహము' అని గుర్తుంచుకోవాలనీ, మనిషెవ్వరూ ఈ లోకంలో శాశ్వతం కాదు అంటాడు. దేహం చూసుకొని వ్యామోహం చెందడం తగదంటాడు. పరస్త్రీ మోహంలో జీవితం పాడు చేసుకోవద్దని హితవు చెబుతాడు. సాధువులను నిందించడం పాపం అంటాడు. 'తల్లిదండ్రుల ఆజ్ఞ మీరకురా నా ముద్దు సోదరా' అని సుద్దులు చెబుతాడు. కలిమి లేములు సమమే అని స్థితప్రజ్ఞత ఉపదేశిస్తాడు. కాంత, కాంచనముల మాయలో పడి చెడిపోకుమంటాడు.

ఇట్లా 'రాజయోగానంద భజనమాలలోని 88 గీతాలు మానవ విలువలు, ఆధ్యాత్మిక జ్ఞానం, వైరాగ్య భావన ప్రబోధిస్తాయి. వెంకటాచార్యులు ప్రతి పాటను ఆబాల గోపాలాన్ని అలరించే విధంగా తీర్చిదిద్దాడు. ప్రతి పాటలోనూ జీవిత పరమార్థాన్ని రంగరించాడు. పాటల చివర ఉన్న భజనలు పునరుక్తంతో భక్తులు పరవశంతో పాడుకునేలా ఉన్నాయి. ఇందులోని చాలా పాటలు విశేష జనాదరణ పొందాయి.

**ముగింపు :**

తెలంగాణా మారుమూల పల్లెలో పుట్టిన వడ్ల వెంకటాచార్యులు సహజపండితుడై గురుముఖతా కొంత, స్వీయ అధ్యయనం ద్వారా మరికొంత సాహిత్యం ఆకళింపు చేసుకున్నాడు. ఆయన ఎన్ని రచనలు చేసినా ప్రజలు పాడుకోవడంలో ఆనందం చూసుకున్నాడు. కానీ ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. అలాగే రాసిన వాటిని వెంటనే అచ్చు వేయించుకోకపోవడం కూడా ఆయన ప్రతిభ వెలుగులోకి రాకపోవడానికి ముఖ్య కారణం. ఆయన రాసిన

నాటకాలు, రచనలు పూర్తిగా దొరికితే తెలంగాణ సాహిత్యం మరింత పరిపుష్టం అయ్యేది. లభ్యం కాకపోవడం ఒక లోటుగానే భావించవచ్చు.

సహజకవిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా కామారెడ్డి ప్రాంతంలో వెలిగిన వడ్ల వెంకటాచార్యులు రెండేండ్లకు పైగా అనారోగ్యంతో బాధపడి 1987 డిసెంబర్ 17 ఈ లోకం విడిచి వెళ్లిపోయారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఇందూరు సీమ విజ్ఞాన సర్వస్వము, సంపాదకులు - శాస్త్రుల రఘురామ శర్మ, ప్రభా ప్రచురణలు, సికింద్రాబాద్, ఫిబ్రవరి 2005.
2. నిజామాబాదు జిల్లా కవిత్వం, డా.వి.శంకర్, తెలంగాణ రచయితల సంఘం, హైదరాబాదు, జూలై 2016.
3. కామారెడ్డి జిల్లా సాహిత్య చరిత్ర, డా.వి.శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాదు, జూన్ 2019.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# సమకాలీన సాహిత్యం - వృత్తి జీవనంలో మానవ సంబంధాల కథలు



డా।। ఎస్. రవి ప్రసాద్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, షాద్ నగర్.
Email : raviprasads2022@gmail.com

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

సమకాలీనత అనేది ఒక కాలంలో జరిగిన ఏ విషయాన్నైనా ఒకే దృక్పథంతో వున్న వాటినీ, భిన్న ఆలోచనలతో వున్న దానిని స్పష్టంగా అవగాహన చేసుకోవడానికి దోహదపడ్తుంది. సమకాలీనత అధ్యయనానికి మార్గదర్శనం చేస్తుంది. ఒకే కాలంలో జరిగిన సంఘనల పరంగానూ, శాస్త్రపరంగానూ, సాహిత్యపరంగానూ పోలికలు, భేదాలు తెలుసుకోవడానికి కూడా సమకాలీనతనకు మనం ఈనాడు ప్రాధాన్యమిస్తున్నాం. జాతుల మధ్య, తెగల మధ్య సంస్కృతి, ఆచారవ్యవహారాలు, కర్మకాండలు ఆటపాటలు మొదలైన వాటిని తెలుసుకుని వాటిపరంగా వచ్చిన ప్రభావాలు ఏ విధంగా సమాజాలను ప్రభావితం చేశాయో అన్న విషయాన్ని కేవలం అవగాహనకే పరిమితం చేయకుండా వర్తమాన కాలంలోనూ పరిగణనాత్మక విషయాల పరంగా లోతైన వివేచనతో సవరణలు, సంస్కరణలు చేయడానికి సమకాలీనత దోహదపడ్తుంది. సమకాలీనత గతానికే పరిమితం కాదు, వర్తమానంలోనూ గడచిన కాలాంశాలను పునశ్చరణ చేసేదిశలో నిబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడుతుంది.

**కీలక పదాలు :**

సమకాలీనత, ఆధునికత, సామాజిక వైరుధ్యాలు, తాత్వికపోరాటం, సమాజ స్థితిగతులు, కులవృత్తులు, ఆర్థిక సమానత్వం, మానవ సంబంధాలు, పారిశ్రామిక రంగం, పట్టణ జీవితం, ప్రపంచీకరణ.

**ప్రవేశిక :**

కథానిక దీర్ఘంగా సాగిపోకుండా పొందికగా ఉండాలనీ అందులో దీర్ఘ సమాసాలు, వర్ణనలు అవసరం లేదని, పఠితకు సంభ్రమాశ్చర్యాదులు కలిగించే విచిత్ర సంఘటనలుండాలని, కథా గర్భంలో కరుణ రసోత్పాదకమైన సన్నివేశా లుండాలని, పాఠకుడు ఊహించని అద్భుతమైన మలుపుతో కథ ముగియాలని అగ్నిపురాణంలో ఉన్న ఒక

శ్లోకాన్ని బట్టి తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికి ఆధునిక తెలుగు సాహిత్యంలో కథానిక అనే పదాన్ని ఆంగ్లంలోని 'Short Story' అనే పదానికి సమానార్థకంగా వాడుచున్నారు. కథ అనేది కథానికకు పర్యాయపదం.

వ్యక్తికి, సమాజానికి, సాహిత్యానికి పరస్పర సంబంధం ఉంటుంది. వ్యక్తి సమాజంలో భాగంగా జీవిస్తాడు. సమాజంలో భాగంగా రూపుదిద్దుకుంటాడు. సమాజం పరిణామశీలమైనది. సమాజ క్రమాన్ని వ్యక్తులు, శక్తులు, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి సాధనాలు సామాజిక వైరుధ్యాలు, సామాజిక వైవిధ్యాలు, పరస్పర ఐక్యత, ఘర్షణ, సహజీవనం, పరిమాణాత్మక గుణాత్మక మార్పుల క్రమాలు నిర్దేశిస్తాయి. ఈ దృష్టితో చరిత్రను అధ్యయనం చేయడాన్ని ఆధునిక తెలుగు సాహిత్యం ఏ ఇతర భాషా సాహిత్యాలకు తీసిపోదని ఇటీవలి కాలంలో వెలువడ్డ కవితా సంకలనాలు, సమీక్షా గ్రంథాలు నిరూపిస్తున్నాయి. సమకాలీన సమాజ స్థితిగతులు, నడుస్తున్న చరిత్ర సంస్కృతి అందులో చోటుచేసుకుంటున్న మార్పులు, మనుష్యుల స్వభావాలను విశ్లేషిస్తూ విరివిగా కథా సంకలనాలు వస్తున్నాయి. మానవ సంబంధాల్లో ఉద్యమాల్లో, వ్యవస్థలో, ఆలోచనా సరళిలో వస్తున్న మార్పులను సామాజిక తాత్త్విక పోరాటాలతో కలుగుతున్న చైతన్యాన్ని విశ్లేషించి, చదివించే శైలిలో చిత్రించడం సమకాలీన కవుల లక్షణం. వస్తువు సమకాలీకం కాదు అది వర్తమాన పురోగమనానికి వర్తమాన భావాలను వ్యాప్తి చేయడానికి ఆ రచన సమకాలీనమైనప్పటికి ఏ విధంగానూ దోహదం చేయదు. ఈ వ్యాసంలో సమకాలీన వృత్తి జీవనంలో మానవ సంబంధాల కథలను తీసుకొని విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

**వృత్తి జీవనం మానవ సంబధాల పాత్ర – విశ్లేషణ :**

గ్రామీణ ప్రాంతాల్లో కరువు విలయతాండవం చేసే దృశ్యాన్ని కడుపు తరక్కుపోయినట్లు వర్ణించడం మిత్తవ ప్రత్యేకత. ఈ కథలోని గోవిందమ్మ ఇద్దరు పిల్లల తల్లి. ఆమె కాయకష్టం మీద ఇంటిల్లిపాది బతికేవారు. ఆమె భర్త జులాయి. ఎవరికి చెప్పాపెట్టకుండా ఎటో ఉడాయించాడు కూడా. ముసలి వాళ్ళకు ప్రభుత్వం ఆశ్రయమిస్తుందన్న వార్తలు రావడంతో పిల్లల్ని తీసుకొని వలస పోవాలని ఊరు విడిచి పెట్టి దగ్గర్లో ఉన్న పట్నానికి చేరింది. లాభం లేకపోవడంతో ఏమి చెయ్యాలో తోచక కన్న వారి ఊరి బస్సెక్కింది. ఆ వూరి పరిస్థితీ అంతే. దుర్భిక్షానికి తోడు విషజ్వరాలతో ఊరు భయంకరంగా ఉంది. పల్లెటూళ్ళో వైద్యం దుస్థితి అతి సహజంగా చిత్రించడం జరిగింది. పొలం పని ఉన్నన్నాళ్ళూ గోవిందమ్మను వదిన బాగానే చూసుకుంది. పొలం పనులు లేక ఖాళీగా ఉండడంతో గోవిందమ్మను పంపేయమని వదిన ఒకటే గొడవ చేసింది. అరకొర పంటలతో అప్పులు తెప్పలుగా పెరగడం గోవిందమ్మ వదిన అలా వ్యవహరించడానికి హేతువయ్యాయి. గోవిందమ్మ ఆత్మహత్యకు సిద్ధపడుతుంది. చివరి క్షణంలో పిల్లలు గుర్తు రావడంతో నిర్ణయం మార్చుకొని, వాళ్ళని తీసుకొని చీకటి నుండి వెలుగు వైపు ప్రస్థానం సాగించింది.

కొడవలి, గొడ్డలి, రంపం, నాగలి పల్లె నుండి మాయమయ్యే తీరు స్వామి 'తెల్లదెయ్యం' కథలో తేటతెల్లమవుతుంది. గ్రామీణ వృత్తికారుల నేపథ్యంలో సాగిందీకథ. విత్తులో ప్రాణం రాజేసే విద్య తప్ప మరో నాగరికత తెలియని పాతన్నకు ద్రవ్య వ్యవస్థలో జరిగిన మోసం ఈ కథ తెలుపుతుంది. ఒక గింజ నుండి పది గింజలు పుట్టించగలుగుతున్నాడు కానీ ఆ గింజను రూపాయి చేసే రూపాయి నుండి పది రూపాయలు తీయలేకపో తున్నాడు.. ఈ అవకాశాన్ని వ్యాపార నాగరికత సొంతం చేసుకుంది. అదుగో పాతన్నకు అక్కడ్నుండి మాయరోగం పట్టుకుంది. ఆ రోగం వేదిస్తూనే ఉంది. ఎద్దులు కనిపించడంలేదని పాతన్న భార్యను అడుగుతారు. బోసిమెడ తడుముకుంటూ ఏమో అంటుంది. అయ్యో! అనుకుని అనుమానంగా బయటకు పరుగెడతాడు. బండి లేదు. కుమ్మరి తిప్పన్నకు సారి కనిపించడంలేదు. గాండ్ల వెంకటేశుకు గానుగు కనిపించడంలేదు. నేసే మున్నయ్యకు మగ్గం కనిపించడంలేదు.

ప్రపంచీకరణ నగర సంస్కృతిని ఎలా పెంచుతుందో, నగరాలు విస్తరించి, గ్రామాల్ని గ్రామ జీవనాధారాల్ని ఎలా మాయం చేస్తున్నాయో ఈ కథ తెలుపుతుంది.

కొడుకుని నడుంకి కట్టుకొని, కత్తిపట్టుకొని గుఱ్ఱం మీద నుంచి ఝాన్సీ లక్ష్మీబాయి యుద్ధం చేస్తే లచ్చవ్వ తన కొడుకు భవితవ్యం కోసం ఆ వూరి భూస్వామితో చేసిన ఒంటరి పోరే 'పోరుతల్లి'. బెజ్జరపు రవీందర్ రాసిన ఈ కథ ఆద్యంతం గ్రామీణ భూస్వాములు పేదల్ని పెట్టే హింస, దౌర్జన్యం దోపిడి కనిపిస్తుంది. లచ్చవ్వ భూమిని కాజెయ్యడమే కాకుండా కొడుకుని పాలికాపుగా ఉంచమంటాడు భూస్వామి. లచ్చవ్వ భూస్వామిని అసహ్యించుకుంటుంది. దానితో వాడు బండబూతులు తిట్టడమే కాకుండా దారుణమైన దౌర్జన్యాలు చేస్తాడు. కథ అమూలాగ్రం భూస్వామి దుశ్చర్యల్ని తెలియచెప్పినా గ్రామీణ ప్రాంతాల్లో చేతివృత్తులు అటకెక్కిన తీరు అద్భుతంగా చెప్పడం జరిగింది. ప్రారంభంలో కొరవయ్యసారు చెప్పే పాఠం అర్థమయ్యి అర్థం కానట్టుండడం ఎంత దయనీయం. చెప్పే పాఠం గ్రామీణ వృత్తికారులకు చెందిన నేత గురించి. ఆ పాఠం గ్రామీణ పిల్లలకు అర్థం కాని స్థితి అటకెక్కిన చేతివృత్తుల స్థితిని తెలుపుతుంది.

కిందటి తరంలో సంఘటితంగా పోరాడి సాధించుకున్న హక్కుల్ని పాలక పక్షాలు ప్రయివేటీకరణ, సరళీకరణల పుణ్యమా అని ఉపసంహరించుకున్న విధానాల్ని లాభాల్ని కృత్రిమ నష్టాలుగా చూపించి కార్మిక రిట్రెచ్‌మెంట్ విధానాన్ని కాంట్రాక్ట్ కూలీ విధానాన్ని, మానవ శ్రమకు బదులు యంత్రాల్ని ఉపయోగించే పద్ధతిని తెలియజేసే కథ కాట్రగడ్డ దయానంద్ రాసిన 'అలజడి' గతతరంలోని పోరాట పటిమ, ఐక్యమత్యం కోల్పోవడం పాలక పక్షాలకు ఎంత మేలు జరుగుతుందో తెలుపుతుంది. కార్మికులు, శ్రమ జీవుల జీవితాలు దుర్భరంగా మారడానికి ఎలా హేతువవుతుందో తెలుపుతుంది. గ్రామాలకు గ్రామాలు వ్యవసాయం నుంచి దూరంగా జరిగి కాంట్రాక్టుల సొంత ఆస్థిగా ఎలా మారిపోయాయో తెలుపుతుంది. భూములు కోల్పోయిన వాళ్ళు దినసరి కూలీలుగా ఎలా పరివర్తన చెందారో అర్థమవుతుంది. పోరాడి ఏర్పాటు చేయించుకున్న ఆసుపత్రులు, విద్యాలయాలు ఎలా నిర్వీర్యమై మూతలు పడుతున్నాయో ఈ కథ తెలుపుతుంది.

సాహితి 'లివింగ్ టు గెదర్' వైవాహిక జీవితాల్లో వచ్చిన పెనుమార్పుల్ని చెబుతుంది. నగర జీవితంలో కుటుంబ వ్యవస్థ ఎలా ఛిన్నాభిననమయ్యిందో వివరిస్తుంది. నిశాంత్, మహతిలకు వివాహమై ఎనిమిదేళ్ళయ్యింది. వాళ్ళకి ఇద్దరు పిల్లలు కూడా. నిశాంత్ ఉద్యోగి. మహతి హౌస్‌వైఫ్. నిశాంత్‌కు తన కాలేజీ మీట్ ప్రసన్న కనిపించింది. అదుగో అక్కడ్నుండి వాడిలో మార్పు చోటు చేసుకుంది. మహతితో సహజీవనం చేస్తూనే ప్రసన్నతో కలిసుండాలనుకుంటాడు. మహతి విభేదించింది. ఇద్దరూ విడిపోయారు. మహతి పి.జి. చదువు పూర్తి చేసి ఉద్యోగంలో చేరుతుంది. ఆ తరువాత లండన్ ఉద్యోగం పని మీద వెళుతుంది. పిల్లల్ని కూడా లండన్ తీసుకుపోతుంది. చాలా కాలం తరువాత తన ఆఫీస్ కొలిగ్‌ని పెళ్ళి చేసుకుంటుంది. ఆమెకు అతని వల్ల ఒక కొడుకు కూడా. నిశాంత్ ప్రసన్నలు వివాహేతరంగా కలుసుకుంటారు. ప్రసన్నకు కుటుంబ వ్యవస్థ మీద వ్యతిరేకత. చాలా సంవత్సరాల తరువాత లండన్ నుండి మహతి నిశాంత్‌కు ఉత్తరం రాసింది. పిల్లలు లండన్ నుండి నిశాంత్‌ను చూడాలని వస్తున్నారన్నది ఉత్తర సారాంశం. నిశాంత్ ప్రసన్నలు స్టేషన్‌కు వచ్చి పిల్లల్ని రిసీవ్ చేసుకుంటారు. ఆ కలయిక తరువాత కుటుంబ జీవితగొప్పతనం నిశాంత్‌కు తెలుసొచ్చి మనస్సులో కలకలం సృష్టిస్తుంది.

ంంంంఅక్కిరాజు భట్టిప్రోలు 'నందిని' కథ ఇదే యితివృత్తంతో సాగిన రచన. నందినిది హైదరాబాద్. వివాహ వ్యవస్థ మీద ఆమెకు అసహ్యం. కలిసి జీవించాలి తప్ప పెండ్లి చేసుకోకూడదని నిర్ణయించుకుంటుంది. ఉద్యోగ నిమిత్తం అమెరికా వెళ్ళి అక్కడ ఒక కంపెనీలో మంచి పొజిషన్ సంపాదిస్తుంది. అమెరికాలో తనతో పని చేస్తున్న మార్క్‌తో పరిచయం పెంచుకుంటుంది. అది శారీరక సంబంధానికి దారి తీస్తుంది. యధేచ్ఛగా తిరగడమే స్వేచ్ఛగా భావిస్తుంది. అదే సమాజం మీద తిరుగుబాటనుకుంటుంది. మాటల సందర్భంగా నందిని తన స్నేహితురాలితో ఈ

అభిప్రాయాలు వెల్లడిస్తుంది. సామాజిక చట్రాన్ని అర్థం చేసుకోకుండా ఆర్థిక సమానత్వం ఒక్కటే స్త్రీ సమస్యలకు పరిష్కారంగా భావిస్తుంది. ఇలా అస్పష్ట అభిప్రాయాల సమాహారమే నందినిగా కన్పిస్తుంది. మార్క్‌తో చెప్పకుండా బిడ్డను కనాలనుకుంటుంది. హైదరాబాద్‌లో ఉన్న తల్లితండ్రుల్ని అమెరికా పిలిపించి విషయం చెబుతుంది. తల్లితండ్రులు మార్క్‌ని పెళ్ళి చేసుకోమంటారు. నందిని వ్యతిరేకిస్తుంది. నందిని కాన్పు కోసం ఆసుపత్రిలో జాయినై మగబిడ్డడ్ని కంటుంది. ఆమె ఆసుపత్రిలో ఉండగా మార్క్ ఒక పార్శిల్ తెచ్చిస్తాడు. పెండ్లి లేకుండా కలిసుండడం తనకిష్టంలేదని, పెళ్ళి చేసుకుంటేనే కలిసుంటానని లేకపోతే వేరే పెళ్ళి చేసుకుంటానని మార్క్ నందినికి తెగేసి చెబుతాడు. నందిని పార్శిల్ తెరిచి చేస్తుంది. అందులో అందమైన డైమండ్ ఉంగరం ఉంటుంది. చేతికి ఆప్యాయంగా పెట్టుకుంటుంది. నగర సంస్కృతి పేరిట విచ్ఛిన్నమవుతున్న వివాహ వ్యవస్థ ఈ రెండు కథల్లో ఉంది. వీటి మీద లోతుగా చర్చ జరగాల్సి ఉంది.

టీనేజ్ అమ్మాయిలు కొత్త రుచులకు, కొత్త ప్రభావాలకు ఎలా లోనవుతారో తెలిపే కథ ‘వర్షపు జల్లులో...’ కుప్పిలి పద్మ టీనేజ్ అమ్మాయిల మనస్తత్వాన్ని చాలా సునిసితంగా పరిశీలించారు. వస్తు వ్యామోహ సంస్కృతి పిల్లల్ని ఎలా ప్రలోభపెడుతుందో, పెద్దల్లో కూడా ఎలాంటి మార్పు తెస్తుందో ఈ కథ తెలుపుతుంది. మహీ టీనేజ్ అమ్మాయి. ఇంటర్ చదువుతుంది. మహి తమ్ముడు 8వ తరగతి చదువుతున్నాడు. వీడియో గేములు, సిడిలు, కంప్యూటర్‌లు తన తోటి వాళ్ళ దగ్గరున్నాయి తనకు కావాలంటాడు వాడు. తన స్నేహితులు బళ్ళలో వెళ్తున్నారని తనకు బండి కావాలని మహి అంటుంది. తండ్రి సెల్ కొనుక్కుంటాడు. కూతురుకు కూడా కొనిపెడతాడు. అవసరంలేని వస్తువులు కొనుగోలును తల్లి వ్యతిరేకిస్తుంది. మహికి కొత్తగా ప్రతాప్‌తో పరిచయం ఏర్పడుతుంది. మొదట్లో మొగమాటానికి, తరువాత అలవాటుగా మహి ప్రదీప్‌తో పబ్‌లకి, డిస్కోలకి, ఫాంమ్ హౌస్ పార్టీలకి, వీకెండ్ పార్టీలకి వెళుతుంది. బీరు తాగడం, కృత్రిమ వానలో డాన్స్ చేయడం మొదలు పెట్టింది. ఇంటి దగ్గర ఏవో అబద్దాలు చెప్పి సాయంత్రం పూట బయటకు వెళ్ళేది. ఏడాది చివర్లో అత్తెసరు మార్కులతో ఇంటర్ పాసవుతుంది. డిగ్రీకి వచ్చిన తరువాత ప్రదీప్ ఫామ్ హౌస్‌లోని సింగిల్ బెడ్‌రూమ్‌కి తీసుకెళతాడు. అక్కడ తాగుతుంటాడు. భయంతో బయటకు పరుగుతీసి ఆటో ఎక్కి ఇంటికి పోతుంది. ప్రదీప్ మహీకి ఫోన్ చేసి మొదట్లో అలాగానే ఉంటుందని అదేంతప్పుకాదని అంటాడు. మహి ఒప్పుకోదు. ఆమె పశ్చాతాపంతో కుములి పోతుంది. మహి బాధని పసికట్టిన తల్లి కూతుర్ని సంభాళిస్తుంది. తల్లితో జరిగిన విషయాన్ని చెప్పి బాధపడుతుంది. ‘కొన్ని సార్లు గాయపడ్డం అనివార్యం ఒక కొత్త జీవితం అందులోంచే చిగిరిస్తుంది. ఆ నమ్మకం నాకుంది’ అని మహితో తల్లి చెప్పి ఊరడిస్తుంది. పిల్లల్ని బాహ్య ప్రపంచం తెలియకుండా పెంచితే జరిగే పరిణామాలు ఈ కథ వివరించింది.

గొలుసు జగదీశ్వరరెడ్డి రాసిన ‘చీడ’ కథ కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులతోపాటు తల్లితండ్రుల కలహాలు పిల్లలకు ఎలా శాపాలుగా పరిణమిస్తాయో తెలుపుతుంది. అరవింద సుజాతలది ప్రేమ వివాహం. అందునా కులాంతరం. కొన్నాళ్ళు సజావుగా సాగిన వాళ్ళ దాంపత్య జీవితం ఎంతో మంది పొగడ్తలను అందుకుంది వాళ్ళ పెరటి పూతోటలానే అందంగా, ఆనందంగా సాగింది. ఆర్థిక మార్పులు. పట్టణ నాగరికత వారి మధ్య అపోహలకు, అరమరికలకు హేతువయ్యింది. ఆ విషబీజాలు విస్తరించి ఒకరిపట్ల ఒకరికి ద్వేషం, ప్రతీకారంగా మారింది. వాళ్ళ గొడవల మధ్య పిల్లలు బలి పశువులయ్యారు. చిత్రహింసలు అనునిత్యం అనుభవించే వారు. మొత్తం కథని కథకుడు శంపంగి ఆత్మకథగా వివరించడం దీనిలోని ప్రత్యేకత. ఇంటి పెరటిలోని మొక్కలు చిట్టితల్లి మీద చూపించిన ప్రేమైనా తల్లితండ్రులు చూపించలేకపోయారు. తల్లితండ్రులిద్దరు చివరకు ఒకరి జ్ఞాపకాలు ఒంకొకరికి మిగలకూడదని వాటిని ధ్వంసం చేసుకుంటారు. ఇది నేటి వివాహాల డొల్లతనాన్ని బహిర్గతం చేస్తుంది. చివరకు చిట్టితల్లి, తల్లితండ్రులతోనూ అన్నయ్యతోనూ పెరటి మొక్కల్లో తీయించుకున్న ఫోటోను సంపంగి ఒడిలో దాయడం

అద్భుత ముగింపు. కథలు కాకరకాయలు సమాజాన్ని మారుస్తాయా అన్న వాళ్ళకు ఈ సంకలనం సమాధానం. కథలు ఉన్న ఫళంగా సమాజాన్ని మార్చలేకపోయినా సమాజ మార్పుల్ని చెబుతాయి. ఆ మార్పులు సమాజ శ్రేణుల్ని ఆలోచనలోకి నెడతాయి. ఆలోచన పదునెక్కి అభ్యుదయ సంస్కారం అబ్బుతుంది. ఆ సంస్కారమే వ్యక్తిలోనూ సమాజంలోను మార్పుకు దోహద పడుతుంది.

యాళ్ల అచ్యుతరామయ్య రచించిన 'బ్రతుక్కి అర్థం' కథలో 'ఆల్విన్' ప్రైవేటీకరణ వల్లరోడ్ల పాలైన ఓ కార్మికుడు బతుకు తెరువు కోసం విదేశాలకు వెళ్లేందుకు సిద్ధపడతాడు. ఈ పరిస్థితుల్లో కన్నకొడుకును విడిచి వుండలేని ముసలి తల్లి ఎంతగానో వేదన చెందుతుంది. ఆ సందర్భంలో వారి మానసిక సంఘర్షణ చిత్రితమైన తీరు పాఠకులను కంట తడి పెట్టిస్తుంది. ఈ కథలో ప్రధాన (కథానాయకుడి) పాత్ర ఎవరిది అనేది నిశితంగా పరిశీలిస్తే కానీ అవగతం కాదు. కథా ప్రారంభంలో కొడుకుని విదేశాలకు వెళ్లవద్దని తల్లి బతిమాలుతుంది. పొరుగున నివసించే మహిళ వారికి ధైర్యం చెబుతుంది. వామపక్ష కార్యకర్త అయిన తన కొడుకుని వారికి సాయం చేసేందుకు పంపిస్తుంది. అతని సలహా -సహాయంతో ఆ కార్మికుడు విదేశీ ప్రయాణం మానుకుంటాడు. వేరే కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా చేరి ఇక్కడే ఉండిపోతాడు. క్రమంగా ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ పోరాటాల్లో భాగస్వామి అవుతాడు. కొడుకుతో పాటు తల్లి కూడా ఈ ఉద్యమ స్వభావాన్ని అర్థం చేసుకుంటుంది. చివరకు ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడి రాకను నిరసిస్తూ సాగిన ప్రదర్శనల్లో తానూ పాల్గొంటుంది. ఆ సందర్భంలో ఆమెను ఓ విలేకరి ఇంటర్వ్యూ చేస్తాడు. తన లాంటి తల్లులకు కడుపు కోత మిగుల్చుతున్న. తమ బిడ్డల జీవితాల్లో నిప్పులు పోస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదంపై ఆ తల్లి ఆగ్రహాన్ని వెలిబుచ్చడంతో కథ ముగుస్తుంది. ఈ రకమైన ముగింపు గోర్కీ నవల 'అమ్మ'ను గుర్తుకు తెస్తుంది. స్వయంగా ప్రయివేటీకరణ బాధితుడైన రచయిత ఈ కథల పోటీలో మొదటి బహుమతి పొందడం విశేషం. 'కార్మికలోకం' కథల పోటీ నిర్వాహకులు ఆశించిన ప్రయోజనం ఈ విధంగా సంపూర్ణంగా నెరవేరిందని భావించవచ్చు.

ఎలికట్టె శంకరరావు రచించిన 'పొరకలు' కథకు రెండవ బహుమతి లభించింది. ఈ కథలోని పాత్రలు నిత్యం మన రోడ్లను ఊడుస్తూ చెత్తను ఎత్తి వేస్తూ కనపడే శ్రామికులే. తెలంగాణా మాండలికంలో సాగిన ఈ రచన ఎవరి గుండెనయినా కదిలించకమానదు. అర్థరాత్రి అపరాత్రి అనక రోడ్లను ఊడుస్తూ, నెలల తరబడి జీతాలు రాక ఇబ్బంది పడుతూ, కాంట్రాక్టర్లు - అధికారుల ఛీత్కారాలకు గురవుతూ, కౌన్సిలర్ల బేరసారాలకు బలవుతూ, ఆకలితో అల్లాడుతూ బతుకుతున్న సజీవ పాత్రలు ఈ కథలో మనల్ని నిలదీస్తాయి. కథనంపై - మాండలికంపై రచయిత తనకు గల పట్టును ప్రదర్శించారు.

'రక్తంతో నడుపుతాను రిక్షాను! నా రక్తమే నా రిక్షాకు పెట్రోలు' అనే చెరబండరాజు గీతానికి సజీవ సాక్ష్యంలా కనబడే రిక్షా కార్మికుని పాత్రధారిగా చేసి ఉనిసురేష్ పిళ్ళై రచించిన కథ 'కండ్లలో ఊట'. దీనికి మూడవ బహుమతి లభించింది. వేలాది రూపాయలు వెచ్చించి విలాస వస్తువులు కొనే పెద్ద మనుషులు వాటిని ఇంటికి చేర్చే సాటి మనిషి అయిన రిక్షా కార్మికుడి పట్ల ఎంత నిర్దయగా, మోసకారితనంగా వ్యవహరిస్తారనేది ఈ కథ కళ్లకు కట్టేలా చూపించింది.

**ముగింపు :**

ప్రపంచంలో భారతీయ సమాజానికే ప్రత్యేకమై శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల వ్యవస్థలో ప్రతికులానికి ఒక ప్రతిపత్తి ఉంది. ప్రత్యేకమైన జీవన విధానం ఉంది. ఒక వ్యక్తి సంఘంలో ఒక హోదాను వృత్తిని పొందటాన్ని అతను పుట్టిన కులం నిర్ధారిస్తుంది. ఆహార, సామాజిక సంబంధాలలో నిషేధాన్ని కల్పిస్తుంది. కొన్ని కులాలవారిని... ఊరికి దూరంగా ఇండ్లు కట్టుకోవాలని నిర్దేశిస్తుంది. కొన్ని కులాలవారు వారికి నిర్దేశించిన వృత్తినే చేయాలి. వివాహ విషయంలో

కూడ నిర్దేశించిన కులంవారినే వివాహం చేసుకోవాలి. అతిక్రమిస్తే కుల బహిష్కారం తప్పదు. రాజకీయంగా కూడా ఈనాడు సమాజంలో కులభావన, కులాభిమానం ప్రధాన ప్రభావాన్ని చూపుతున్నాయి. కులాన్ని బట్టి వృత్తి కేటాయించబడుతుంది. బట్టలు నేసేవాళ్ళు పద్మశాలీలుగా, చర్మకారవృత్తి చేయువారు మాదిగలుగా, కల్లుతీసి అమ్మువారు గౌడులుగా కులం ఆధారంగా ఏర్పడిన వృత్తుల వారు. కులం ప్రత్యేకమైన సంప్రదాయాల్ని కళల్ని కల్గి ఉంటుంది. శిల్పం చెక్కడం శిల్పులవంతు అని, కట్టెను చెక్కి చక్కని ఆకారాన్ని తేవడం, వడ్రంగి వంతు అని చెప్పవచ్చు. ప్రత్యేకమైన కళలను కొన్ని కులాల వారు మాత్రమే నేర్చుకోవడం, వాటిని ఉపయోగించుకోవడం కులం ఆధారంగానే జరుగుతుంది. ఈనాడు కుల ఔన్నత్యాన్ని గుర్తించిన కొందరు కులాన్ని తమ ప్రయోజనాలకు వాడుకొని రాజకీయంగా, సామాజికంగా పైపైకి ఎదగటాన్ని గమనించవచ్చు. మానవ సంబంధాలు (Human Relationships) అంటే వ్యక్తుల మధ్య ఉండే అనుబంధాలు, ప్రేమ, స్నేహం మరియు పరస్పర అవగాహన. ఇవి కుటుంబం, స్నేహితులు మరియు సమాజం మధ్య ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అయితే, నేటి ఆధునిక కాలంలో వీటిని కాపాడుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది.

**ఆధార గ్రంథాలు :**


1. నాగయ్య, జి., తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటి 1,2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.1996
2. తెలుగు కవిత్వం వృత్తి జీవన చిత్రణ, ఆంధ్రప్రభ (దిన) 22-09-2007.
3. ద్వానాశాస్త్రి, 1. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2004,
4. ప్రజాసాహితి, ప్రత్యేక సంచిక నవంబరు,2005.
5. బి.ఎస్.రాములు, బి.సి.కథలు ఒక విశ్లేషణ 2000-2010, విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్.


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# ఆముక్త మాల్యదలో మాలదాసరి సామాజిక జీవన వేదన : ఒక సమగ్ర పరిశీలన



డా॥. పురుషోత్తం గణపతిరావు
తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పొందూరు, శ్రీకాకుళం జిల్లా.
సెల్ : 9490497566.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహము :**

ఈ పరిశోధన వ్యాసం శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్త మాల్యద'లోని 'మాలదాసరి కథ' నేపథ్యంగా నాటి సామాజిక అసమానతను, అట్టడుగు వర్గాల జీవన వేదనను విశ్లేషిస్తుంది. సమాజంలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటూ, ఆలయ ప్రవేశం లేకపోయినా మాలదాసరి తన నిరుపమానమైన సంగీత సాధన, నిశ్చల భక్తి ద్వారా సాధించిన ఆధ్యాత్మిక ఉన్నతిని ఈ వ్యాసం చర్చిస్తుంది. అడవిలో బ్రహ్మరాక్షసుడితో జరిగిన తాత్విక సంవాదం, అనంతరం రాక్షసుడి శాపవిమోచనం కోసం ఒక బ్రాహ్మణుడు మాలదాసరి పాదాలపై పడి పుణ్యఫలాన్ని భిక్షగా అర్థించడం వంటి ఘట్టాల ద్వారా పుట్టుక కంటే గుణమే ప్రధానమని నిరూపించబడింది. రామానుజాచార్యుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావంతో, సాహిత్యం ద్వారా నాటి సామాజిక క్రమాన్ని తిరగరాసి, ఆధ్యాత్మిక సమత్వాన్ని, సామాజిక న్యాయాన్ని చాటిచెప్పిన రాయలవారి విప్లవాత్మక సామాజిక దృక్పథాన్ని వివరిస్తూ, ఈ కథను తెలుగు సాహిత్యంలో తొలి సమతావాద బీజాలుగా ఈ వ్యాసం ఆవిష్కరిస్తుంది.

**కీలక పదాలు :**

ఆముక్త మాల్యద, శ్రీకృష్ణదేవరాయలు, మాలదాసరి, సామాజిక, జీవన వేదన, అస్పృశ్యత, బ్రహ్మరాక్షసుడు కైశిక వ్రతం, కైశిక (సోమశర్మ) రాగం, విశిష్టాద్వైతం, భక్తిమార్గం, సామాజిక సమత్వం, సామాజిక న్యాయం, దళిత, సమతావాద భావనలు.

**వ్యాస ప్రయోజనం :**

విజయనగర కాలం నాటి సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలనుభవించిన అస్పృశ్యత, అవాస వివక్ష మరియు నిశ్శబ్ద వేదనను చారిత్రకంగా నిరూపించడం, సామాజిక చేదు నిజాల ఆవిష్కరించడం. భగవద్భక్తి, నైతిక విలువల

ముందు కుల వివక్ష నిలవదని పుట్టుకతో వచ్చే కులం కంటే మనిషి గుణమే ప్రధానమని మాలదాసరి పాత్ర ద్వారా చాటి చెప్పడం. అగ్రవర్ణానికి చెందిన బ్రాహ్మణుడు (రాక్షస రూపంలో ఉన్నా) తన శాపవిమోచనం కోసం అట్టడుగు వర్గానికి చెందిన మాలదాసరి పాదాలపై పడటం ద్వారా నాటి సామాజిక క్రమాన్ని తిరగరాసిన విప్లవాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించడం. అంతేగాక శ్రీకృష్ణదేవరాయలు కేవలం చక్రవర్తి మాత్రమే గాక భక్తిమార్గం ద్వారా సమాజంలో సమతను సాధించాలని ఆకాంక్షించిన గొప్ప సామాజిక సంస్కర్త అని, తెలుగు సాహిత్యంలో తొలి సమతావాద బీజాలు ఇక్కడే పడ్డాయని నిరూపించడం.

**పరిచయం**

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, సాహిత్య సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన ప్రబంధ శిరోమని, 'అముక్తమాల్యద'. విష్ణుచిత్తీయం అనే నామాంతరం ఉన్న ఈ గ్రంథం కేవలం భక్తితత్వాన్ని మాత్రమే కాక, నాటి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక పరిస్థితులను అద్దం పట్టిన చారిత్రక దర్పణం. రాయలు తన కావ్యంలో ఎందరో గొప్ప భక్తుల కథలను వివరించారు. అయితే ఆముక్త మాల్యద ఆరవ ఆశ్వాసంలో వచ్చే 'మాల దాసరి కథ' రాయలవారి సామాజిక స్పృహకు, మానవీయ కోణానికి అత్యున్నత నిదర్శనంగా నిలుస్తుంది.

సమాజంలో అట్టడుగున ఉన్న ఒక దళిత భక్తుడి (మాల దాసరి) అంతరంగ వేదనను, నాటి సమాజం అతని పట్ల ప్రదర్శించిన వివక్షను, భక్తి ద్వారా అతడు సాధించిన ఆధ్యాత్మిక సమత్వాన్ని ఈ కథ అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. సామాజిక అసమానతలు, అంటరానితనం ప్రబలంగా ఉన్న కాలంలో ఒక చక్రవర్తి ఇటువంటి కథాంశాన్ని ఎన్నుకొని కావ్యంలో పొందుపరచడం ఒక విప్లవాత్మకమైన చర్యగా భావించవచ్చు. ఈ పరిశోధన వ్యాసంలో మాలదాసరి సామాజిక జీవన వేదనను, దాని వెనుక ఉన్న చారిత్రక కోణాలను సమగ్రంగా విశ్లేషించడం జరిగింది.

**చారిత్రక, సామాజిక నేపథ్యం**

రాయల కాలం నాటి సమాజం వర్ణవ్యవస్థ ఆధారంగా నడిచేది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలతో పాట, వీటికి బాహ్యంగా ఉన్న అంత్యజ వర్గం తీవ్రమైన సామాజిక బలిపశువుగా మారిన కాలమది. ఊరికి దూరంగా నివసించడం, అస్పృశ్యత, కనీస మానవ హక్కులు లేకపోవడం నాటి సమాజంలోని క్రూర యథార్థాలు. శూద్రుల కంటే అధమంగా, సమాజంలో కనీస గౌరవానికి నోచుకోని వర్గంగా అంత్యజ వర్గాన్ని పరిగణించేవారు. వారు నగరంలో లేదా గ్రామంలో ప్రవేశించడానికి కఠినమైన నిబంధనలు ఉండేవి.

రాయలు తాను చక్రవర్తి అయినప్పటికీ, నాటి సమాజంలో ఉన్న ఈ దురాచారాన్ని దాచకుండా, ఒక అంటరాని వర్గానికి చెందిన భక్తుడిని కథానాయకుడిగా స్వీకరించడం ఒక విప్లవాత్మకమైన మార్పు, విశిష్టాద్వైత సిద్ధాంతంలోని 'శరణాగతి' మరియు 'భగవద్భక్తి' ముందు కుల వివక్ష నిలవదని నిరూపించడమే ఈ కథ యొక్క ముఖ్య ఉద్దేశం. రామానుజాచార్యుల ప్రబోధాల ప్రభావం రాయలవారిపై ఎంతగానో ఉందని దీని ద్వారా స్పష్టమవుతుంది. కులం కంటే గుణం, భక్తి ప్రభానమని నిరూపించడానికి రాయలు ఈ చారిత్రక సామాజిక నేపథ్యాన్ని వాడుకున్నారు.

**గమనిక : నాటి సామాజిక వ్యవస్థలో అట్టడుగు వర్గాల ప్రజలు అనుభవించిన యాతనను కళ్లకు కట్టినట్లు చూపించడంతో పాటు భక్తిమార్గంలో వారికెంత ఉన్నత స్థానం లభించిందో రాయలు ఈ కథ ద్వారా నిరూపించారు.**

**మాలదాసరి పాత్ర చిత్రణ – నిశ్శబ్ద వేదన**

ఆముక్త మాల్యదలో మాలదాసరి పాత్ర కేవలం ఒక భక్తుడి పాత్ర మాత్రమే కాదు; అది శతాబ్దాల నాటి అణగారిన వర్గాల నిశ్శబ్ద వేదనకు ప్రతీక. మాలదాసరి ప్రతిరోజూ బ్రాహ్మీ ముహూర్తంలో (తెల్లవారుజామున) లేచి, కురుంగుడి నంబి (మహావిష్ణువు) ఆలయానికి వెళ్తాడు. కానీ, అతనికి ఆలయ ప్రవేశం లేదు. ఈ వివక్ష అతనికి

సమాజం విధించిన శిక్ష. ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టే హక్కు లేకపోవడంతో, అతడు దూరంగా నిలబడి, ఆలయ ధ్వజస్తంభం వెలుపల నుంచే భగవంతుడిని ధ్యానించేవాడు.

ఊరి వెలుపల ఉంటూ, ఎవరూ చూడకుండా చీకట్లోనే నదికి వెళ్లి స్నానం చేసి, వీధుల గుండా నడుస్తున్నప్పుడు తన నీడ కూడా సమాజాన్ని మైలపరుస్తుందనే భావన ఎంత క్రూరమైనదో ఈ ఘట్టం వివరిస్తుంది. రాయలు ఇక్కడ మాలదాసరి భౌతిక రూపాన్ని, అతని నిరుపేదరికాన్ని వర్ణించిన తీరు నాటి సామాజిక అసమానతలను కళ్లకు కడుతుంది. చిరిగిన వస్త్రాలు, చేతిలో కిన్నెర (సంగీత వాయిద్యం), హృదయంలో నిరుపమానమైన భక్తి ఇవే అతని ఆస్తులు. ఈ బాహ్య దారిద్ర్యం వెనుక ఉన్న అంతరంగిక సంపద నాటి సమాజంలోని ఏ కులీనుడికీ లేనిది.

### సంగీత సాధన మరియు ఆధ్యాత్మిక ఉన్నతి

మాలదాసరి గాంధర్వ విద్యలో (సంగీతంలో) నిష్ణాతుడు. మాలవగౌ రాగంలో అతడు పాడే కీర్తనలు భగవంతుడిని సైతం సంగీతం కేవలం ఒక కళ కాదు, అది అతని ఆత్మవేదన యొక్క ఆవిష్కరణ. భగవంతుడిని చేరుకోవడానికి అతను ఎంచుకున్న ఏకైక మార్గం ఈ సంగీత సాధన.

### సామాజిక పరస్పర విరుద్ధత

సమాజం అతన్ని శారీరకంగా దూరం పెట్టింది, కాని అతని గొంతు నుండి వచ్చే సంగీతాన్ని, భక్తిని ప్రకృతి సైతం ఆస్వాదించింది. మనుషులు వినడానికి నిరాకరించిన ఆ గానాన్ని బ్రహ్మరాక్షసుడు మరియు స్వయంగా భగవంతుడు ఆలకించారు.

### కైశిక వ్రతం

కార్తీక మాసంలో ప్రబోధోత్సవ వేళ మాలదాసరి చేసిన గానం కేవలం వినోదం కాదు, అది ఒక తపస్సు. సమాజం ఇచ్చిన కులముద్రను దాటి, కథ ద్వారా భగవంతుడితో అనుసంధానం కావడం ద్వారా అతడు సామాజిక వేదనను అధిగమించడానికి ప్రయత్నించాడు. కైశిక రాగాన్ని ఆలపించడం ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని సంపాదించడం అతి ఆధ్యాత్మిక ఉన్నతికి నిదర్శనం.

### బ్రహ్మ రాక్షసుడితో సంవాదం : ఒక తాత్విక విశ్లేషణ

మాలదాసరి కథలో  అత్యంత కీలకమైన ఘటట్టం - అడవిలో బ్రహ్మరాక్షసుడు (సోమశర్మ) ఎదురుపడటం. పూర్వజన్మలో విద్యాగర్వం, అహంకారం కలిగిన బ్రాహ్మణుడైన సోమశర్మ శాపం వల్ల రాక్షసుడిగా మారి ఆకలితో అల్లాడుతుంటాడు. మాలదాసరిని తినడానికి సిద్ధపడినప్పుడు, వారిద్దరి మధ్య జరిగిన సంవాదం సమాజంలోని కులం, విద్యా అహంకారాలపై రాయలు సంధించిన అస్త్రం. ఈ సంవాదం కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగినది కాదు, ఇది రెండు విభిన్న సామాజిక వర్గాల, రెండు విభిన్న జీవన తత్వాల మధ్య జరిగిన మేధోమథనం.

### అహంకారానికి మరియు వినయానికి గల తేడా

బ్రాహ్మణుడిగా పుట్టి, వేదాలు చదివినా ఆచరణ లేకపోవడం వల్ల రాక్షసుడైన వాడు ఒకవైపు; అంత్యజ కులంలో పుట్టినా, సంస్కారం, సత్యవాక్పాలన, నిరహంకారం కలిగిన మాలదాసరి మరొకవైపు. ఇక్కడ పుట్టుక చేత వచ్చే కులం కంటే గుణం, ప్రవర్తనే ముఖ్యమని రాయలు నిరూపించారు. ఉన్నత కులంలో పుట్టినంత మాత్రాన ఒకడు గొప్పవాడు కాలేడని, అతని కర్మలు మరియు గుణాలే అతని సా&థయిని నిర్దేశిస్తాయని బ్రహ్మరాక్షసుని పాత్ర ద్వారా స్పష్టమవుతుంది.

### సత్యవాకాల్పన మరియు వేదన

మాలదాసరి తాను దేవుడికి కీర్తనలు సమర్పించి తిరిగి వస్తానని, ఆ తర్వాత తన శరీరాన్ని ఆహారంగా ఇస్తానని

రాక్షసుడిని వేడుకుంటాడు. ఒక 'మాల' వాడు మాట నిలబెట్టుకుంటాడా అని రాక్షసుడు శంకిస్తాడు. ఇక్కడ మాలదాసరి తన ప్రాణం కంటే సత్యానికి, భగవత్ప్రేమకే ప్రాధాన్యతనిచ్చి, తిరిగి వచ్చి రాక్షసుడి ముందు నిలబడతాడు. ఈ ఘట్టం మాలదాసరి నైతిక ఉన్నతిని, సమాజం అతనిపై ఉంచిన తప్పుడు అంచనాలను పటాపంచలు చేస్తుంది. అట్టడుగు వర్గాలలో ఉండే నైతిక విలువలు ఎంతో ఉన్నతమైనవని రాయలు చాటి చెప్పారు.

**పుణ్యఫల దానం – సామాజిక సమత్వ స్థాపన**

తిరిగి వచ్చిన మాలదాసరిని చూసి రాక్షసుడు ఆశ్చర్యపోయి, అతన్ని తినడానికి నిరాకరించి, తన శాపవిమోచనం కోసం మాలదాసరి పాడిన కైశిక రాగ పుణ్యఫలాన్ని ధారపోయమని వేడుకుంటాడు. ఈ ఘట్టం కావ్యంలోనే అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది కేవలం ఒక శాపవిమోచన వృత్తాంతం కాదు, ఇది ఆధ్యాత్మిక రంగంలో జరిగిన ఒక గొప్ప విప్లవం.

**సామాజిక న్యాయం**

సమాజంలో అత్యున్నత స్థానంలో ఉన్న బ్రాహ్మణుడు (రాక్షసరూరంలో  ఉన్నా), సమాజంలో అట్టడుగున ఉన్న మాలదాసరి పాదాలపై పడి పుణ్యభిక్ష వేడడం ఇక్కడ విప్లవాత్మక ఘట్టం. నాటి సామాజిక క్రమాన్ని తిరగరాసిన ఘట్టమిది.

**ఆధ్యాత్మిక సమత్వం**

చివరికి మాలదాపరి తాను ఆ రాత్రి పాడిన పాట చివరి చరణం యొక్క ఫలాన్ని మాత్రమే ధారపోయగా, రాక్షసుడికి శాపవిమోచనం కలిగి సోమశర్మగా మారి దివ్యరూపం దాలుస్తాడు. భక్తి, జ్ఞానాల ముందు కులవివక్షలు ఎంత ప్రాధాన్యత లేనివో రాయలు ఈ ఘట్టం ద్వారా నిరూపించారు. జ్ఞానం ఉన్నా భక్తి లేకపోతే రాక్షసుడిగా మారుతారని, కులం తక్కువైనా భక్తి ఉంటే తారకమంత్రం అవుతుందని నిరూపించబడింది.

**నాటి సామాజిక జీవన వేదనకు ప్రతిబింబాలు**

ఆముక్త మాల్యదలోని ఈ ఘట్టం ద్వారా నాటి సమాజంలోని పలు చేదు నిజాలు వెల్లడవుతాయి.

**ఆవాస వివక్ష**

అంత్యజాలు ఊరి చివర, శ్మశానాల పక్కన నివసించాల్సి రావడం. వారికి సమాజ ప్రధాన స్రవంతిలో నివసించే హక్కు లేకపోవడం వల్ల ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారు.

**సంచార నియమాలు**

పగటిపూట సమాజంలో తిరిగే స్వేచ్ఛ లేకపోవడం, కేవలం రాత్రి లేదా తెల్లవారుజామున చీకట్లోనే తిరగాల్సి రావడం. మనుషుల కంట పడితే సమాజం మైలపడుతుందనే మూఢనమ్మకం వారి స్వేచ్ఛను హరించింది.

**ఆధ్యాత్మిక అణచివేత**

భగవంతుడిని దర్శించుకునే హక్కు లేకపోవడం. ఆలయ ధ్వజస్తంభం వెలుపల నిలబడి మాత్రమే ప్రార్థించాల్సి రావడం. భగవంతుడి సృష్టిలో అందరూ సమానులైనా, మానవ నిర్మిత చట్టాలు వారిని దేవుడిని కూడా దూరం చేశాయి.

**ఆర్థిక దైన్యం**

నాటి సామాజిక వ్యవస్థలో ఈ వర్గాలకు స్థిరమైన ఉపాధి లేక, కేవలం అడవి ఉత్పత్తులపై  లేదా సమాజం ఇచ్చే విదిల్చే ముక్కలపై ఆధారపడటం వల్ల కలిగే వేదన. వారి శ్రమను దోచుకుంటూ వారిని కనీస మానవులుగా గుర్తించని తన ఇక్కడ కనిపిస్తుంది.

**రాయల సామాజిక దృక్పథం – ప్రత్యామ్నాయ మార్గం**

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా వైష్ణవ మతాభిమాని. రామానుజాచార్యుల విశిష్టాద్వైత సిద్ధాంతం 'భక్తి' ద్వారా అందరికీ మోక్షార్హత ఉందని ప్రకటించింది. రాయలు ఆముక్త మాల్యదలో మాలదాసరి పాత్ర ద్వారా సామాజిక విప్లవాన్ని నేరుగా కాకుండా, భక్తిమార్గం ద్వారా సాధించవచ్చని చూపించారు. శారీరక అస్పృశ్యతను పాటించే సమాజానికి, ఆత్మ యొక్క పవిత్రతను చూపి గుణపాఠం నేర్పారు.

రాయలు కేవలం ఒక చక్రవర్తిగా కాకుండా, ఒక గొప్ప సామాజిక సంస్కర్తగా ఈ కావ్యంలో దర్శనమిస్తారు. రాజ్య పాలనలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, సమాజంలోని ఈ కుల వివక్షను గమనించి, దానికి సాహిత్యరూపంలో సమాధానం చెప్పటం రాయల ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. మాలదాసరి కథ ద్వారా రాయలు నాటి అగ్రవర్ణాల కళ్ళు తెరిపించే ప్రయత్నం చేశారు.

**ముగింపు**

ఆముక్త మాల్యదలోని మాలదాసరి వృత్తాంతం కేవలం ఒక పురాణ గాథ కాదు. అది నాటి దక్షిణ భారత సామాజిక వ్యవస్థలో నెలకొన్న కుల వివక్షకు, అణగారిన వర్గాల జీవన వేదనకు ఒక చారిత్రక సాక్ష్యం. మాలదాసరి తన నిరుపమానమైన భక్తి, సత్యనితరి, సంగీత సాధన ద్వారా సామాజిక అసమానతలను అధిగమించి, ఉన్నత వర్గాల అహంకారాన్ని దించి, ఆధ్యాత్మిక శిఖరంగా నిలిచాడు. రాయలవారు ఈ పాత్రను మలిచిన తీరు, తెలుగు సాహిత్యంలో తొలి దళిత / సమతావాద భావనలకు తొలి బీజాలుగా భావించవచ్చు. శతాబ్దాల నాటి సామాజిక వేదనకు ఈ కథ ఒక శాశ్వత శబ్ద రూపం. నేటి ఆధునిక సమాజానికి కూడా ఈ కథ సమత్వ సందేశాన్ని అందిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**


1. ఆముక్త మాల్యద (సవ్యాఖ్యానము), శ్రీకృష్ణదేవరాయలు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాస్.
2. తెలుగు సాహిత్య చరిత్ర, డా॥.కె.వి. నారాయణ రావు, ప్రతిభ ప్రచురణలు, హైదరాబాద్.
3. రాయల కాలం నాటి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.
4. విజయ నగర సామ్రాజ్య సామాజిక పరిస్థితులు, డా॥. కే.ఎ. నీలకంఠ శాస్త్రి, దక్షిణ ఆసియా చరిత్ర పరిశోధన సంస్థ.
5. ప్రబంధ వాఙ్మయ వికాసము, ఆచార్య దివాకర్ల వేంకటావధాని, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ప్రచురణలు.
6. విశిష్టాద్వైత భక్తితత్వము - మాలదాసరి పాత్ర పరిశీలన, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : *https://www.bhavaveena.com/*

# తెలుగు సహజభాషా సంవిధానం(NLP)-బాలవ్యాకరణ సూత్రాల పునఃసమీక్ష : ఒక సమగ్ర సమాలోచన



డా॥. వి. వి. సుబ్బారావు
సహాచార్యులు, అధ్యక్షులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ),
ఖైరతాబాద్, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధ (AI), సహజభాషా సంవిధానం (Natural Language Processing - NLP) రంగాలు మానవ భాషలను కంప్యూటర్లకు నేర్పించడంలో అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, ఆంగ్ల భాషా నిర్మాణంతో పోలిస్తే ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగు వంటి సంక్లిష్ట 'సంశ్లిష్ట భాషల' (Agglutinative Languages) విషయంలో ఈ సాంకేతిక అన్వయం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. 19వ శతాబ్దంలో పరవస్తు చిన్నయసూరి రచించిన 'బాలవ్యాకరణం' తెలుగు భాషా ప్రామాణీకరణకు, గ్రాంథిక సాహిత్య వికాసానికి అద్భుతమైన దిక్సూచిగా నిలిచింది. కానీ, నాటి మానవ మేధస్సును, కావ్య భాషను ఉద్దేశించి వ్రాసిన సంస్కృత ఆధారిత సూత్రాలు... నేటి బైనరీ లేదా గణితాత్మక అల్గారిథమ్స్తో నడిచే కంప్యూటర్ వ్యవస్థలకు ఒక క్లిష్టమైన సమస్యగా పరిణమించాయి.

ఈ పరిశోధనా పత్రం బాలవ్యాకరణంలోని సంజ్ఞా, సంధి, సమాస, తత్సమ, మరియు ఆచ్ఛిక పరిచ్ఛేదాలలోని ముఖ్య సూత్రాలను ఆధునిక కంప్యూటర్ భాషాశాస్త్ర (Computational Linguistics) దృష్ట్యా పునఃసమీక్షిస్తుంది. ముఖ్యంగా, కంప్యూటర్ సాఫ్ట్వేర్ ఎదుర్కొంటున్న 'రూప విశ్లేషణ' (Morphological Parsing), 'సంధి విచ్ఛేదనం' (Sandhi Splitting) లోని సందిగ్ధతలను స్పష్టమైన ఉదాహరణలతో విశ్లేషిస్తుంది. సంప్రదాయ వ్యాకరణ పరిభాషను యంత్ర సంవిధానానికి అనుగుణంగా మార్చడంలో ఉన్న పరిమితులను చర్చిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలుగు భాషను డిజిటలైజ్ చేయడానికి అవసరమైన 'ఫార్మల్గ్రామర్' (Formal Grammar) రూపకల్పనను మరియు సరళీకృత ప్రత్యామ్నాయాలను ఈ వ్యాసం ప్రతిపాదిస్తుంది.

**ముఖ్య పదాలు :**

సహజభాషా సంవిధానం (NLP), బాలవ్యాకరణము, కంప్యూటర్ భాషాశాస్త్రం, రూప విశ్లేషణ (Morphological

Parsing), సంశ్లిష్ట భాష (Agglutinative Language), సంధి విచ్ఛేదనం, ద్రుతప్రకృతికము, కారక సిద్ధాంతం, కృత్రిమ మేధ (AI), యంత్రానువాదం (Machine Translation).

**1. పరిచయం :**

మానవ మేధస్సుకు, యంత్ర మేధస్సుకు (Machine Intelligence) మధ్య వారధిగా నిలిచే ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగమే 'సహజభాషా సంవిధానం' (NLP). సమాచార సాంకేతిక రంగం (IT) విస్తరిస్తున్న కొద్దీ ప్రాంతీయ భాషలలో కంప్యూటర్ అప్లికేషన్లు, వెబ్సైట్లు, సెర్చ్ ఇంజన్లు, వాయిస్ అసిస్టెంట్లు (Siri, Alexa), చాట్బాట్స్ (ChatGPT, Claude) వంటి వాటి ఆవశ్యకత పెరిగింది. ఒక కంప్యూటర్కు భాషను నేర్పించాలంటే ఆ భాషకు సంబంధించిన ఖచ్చితమైన నియమ నిబంధనలు (Rules) అవసరం. ఈ నియమాలనే మనం 'వ్యాకరణం' అని పిలుస్తాము.

తెలుగు భాష విషయానికి వస్తే, క్రీ.శ. 1855లో పరవస్తు చిన్నయసూరి ప్రచురించిన 'బాలవ్యాకరణము' నేటికీ ప్రామాణిక గ్రంథంగా చలామణీ అవుతోంది. చిన్నయసూరి అంతకుముందున్న నన్నయ 'ఆంధ్రశబ్దచింతామణి' వంటి సంస్కృత సూత్ర పద్ధతులను ఆధారంగా చేసుకుని, సూటిగా ఉండే సూత్ర రూపంలో తెలుగు లక్షణాలను క్రోడీకరించారు. సాహిత్య సృష్టికి, గ్రాంథిక భాషా బోధనకు ఈ గ్రంథం అత్యున్నత శిఖరం. అయితే, బాలవ్యాకరణం వ్రాయబడిన కాలం నాటికి కంప్యూటర్లు లేవు. అందువల్ల, చిన్నయసూరి మానవ పాఠకుడి ఊహాశక్తిని, సందర్భ శుద్ధిని, సాహిత్య పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని మినహాయింపులతో కూడిన సూత్రాలను రచించారు.

కానీ కంప్యూటర్ ఒక 'లాజికల్ మెషిన్' (Logical Machine). దానికి సందర్భ శుద్ధి తెలియదు; కేవలం మనం ఇచ్చే కోడింగ్ లేదా అల్గారిథమ్స్ మాత్రమే తెలుసు. ఆంగ్లం వంటి భాషలలో విభక్తులు (Prepositions - in, on, for, from) విడివిడిగా ఉంటాయి. కానీ తెలుగులో అవి పదంతో కలిసిపోతాయి. ఈ ప్రక్రియనే భాషాశాస్త్రంలో లిలి'సంశ్లిష్ట స్వభావం' (Agglutinative nature) అంటారు. ఇటువంటి సంశ్లిష్ట భాషను కంప్యూటర్లకు నేర్పే క్రమంలో బాలవ్యాకరణ సూత్రాలు ఎక్కడ సరిపోతున్నాయి, ఎక్కడ సవాళ్లు విసురుతున్నాయి అనే అంశాన్ని సమగ్రంగా సమీక్షించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

**2. తెలుగు భాషా స్వరూపం – కంప్యూటేషనల్ సవాళ్లు (Development of Essay)**

**2.1 సంశ్లిష్ట భాషా లక్షణం మరియు రూప విశ్లేషణ (Morphological Parsing):**

తెలుగు భాషలో ఒకే ఒక నామవాచక పదానికి లేదా ధాతువుకు విభిన్న ప్రత్యయాలను ఒకదాని వెనుక ఒకటి చేర్చడం వల్ల వందలాది రూపాలు ఏర్పడతాయి. కంప్యూటర్ భాషాశాస్త్రంలో దీనిని విశ్లేషించే పరికరాన్ని 'మార్ఫలాజికల్ పార్సర్' (Morphological Parser) అంటారు. కంప్యూటర్ ముందుగా ఒక పెద్ద పదాన్ని చూసినప్పుడు, దానిలోని మూలపదాన్ని (Root Word), దానికి చేరిన ప్రత్యయాలను (Suffixes) వేరు చేయాలి.

బాలవ్యాకరణంలోని సంజ్ఞా పరిచ్ఛేదంలో చిన్నయసూరి తెలుగు పదాల వర్గీకరణను అద్భుతంగా వివరించారు [^1]. కానీ సాంకేతిక దృష్ట్యా పరిశీలిస్తే, సంశ్లిష్ట స్వభావం కారణంగా ఒక తెలుగు నామవాచకం వాక్యంలో వాడేటప్పుడు ఎలా మారుతుందో క్రింది పట్టిక ద్వారా గమనించవచ్చు :

| మూలపదం (Root) | చేరిన ప్రత్యయం/విభక్తి | ఏర్పడిన రూపం (Surface Form) | కంప్యూటర్ ఎదుర్కొనే సవాలు |
| --- | --- | --- | --- |
| పుస్తకము | లు (బహువచనం) | పుస్తకాలు | 'ము' వర్ణం లోపించి 'కా' గా మారడం |

। పుస్తకము । లో (షష్ఠీ/సప్తమీ) । పుస్తకంలో । 'ము' స్థానంలో అనుస్వారం రావడం ।

। పుస్తకము । కొరకు (చతుర్థీ) । పుస్తకాలకొరకు । బహువచన రూపం చేరి 'కొరకు' రావడం ।

బాలవ్యాకరణంలోని 'తత్సమ పరిచ్ఛేదం' లోని డూముపుల లోప సూత్రాలు మానవులకు సులభమే కానీ, కంప్యూటర్ నిఘంటువులో (Lexicon) 'పుస్తకము' అని ఒకే పదాన్ని ఫీడ్ చేస్తే, అది 'పుస్తకాలకొరకు' అనే పదాన్ని గుర్తించలేదు. ఎందుకంటే కంప్యూటర్కు 'ము' వర్ణం లోపించి, అక్కడ 'ఆ' కారం వచ్చి, ఆపై 'కొరకు' చేరాలనే నియమాన్ని వేర్వేరు అల్గారిథమ్స్ రూపంలో ప్రోగ్రామ్ చేయాల్సి ఉంటుంది. బాలవ్యాకరణ సూత్రాలలోని సంస్కృత పరిభాషను గణిత సూత్రాలుగా (Mathematical Rules) మార్చకపోతే రూప విశ్లేషణ సాధ్యం కాదు.

**2.2 సంధి విచ్ఛేదనం లోని సందిగ్ధత (Ambiguity in Sandhi Splitting)**

తెలుగు ఎన్ఎల్పి రంగంలో 'సంధి విచ్ఛేదనం' లేదా పదాన్ని విడదీయడం (Sandhi Splitting) అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. బాలవ్యాకరణ సంధి పరిచ్ఛేదంలోని మొదటి సూత్రాన్ని పరిశీలిద్దాం:

> "ఉత్తునకు నచ్చు పరంబగునపుడు సంధి యగు." [^2]

ఈ సూత్రం ప్రకారం 'రాముడతడు' అనే పదాన్ని విడదీస్తే 'రాముడు + అతడు' అవుతుంది. ఇక్కడ కంప్యూటర్ ఎదుర్కొనే సాంకేతిక సమస్యలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు :

**1. ఓవర్–జనరేషన్ (Over-generation) :**

కంప్యూటర్ అల్గరిథమ్ నియమాలను మాత్రమే గ్రుడ్డిగా పాటిస్తుంది. అది 'రాముడతడు' అనే పదాన్ని చూసినప్పుడు, అక్షరాల కలయిక ఆధారంగా క్రింది విధంగా విడదీసే అవకాశం ఉంది:

- రాముడు + అతడు (సరైన రూపం)
- రాముడ + తడు (అర్థరహిత రూపం, కానీ అక్షరాల పరంగా సాధ్యం)
- రాము + డతడు (తప్పుడు రూపం)

**2. అండర్–జనరేషన్ (Under-generation) :**

బాలవ్యాకరణంలో చిన్నయసూరి "ఒక్కొక్కచో సంధి కాకపోవచ్చు" (వైకల్పికం, బహుళం) అని కొన్ని మినహాయింపులు ఇచ్చారు. ఉదాహరణకు: "మహాత్ముని చరిత్రము"లో సంధి జరగక "మహాత్మునిచరిత్రము" గానే ఉండవచ్చు. కంప్యూటర్కు ఖచ్చితమైన నియమం (Deterministic Rule) కాకుండా, ఇలాంటి 'బహుళ' లేదా 'వైకల్పిక' నియమాలు ఇచ్చినప్పుడు అది ఏ రూపాన్ని ప్రామాణికంగా తీసుకోవాలో తెలియక స్తంభించిపోతుంది (Ambiguity).

**2.3 ద్రుతప్రకృతికాలు – సమాచార పునరుద్ధరణ సవాళ్లు (Information Retrieval)**

బాలవ్యాకరణ సంజ్ఞ పరిచ్ఛేదంలో చిన్నయసూరి నకారాన్ని 'ద్రుతము' అని, ద్రుతాంతములైన పదాలను 'ద్రుతప్రకృతికములు' అని నిర్వచించారు [^3]. సంధి పరిచ్ఛేదంలో దీనికి సంబంధించిన సూత్రం ఇలా ఉంది:

> "ద్రుతప్రకృతికమునకచ్చు పరంబగునపుడు ద్రుతంబు పయిపదంబుతోడం గలియు." [^4]

ఈ ద్రుత కార్యం మరియు 'సరళాదేశ సంధి' (కచటతపలకు గజడదబలు రావడం) కారణంగా ఒకే వాక్యం లేదా పదబంధం క్రింది విధంగా విభిన్న రూపాలను (Surface Variants) సంతరింపజేసుకుంటుంది :

పూచెన్ + కలువలు = పూచెంగలువలు

పూచెన్ + కలువలు =పూచెంగలువలు

పూచెన్ + కలువలు =పూచెన్గలువులు

సాహిత్యపరంగా ఈ మూడు రూపాలు సాధువులే. కానీ గూగుల్ (Google) లేదా మరేదైనా సెర్చ్ ఇంజన్లో ఒక వినియోగదారుడు 'పూచెగలువలు' అని టైప్ చేసి వెతికినప్పుడు, డేటాబేస్లో 'పూచెంగలువలు' అని ఉంటే కంప్యూటర్ దాన్ని గుర్తించలేదు. ఎందుకంటే కంప్యూటర్ దృష్టిలో 'గ' వేరు, 'ంగ' వేరు, 'న్ గ' వేరు. సాంప్రదాయ వ్యాకరణం ఈ రూపాలను భాషా వైవిధ్య సౌందర్యంగా చూస్తే, ఎన్ఎల్పి సాంకేతిక రంగం దీనిని 'డేటా నాయిస్' (Data Noise) లేదా 'వైవిధ్య సవాలు'గా భావిస్తుంది.

## 2.4 త్రిక సంధి మరియు యడాగమ సంధి అల్గారిథమిక్ విశ్లేషణ

బాలవ్యాకరణంలోని 'త్రిక సంధి' సూత్రాలు కంప్యూటర్ కోడింగ్కు పెద్ద పరీక్ష పెడతాయి.

- "ఆ ఈ ఏ లనబడు సర్వనామంబులు త్రికంబు లనంబడు." [^5]
- "త్రికము పఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు." [^6]

**ఉదాహరణకు :** 'ఆ + కాశము' 'అక్కాశము'గా మారుతుంది. ఇక్కడ దీర్ఘం హ్రస్వమవ్వడం ('ఆ' కాస్తా 'అ' అవ్వడం), హల్లు ద్విత్వమవ్వడం ('క' కాస్తా 'క్క' అవ్వడం) వంటి మూడు వేర్వేరు ప్రక్రియలు ఒకే సూత్రంలో జరుగుతాయి. కంప్యూటర్ ఈ పదాన్ని విడదీయాలంటే, వెనక నుండి ముందుకు (Reverse Algorithm) ప్రయాణించి, ద్విత్వాన్ని తొలగించి, హ్రస్వాన్ని దీర్ఘం చేయాలి. ఇటువంటి క్లిష్టమైన రూల్స్ రాయడం సాఫ్ట్వేర్ డెవలపర్లకు ఎంతో శ్రమతో కూడుకున్న పని.

అలాగే, 'యడాగమ సంధి' సూత్రం ప్రకారం :

> "సంధి లేని చోట నచ్చు పరంబగునపుడు యడాగమంబగు." [^7]

'మా + అమ్మ', 'మాయమ్మ'. ఇక్కడ 'య్' అనే అక్షరం కొత్తగా ఆగమంగా వస్తుంది. కంప్యూటర్ 'మాయమ్మ'ను విడదీసేటప్పుడు 'య' ను తొలగించి 'మా + అమ్మ' అని గుర్తించాలనే ప్రత్యేక కోడింగ్ రాయాలి, లేకపోతే అది 'మాయ + అమ్మ' అని తప్పుగా విశ్లేషించే ప్రమాదం ఉంది.

## 3. సమాసాలు – అర్థ విశ్లేషణ సవాళ్లు (Semantic Analysis)

కేవలం పదాలను విడదీయడమే కాకుండా, వాక్యం యొక్క అర్థాన్ని గ్రహించడం (Semantic Web /Analysis) ఎన్ఎల్పిలో అత్యంత ముఖ్యం. బాలవ్యాకరణ సమాస పరిచ్ఛేదంలో చిన్నయసూరి సమాసాలను విపులీకరించారు. అయితే నేటి ఆధునిక భాషలో సంస్కృత పదాలను, తెలుగు పదాలను కలిపి వాడే 'మిశ్ర సమాసాలు' విరివిగా ఉన్నాయి.

సాంప్రదాయ వ్యాకరణం ప్రకారం కొన్ని మిశ్ర సమాసాలు 'వైరి సమాసాలు' [^8] గా పరిగణించబడి నిషిద్ధమయ్యాయి. కానీ నేటి డిజిటల్ యుగంలో వినియోగదారులు సోషల్ మీడియాలో రాసేటప్పుడు సాంప్రదాయ నియమాలను పాటించరు.

**ఉదాహరణకు :** 'కంప్యూటర్ కేంద్రము', 'రాజకీయ నాయకుడు'. ఇందులో ఒక పదం ఇంగ్లీషు లేదా తెలుగు, మరొకటి సంస్కృతం కావచ్చు. బాలవ్యాకరణ నియమాల ప్రకారం ఇవి తప్పు కావచ్చు, కానీ కంప్యూటర్ వీటిని అర్థం చేసుకోవాలి. అందువల్ల ఎన్ఎల్పి అప్లికేషన్లకు బాలవ్యాకరణ నియమాలతో పాటు ఆధునిక 'సమకాలీన వాడుక భాషా నిఘంటువులను' అనుసంధానించడం అనివార్యం.

## 4. కంప్యూటేషనల్ పాణినీయ వ్యాకరణం: ఒక ఆధునిక పరిష్కారం (Linguistic Solution)

బాలవ్యాకరణంలోని సంస్కృత ఆధారిత సూత్రాల పరిమితులను అధిగమించడానికి, భారతీయ అగ్రశ్రేణి

విద్యాసంస్థలైన ఐఐటీ హైదరాబాద్ (IIT Hyderabad), ట్రిపుల్ ఐటీ (IIIT Hyderabad), మరియు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (UoH) పరిశోధకులు ఒక కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. అదే 'కంప్యూటేషనల్ పాణినీయ వ్యాకరణం' (Computational Paninian Grammar - CPG)

పాణిని మహర్షి తన 'అష్టాధ్యాయి' లో అందించిన 'కారక సిద్ధాంతం' (Karaka Theory) నేటి కంప్యూటర్ డిపెండెన్సీ పార్సింగ్ (Dependency Parsing) కు అత్యంత అనుకూలంగా ఉందని అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తలు అంగీకరించారు. తెలుగు ఒక 'స్వతంత్ర పదక్రమ భాష' (Free Word Order Language). అంటే వాక్యంలో కర్తా, కర్మ, క్రియాల స్థానాలు ఎక్కడ మారినా అర్థం మారదు.

- ఉదాహరణ 1 : "రాముడు రావణుడిని చంపెను."
- ఉదాహరణ 2 : "రావణుడిని రాముడు చంపెను."

ఈ రెండు వాక్యాల అర్థం ఒక్కటే. కంప్యూటర్ వీటిని కేవలం పదాల క్రమం ఆధారంగా కాకుండా, 'రాముడు' అనే పదానికి ఉన్న 'డు' (ప్రథమా విభక్తి - కర్త కారకం), 'రావణుడిని' లోని 'ని' (ద్వితీయా విభక్తి - కర్మ కారకం) ఆధారంగా వాక్యార్థాన్ని ఖచ్చితంగా గ్రహిస్తుంది. బాలవ్యాకరణంలోని విభక్తి సూత్రాలను ఈ కారక సిద్ధాంతంతో ముడిపెట్టి కంప్యూటర్ అల్గారిథమ్స్ రూపొందించినప్పుడు ఎన్ఎల్పి వ్యవస్థల ఖచ్చితత్వం గణనీయంగా పెరిగింది.

**5. ముగింపు :**

పరవస్తు చిన్నయసూరి ప్రణీతమైన బాలవ్యాకరణం తెలుగు భాషా వికాస చరిత్రలో ఒక మైలురాయి. సాహిత్య గౌరవాన్ని, భాషా ప్రామాణికతను కాపాడటంలో దీని పాత్ర అద్వితీయం. అయితే, ఏ భాషైనా కాలంతో పాటు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మారినప్పుడే సజీవంగా ఉంటుంది. డిజిటల్ యుగంలో తెలుగు భాషా రక్షణ మరియు వ్యాప్తి కేవలం సాహిత్యం ద్వారానే కాకుండా సాంకేతికత ద్వారా సాధ్యమవుతాయి.

చాట్ జిపిటి వంటి కృత్రిమ మేధా పరికరాలు, స్వయంచాలక అనువాద వ్యవస్థలు (Machine Translation), తెలుగు స్పెల్ చెకర్స్ నూటికి నూరుపాళ్ళు ఖచ్చితత్వంతో పనిచేయాలంటే బాలవ్యాకరణ సూత్రాలను యంత్ర సంవిధానానికి అనుగుణంగా 'పునఃసమీక్షించక' తప్పదు. సంశ్లిష్ట భాషా రూపాలలోని మినహాయింపులను తగ్గించి, వాటిని బైనరీ లాజిక్కు మార్చాలి. భాషా కోవిదులు, కంప్యూటర్ శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేసి సాంప్రదాయ వ్యాకరణాన్ని 'కంప్యూటేషనల్ వ్యాకరణం' గా పునర్నిర్మించినప్పుడే ప్రపంచ డిజిటల్ పటంలో తెలుగు భాష అగ్రస్థానంలో నిలుస్తుంది.

**పాదసూచికలు :**

1. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంజ్ఞా పరిచ్ఛేదము, సూత్రం 5 ("తెన్నఁగున కక్షరంబులు ముప్పదియారు...").
2. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంధి పరిచ్ఛేదము, సూత్రం 1.
3. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంజ్ఞా పరిచ్ఛేదము, సూత్రం 12 ("ద్రుతమనఁగా నకారంబు... ద్రుతాంతములయిన పదములు ద్రుతప్రకృతికములనఁబడు.").
4. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంధి పరిచ్ఛేదము, సూత్రం 14.
5. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంజ్ఞా పరిచ్ఛేదము, సూత్రం 14.

6. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంధి పరిచ్ఛేదము, సూత్రం 39.
7. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సంధి పరిచ్ఛేదము, సూత్రం 3.
8. చిన్నయసూరి, పరవస్తు. 'బాలవ్యాకరణము'. సమాస పరిచ్ఛేదము, సూత్రం 24 ("తెన్గుఁగుపదంబుతో సంస్కృతపదంబు సమాసంబు కాదు; అది వైరిసమాసంబు నఁబడు.").

**సూచన గ్రంథాల పట్టిక:**


1. చిన్నయసూరి, పరవస్తు. బాలవ్యాకరణము. వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1952.
2. Bharati, Akshar, Vineet Chaitanya, and Rajeev Sangal. *Natural Language Processing: A Paninian Perspective*, Prentice-Hall of India, 1995.
3. Bharati, Akshar, et al. "Grammar Extraction from Treebanks for Hindi and Telugu." *Proceedings of the Seventh International Conference on Language Resources and Evaluation (LREC'10)*, European Language Resources Association (ELRA), 2010, pp. 3803-06.
4. Krishnamurti, Bhadriraju, and J.P.L. Gwynn. *A Grammar of Modern Telugu*. Oxford UP, 1985.
5. Madhukar, Danaveni. *Evaluation and Error Analysis of English-Telugu Neural Machine Translation Output*. 2022. University of Hyderabad, M.Phil. dissertation. *Indira Gandhi Memorial Library*.
6. Nallani, Sneha, Manish Shrivastava, and Dipti Sharma. "A Simple and Effective Dependency Parser for Telugu." *Proceedings of the 58th Annual Meeting of the Association for Computational Linguistics: Student Research Workshop*, Association for Computational Linguistics, 2020, pp. 143--49. *ACL Anthology*, [https://doi.org/10.18653/v1/2020.acl-srw.19](https://www.google.com/search?qRhttps://doi.org/10.18653/v1/2020.acl-srw.19)
7. Rao, Dhana L., Venkatesh R. Pala, Nic Herndon, and Venkat N. Gudivada. "A Deep Learning Architecture for Corpus Creation for Telugu Language." *Advances in Intelligent Systems and Computing*, vol. 1155, Springer Singapore, 2020, pp. 1--16. *SpringerLink*, [https://doi.org/10.1007/978-981-15-4029-5_1](https://www.google.com/search?qRhttps%3A%2F%2Fdoi.org%2F10.1007%2F978-981-15-4029-5_1)
8. T., Nadana Ravishankar, Dinesh Mavaluru, and Jayabrabu R. "Grammar Rule Based Information Retrieval Model for Big Data." *ICTACT Journal on Soft Computing*, vol. 5, no. 4, 2015, pp. 1027--34. *Core*, [https://doi.org/10.21917/ijsc.2015.0144](https://www.google.com/search?qRhttps%3A%2F%2Fdoi.org%2F10.21917%2Fijsc.2015.0144)


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# విలాస కావ్యాలు - విజయ విలాసము విశేషాలు



డా॥. చొట్ల కిశోర్
తెలుగు విభాగాధిపతి, కాకాని వేంకట రత్నం కళాశాల, నందిగామ.
సెల్ : 9866820524.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

"కృష్ణ రాయల వారి యెడబాటు చీకట్లు ముసిరి దిక్కులలోన మసలు వేళ
భూరి వాంగ్మయలక్ష్మి దారిబత్తెము తోడ తంజాపురము వంక తరులు వేళ
వేంకటకవి తెలుగు పంకేరుహాక్షి కి శ్లేషో క్తులలవాటు సేయువేళ
పచ్చపచ్చని ముద్దుపళని ముద్దుల కైత శృంగార రసము వర్షించు వేళ

తే: గీ: ముద్వగోపాల దేవుని పూజ సేయ
ఘనుడు క్షేత్రయ కలమందుకొనిన వేళ
నపర రాయలు రఘునాథ నృపతి విభుడు
కట్టుకున్నాడు సత్కీర్తి కుట్టిమంబు". (గబ్బిలం 1... )

అని మహాకవి గుర్రం జాషువా దక్షిణాంధ్రయుగం, రఘునాథ నాయకుడిప్రస్థానాన్ని కీర్తించారు.

మధురకవిగా అశేష శేముషీ పతిగా పేర్గాంచిన రఘునాథ నాయకుడు మంచి రసికుడు సరసుడు. కృష్ణదేవరాయల తరువాత తెలుగు సాహిత్యానికి పట్టుగొమ్మై నిలిచాడు స్వతహాగా మంచి సంగీత ప్రియుడుకూడా నూతన రాగాలను తాళాలను కనిపెట్టి వీణల మేళవింపును సంస్కరించగలిగిన సంగీత శాస్త్ర ప్రవీణుడు. జయంతసేన అనే కొత్త రాగాన్ని రామానందము అనే తాళాన్ని, రఘునాథ మేళ వీణ అనే మేళాంతరము ను సృష్టించిన ప్రతిభాశాలి నల చరిత్ర, వాల్మీకి చరిత్ర, రామాయణం, శృంగార సావిత్రి వంటి అనేక రచనలు చేశాడు. రామభద్రంబ, మధురవాణి వంటి విధుషీమణులు, యజ్ఞ నారాయణ దీక్షితులు వంటి పండితులు ఈయన ఆస్థానంలో ఉన్నారు ఈయన ఆస్థానం యక్షగాన రచనలతో నాటకకళ వికాసంతో కళాభ్యుదయానికి త్రోవ చూపింది వేంకటకవి వీరి ఆస్థానాన్ని కొనియాడుతూ

"మాటల నేర్పులా సరస మార్గములా కొలువుండు రీతులా
పాటలగంధులా కళలభాగ్యములా బహుదానలీలలా
నాటకశాలలా ఒకటనన్వల దెన్నిట జూడనన్నిటం
మేటియు గీర్తిలోలుడు జుమీ రఘునాధనృపాలుడిమ్మహిన్"....
(విజయవిలాసం - హృదయోల్లాస వ్యాఖ్య 1-28)

అంటూ రఘునాథుడి ఆస్థానాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. దక్షిణాంధ్ర యుగంలో రఘునాథ నాయకుడి పాలనాకాలం స్వర్ణయుగం అంటే అతిశయోక్తి కాదు. కవి పండితులతోనూ విదుషీమణులతోనూ పాటలగంధులతోనూ నాటకకళాకారులతోనూ నిత్యం శోభాయమానంగా అలరారుతుండే రఘునాథ నాయకుని ఆస్థానంలో మాట్లాడటం కూడా ఒక సాహసమేనని కవి చౌడప్ప లాంటి వారే గౌరవంగా ఒప్పుకుంటారు.

"నేరుతునని మాటాడగ
వారిజభవునంత వాని వశమే తంజా
పురి రఘునాధనాయని
గారి సభను కుందవరపు కవి చౌడప్పా"...... (కవిచౌడప్ప శతకం)

అని కొనియాడాడంటే రఘునాథ నాయకుని ఆస్థాన విశేషాలు కవి పండితుల ప్రతిభ కళాపోషణ దేశమంతా మారు మ్రోగిపోయిందని చెప్పవచ్చు. ఇటువంటి ఆస్థానంలో వెలుగొందిన కవి చేమకూరవేంకటకవి.

ఈ సందర్భంగా నాయక రాజుల యుగాన్ని గురించి కొంత స్మరించుకోవాలి శ్రీకృష్ణదేవరాయలు పాలన చేస్తున్న సమయంలో తన రాజ్యాన్ని కటకం నుండి కన్యాకుమారి వరకు విస్తరించారు. చోళ రాజ్యానికి తంజావూరు, పాండ్య రాజ్యానికి మధుర, చేర రాజ్యానికి తిరువనంతపురం రాజధానులుగా ఉండేవి. వీటితోపాటు తుండీరమండలం కూడా ఉండేది దానికి చేంజి ముఖ్యనగరం. ఒక్క చేర రాజ్యంలో తప్ప మిగతా మూడు రాజ్యాలలో రాజప్రతినిధులుగా మొదటి నుండి ఆంధ్ర నాయకులే ఆధిపత్యం వహించారు క్రమంగా రాజ్యాధిపతులుగా మారి రాయలసింహాసనానికి అనుగుణంగా ఉంటూ కప్పాలు చెల్లించేవారు. ఇదిలా ఉండగా క్రీస్తు శకం 1564 లో జరిగిన రాక్షస తంగడి యుద్ధంలో రాయ సామ్రాజ్యం ఓడిపోయింది ఇదే అదునుగా విజయనగర సామంతులందరూ స్వతంత్రులయ్యారు. ఈ క్రమంలో తంజావూరులో అచ్యుతప్ప నాయకుని తర్వాత రఘునాథుడు రాజ్యానికి వచ్చాడు ఈయన మరో శ్రీకృష్ణదేవరాయలు 1600 నుండి 1631 వరకు తంజావూరు రాజధానిగా చేసుకొని చోళదేశాన్ని పరిపాలించాడు ఈయన తంజావూరు నాయక రాజులలో మూడోవాడు. నాయకు రాజులకు చెవ్వప్ప నాయకుడు మూలపురుషుడు. శ్రీకృష్ణదేవరాయల తమ్ముడైన అచ్యుతరాయలకు తోడల్లుడు చెవ్వప్ప. చెవ్వప్ప కంజీవరం తిరువన్నామలై వృద్ధాచలం లలో గాలిగోపురాలను, ప్రాకారాలను కట్టించాడు. భార్య పేరు మూర్తిమాంబ, అచ్యుత రాయల భార్య తిరుమలాంబ చెల్లెలు ఈమె. వీరికి జన్మించిన వాడు అచ్యుతరాయలు (ఇంకొకరు). ఈ అచ్యుత రాయలకు జన్మించిన వాడు రఘునాథరాజు ఇతడు తంజావూరులో మొదటి స్వతంత్ర రాజు. భారత ప్రభుత్వం 1924లో రఘునాథ నాయకునికి సంబంధించి మొదటి శిలాశాసనాన్ని ప్రకటించింది ఈయన పేరు ఆ శాసనంలో విజయ రఘునాథ నాయకుడని పేర్కొంది. ఈయన కాలంలో తంజావూరు రాజధానిగా చోళరాజ్యం తెలుగు సాహిత్యానికి పట్టుగొమ్మగా మారింది. ముఖ్యంగా 1600 నుండి 1675 వరకు దక్షిణాంధ్ర యుగ సాహిత్యం పరిఢవిల్లింది. ఇదే కాలంలో మధురలోను తంజావూరులోనూ చేంజి లోను తెలుగు సాహిత్యం విశేషంగా పోషించబడింది ముఖ్యంగా చేంజి రాజులతో ప్రారంభమైన సాహిత్యసేవ తంజావూరు రఘునాథ నాయకుని కాలానికి పతాక స్థాయి నందుకున్నది. 1616 డిసెంబర్ 12న జరిగిన తోపురు యుద్ధంలో గెలిచి వచ్చిన రఘునాథ నాయకుడు విజయుడిగా కొనియాడబడ్డాడు అప్పుడే ఒక భవన నిర్మాణం చేసి దానికి విజయవిలాసం అని నామకరణం చేశాడు. చేమకూర వెంకటకవి రాసిన విజయ

విలాస కావ్యాన్ని ఈ భవనంలోనే రఘునాథ నాయకుడు అందుకున్నాడు రఘునాథ నాయకుడు గొప్ప రామ భక్తుడు ఈ విషయాన్ని కుమారుడు విజయ రాఘవ నాయకుడు తాను తన తండ్రి గురించి రాసిన రఘునాథా భ్యుదయం కావ్యంలో ప్రస్తావించాడు అంతఃపురంలో కోటగోడల మీద శ్రీరాముని చిత్రాలు లోపల విగ్రహాలు ఉన్నాయని చెప్పాడు చేమకూర వెంకట కవి విజయ విలాస కావ్యాన్ని శ్రీరాముని ప్రస్తావనతో ప్రారంభించడం కూడా ఇందువల్లనే అని అర్థమవుతుంది.

1600 ప్రాంతాలలో తంజావూరులో నివసించిన చేమకూరి కుటుంబంలో జన్మించినవాడు చేమకూర వెంకటకవి తండ్రి పేరు చేమకూర లచ్చన్న గారు లచ్చన్న గారి పుత్రులు చేమకూర వెంకటరాజు, సోదరులు తంజావూరు సంస్థానంలో ప్రవేశించారు వెంకటరాజు తన క్షత్రధర్మాన్ని పాటిస్తూ సేనలో చేరి, కొన్నియుద్ధాల్లో కూడా పాల్గొన్నట్లు తెలుస్తుంది అన్నింటిలోనూ ప్రయోజకుడైన చేమకూర వెంకటరాజు మీద రఘునాథుడికి ఇంతింత అనరాని వాత్సల్యం ఉంది. ఆ ప్రభువు పట్ల చేమకూర కవికి కూడా చెప్పలేనంత భక్తి విశ్వాసాలు ఉన్నాయి. రఘునాధుని కొలువులో తప్ప ఇంకెవరి సేవలోనూ ఉండకూడదని వెంకటరాజు దీక్షబూనాడు కథన పాండిత్యంతో పాటు కమ్మని కవిత్వం కూడా చెప్పడం నేర్చుకుని విజయ విలాసం వంటి కావ్యాన్ని రాసి ఆ ప్రభువుకే అంకితం చేసి వేంకటకవిగా జగత్ ప్రసిద్ధుడైనాడు. "క్షితిలో నీ మార్గమెవరి కిం రాదు సుమీ" అని... "వాక్శ్రియమ రూడి నీ అంత వాడింకేడి" అని రాజు చేత ప్రశంసించబడ్డాడు ప్రతిపద్య చమత్కృతిగా విజయ విలాస ప్రబంధాన్ని రాసి రఘునాథుడికి అంకితం ఇచ్చాడు .

"నన్ను నడిపిన బహుళ సన్మాన మెంచి
య ఖిల విద్యావిశారదు డగుటగాంచి
యవని నింతటి రాజెవ్వడని గణించి
కృతులోసగ కీర్తి కలదని మతి దలంచి" (వి.వి. హ్యా.వ్యా 1-30)

తానీ కావ్యం అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నాడు.

విజయ విలాసం విలక్షణమైన ప్రబంధం విలాస కావ్యాల్లో విశిష్టమైనది. తెలుగులో విలాస శబ్దంతో కూడుకున్న కావ్యాలు ఎన్నో కనబడుతున్నాయి శ్రీనాధుని హరవిలాసం, సారంగు తమ్మయ్య వైజయంతి విలాసం, తాళ్లపాక తిరువేంగళనాథుడు రచించిన పరమయోగి విలాసం, పసుపులేటి రంగాజమ్మ మన్నారుదాసవిలాసం, కూచిమంచి తిమ్మకవి శివలీల విలాసం, రాజశేఖర విలాసం, ఏనుగు లక్ష్మణ కవి రామ విలాసం, మొదలైనవి ప్రసిద్ధి చెందిన విలాస కావ్యాలు. ఇవిగాక యక్షగాన నాటక ప్రక్రియలో కూడా గణింపదగిన విలాస కావ్యాలు ఉన్నాయి .విజయ రాఘవ నాయకుని కృష్ణ విలాసం, రాజగోపాల విలాసం, మోహిని విలాసం, రతీ మన్మధ విలాసం, పసుపులేటి రంగాజమ్మ మన్నారు దాస విలాసం, మొదలైనవి .అలాగే ద్విపద శతక ప్రక్రియలలో తరిగొండ వెంగమాంబ శివ విలాసం విశిష్టమైనది. విలాసం వనితల శృంగారచేష్టలలో ఒకటిగా లక్షణ శాస్త్రంలో ప్రసిద్ధి. "యాన స్థానాననా దీనాం ముఖ నేత్రాధి కర్మణాం విశేషస్తు విలాసస్య దిష్ట సందర్శనాదినా"అని సాహిత్య దర్పణం (ప్రియుని చూడగానే నాయిక నడకలో ఉనికిలో కూర్చోవడంలో మాటలాడటంలో ముఖనేత్రాది కర్మలలో కనబడే వికార విశేషం విలాసం) "విశేషేన లసనం విలాస: లశశ్లేషణ క్రీడనయో"అని గురు బాల ప్రభోధిక తెలియజేస్తున్నాయి లసధాతువునకు శ్లేషణమని క్రీడనమని అర్థాలు ఉన్నాయి అంటే ఆలింగనాధులను రతిక్రీడాదులను విశేషంగా వర్ణించిన దాన్ని విలాసమనవచ్చు విలాస శబ్దం సామాన్యంగా స్త్రీ పట్ల వాడబడుతున్నా కావ్యం లో నాయికా నాయకుల ఇరువురికి వర్తించేదిగా గ్రహించాలి ఒకసారి విలాస కావ్య నామాలను గమనిస్తే నాయక విలాస కావ్యాలూ ఉన్నాయి, నాయిక విలాస కావ్యాలూ ఉన్నాయి, ఉభయ విలాస కావ్యాలూ కనబడుతున్నాయి. అయితే తెలుగు కవులు విలాస శబ్దాన్ని శ్లేషణ, క్రీడనార్థాలలో మాత్రమే వాడినట్లు లేదు లీలా మహాత్మ్యాలనే అర్థాలలో కూడా వాడారు అంటే

విలాస శబ్దం శృంగార రస సంబంధి గానే కాక వీరాద్భుత, భక్తి, శాంతాది రస వ్యంజకం గా కూడా కవులుద్దేశించినట్లు అర్థమవుతుంది ఉదాహరణకు శ్రీనాధుని హరవిలాసం ఏనుగు లక్ష్మణ కవి రామ విలాసం మొదలైనవి అయితే తెలుగు సాహిత్యంలో వీరాద్భుత, భక్తి, శాంతి ప్రధానమైన విలాస కావ్యాలకంటే శృంగార రస ప్రధానమైన విలాస కావ్యాలే అధిక సంఖ్యలో ఉన్నాయి ఈ విషయాన్ని సుప్రసిద్ధ విమర్శకులు ఆచార్య జీవీ సుబ్రహ్మణ్యం గారు తన రసో ల్లాసం నందు "విలాస శబ్దం శృంగారపరంగా ధీర లలితులకు అన్వయించినంతగా ఇతరులకు వీలుకాదు" అంటారు, వారే విజయ విలాస కావ్యాన్ని ప్రస్తావిస్తూ లస ధాత్వర్థాలను విజయ విలాసం లోని నాయకునికి అనువర్తింప చేస్తే విధేయుడైన అర్జునుడు నాయికాలింగన రతి సౌఖ్యాధులను పొందే కథ విజయ విలాసమవుతుంది ఈ అర్థం కావ్య నామానికి చక్కగా అమరుతుంది విజయ విలాసం సార్ధకమైన పేరుతో వెలసిన కావ్యమే కాదు అటువంటి కావ్యాలలో అది అనర్ఘరత్నం అంటారు.

విజయ విలాసం విలక్షణమైన అద్వితీయమైన ప్రబంధం శృంగార రస ప్రధానమైనది. విజయ విలాసాని కంటే ముందే చేమకూర వెంకట కవి సారంగధర చరిత్ర అనే మూడు ఆశ్వాసాల కావ్యం రాసి రసికుడైన రఘునాథుని ప్రశంసలకు విశేషంగా పాత్రుడయ్యాడు"

"తా రసపుష్టిమై ప్రతిపదంబున జాతీయు వార్తయు జమ
త్కారము నర్థగౌరవముగల్గు ననేక కృతుల్ ప్రసన్న గం
భీరగతిన్ రచించి మహిమించినచో నిక శక్తులెవ్వర
య్యా రఘునాథ భూప రసికాగ్రణికిన్ జెవి సోక చెప్పగన్" (వి.వి. హ్య.వ్యా. 1-31)

అని రఘునాథుని ప్రశంసించినా అటువంటి కావ్య లక్షణాలు తన ప్రబంధంలోనే చూపించాడు ఈ పద్యంలో ప్రస్తావించిన జాతి అనే పదానికి ఒక్కొక్కరు ఒక్కో అర్థం చెప్పారు వేదం వెంకటరాయ శాస్త్రి గారు జాతి అంటే స్వభావం అన్నారు. బులుసు వెంకటరమణయ్యగారు జాతి అంటే స్వభావోక్తి అన్నారు. నాయక రాజుల యుగంలో జాతి అంటే హాస్యోక్తి అని అర్థం. సవరంచిన్ననారాయణ తన కువలయాశ్వచరిత్ర లో మదాలస మదనవేదన వర్ణించే ఘట్టంలో "కనిపించి జాతి చెప్పిన నవ్వునో యంచు నరుదెంచు నలినాక్షి యివలికరుగ" అని ప్రయోగించారు ఈ ప్రయోగం వల్ల ఆనాటి జాతికి, ఈనాటి జోక్ అని అర్థం చెప్పవచ్చు అని అంటారు. ఆరుద్ర గారు తన సమగ్ర ఆంధ్ర సాహిత్యం లో. వార్త అంటే చేమకూర ఉద్దేశ్యంలో సామెత అని అర్థం ఉదాహరణకు విజయ విలాసంలో కవిప్రయోగమే ఉంది "మోక్షమునకు బోవ మొసలెత్తుకుని పోయె ననెడు వార్త నిక్కమగునటంచు" అనే ప్రయోగంలో మోక్షానికి పోతే మొసలి ఎత్తుకు పోయిందనే సామెతను వాడుతూ దానిని వార్త అని కవి ప్రయోగించాడు. ఇక చమత్కారం అంటే వెంకటకవి దృష్టిలో నేర్పు అంటే శ్లేష అని కూడా అనవచ్చు అబ్బురమైన కొత్త విరుపులకు ఆస్కారం ఉండే రచన చమత్కారంగా చెప్పవచ్చు. ఈ విధంగా చేమకూర వెంకట కవి జాతి వార్త చమత్కారాలను తన కవితా లక్షణాలుగా చేసుకుని ప్రసన్న గంభీర గతితో విజయ విలాస కావ్యాన్ని సృష్టించారు. విజయ విలాసంలో కథ తక్కువ వర్ణనలు ఎక్కువ. ఈ వర్ణనలో ఊహావైభవం భావనగాంబీర్యం రచనా సౌందర్యం వంటి లక్షణాలను కవులు ప్రదర్శించారు చేమకూర వెంకట కవి రచనా సౌందర్యాన్ని ఆరాధించిన కవి. శబ్దాలంకారాలను సార్ధకంగా వాడటం శ్లేష ను తెలుగు పలుకుబడులలో కొత్త సొంపు లతో సంతరించడం ఆయన సాధించిన ప్రత్యేక గుణాలని మాటల ఒడుపులో, విరుపులలో కదుపులలో చూపించే చమత్కారాలు ప్రతిపద్య ప్రత్యక్షాలు. అందువల్లనే చేమకూర వానిదొక ప్రత్యేక మార్గం అయిందని అంటారు ఆచార్య జి. వి. ఎస్. కావ్యం లో కొన్ని పద్యాలో కొన్ని ఘట్టాలో ఎప్పటికీ పాఠకుల్ని వెంటాడటం పరిపాటి అలాగే కవి ప్రతిభ కొన్ని ఘట్టాల్లో అపూర్వంగా వికసించి ఆయా సందర్భాలు ఆయా కావ్యాలకు వన్నెతెచ్చి అజరామరంగా వెలుగొందేలా చేస్తాయి ఉదాహరణకు మనుచరిత్రలో వరూధిని ప్రవరాఖ్యుల ఘట్టం పారిజాతాపహరణం లో సత్యభామ సాంత్వనం ఘట్టం. కానీ కావ్యం మొత్తం ప్రతి పద్యం

లోనూ, ఘట్టంలోనూ, కవి ప్రతిభాపాతవాలు అద్భుతంగా కనిపిస్తున్నాయంటే అది తప్పక విజయ విలాస కావ్యం అవుతుంది... అందువల్లనే భోజరాజు అంతటి రఘునాథుడిచేత ....

"ప్రతి పద్యము నందు జమ
త్కృతి కలుగం జెప్ప నేర్తు వెల్లడ బెళుకౌ
కృతి వింటి మపారముగా
క్షితిలో నీ మార్గమెవరికిన్ రాదు సుమీ" (వి.వి. హ్యా.వ్యా. 1-50)

అని ప్రశంసించబడినాడు.

విజయ విలాసం మూడు ఆశ్వాసాల ప్రబంధం మొత్తం 670 గద్య పద్యాలతో అలరారిన ప్రబంధం. అర్జునుడు ఉలూచి, చిత్రాంగద, సుభద్ర అనే మూడు లోకాలకు సంబంధించిన ముగ్గురు కన్యలను వివాహమాడటం వారితో అర్జునుని విలాసాలు, పుత్ర లాభం పొందిన ఘట్టాలు ఈ కావ్యం లోని ఇతివృత్తం. ఉలూచి నాగ కన్య భోగవతి పురవాసిని. చిత్రాంగద మర్త్య కన్య పాండ్య దేశాధీశుడు మణిపురి రాజు మలయ ధ్వజుని కూతురు. సుభద్ర దైవాంశ సంభూత కృష్ణుని సోదరి ఊరు ద్వారక. ముగ్గురు నాయికలతో ఒక నాయకుడి ముచ్చటైన విలాసం విజయ విలాసం. ధర్మరాజు రాజుగా ఇంద్రప్రస్థ పురాన్ని పరిపాలిస్తున్నాడు భీమాదులు అన్నకు అనుంగు సోదరులుగా మద్దతిస్తున్నారు ఈ సమయంలో ఒకరోజు ద్వారక నుండి గదుడు అనేవాడు శ్రీకృష్ణుడు పంపగా ఇంద్రప్రస్థపురాన్ని చేరుకున్నాడు క్షేమ సమాచారాల తర్వాత సమయం చిక్కించుకొని గదుడు అర్జునుని మందిరానికి వచ్చాడు పిచ్చాపాటిగా మాట్లాడుతూ ద్వారకా నగరంలో విశేషాలు చెబుతూ కృష్ణుని అభి ష్టానుసారంగా అర్జునుడికి సుభద్ర అందచందాలను గురించి విశేషంగా వర్ణించి చెప్పాడు.

"కనన్ సుభద్రకున్ సమంబుగాగ నే మృగీవిలో
కనన్ నిజంబుగాగ నే జగంబునందు జూచికా
కనన్ దధీయ వర్ణనీయ హావ భావ ధీ వయ
కన న్మనోజ్ఞ రేఖలెన్నగా దరంబె గ్రక్కనన్" (వి.వి. హ్యా.వ్యా. 1-97)

అని సాటిలేని సుభద్ర సౌందర్యాన్ని ప్రశంసిస్తాడు పైగా నడ మంత్రపు సిరి కలిగినప్పుడు లోకంలో ఒక్కొక్కరు నిక్కుతూ నీలుగుతూ విరవేగడాన్ని అత్యంత మనోహరంగా సుభద్ర సౌందర్యానికి ఆపాదిస్తూ కవి చేసిన వర్ణన అత్యద్భుతం

"అతివ కుచంబులున్ మెరుగుటారును వేనలియున్ ధారాధిపో
న్నతియు నహీన భూతికలనంబు ఘనాభ్యుదయంబు నిప్పుడొం
దితిమని మాటిమాటికిని నిక్కెడు నీల్గెడు విర్రవీగెడున్
క్షితినిటుగాదె ఒక్కొకనికిన్ నడ మంత్రపు గల్మిగల్గినన్" (వి.వి. హ్యా.వ్యా. 1-99)

అంటాడు కవి అప్పటినుండి అర్జునుడు కూడా సుభద్రను చేరుకోవడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ సందర్భంగా ఒక వింత జరిగింది ఒక బ్రాహ్మణుడు తన ఆవు చోరుల చేత అపహరించబడిందని అర్జునునికి విన్నవించగా దానిని ఆ బ్రాహ్మణుడికి అప్పగించే నిమిత్తం అర్జునుడు ఆయుధాల కోసం నిబంధనను అతిక్రమించి ద్రౌపది ధర్మరాజుల అంతరంగిక మందిరంలోకి వెళ్ళాడు ఫలితంగా... వారి మధ్య ఒప్పందం ప్రకారం ఒక సంవత్సరం తీర్థయాత్రలు చేయాల్సి రావడం తటస్థించింది ఈ ఒక సంవత్సరం తీర్థయాత్రలో అర్జునుడు వలచిన ఈ మూడు వలపులే విజయ విలాసం. అనేక రసవంతమైన ఘట్టాలు ఈ కావ్యాన్ని శృంగారసంలో ముంచెత్తాయి ముఖ్యంగా గదుడు సుభద్రను వర్ణించే సందర్భం, ఉలూచి అర్జునుల వృత్తాంతం, అర్జునుడు చిత్రాంగదల వృత్తాంతం, సుభద్రా

అర్జునుల వృత్తాంతం ఈ ఈ కథలన్నింటిలోనూ చేమకూర వెంకట కవి కలం విజృంభించి కవి ప్రతిభను పతాక స్థాయికి తీసుకెళ్లినది ముఖ్యంగా శ్లేష, చమత్కారాలు ఈ కావ్యానికి ప్రాణంగా నిలిచాయి. కవి తన వర్ణనలతో ప్రతి ఘట్టాన్ని దృశ్యమానం చేసి పాఠకుల కళ్ళముందు నిలబెడతాడు. ప్రథమశ్వాసంలో ఉలూచి అర్జునునికి తనను పరిచయం చేసుకునే సందర్భంలో..

"మేలి పసిండిగాజుల సమేళపు పచ్చల కీల్కడెంపు డా
కేలు మెరుంగు గబ్బి చనుగ్రేవకు దార్చుచు సోగకన్నులన్
దేలగ జూచి యే మధువతీ నవమన్మధ ఈ జగంబు పా
తాళము నేనులూచి యనుదాన భుజంగమ రాజకన్యకన్" (వి.వి. హ్య.వ్యా. 1-144)

అని చెబుతున్నప్పుడు ఆ దృశ్యం మన కళ్ళ ముందు కనిపిస్తుంది. అర్జునుడిని ఆకర్షించడానికి ఉలూచి చేసిన ప్రయత్నం అంతా తన చేష్టల ద్వారా నర్మగర్భమైన సంభాషణ ద్వారా తెలుపుతుంది స్త్రీలు తమ ఎడమ చేతితో పైటను సర్దుకోవడం అత్యంత సహజం. అర్జునుడిని ఓ మధవతీ నవమన్మథ!అని సంబోధించడం నేను భుజంగము రాజకన్యకన్ అని చెప్పడం వెనుక అర్జునుని మధవతులకు నవమన్మధుడు అని కీర్తించడం తాను ఇంకా కన్యనని స్పష్టంగా తెలియజేయడం ఈ పద్యంలోని

చమత్కారం. అలాగే తాను అవివాహితను అనే విషయాన్ని తెలియజేస్తూ
"కన్నియ గాని వేరొకతె గాను మనోహరరూప నీకు నే
జన్నియవట్టి యుంటి నెలజవ్వనమంతయు నేటిదాకా నా
కన్నుల యాన నా వలపు కస్తురి నామము తోడు నమ్ము కా
దన్నను నీదు మోవి మధురామృత మానియు బాససేసెదన్" (వి.వి. హ్య.వ్యా. 1-162)

అంటూ తన కన్నుల మీద కస్తూరి నామము మీద ఒట్టు పెట్టుకుని చెబుతుంది ఇంకా నమ్మకపోతే నీ అధరామృతం ఊని ప్రమాణం చేస్తాను అని గడుసుగా చెబుతుంది. ఉలూచి ప్రౌఢ. అర్జునుడిని చూచి స్మరాంధురాలై సంపూర్ణ యవ్వనంతో అతనిని ఆకర్షించి తన మనసులోని భావాన్ని తెలియజేసి అర్జునుని ఒప్పించి వివాహమాడుతుంది ఉలూచి ఘట్టంలో పతాక స్థాయి అనదగినది వారి వివాహం ఈ సందర్భంగా

"శయ్యకు దార్పగా దురుము జారె నదంతట చక్కదిద్దబోన్
బయ్యద జారె నయ్యదిరిపాటున గ్రక్కున నీవి జారె రా
జయ్యడ నవ్విలాసిని వయారము జూసి కవుంగిలించె నౌ
నెయ్యడ మేలేచూతురు గణింపరు జాణలు జారుపాటులన్" (వి.వి. హ్య.వ్యా. 1-172)

అంటూ చేసిన వెంకట కవి వర్ణన కేవలం అర్జునుని విషయంలోనే కాక కావ్య విమర్శలో కూడా స్వల్ప లోపాలను గణించక రసభావాది సుగుణాలనే ఎంచాలని పండిత విమర్శకులకు మనవి చేశాడు.

రెండవ ఆశ్వాసంలో వచ్చే చిత్రాంగద వృత్తాంతం కూడా పాఠకులను మైమరిపింప చేస్తుంది చిత్రాంగద అచ్చమైన ముగ్ధ తండ్రి చాటు బిడ్డ ఆమె అందాన్ని చూసి అర్జునుడు మోహించి పెండ్లికి తాపత్రయపడ్డాడే గాని ఆమె లజ్జకే వజ్జయిన లజ్జావతి సమదిక లజ్జావతి కావడం ముగ్ధకు ప్రధాన లక్షణం. లజ్జచే రతి విముఖ అయినా ఆమె పొందు నాయకులకు అత్యంత సౌఖ్యప్రదమని లాక్షణికులు చెప్పారు చేమకూర అలాగే వర్ణించి చూపించాడు.

"ఇగ్గెడు వెన్కకుం బయికి నీడ్చినన్ బైట దొలంగజేయ గే
లొగ్గెడు రెమ్మి పోకముడి యూడ్చిన గ్రుంగిలి రెండు కొంగులుం

బిగ్గ నడంచుచున్ విడిచిపెట్టదు బాలననంబనేమి యా
సిగ్గుకు సిగ్గు లేదిటుల జేసిన పిమ్మట నుండవచ్చునే'' (వి.వి. హ్యా.వ్యా. 2-30)

చిత్రాంగద బాల అనగా ముగ్ధ కాబట్టి సిగ్గుపడుతుందంటాడు కవి రెండు మూడు అశ్వాసాలలో చిత్రాంగద వృత్తాంతం, సుభద్ర వృత్తాంతం వెంకటకవి ప్రతిభకు పట్టం కడతాయి ముఖ్యంగా అర్జునుడి సన్యాసి వేషం, రేవతకోత్సవం, సుభద్ర సౌందర్య వర్ణన, సుభద్ర యతికి సేవచేయడం, అర్జునుని గూర్చి మాయాయతి సుభద్రల సంభాషణ, సుభద్రా అర్జునుల వివాహ ఘట్టం మొదలైన సందర్భాలలో కవి వర్ణనలు భావనా బలం ఈ కావ్యాన్ని అజరామరం చేశాయి ముఖ్యంగా ద్వితీయాశ్వాసములో రేవతకోత్సవానికి సుభద్ర రాక, ఆ సందర్భంలో సుభద్ర సౌందర్య వర్ణన అర్జునుని తడబాటు, సుభద్ర పైటచెంగు తగిలినప్పుడు అర్జునుడి అవస్థ... ఈ ఘట్టాలు యువ పాఠక హృదయాలను గిలిగింతలు పెట్టిస్థాయి.

''గెంటని ప్రేమ మేను పులకించె కిరీటికి బూలొసంగి వా
ల్గంటి గిరుక్కున తిరుగన్ కమ్మని కస్తురి తావి గ్రమ్ముకొన్
గింటెపు గబ్బి గుబ్బల జిగిన్ వెలిజిమ్ము నొయారి జిల్గు ప
య్యంట చెరంగొకింత దన యంగము పై నటు సోకినంతటన్'' (వి.వి. హ్యా.వ్యా. 2-134)

అంటాడు కవి. గిరుక్కున సుభద్ర వెనుకకు తిరగడము అలా తిరిగినప్పుడు వయ్యారంగా సన్నని పైట ఎగిరి అర్జునుని తాకడము అర్జునుని మేను పులకించడం మనోహరమైన, సహజసిద్ధమైన వర్ణనలు అర్జునుడు మహావీరుడిగా కాక సాధారణ యువకుడిగానే కనిపించడం విశేషం. ఇక సుభద్రా అర్జునుల వివాహ ఘట్టం ఈ కావ్యానికే తలమానికం వెంకట కవి అత్యంత సహజసిద్ధంగా సుందరంగా సాంప్రదాయానుసారంగా ఈ ఘట్టాలను పొందుపరిచాడు సుమారు 64 పద్యాలలో ఆనాటి తంజాపురి నగరంలో తెలుగు నాయక రాజుల కుటుంబాలలో జరుగుతున్న వివాహ పద్ధతులను ఆచారాలను ఉన్నది ఉన్నట్టుగా వర్ణించి చెప్పాడు వధూవరుల ముస్తాబు మొదలుకొని వివాహ కార్యక్రమంలో జరిగే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించాడు తెలుగువారి వివాహ పద్ధతిని వెంకట కవి ఒక విధంగా రికార్డు చేశాడన వచ్చు

''పొలయలుకందు వేడుకొను పొందిక దెల్పెడులీల సిగ్గు దొ
ట్రిలిన ముఖాబ్జ మెత్తి మెడ క్రిందికి హస్త యుగంబు సాచి వే
లి దెమలించి సౌఖ్యకలనస్థితి గట్టిగ బట్టి కట్టే న
నవ్వెలదుక కంఠసీమన్ గురువీరుడు మంగళసూత్ర మయ్యెడన్'' (వి.వి. హ్యా.వ్యా. 3-115)

అంటూ సుభద్రకు మంగళసూత్ర ధారణ చేసే ఘట్టాన్ని అత్యంత స్వభావసిద్ధంగా వర్ణించాడు. అలాగే మొదటి అధ్యాయంలో గదుడు సుభద్రను వర్ణించిన అంశాలు... తదితర అంశాలు ప్రేమరసైక జీవులకు గిలిగింతలు పెట్టే సందర్భాలు.

''చెందురు కావి పావడ పిసాళి రుచుల్ సరిగంచు చీర పై
చిందులుత్రొక్క వేణి కటిసీమ పయిన్ నటియింప జాలు వా
అందెలు మ్రోయ జుంటి రవికంటి చనుంగవ పిక్కటిల్లగా
జందనగంధి వచ్చె రభసమ్మున నమ్ముని రాజ సేవకున్'' (వి.వి. హ్యా.వ్యా. 2-130)

అని యతికి శుశ్రూష చేయడానికి వచ్చే సుభద్రను వర్ణిస్తాడు. అలాగే ఈ కావ్యంలో ఒకప్పుడు తెలుగువారి రాజధానివలే భాసిల్లిన తంజాపురి సొగసును అనేక విధాలుగా శ్లాగించాడు కవి. ఇంద్రప్రస్థ పురాన్ని గురించి చేసిన

వర్ణనలన్నీ నాటి తంజాపురి నగర విశేషాలే. తోటలు, కోటగోడలు, ఆపురి విలాసవతుల విహారాలు, (ఆరామ సీమల యందు నుండి పవళ్ళు ముదమెసంగ వసంతుడెదురుచూచు.1-76.పుట :124 వి.వి)వేశ్యల చాతుర్యాలు, (అతి వినోదముగాగ రతుల మెప్పించు నీ పచ్చల కడియాల పద్మగంధి 1-81పుట :137 వి.వి)ఆయా సందర్భాలలో చమత్కారంగా వర్ణించాడు అలాగే అర్జునుడు భోగవతిపురం నుండి తిరిగి వచ్చాక తన ప్రాణసఖుడైన విశారదుడితో ఉలూచి సౌందర్యం, భోగవతీపురంలో ఆవిడ వైభవం తదితర అంశాలన్నీ వివరిస్తూ....

"ఆ భోగము తద్వస్తు చ
యా భోగము నెందుగన్న యవిగావు సుమీ
నా భోగపురము సరియౌ
నా భోగవతీపురంబు సార్థంబయ్యెన్" (వి.వి. హృ.వ్యా. 1-188)

అంటాడు ఇదే సందర్భంలో ఉలూచి పడకంటి గురించి "మరుని గెల్పుల కథా మహిమమ్ము విలసిల్లు నొరపు జిత్తరు లీవి నుల్లసిల్లు"(1-187. పుట 291.వి.వి) అంటూ చేసిన వర్ణన నాటి తంజావూరు రఘునాథ నాయకుడి పడకటింటి వైభవాన్ని స్మరింపజేస్తుంది . ఒక విధంగా శ్లేష కావ్యయుగంలో వచ్చిన ఈ విజయ విలాసాన్ని చివరి మజిలీగా చెప్పవచ్చు. ముగ్గురు నాయకులను ప్రతీకలుగా తీసుకొని, ఏదో సాహిత్య సూత్ర రహస్యాన్ని గాని తత్వాన్ని గాని ధ్వనింపజేసే ప్రక్రియ ప్రబంధాలలో పెద్దన మనుచరిత్రతో ప్రారంభమైంది. దాన్ని మిగతా ప్రబంధ కవులు కూడా అనుసరించారు .చేమకూర వెంకటకవి కూడా మూడు విధాలైన పాత్రలను వాటి చిత్తవృత్తులను పరమ రమణీయంగా చిత్రించడమే కాకుండా అనేక రకాల శ్లేషలు ధ్వని భేదాలతో ప్రతీకాత్మక ప్రవృత్తి తో ఈ కావ్యాన్ని రూపొందించి తన ప్రత్యేకతను నిలుపుకున్నాడు. అయితే ఎంత సమర్థవంతంగా రచించినా సమకాలం వారు మెచ్చుకోకపోవడం తెలిసిన విషయమే వెంకటకవి కూడా దీనికి మినహాయింపు కాడు అందుకే చిత్రాంగద కథలో అర్జునుడు విరహంతో ఉన్న సందర్భంలో చేసిన సాయంకాలపు వర్ణనలో తన బాధను వ్యక్తం చేసుకుంటాడు కవి."

"క్షితిపై వట్టి ప్రాకులు జిగిర్ప వసంతుడు దా రసోప గుం
పిత పదవాసనల్ నెరప మెచ్చక చంద్రుడు మిన్నునం ప్రస
న్నతయును సౌకుమార్యము గనం బడ రాల్గరుగంగ జేసే నే
గతి రచియించి రేని సమకాలము వారలు మెచ్చరే కదా" (వి.వి. హృ.వ్యా. 1-210)

అంటాడు.అయినా కూడా దక్షిణాంధ్ర యుగ సాహిత్యంలోనే కాక తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప ప్రబంధంగా విజయ విలాసాన్ని తీర్చిదిద్దాడు.

**ఆధార గ్రంథాలు :**


1) విజయ విలాసము :చేమకూర వెంకట కవి. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ
2) విజయ విలాసం -- హృదయోల్లాస వ్యాఖ్య -- తాపి ధర్మారావు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ
3) రసోల్లాసము ఆచార్య జీవి సుబ్రహ్మణ్యం తెలుగు అకాడమీ ప్రచురణ
4) సాహిత్యంలో చర్చనీయాంశాలు ఆచార్య జీవి సుబ్రహ్మణ్యం
5) తెలుగు సాహిత్య సమీక్ష రెండో సంపుటం జి నాగయ్య నవ్య పరిశోధక ప్రచురణలు
6) సమగ్రాంధ్ర సాహిత్యం: నాయక రాజుల యుగం: ఆరుద్ర


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# జాతశ్రీ, నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ కథలు- కులవృత్తుల సామాజిక జీవన పరిస్థితులు



**జి. ప్రేమలత**
పరిశోధక విద్యార్థిని తెలుగు అధ్యాపకురాలు, గురుకుల పాఠశాల, రంగారెడ్డి జిల్లా.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

తెలంగాణ కథ స్పృశించని అనేక పార్శ్వాలను తీసుకొని ఇక్కడి కథకులు కులవృత్తుల కథలు రాస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ కథల్లో గ్రామీణ జీవనశైలీ, శ్రామికస్వయం పోషక లక్షణాలతో మమేకమైన నాగరికథ, వ్యవసాయం, పశుపోషణ, కులవృత్తులతో విడదీయరాని భాగస్వామ్యం, సమిష్టి జీవితం పట్ల విశ్వాసం. మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులకు అనుగునంగా వలసలు ఇతివృత్తాలుగా ఉంటాయి. తెలంగాణలో తిరుగులేని కులవృత్తి నైపుణ్యం ఉంది. ఇది నేటి కార్పోరేటీకరణ, ప్రపంచీకరణల ఇనుపపాదాల కింద నలిగినశ్యమై పోతున్నాయి. తెలంగాణ కథా సాహిత్య వికాసంలో బహుజన కులవృత్తుల కథలకు ప్రత్యేకమైన స్థానం కలదు. అని అచ్చమైన తెలంగాణ జీవన చిత్రణలు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, పద్మశాలి, గొల్ల, కాపు, తెనుగు, బెస్త కుర్మ, చాకలి, మంగలి, మేర లాంటి వృత్తుల జీవన స్థితిగతులపై ఎన్నో కథలు వచ్చాయి వస్తున్నాయి కూడా ప్రపంచీకరణ క్రమంలో పెరుగుతున్న డబ్బు అవసరాల ప్రాధాన్యత వృత్తిపనివాళ్ళ జీవితాలలో వస్తున్న సంక్షోభం వీటికి మధ్య ఉన్న సంబంధాన్ని రచయితలు తమ కథల్లో చిత్రించిన వైనం తెలంగాణ కథల్లో కనబడుతుంది. ముఖ్యంగా అన్ని కులవృత్తుల కథలను రాసిన జాతశ్రీ, గౌడ కులానికి చెందిన కథలు రాసిన శ్రీనివాస గౌడ్ కథలను వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు :**

తెలంగాణ కథ, కులవృత్తి నైపుణ్యం, ప్రపంచీకరణ, గ్రామీణ సంక్షోభం, వృత్తి కళాకారులు, అస్తిత్వం, సంస్కృతి, సామాజిక జీవనం, గ్రామీణ వ్యవస్థ.

**ప్రవేశిక :**

ఆధునిక సాహిత్యంలో అనేక సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలు వచ్చాయి. అందులో కథా సాహిత్య ప్రక్రియ అత్యంత ప్రాచీనమైనది. కథా అనే కదానికి 'కత' అనే వికృతి ఎవరైనా లేనివి కల్పించి మాట్లాడితే కథలు

చెప్పకు అని అంటుటాము. అంటే కల్పిత వృత్తాంతం కలిగిన కథ అని అర్థం. విజ్ఞానాత్మకమైన పంచతంత్ర కథలు మొదలగు కథలు పిల్లలను అలరిస్తూ వినోదాన్ని విజ్ఞానాన్ని అందించి వారిని ఉత్తమ గుణసంపన్నులులుగా ఎదగడానికి దోహదం చేస్తున్నాయి. కథ అనే ప్రక్రియ తెలుగులో తొలిసారిగా భండారు అచ్చమాంబ కథలో ప్రారంభమైయింది. ప్రాచీన కాలం నుండి కథలలో అనేక రకాలు ఉన్నాయి. పరిమాణాన్ని రంగాన్ని ఇతివృత్తాన్ని దానికి గల ప్రాచుర్యాన్ని, చెప్పే విధానాన్ని బట్టి కథలను వర్గీకరించడం జరిగింది. జీవితంలోని ఒక్కొనొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదే పదే చదవాలనిపించజేసేది గొప్ప కథ అని పోరంకి అంటారు. ఈ నేపథ్యం నుండే జాతశ్రీ, శ్రీనివాస్ గౌడ్ కథలను పరిశీలించడం జరిగినది.

**జాతశ్రీ కులవృత్తి కథలు విశ్లేషణ :**

**అంతర్ముఖం :**

'అంతర్ముఖం' గౌడ వృత్తికి సంబంధించిన కథ 'అంతర్ముఖంగా ఉదయం నుండి రెక్కల కష్టంతో, ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ, ఒళ్ళంతా కమిలిన లెక్క చేయకుండా తాటి చెట్లు, ఈత చెట్లు ఎక్కి కల్లును తీసి స్వచ్ఛంగా కుండల్లో పెడితే ఎవరు కొనని రోజులు ప్రస్తుతం గ్రామాల్లో సహజం. ఇలాంటి సంఘటననే ఇతివృత్తంగా తీసుకుని జాతశ్రీ రాసిన 'అంతర్ముఖం ఇన్ని సమస్యల వలయంలో కథను అద్భుతంగా చిత్రీకరించాడు.

కులవృత్తి జీవితంగా భావించిన మల్లేశం చేయకూడదా ? నాగలి పట్టకూడదా' అని మనసులో అనుకోవటం వెనుక ఒక విషాద ఘటన ఉంది. చదివిన వారు కూడా చివరికి కులవృత్తి చేపట్టక తప్పదని హెచ్చరించినట్లు ఈ కథలో కనిపిస్తుంది. ప్రతిరోజు గౌడ కులస్థుడు మూడుసార్లు చెట్టెక్కాలని అతడు కష్టపడితే ఫలితం శూన్యం అని నొక్కిచెప్పాడు. మనిషి సాధారణంగా మూడు పూటలు భుజిస్తాడు. మనిషికి అన్నం ఎంత ముఖ్యమో గౌడ కులస్థుడికి అన్నంతో పాటు మూడుసార్లు చెట్టెక్కాలని వారి టైం టేబుల్ పట్టికని ఈ కథ ద్వారా ప్రస్తావించాడు. ఎందో గౌండ్లోడి బతుకు ఎక్కి దిగటమే తప్ప ఎదిగొచ్చినోడు ఎవడు లేడు. తాళ్ళపాట పాడినోడు తప్ప తాళ్ళు గీసివోడు బాగైంది లేదు. చెట్టు ఈ కల్లుతో గీసే వోడి కంటే చెట్టు మీంచి పడినోడికే ఇలవ' అంటూ జాత శ్రీ గౌడ కులస్థుల భాధను ప్రస్తావించాడు.

మందులతో కత్తీ కల్లు తయారుచేసిన వారి వ్యాపారం సజావుగానే సాగుతుంది. కానీ ఉదయం నుండి రెక్కల కష్టంతో, ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ, ఒళ్ళంతా కమిలిన లెక్క చేయకుండా తాటి చెట్లు, ఈత చెట్లు ఎక్కి కల్లును తీసి స్వచ్ఛంగా కుండల్లో పెడితే ఎవరు కొనని రోజులు ప్రస్తుతం గ్రామాల్లో సహజం. ఇలాంటి సంఘటననే ఇతివృత్తంగా తీసుకుని జాత శ్రీ రాసిన 'అంతర్ముఖం'. ఇన్ని సమస్యల వలయంలో జాతశ్రీ కథను అద్భుతంగా చిత్రీకరించాడు.

అంతర్ముఖం కథలో గౌడ, కల్లుగీత కార్మికుల జీవితాల గురించి, వారి అవస్థల గురించి, చెట్టుమీంచి పడితే కనీసం ప్రభుత్వం ఇచ్చే ఎక్స్ గ్రేషియాతోనైనా కుటుంబం బాగుపడతుందని, బతికి చేసేదేమిటని ఆలోచించే దుస్థితి కడు దయనీయంగా చిత్రించారు. కథలో గంగిరెద్దులు ఆడించే వారి జీవితాలు, సంస్కృతి విశ్లేషించారు. కథలో గాడిదలు, దొమ్మరి ఆటలు, వారి జీవితాలు చిత్రించారు. గౌడుల జీవితాలపై కల్లు గీత వృత్తిలో గల సాధక బాధకాలపై, గ్రామీణ పెత్తందార్లు చెలాయించే ఆధిపత్యంపై ఇనుప ముక్క కారులు కథలో చిత్రించారు.

**అగ్నితుఫాన్ :**

'అగ్ని తుఫాను' బెస్త వృత్తి అంటే చేపలు పట్టడం. దీనికి సంబంధించిన కథ 'అగ్ని తుఫాను సముద్రంలో వేటే జీవితంగా చావు బ్రతుకుల నడుమ జీవితం గడిపేవారి జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు రచయిత.

బెస్తవాళ్ళు, చేపలు పట్టేవారు, జాలర్లు, కళాసీలు తదితరులు పేర్లతో వ్యవహరించినా వారిది ఒకే వృత్తి అదే బెస్త వృత్తి. వీరిని రచయిత కళాసీలుగా కథ మొత్తం సంభోదించాడు. ఇయ్యలేపూ ఆట సూసేటోడే కరువయిండు. చిత్రించా యిగ కడుపెవడు సూస్తడు' అని ధ్వంసమైన వృత్తి జీవితాన్ని చిత్రించాడు. హన్మంతు బెస్తవారి యజమాని. ప్రతిరోజు వారిని బెదిరించి శ్రమదోపిడి చేస్తాడు. వారు చేసిన కష్టానికి తగిన డబ్బులివ్వకుండా రేపిస్తా, మాపిస్తా అని బొంకుతాడు. ముందుగాల... సరుకు..... సరుకు..... అని నిరంతరం వారిని పనిచేయించాలనుకుంటాడు. ఇతడిని ఏ బెస్త వ్యక్తి అయిన అడ్వాంసుగా డబ్బులడిగితే ఇచ్చి ఎక్కువ పని చేయించుకొని శ్రమదోపిడి చేస్తాడు. సరుకు దించరేటి అని అరుస్తూ పని చెప్తాడు.

ఇందులో ఊరగల్లుది ప్రధాన పాత్ర ఊరగల్లు నిద్రలేచి పిల్లలను చూస్తూ తల్లి పిల్లలను చల్లంగా చూడు, ఏ కష్టం రాకుండా మంచి భవిష్యత్తు చూపించు అని గంగమ్మ తల్లికి నమస్కరిస్తాడు. ఇదంతా ఎందుకు చేస్తున్నాడంటే తాను చేసే వృత్తి చాలా కష్టమైంది. ఎట్టి పరిస్థితిలో ఈ పనిని పిల్లలకు నేర్పించొద్దు, పిల్లలను దీని జోలికి రానివ్వద్దని నిర్ణయించుకుంటాడు ఊరగల్లు బెస్తవాళ్ళ, చేపలు పట్టేవారు, జాలర్లు, కళాసీలు తదితరులు పేర్లతో వ్యవహరించినా వారిది ఒకే వృత్తి అదే బెస్త వృత్తి. వీరిని రచయిత కళాసీలుగా కథ మొత్తం సంభోదించాడు. నల్లమ్మ భర్త బలహీనతను బట్టి భర్త కళాసిగా కష్టపడుతుంటే ఈమె చేపలను మోస్తుంది. ఏడుస్తూ నవ్వగల మాతృమూర్తి నల్లమ్మ. నల్లమ్మ పాత్ర ద్వారా రచయిత చెప్పదలచుకున్నదేమిటంటే భర్త మాటను జవదాటరని, భర్తను గౌరవిస్తారని కూడా పరోక్షంగా తెలిపాడు. చదువుకునేవారే భర్తలను గౌరవిస్తారని లోకంలో అనుకుంటారు. కానీ జాతశ్రీ కూలీనాలీ చేసుకొని బ్రతికేవారు కూడా భర్తలను గౌరవిస్తారని చెప్పాడు. తాగుడుకు బానిసై వృత్తిదారులు యజమానుల చేతిలో ఎలా మోసపోతారో జాత శ్రీ చక్కగా చిత్రీకరించాడు.

బెస్తవారి జీవితాలు బాగుపడేదెప్పుడు ? జీవితాంతం ఇదేనా వారి పరిస్థితి ? ప్రభుత్వాల నుండి సహాయం అందదా ? యజమానుల చేతుల్లో ఎన్ని వేల సార్లు మోసగించబడాలి ? అని పలు ప్రశ్నలను పాఠకుల ముందుంచుతాడు. నీళ్ళల్లో కొనసాగింపుగా ఉంటడం చేత అనారోగ్యం పాలవుతారు. కానీ యజమానులు వారిని క్షమించరు. ఆరోగ్యంగా ఉన్న లేకున్నా పనిలోకి రావాల్సిందేనని పట్టుబడతాడు ఈ కథలో ప్రధానంగా కష్టపడి చేపలు పట్టిన కళాసీలపై యజమాని హన్మంత్ దౌర్జన్యం కనిపిస్తుంది. అదేవిధంగా శ్రమను, ఒంటి నొప్పులను మరచిపోవటానికి తాగుడుకు ఏ విధంగా బానిసవుతారో ఊరగల్లు పాత్ర ద్వారా చెప్పాడు,

ఈ సంఘటన ద్వారా రచయిత ఏం చెప్పదలచుకున్నాడంటే శ్రమను కూడా గుర్తించని ఓనర్లు లెక్కకు మించి సమాజంలో పేరుకుపోయారని నిర్మొహమాటంగా యజమాని హన్మంత్ పాత్రను సృష్టించాడు. నెల పొడవు కథలో. చేపలు కడిగి ఇచ్చే వారి వృత్తి గురించి చిత్రించారు.

ముసలవ్వ మనసు కథలో చేపలమ్ముకుంటూ బతికే వారి జీవితాన్ని చిత్రించడం జరిగింది. అయితే చేపలమ్ము కోవడంలో వాళ్ళను హీనంగా చూడటంలాంటి అనేక విషయాలు ఇందులో కనబడతాయి.

**విషాదం :**

జాతశ్రీ విషాదం పుల్మణి సంబలోళ్ళ వృత్తిని నమ్ముకుని బతుకుదెరువును నెట్టుకొస్తుంది. భర్త ఆధిపత్యంపై నడుంబిగిస్తుంది. స్త్రీవాది లక్షణాలున్న వ్యక్తి ఈ పాత్ర విషాదం కథలోనిది. పట్టణాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో పంబళ్ళు అడుక్కుతినడం కోసం ఎన్ని అవస్థలు పడతారో చిత్రించిన గొప్పకథ ఇది. భర్త, మామల కడుపు నింపడం కోసం పుల్మణి ఎంత ఆవేదనకు గురౌతుందో రచయిత జాత శ్రీ కళ్లకు కట్టినట్లుగా వర్ణించాడు. పూరి గుడిసెలో జీవించే పుల్మణీ, భర్త పిట్టల ఉండేలు, మామ పంబజోళ్ళ గురప్ప ఒక్క పూట కోసం నానా కష్టాలు పడతారు.

సంకలో డోలు తగిలించుకోని వాయిస్తూ జనాల నుండి డబ్బులు అడుక్కునేది వీరి వృత్తి. గడిచినా కాలాన్ని మునెవ్వతో పుల్మణీ వివరిస్తూ కంటతడి పెట్టిన సందర్భాన్ని రచయిత చక్కగా చిత్రీకరించాడు. ఆడబిడ్డ అని తెలియగానే ఉండేలు బాతును చిదిమేసినట్లు చిదిమేస్తాడు. స్థూలంగా ఇది కథ. ఈ కథ ద్వారా అడుక్కునే తినేవారి పరిస్థితులు ప్రస్తుతం ఎలా ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఈ కథ ద్వారా పంబజొళ్ళు కూటి కోసం ఎన్ని అవస్థలు, అవమానాలు పడతారో చెప్పాడు.

'విషాదం' కథ ద్వారా రచయిత చెప్పదలచుకున్నదేమిటంటే సమాజంలో ఇప్పటికీ భిక్షాటన వృత్తి ఉన్నదని, వారి మనుగడ కోసం ప్రభుత్వం స్పందించాలని పేర్కొన్నాడు. డబ్బు కోసం ఆశపడి మునెవ్వ పసి పిల్లల్ని కన్ను తెరవకముందే కాలువలో తోసేస్తుంది. ఈ పాత్ర ద్వారా ఆస్పత్రుల్లో పని చేసే ఆయాలు, నర్సులు ఎలా డబ్బుకి కక్కుర్తిపడి ఎంతటి పనికైన వెనకాడరని చెప్పాడు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల కుటుంబానికి బరువని పేదవారు భావిస్తారు. పెళ్ళి చేయాలంటే బోలెడు కట్నం కావాలి, డబ్బు లేకపోయిన భూమి ఎంతో కొంత రాసివ్వాలి. ఇవన్నీ లేనివాళ్ళ పరిస్థితి ఏమిటి అని కొందరనుకుంటారు. మరికొందరేమో ఆడపిల్లలు పుట్టగానే చెత్తకుండీలలో, పొలాల్లో, ఆసపత్రుల్లో, రోడ్లమీద వదిలి వెలుతుంటారు. ఇలాంటి చక్కటి సంఘటనలను తీసుకొని రచయిత కథలో ప్రస్తావించాడు.భార్యా భర్తలు శిశువును చూద్దామని తొందరపడతారు. ఆడపిల్ల అని కంలో భార్యా తెలియగానే పుల్మణి భర్త ఉండేలు పసిగుడ్డను పిడికిలిలో క్రూరంగా పిసికేస్తాడని ముందే గ్రహించి స్త్రీల మానవత్వాన్ని నొక్కి చెప్పాడు. తలబాదుకుంటూ బిడ్డని సంపకురా ... సంపకు..... పిసికెయ్యబాక..... సస్తది.... సస్తాంది.... అయ్యో ... అయ్యోయ్యో .... బిడ్డ .... ఓర్నిన్ను తగలెయ్య...నీ తలపండు పగల ! నిను కాస్టాల గడ్డకు కొంచకు పోను..... అయ్యో.... బిడ్డ అని వేదన చెందుతది పుల్మణి. పుల్మణిని కుటుంబానికి అన్నం పెట్టే మనిషిగా చిత్రీకరించాడు. పంబడోళ్ళ అవస్థలు, వేదన, ఆకలిభాధ, కడుపు మంటలను ప్రస్తావించాడు.

**నేరెళ్ళ శ్రీనివాస గౌడ్ కథల్లో జీవన చిత్రణ :**

**పేదోళ్ళ బతుకులు :**

'పేదోళ్ళ బతుకులు' కథలో నర్సవ్వ పాత్ర స్త్రీ అబల కాదు సబల అని నిరూపిస్తుంది. నర్సవ్వ బతుకు జీవన కోసం బీడీలు చెయ్యడం నేర్చుకోని సొంతంగా బీడీలు చేస్తుంది. నాలుగేండ్లయినంత నర్సవ్వకు పి.యఫ్.కట్ చేసాడు టేకదారు. ఆమె బీడి కార్మికురాలని ఐడెంటిటీ కార్డు అపాయింటుమెంటు లేటరు ఇస్తాడు. బుచ్చన్న నర్సవ్వలు పద్నాలుగేండ్లు రక్తం కలికలికాంగ కట్టపడితే రెండు గుంటల భూమి కొన్నారు. మరో పద్నాలుగేండ్లు కట్టపడ్డ ఇల్లు కట్టుకోవడానికి ఖర్చు అయ్యే రూపాయాలు జమకావని ఒకగుడిసె వేసుకుంటే సరిపోతుందని అను కుంటుండగా కేంద్ర ప్రభుత్వం ఒక సంవత్సరం నుండి పి.యఫ్. ఉన్న బీడి కార్మికులకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నలుభయి వేల రూపాయాలు పూర్తి సబ్సిడీతో ఆర్థిక సహాయం చేస్తుంది ప్రకటన వెలువడింది.

అందుకు బీడి కార్మికులు ముందుగా ఐదువేల రూపాయలు డి.డి. తీసి హౌసింగ్ బోర్డు ఆఫీలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అప్పటి నుండి బుచ్చన్న నర్సవ్వలు ఐదువేలు అప్పుకోసం పక్కపొంటి ఊర్లల్ల తెలిసినోల్లను అడిగింద్రు. సూటాల మార్గాన అడిగింద్రు ఎక్కడ అప్పు దొరకుత లేదు. ఇల్లు గట్టుకునే భాగ్యం లేదని సొలిచ్చు కుంద్రు ధరఖాస్తు పెట్టుకొన్నోల్లాందరికి ఇండ్లు మంజూరైనాయి ఎంత మోసం, ఎంత మోసం మనలాంటి పేదోళ్ళను ప్రభుత్వం మోసం జేత్తుంది'' అన్నది నర్సవ్వ. నర్సవ్వ కిరాయికి ఉన్నఇంట్లో నర్సవ్వతో పాటు మరో ఐదారుగురు కూచొని బీడీలు జిత్తుండు. ''ఇండ్లు మంజూరు చేసేటప్పుడు సూడద్ద ఎవలకు ఇండ్లున్నాయో లేవోనని'' అన్నది బుచ్చమ్మ. గాసామ్మవ్వకు ఇల్లు లేదా... గా లచ్చుంబాయికి ఇల్లులేదా... వాల్లకు ఇండ్లు లేనట్టుగా ఈ వాల్ల ఆడబిడ్డకు

ఇల్లు లేదు.. పట్వారి ఎట్ల రాసిచ్చిండు "కుక్కకు బొక్కేత్తే కోరుక్కుంట ఉంటుంది. వాల్లడి వాల్లకు ముట్ట జెప్తుయిపోయే అన్నది బుచ్చమ్మ.

**క్షౌరశాల :**

క్షౌరశాల కథలో మంగళి వృత్తి వారి జీవన విధానం, సమాజంలో వారు ఎదుర్కొంటున్న నిందలు. శ్రమదోపిడి ఆగ్రకులాలవారు వీరిని చిన్న చూపు చూడుట మొదలైనవి ఇతివృత్తంగా ఈ కథ వుంటుంది. ఈ కథలో ముఖ్యమైన పాత్ర 'మంగళి దుబ్బయ్య' ఆ వూరిలో విగ్రహాల ఆవిష్క రణకు అయిన ఖర్చులు కుటుంబాల వారిగా ప్రజలు చెల్లిస్తున్నారు. దుబ్బయ్య చెల్లించక పోవడంతో పెద్ద మనుషులు ఊరందరి సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి దుబ్బయ్యను మందలించారు. అందులో ఒక పెద్ద మనిషి 'దుబ్బా...! నిన్నేప్పుడన్న చిన్న చూపు చేసినా మురా..? అంటాడు. ఆ మాటలకు దుబ్బయ్యే తన మనసులో ఇన్నాళ్ళ జీవితంలో తనను సాటి మనిషిగా ఏనాడు చూల్లేదు. మంగళోడిని అనుమానించారు. తనను నీచ మానవునిగా పరిగణించారు. ఎంతో సేవచేయించు కొని ప్రతిఫలం ఇవ్వకుండా దోచుకున్నారు. ప్రతిరోజు ఉదయమే తనకల్పన జబ్బకు వేసుకుని ఊల్లోని వ్యక్తు లకు ఎవరెవరికి క్షౌరం పెరిగింది, గడ్డం పెరిగిందో తెలుసుకోని వారి ఇంటికి వెళ్ళి వారి గడ్డం తీసివాడ్ని, క్షైరం తీసేవాడ్ని వారి పెరిగిన గోళ్ళ తీసేవాడ్ని, తల, శరీరం మాలీస్ చేసేవాడ్ని. ఇంకా చేస్తునే ఉన్నా తనను అశుభ్రుడుగా భావంచేవారు. అయినా నిన్నెప్పుడున్నా చిన్న చూపు చూసినాముర? అన్న పెద్ద మనిషి మాటలు దుబ్బయ్యను బాధించాయి. దుబ్బయ్య భార్య రాజమ్మ ఈమె మంత్రిసాని తనం చేస్తే తనకేమెచ్చివారో పెద్ద మనుషులకు ఈ విధంగా తెలిపింది.

"ఊల్లో కడుపుతోనున్న ఆడోళ్లకు కంటి రెప్పోలే కావలుండి కాన్పుకైత్తిమి. పుట్టంగనే బొడ్డుగోసి తల్లి, పిల్లలను బతికిత్తిమి. మాయినిముంతవేసి కుక్కలు తింటే ఎర్రిలెత్తదని కుక్కలకు దొరకకుంటదాసి పెడితిమి. పెయిపుండైన పచ్చి బాలింతకు పెయ్యంత పసుపునూనె రాసి నీళ్ళల్ల అయిలాకు, తక్కల్లాకేసి కాగవెట్టి తానంబోసి పెయిల నొప్పులు పోగొడితిమి. పురుడునాడు తల్లి పిల్లను నడిమంచంలో కూసండబెట్టి ఎల్లిపాయల దండగుచ్చి ఇద్దరికి మెడలో వేసి నిండ దుప్పటి కప్పి అరుసోల (తవ్వ)లో ఆటాణ బిల్లచేసి ఆరుసోలను కిందికి మీదికి ఊపుకుంట' పాములా పాకులాడు. కప్పోలే దూకులాడు బుడు బుడు బుడుక్ అనుకుంట మంచం చుట్టు దుంకుకుంట తిరుగుదంటిమి. ఆడపిల్ల పెద్దమనిషి (రజ స్వల) అయిననాడు కాళ్ళగొల్లు తీసి తానం పోత్తిమి ఇంతజేత్తి మాకేమిచ్చింద్రు ఓనూరో, యాబయో రూపాయలెత్తురు కొందరు తక్కోదరది సేర కొందురు. మీరెంతిచ్చినా తీసుకున్నాం ఏనాడు గిన్నియ్యుంద్రని అడగలేదు అన్నది రాజమ్మ. ఇందులో కులవృత్తుల వారి సమస్యలను వివరించడం జరిగింది.

**ముగింపు :**

జాతశ్రీ, నేరెళ్ళ శ్రీనివాస్‌గౌడ్ రచయితలు స్ఫూర్తిదాతలుగా నిలిచారు. తెలంగాణ కథా సాహిత్యానికి నిరుపమాన సేవలందించిన సుప్రసిద్ధ కథకులు వీరు. తెలంగాణ మధ్య తరగతి జీవితాల్లోని మందహాసాన్ని మంచి చెడులను తమ కథల్లో ఆవిష్కరించి తెలంగాణ సాహిత్యానికి ప్రాణం పోసిన కథకులు వీరు. సమకాలీన మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబిస్తూ సామాజిక సమస్యలకు దర్పణం పట్టే కథలనేకం రచించారు. తెలంగాణ సాహితీ లోకంలో కథలు రాసిన విశిష్ట కథకులు. కథా ప్రపంచాన్ని సుసంపన్నం చేశారు. సామాజిక వ్యక్తిత్వాలను గూర్చి వైయక్తిక దృష్టితో మధ్య తరగతి జీవన వైవిధ్యాలను తెలంగాణలో ప్రత్యేకించి ప్రాంతీయ వాసనలతో కథలు రాసి మానవతా వాదులుగా నిగర్వులుగా, నిరాడంబరులుగా సహృదయులుగా సహృదయ చక్రవర్తులుగా వీరు చరిత్రలో నిలిచిపోయారు.

**ఆధార గ్రంథాలు :**


1. జాతశ్రీ - ఆర్తారావం కథా సంపుటి - ప్రథమ ముద్రణ మార్చి, 2009,
2. క్షౌరశాల-నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ : పేదోళ్ళ బతుకులు కథా సంపుటి, జనవరి, 2006.
3. డా॥. పంతంగి వెంకటేశ్వర్లు, తెలంగాణ తెలుగు కథ, తెలుగు విభాగం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్, 2011.
4. డా॥. ఎం.దేవేంద్ర, తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ (1990-2010), చందన మారోజు పబ్లికేషన్స్, తార్నాక, హైదరాబాద్, 2021.
5. జి. గిరిజామనోహరబాబు, కథకు శతమానం, కథానికా సాహిత్య వ్యాసాలు, గన్నమరాజు ఫౌండేషన్, విజయనగర్ కాలనీ, హనుమకొండ, 2012.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*



# కరీంనగర్ జిల్లా కథల్లో సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ

**(బి.వి.ఎస్.స్వామి, పెద్దింటి అశోక్ కుమార్ కథలు)**

**డా॥. జ్యోతి అనుగుల**
అధ్యాపకురాలు, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A): 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

ఆధునిక తెలంగాణ సాహిత్యంలో అత్యంత ప్రజాధరణ పొందిన సాహిత్య ప్రక్రియ కథ. వ్యక్తీకరణకు చక్కని మార్గం కావడంతో నేటి సాహిత్య యుగంలో కథకు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతూ ఉంది. సమకాలీన సమాజంలోని అతి సూక్ష్మ విషయం నుండి అతి స్థూలమైన విషయాలను అభివ్యక్తీకరించడంలో కథ ముందున్నది. ఈ కథలు ధారావాహికాలుగా, సంపుటాలుగా సంకలనాలుగా నేడు ఆవిష్కరించ బడుతున్నాయి. ఈ కథలు తెలంగాణ ప్రజల సాంఘీక, ఆర్థిక సాంస్క ృతిక, రాజకీయ సంబంధ విసయాలను కొంత వరకు సమగ్రంగా అధ్యయనం చేస్తున్నాయి. తెలంగాణ ప్రజల జీవన విధానాలను, వారి మనస్తత్వాలను, ఆచార వ్యవహారాలను, కథల సంబంధ విషయాలను ఈ తెలంగాణ కథలు కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

అస్థిత్వ ఉద్యమాలు నేపథ్యంలో ఒక ప్రాంతం ఒక సాహిత్యాన్ని, సంస్క ృతిని తరిచి చూసుకుంటూ, పునర్విశ్లేషణకు పూనుకున్న సందర్భమిది. కనుకనే తెలంగాణలోని కథా సాహిత్యం మీద మరింత లోతుగా, విస్తృతంగా పరిశోధనా దృష్టితో విశ్లేషణలు చేస్తున్న కాలంలో ఉన్నాం, ఈ నేపథ్యంలోనే కథా ప్రక్రియకు సంబంధించి తెలంగాణలో జరిగిన సామాజిక కృషిని చూసినప్పుడు తెలంగాణ కథా విస్తృతి తెలుస్తుంది. ఈ వ్యాసంలో బి.వి.ఎన్.స్వామి, పెద్దింటి అశోక్ కుమార్ కథలు తెలంగాణ కథా వికాసానికి తొర్పడ్డాయి.

**కీలక పదాలు :**

కథానిక, మానవత, సాంస్క ృతిక చిత్రణ, కులవృత్తులు, మధ్యతరగతి జీవనం, వాస్తవికత, ఆర్థిక సంబంధాలు, ప్రాంతీయత, గ్రామీణ వ్యవస్థ, ప్రపంచీకరణ.

**ప్రవేశిక :**

సమాజ ప్రతిబింబమే సాహిత్యం. సమకాలీన సమాజానికి దర్పణం పడుతుంది సాహిత్యం, అనుభవాల నుండి, జీవితాల నుండి, సమాజ మూలల నుంచి వచ్చే సాహిత్యమే గొప్ప సాహిత్య మవుతుంది. జీవిత సంఘర్షణలోంచి వచ్చిన సాహిత్య విలువలను కలిగి ఉన్న సాహిత్యమే ప్రజలను చేరుతుంది. 'సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు' అన్న కొడవగంటి కుటుంబరావు మాటలు జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసర ముంది. ఇందులో ప్రాచీన సాహిత్యం నుండి నేటి వరకు ఎందరో కవులు తమ కవిత్వ పాటవాన్ని ప్రదర్శించారు. ఆధునిక సాహిత్యంలో బాగా ప్రజల గుండెల్లో స్థిరస్థానాన్ని నిలుపుకున్న సాహిత్య ప్రక్రియ కథ.

రచనా వస్తువు సమకాలీనమైన అందులో నాటి సామాజిక పరిస్థితులు మరింత ప్రస్ఫుటంగా ప్రత్యక్షమవుతాయి. సమకాలీన జీవితమే కథలకు వస్తువు కావాలి. కథా వస్తువు వాస్తవికతకు దగ్గరగా వుండాలి. వస్తు స్వీకరణలో వైవిధ్యముండాలి. కథ ప్రధానంగా ఒక పాత్ర చుట్టూ ఒక సంఘటన చుట్టూ, ఒక భావం చుటటూ పరివ్యాప్తంగా వుండేటట్లు రాసినవారు రాయలసీమ కథకులు. మానవ ప్రవర్తనకు అత్యంత సమీపంలో వున్న సాహిత్య ప్రక్రియ కథానిక. కరీంనగర్ జిల్లాలో ఈ తరం తెలుగు కథానికా రచయితలు ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న బి.వి.ఎన్.స్వామి, పెద్దింటి అశోక్‌కుమార్ కథకుల్ని పరిశీలించడమే ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం.

**బి.వి.ఎన్.స్వామి కథలు సామాజిక సాంస్కృతిక జీవన చిత్రణ :**

ముఖ్యంగా ఉపాధ్యాయవృత్తిలో ఉన్న రచయితకు నేటి విద్యావిధానం, ప్రభుత్వపథకాలు, ప్రైవేటు విద్య, మొదు లైనవాటిలో ఒక మంచి అవగాహన కలి ఉందనడానికి నిదర్శనమైన కథలు ఉన్నాయి. అందుకే ఈ విషయంపై ఓ మూడు కథలు కన్పిస్తాయి. 'పరిగడుపు'. కథలు ఇదే విషయాన్ని ప్రతిపాదిస్తూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రిడ్జి స్కూళ్లు తద్వారా పిల్లలు బాగుపడడం మాట అటుంచి, బాలనేరస్థులుగా అయ్యే స్థితులను చిత్రించాడు. పక్కదారి పడుతున్న ప్రభుత్వపథకాలకు 'సవాలు' విసిరే కథ, అందుకే అందులో ఓ పాత్ర ద్వారా "అందరికీ బడి కన్నా, అందరికీ బువ్వ, అంటే బాగుండేది సార్" అనిపిస్తాడు. 'ఉచ్చు' కథలో ప్రైవేటు బడుల ముందు తమకు తామే తోక ముడిచే స్థితిని కల్పిస్తున్న వైనం ప్రభుత్వం పనితీరు చక్కగా విడమరిచాడు.

ఉద్యోగానికి సంబంధించిన కథల్లో నిరుద్యోగవ్యవస్థకే కాక ఉద్యోగం చేస్తున్న వాళ్ల స్థితిగతులు వర్ణించబడ్డాయి. 'కరివేపాకు' కథలో ఆర్టీసీని గురించి, సహేతుక విమర్శ చేస్తూనే కండక్టర్ల జీవితాలకు దర్పణం పడుతూ మోహన్ వంటి నిజాయితీ గల కండక్టర్లు ఎలా బలి అవుతున్నారో విశదపరుస్తాడు. అదే విధంగా 'మథనం' కథలో ఉద్యోగ ప్రాప్తి కోసం నేడు పడుతున్న నిరుద్యోగుల పాట్లు, ఆ సమయంలో ఆధిపత్యం చెలాయిస్తున్న బంధుత్వాలు పైరవీలు విడమరుస్తూ 'సమాజంలోని మానవ సంబంధాలన్నీ ఆర్థిక - ప్రాతిపదిక పైనే ఏర్పడ్డా" యన్నది నిర్ధారిస్తాడు.

అద్భుతంగా 'మానవీయత' కరువవుతున్న గుర్తుకు 'కరవు' అనే కథను తీసుకోవచ్చు. పల్లె నుంచి పట్నం వచ్చి అన్ని హంగులతో నాగరికత పెంచుకుంటున్న పెద్దలు, తమతో పాటే వచ్చిన పేదవాళ్లను మరిచిన సంగతి హృద్యంగా మలచబడింది. దయాదాక్షిణ్యాలున్న ఒకప్పటి ఆ జనమే, పిల్చి అన్నం పెట్టి ఆదుకున్న చేతులే, ఇవ్వాళ మిగిలింది రేపటి కోసం ఫ్రిజ్‌లో దాచుకునే నాగరికత పెంచుకుని మానవీయతకు దూరమయిన వైనం సంభాషణల ద్వారా చక్కగా వెలిబుచ్చాడు.

శ్రామిక జీవితాలను వివరిస్తూ కొన్ని పరిశ్రమలు ప్రపంచీకరణ విధానం వల్ల ఎలా మూతకు దారి తీస్తున్నాయో సహేతుకంగా వివరిస్తూ, అందులో పనిచేసే వారు తమంత తామే వి.ఆర్.ఎస్.ను వరించాల్సిన స్థితులు ఎలా కల్పించబడుతున్నాయో, ఆ 'చక్రబంధం'లో ఉద్యోగులు ఎలా ఇరుక్కుపోతున్నారో వివరిస్తాడు.

అగ్రకులాల వారి జీవితాల్లో కూడా అంతటా అనుకున్నంత సౌఖ్యం ఏం లేదు. అన్నదానికి నిదర్శనంగా 'వలస' కథలో గుండయ్య వంటి పాత్రల సృష్టిని, సూక్ష్మదృష్టితో చూస్తే గాని అవ గాహన కాదు. ఆశతో, బొంబాయి వెళ్లిన ఆయన తీరని కోరికలు, అంతమయిన జీవితం. అదొక పార్శ్వం ఊహించనది కనిపిస్తుంది. అయితే "జీవితం మన చేతిలో లేదు. భగవంతుడి చేతిలో కూడా లేదు" వంటి కొంత తేల్చిచెప్పని వ్యవహారం కొరుకుడు పడదు.

'ఏది ఏమయినా 'నెలపొడుపు' సంకలన శీర్షిక కథలో తెగింపు గల ఆడజీవితం ఒక కొలిక్కి వస్తుందని నిర్ణయిస్తూ శారద పాత్రను మలిచాడు. భర్త చనిపోయిన, ఒంటరి అడది. అటు తల్లిగారింటికి, ఇటు అత్తగారింటికి కాకుండా పోయినప్పుడు, ఆసరాగా తనకు అనుకూలుడైన మగాడిని అనుసరించడంలో తప్పు లేదన్నట్లుగా సూచించాడు. ఈ కథలో కొంచెం చలం వంటి ఆదర్శం అటు వైపు మొగ్గ చూపుతున్న రచయిత ధైర్యం కనిపిస్తుంది.

'పరంపర' కథలో కాస్త కవితాత్మను వెలిబుచ్చే కథాకథనంతో రచయితలో కవి లక్షణాలు కూడా ఉన్నాయని పించుకుంటాడు. ఇంకా పోలీసుల జీవితాలు రైతుల జీవితాలు, మొదలైన కథలు చిన్నవైనా స్పందింపజేసే సంఘటనలతో ఆలోచింప జేయగలిగే కథలున్నాయి.

'తెలంగాణా'వాదం ప్రబలుతున్న ఈ దినాల్లో ఆ ప్రాంతీయ భాషను బాగా వాడుకొని, ప్రాంతీయంగా చలామణిలో ఉన్న"జాజిరి" పాటలు, పూర్తి పాఠంతో పరిచయం చేస్తూ, "నాగేటి చాళ్లను తెలంగాణా" వంటి గేయాలతో, అనేక తత్వాలు కథలో చొప్పించి కథలకు మంచి ఆసక్తిని కలిగించే లక్షణాలను జోడించడం ఈ రచయిత ప్రత్యేకత. దానితోపాటు నిశితపరిశోధనాలక్షణం కూడా ఉన్నదని నిరూపించుకున్నాడు.

ఏది ఏమైనా, ప్రథమప్రయత్నంలోనే మంచి కథాసంకలనాన్ని అందించిన స్వామి ముందు ముందు స్త్రీవాద, దళి తవాద, కథలపై కూడా దృష్టి నిలిపి తన రచనావ్యాసంగాన్ని కొనసాగిస్తాడని ఆశిద్దాం. తన చుట్టూ కనిపించే అనేక వైరుధ్యాలు బి.వి.ఎన్.స్వామిని ఆలోచనల్లో పడేశాయి. ఆసలేమిటిదంతా ఈ లోకం ఎందుకిట్లా తలకిందులుగా ఉంది. అంతా సవ్యంగా సజావుగా ఎందుకు లేదు. ఎప్పుడో ఒక్కలా, ఒక్కటిలా ఎందుకుంట లేదు...? వ్యక్తులుగా మనుషులు మొత్తంగా సమాజం అర్థం కాని, అర్థంలేని సంక్షోభంలో ఎందుకు పడిపోతున్నారు. ఈ ప్రశ్నల్నించి జవాబులు వెతుక్కునే ప్రయత్నంలోనే స్వామి కథలు రాయడం ప్రారంభించాడు. అలా వెతుకులాటలోంచి అర్థమయిన, అర్థమవుతూ ఉన్న విషయాలతో రాసిన కథల సమాహారమే ఈ నెలపొడుపు. ఇందులో 17 కథలున్నాయి. కన్ఫ్యూజన్లోంచి క్లారిటీ వైపు సాగుతున్న స్వామి కథలను వాస్తవికతను ఆశించే సహృదయ పాఠకులు చదవాల్సిందే.

బి.వి.ఎస్.స్వామి కథారచన గ్రామీణ వాతావరణం చుట్టూరా అల్లుకుంటుంది. ఆయన రాసిన కథల సమాహారం 'నెలపొడుపు'. ఈ కథల్లో ఒకటి 'దేవులాట'. ఈ కథలో' నారాయణకు పని ఉండదు. పనిలేని నారాయణ ఊరవతల ఉంటాడు. అటు సన్నాసి కాదు. ఇటు సన్యాసి కాదు. అందరూ హీనంగా, దీనంగా చూస్తారు. ఊళ్లో వాళ్ళతో కలివిడిగానే ఉంటాడు మళ్లీ. ఊరవతల పాడుబడ్డ గుడి దగ్గర ఇతని నివాసం. ఆ గుడిలో పూజా పునస్కారాలు ఎప్పుడో పోయాయి. అయితే ఎవరో ముఖ్యమైన వాళ్లు వచ్చారని పాత పూజారి ఆ పాడుబడ్డ గుళ్లోనే దీప, ధూప, నైవేద్యాలు సాగిస్తాడు. ఈ ఘట్టం అయిన తర్వాత సోమరి నారాయణలో ఓ కొత్త ఆలోచన వస్తుంది. ఇటువంటి గుడినే ఊళ్లో కడితే ఎలా ఉంటుందని. ఈ ఆలోచనతో దశ తిరుగుతుందనుకుంటాడు. ఊళ్లో గుడి వెలుస్తుంది కానీ నారాయణ ఆ ఆలయం ముందు పాన్ దుకాణానికి ఓనరుగా స్థిరపడిపోతాడు. రాంరెడ్డి అనే ధనికుడి గుడి యాజమాన్యం స్వీకరిస్తాడు. తన అనుచరులు ట్రస్టుసభ్యులు. గుడి ఆదాయం, నిర్వహణ అంతా వారిదే. నారాయణది ఆలోచనే కాదు, గుడి నిర్మాణసేవ అంతా అతనిదే. రాంరెడ్డిని అప్పటికీ నారాయణ అడుగుతాడు-తాను పూజారిగా ఉంటానని. రాంరెడ్డి 'నీవేమైనా పురోహిత వంశానికి చెందినవాడివా ! మంత్రాలు, హారతులు, దీపారాధన ఇవ్వన్నీ

నీకెట్టా వస్తాయ్' అంటాడు. గుడి పూజారిగా పాత గుడి పూజారి కొడుకు నియమితులవుతాడు. ఆలోచన నారాయణది. రాంరెడ్డి, పురోహితుడు ఇంకా డబ్బున్న మోతుబరులు ఆ గుడి యాజమాన్యం, ఆదాయం అనుభవిస్తుంటారు. ఈ కథలో ప్రధాన అంశం జనంలో ఉన్న మూఢ భక్తి. నీవు ఏం చేస్తావన్నా సహకరించరు. ఒక గుడి కడతామంటే ముందు కు వస్తారు. ఎవరు ఎలా ఆలయ సొమ్ము దోచుకున్నా నారాయణ వంటి సోమరివానికి పాన్ షాపు ద్వారా ఒక పని దొరికింది మన గ్రామీణ సామాజిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నది మతం, విగ్రహారాధన, మూఢభక్తి తత్సంబంధితాలు. నారాయణ ఆలోచన కూడా ఎలాంటిదో చూడండి. కష్టించి పనిచేయాలని కాక, దేముడి పేరిట ఆలయం ద్వారా డబ్బు సంపాదించాలని భావించాడు. ఒక చిన్నకథ లో నారాయణ పాత్రలో ఎన్నో విషయాలు చెప్పారు రచయిత. సందేశం మూఢభక్తి వద్దు. మతం ద్వారా తేరగా డబ్బు సంపాదన ఆలోచన అటు రాంరెడ్డి, ఇటు నారాయణ వంటి వారి నుంచి తొలగించాలి.

**పెద్దింటి అశోక్‌కుమార్ కథలు – సామాజిక వాస్తవికత :**

పెద్దింటి అశోక్ కుమార్ 1999లో కథకుడిగా సాహిత్యరంగ ప్రవేశంచేసిన పెద్దింటి అశోక్ కుమార్ మొదటికథ ఆశ, నిరాశ, ఆశ కథ ఆంధ్రప్రభలో ప్రచురించబడింది. ఇప్పటి వరకు 180 వరకు కథల్ని అశోక్ కుమార్ వ్రాశారు. ఈయన మస్కట్ వలసల మీద ఎన్నో కథలు వ్రాయడమే కాకుండా 'వలస పక్షులు' అన్న కథా సంపుటాన్ని వెలువరించారు. ఎడారి మంటలు, ఊరికి పువ్వులం, జిరిగి దాడి, సంచారి వంటి నవలలు వ్రాసిన నవలాకారుడు. ఆయన నవలల్లో సామాన్యుల వెతలు, జీవన పోరాటం వంటి వాస్తవిక కోణంలో ఆవిష్కరించారు.

**కాగుబొత్త :**

నైపుణ్యంతో కూడుకున్న మరో కులవృత్తి కుమ్మరివృత్తి. ఇది చాలా శారీరక శ్రమతో కూడుకున్న పని. మట్టిని తవ్వి తెచ్చి, జల్లించి, నాన్చి, దాన్ని బాగా తొక్కి ఆరబెట్టి, ముద్దజేసుకుని, సారెపై వేసి తిప్పుతూ కుమ్మరి కుండలు, కాగులు చెయ్యాలి. ఇంత చేసినా ఫలితంగా దక్కేది మాత్రం స్వల్పమే. అందులోనూ నీళ్ళ ప్యాకేట్ల వ్యాపారం, స్టీలు బిందెలు వంటివి వీరి పొట్ట గొడుతున్నాయి. పెద్దింటి అశోక్ కుమార్ గారి కాగుబొత్త కథ ఈ కుమ్మరి బతుకులకు అద్దం పడుతుంది. ఈ జాతర చేయవటఇలా చాకళ్లకు, గ్రామంలోని ఇతర కులాలకు మధ్య రేగిన విధానాన్ని వివరిస్తుంది. కుమ్మరి కులవృత్తిలో ఎదుర్కొన్న సమస్యల గురించి కాగుబొత్త కథలో కుమ్మరి బ్రతుకుల యదార్థ జీవిత యదార్థ గాథ చిత్రించారు. తన భూమిలో కుండలు చేసుకుంటానికి మట్టిని తవ్వుకోవడానికి కూడా హక్కు లేని దుర్మార్గపు పద్ధతి చిత్రించడం జరిగింది.

వ్యవసాయం ద్వారా పండించిన గింజల్ని ఆహారయోగ్యంగా మార్చుకోవటానికి ముఖ్యమైంది కుండ. గింజను కూడుగా మార్చేది కుండ. కూడుకు ఇంటికి ఉన్న గాఢమైన బంధం కూరాడు. కూరాడు కూడుపెట్టే దైవం. అందుకే ఇంట్లో ఏ ప్రత్యేక వంటకమైనా ముందు కూరాడుకు పెట్టిన తర్వాతే ఇతరులకు. తెలంగాణ సంస్కృతిలో 'కూరాడు కుండ' ప్రత్యేక స్థానం కలిగి ఉన్నది. ఆ కుండను రూపొందించేది కుమ్మరి. వంటకు అవసరమైన రకరకాల పాత్రలు కుమ్మరి తయారు చేస్తాడు. బువ్వకుండ, పాలపటువ, పెరుగుబుడ్డి, కూరయెసల, దీపంత, కంచుడు ఇట్లా ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క పేరు. వంటకు మాత్రమే కాదు. ఇంటికీ, పెండ్లికీ ఐరేని కుండలు ప్రాధాన్యమైనవి. పొలంబోనం, పోశమ్మబోనం, అన్నిటికీ కుండలు, గురుగులు అవసరం. ఇంటి కప్పుకు పెంకులు, నీటి నిల్వకు గోలెం, ధాన్యం నిల్వకు గాజె. సంప్రదాయక సంస్కృతిలో కుమ్మరిస్థానం పవిత్రతను కూడా సంతరించుకున్నది. ఈ మట్టి పరిశ్రమను లోహం దెబ్బతీసింది. స్టీలు, ఇత్తడి పాత్రలు ఇప్పుడైతే ప్లాస్టిక్ పాత్రలు మట్టి పాత్రల్ని రద్దుచేసినయం ఘోరంగా వృత్తిని కోల్పోయిన వాడు కుమ్మరి. ఆధునికీకరణకు అవకాశమేలేని వృత్తయిపోయింది.

**తెగిన బంధాలు :**

'తెగిన బంధాలు' "కులవృత్తులు ఈనాడు కాదు ఏనాడో పోయినయి కనీసం పెండ్లితో ముడిపడ్డ ఒకటి రెండు పనులైనా పట్టణాల్లో ఎప్పుడో పోయినాయి అవి ఇపుడు పల్లెలో కూడ".అన్న వాక్యాలు గ్రామాలలో వస్తున్న మార్పును సూచిస్తున్నాయి. యాంత్రికత పెరిగిపోవడం, అదీ చౌకగా పని ముగిసిపోవడంతో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. మానవీయ సంబంధాలకు పెట్టనికోటగా ఉండే పల్లెటూర్లలోకి కూడ ఈ ఆర్థిక సంబంధాలు చొరబడి, మానవ సంబంధాలను దెబ్బతీశాయి. దీనితో చేనేత కులవృత్తులకు ఆదరణే లేకుండా పోయింది.

**చాకిరేవు :**

'చాకిరేవు'లో ప్రత్యేకంగా చాకలి వారి గురించి చిత్రించారు. ఇందులో చాకలి బాలయ్య ప్రధాన పాత్ర. బాలయ్య భార్య ఆరోగ్యం బాగుచేయించడం కోసం ఆ ఊరి మోతుబరి కిషన్ రావ్ దగ్గర కొన్ని పైసలు తీసుకుంటాడు. ఈ బాలయ్య కిషన్‌రావ్ ఇంటి బట్టలు ఉతుకుతాడు. ఆ పైసల అప్పుతేర్పడం కోసం రజక సంఘం ఊరి బట్టలుతకడం స్ట్రైక్ చేసిన బాలయ్య మాత్రము ఆపడు చివరకు కిషన్ రావ్ బాలయ్యను ఊరి నుంచి వెలివేయాలని అన్నప్పుడు కళ్ళు తెరిసి సంఘంలో కలుస్తాడు. ఊరి దొరల మోసపూరిత విధానాన్ని పసిగడుతారు. అట్లే పెద్దింటి అశోక్ కుమార్ 'వెలి', 'తెగిన బంధాలు' చాకలి వృత్తి నేపథ్యంతో వచ్చిన కథలు. "కులవృత్తుల వారిలో ఏ మాత్రం చైతన్యం కనిపించిన ఊరి పెద్దలు భరించలేరని 'వెలి' కథ తెలియజేస్తుంది. ఇందులో చదువుకున్నవారు చాకలి పని చేయనంటే ఊరిలోని పటేండ్లు కుట్రపన్ని నానా హింసలు పెడతారు. ఇంట్లో వాళ్ళ, కులపోళ్ళు వారికి లొంగిపోయినా ముసలి రామయ్య ఎదిరించడానికి నిలబడి 'వెలిని' ధిక్కరించడం అపూర్వమే.

**ఇసం మింగిన మనిషి :**

'పెద్దింటి అశోక్ కుమార్ ఇసం మింగిన మనిషి కథలో' సాకలి ఆశాలుకు, గౌడులకు మధ్య పెనవేసుకున్న బంధంలో వారి స్వార్థమున్నది. వారు ఆశాలును తన స్వప్రయోజనాలకై వినియోగించు కున్నారు. బక్క పల్చని ఆశాలు కల్లు రుచి చూసి ఎలాంటిదో చెప్పడంలో నేర్పరి. ఏ చెట్టు ఎలాంటి కల్లు పారుతుందో చెప్పేవాడు. తాగు బోతులకు రుచిగల కల్లును అందించడంలో గౌడులు ఆశాలు సాయం తీసుకునేవారు. 'సిరిసిల్ల' నేత బట్టలుక, 'నీలోజుపల్లె' కూరగాయలకు, 'మల్లారెడ్డిపేట' కల్లుకు పేరెల్లింది అని రచయిత చెప్పడంలో ఉద్దేశం ఈ ప్రాంతం గంభీరావు పేట మండలంలోనిదని తెలుస్తుంది. రచయిత తీసుకున్న కథ ఇతివృత్తం వాస్తవానికి అతి దగ్గరగా ఉన్నది.

**వెలి – పెద్దింటి అశోక్‌కుమార్ :**

అశోక్ కుమార్ కథ 'వెలి' ఈ 'వెలి' కథలోని 'మన ఇండ్లల్ల సచ్చినా బతికినా వాళ్ళకు పండుగనే. ఒక్క మేకను కోస్తే కాలు తలకాయ అర్రల బొత్త మాదేనంటారు. చిన్న కార్యమైనా కట్నాలంటారు. పొద్దుమాపు అన్నం అడుక్కపోతారు. ఏ పండగొచ్చినా కూరలు, కల్లుసీసలు, అప్పాలు ఇచ్చుడేనాయొ, ఆరు నెలలు గడిస్తే పంటపండినా పండకపోయినా జంటకు ఇద్దుడు వడ్లు పెట్టుడేవాయొ, ఇట్ల పెట్టినా ముక్కిటుమూతిటు" అన్న వాక్యాలు జీవనోపాధికి ఏర్పడ్డ పరస్పరాధారిత వ్యవస్థను కొన్ని కుటుంబాయి ఎలా దుర్వినియోగ పరుచుకుంటున్నాయో తెలుస్తుంది. గ్రామంలోని ఎవరింట, అశుభమైనా జరిగే కార్యక్రమాల్లో చాకళ్ళకు వాటా ఉంటుంది. వ్యవస్థను గౌరవిస్తూ నమ్మకాలను పాటిస్తూ ఎవరైనా పిలిస్తే కట్నాలంటూ వారిని వేధిస్తే మళ్ళీ తమను పిలవరని, మెల్లగా అది పరస్పరాధారిత వ్యవస్థకు శరాఘాతమౌతుందని ఆయా వర్గాలు గ్రహించడం లేదు.

**ముగింపు :**

తెలంగాణ ప్రజలు గ్రామ ప్రజల కష్టాలను బాధలను బాగా తెలిసినవాడు రైతు కష్టాల్లో పుట్టి పెరిగి మరణిస్తున్నాడు. ఇక్కడి సేద్యం చాలా శ్రమతో కూడుకున్నది. తగిన ఫలితం దొరకలేదని తన కథల ద్వారా చెప్పాడు. పల్లె ప్రజల జీవితాల్లోని అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన దీపాలు వెలిగించడానికి మతకలహాలు అడ్డుగోడల నిర్మూలనకు, అనాథ స్త్రీలపై అన్యాయంగా అత్యాచారాలను అరికట్టేందుకు వ్యసనాలకు బలైపోయే జీవితాలకు విముక్తికి కథలు రాశాడు.

ఏది రాసినా తెలంగాణ జనజీవన చిత్రణకు అద్దంపట్టేవే ఈ కథల్లోని సారాంశం తెలంగాణ ప్రజల నిరంతర కరువుతో బాధపడే అంశాలను కరువుకు గురైన గ్రామ ప్రజల జీవితాలను వారి దయనీయమైన స్థితిని తన కథల్లో హృదయ విదారకంగా చిత్రించాడు. తెలంగాణ ప్రాంతంలో ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన కథలు రాసిన సాంఘిక సామాజిక జీవనానికి అద్దంపట్టే కథలను రాసారు. అట్టడుగు వర్గాల, బడుగులవర్గాల ప్రజల స్థితిగతులను ఆకళింపు చేసుకొని కథలు రాసిన రచయితలు బి.వి.ఎన్.స్వామి, పెద్దింటి అశోక్‌కుమార్. రచయిత శిల్పి అయితే వస్తువు ఒక బండరాయి శిల్పి తన పనితనంతో బండరాయిని అందమైన శిల్పంగా తీర్చిదిద్దినట్లే రచయిత మనిషి జీవితంలో జరిగిన సంఘటనను గానీ, సమస్యనుగానీ, వస్తువుగా తీసుకొని తన రచనా నైపుణ్యంతో అందమైన కథగా మలుస్తాడు. వీరి కథలు వాస్తవానికి దగ్గరగా వుండి ప్రజల స్థితిగతుల్ని సమాజస్థితి గతుల్ని గ్రామీణ జీవితాన్ని, తెలంగాణ కడగండ్లో జీవితాన్ని కరువు సమస్యలను తెలియజేస్తాయి. సహజత్వానికి ప్రతీకలుగా ప్రజల ముందు నిలిపారు.

**ఆధార గ్రంథాలు :**


1. డా॥. బి.వి.ఎన్.స్వామి, కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 2020.
2. డా॥. బి.వి.ఎన్.స్వామి, వివరం- కథా సాహిత్య వ్యాసాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2011.
3. జి.గిరిజామనోహరబాబు, కథకు శతమానం, కథానికా సాహిత్య వ్యాసాలు, గన్నమరాజు ఫౌండేషన్, విజయనగర్ కాలనీ, హనుమకొండ, 2012.
4. డా॥. పంతంగి వెంకటేశ్వర్లు, తెలంగాణ తెలుగు కథ, తెలుగు విభాగం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్, 2011.
5. కాగుబొత్త -పెద్దింటి అశోక్‌కుమార్ ఊటుబావి, కథా సంపుటి, 2005.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలంగాణ సంస్కృతి, సామాజిక దృక్పథ కథలు

## (తుమ్మేటి రఘోత్తమరెడ్డి, బి.ఎస్.రాములు కథలు)



డా॥. సి.హెచ్. శేఖర్
Inspector of police, Kukatpally, Ph :712596926.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A): 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాససంగ్రహం :**

తెలంగాణ కథా సాహిత్యం భండారు అచ్చమాంబతో ప్రారంభమై చాలా కాలం మందగమనంగానే నడక సాగించింది. దానికి కారణం తొలిరోజుల్లో కథకులు పరిమితంగా వుండడం వల్ల నేడు కథా సాహిత్యం స్థిరంగా ముందడుగు వేసుకుంటూ పురోగమిస్తుంది. "ఇరులు నిశాసతి భుజములెక్కి శిరమ్మున నిక్కి తారకా తరుణి కపోలపాళికలు తాకినట్లు " తెలుగుకథ మధ్య తరగతి మేథావి జీవితం చుట్టూ తిరిగి తిరిగి శ్రామిక జన జీవితంలోకి చొచ్చుకు వెళ్ళి నగర పట్టణాల్లోంచి గ్రామాల్లోకి అక్కడనించి కొండ కోనల్లోకి అడవి గుండెల్లోకి అడుగు పెట్టంది. అయితే ఈనాడు మంచి కథలు అంతగా వెలువడడం లేదనే అభిప్రాయం చాల మందిలో ఏర్పడి పోయింది. "కుండెడు చల్ల చిలకరిస్తే వచ్చేది దోసెడు వెన్న మాత్రమే, దాన్ని మరగబెడితే పురిసెడు నెయ్యి చేతిలో పడేది" అప్పుడు యిప్పుడూ కూడా కథల విషయం ఇంతేనని శీలవీర్రాజు గారు చెప్పినది అక్షర సత్యం. బండెడు కథల్లోంచి మంచికథల్ని పాతిక తీసి ఓపికగా పత్రికల్లో వేయిస్తే వాటిని అందరూ చదవడం సాధ్యం కాక మంచి కథలు పాఠకుల దృష్టికి రావడం లేదు. ఏ కాలంలోనైనా ఏ సాహిత్య ప్రక్రియ లోనైనా ఉత్పత్తి అయినదంతా ఉత్తమ సాహిత్యంగా పరిగణించబడదు. కథను కథా వస్తువు, కథా రూపం అని విభజించవచ్చు. అంటే కథా వస్తువు మాత్రమే కథ కాదు, వస్తువుకు అనుగుణమైన రూపం కుదరినప్పుడు మాత్రమే మంచి కథ రూపొందుతుంది. కథా వస్తువును కథగా మార్చేది రూపమే. దీనిద్వారా పాఠకుడు కథా వస్తువును అర్థం చేసుకుంటాడు. అనుభవిస్తారని తుమ్మేటి రఘోత్తమరెడ్డి బి.ఎస్.రాములు కథలు నిరూపించాయి.

**కీలక పదాలు :**

కథ, కథానిక, ఇతివృత్తం, వస్తు వైవిధ్యం, పల్లెజీవనం, గ్రామీణ నేపథ్యం, సంస్కృతి, సామాజికత, మానవ సంబంధాలు, ప్రపంచీకరణ.

ప్రవేశిక: సాహిత్య ప్రక్రియల్లో కథా ప్రక్రియ ఉత్తమమైనది. పాఠకుడి అంతరాంగాన్ని నిలవేసి చేష్టల్ని శాసించే శక్తి కథానికకు ఉంది. సామన్య మానవుణ్ణి సమాజాన్ని దృష్టితో పెట్టుకొని మానవత్వపు విలువల కోసం రచయిత శ్రమించినప్పుడే సాహిత్య ప్రయోజనం సార్థకమౌతుంది. దీన్ని బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి తన కథల ద్వారా వస్తువైవిధ్యాన్ని సాధించారు.

బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి తన మీదగాడమైన ప్రభావం చూపిన తెలంగాణ పల్లెల దుస్థితిని ఆయా గ్రామాల్లో జరిగే వివిధ సమస్యలు వీరిని కదలించాయి. మనిషి తన జీవనం కోసం పోరాడటంలోనే అసలైన ప్రేమ ఉందని తన కథల ద్వారా గుర్తించారు. తాను నిరంతరం చూసే నివసించే గ్రామాల్లో రోజు చూసే అవినీతి లంచగొండితనాన్ని కథల్లో చూపించారు తద్వారా పల్లె ప్రజల పట్ల ఆర్తిని అతని కథలు పెంచుతున్నాయి. రచయిత కథలు చదువుతన్నప్పుడు అతనితో పాటు మనము ఆయన గ్రామీణ నేపథ్యంలోకి వెళ్తాం. అయితే మనం పట్టణ జీవితాల్లో కోల్పోతున్నమనుకుంటున్న పచ్చని తనాన్ని వీరు గుర్తు చేయ్యరు. నిర్ధిష్టంగా కొత్తగా వచ్చిన మార్పులను సూచించే వాతావరణాన్ని మనకు చూపిస్తారు. ఇలా ప్రతికథలో ఏదో ఒక స్పృహ ఏదో ఒక సంఘటన అంతస్సూత్రం కనిపిస్తుంది. దీనికి ఉదాహరణగా బి.ఎస్.రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలను పేర్కొనవచ్చును.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అంటారు. అయితే తాను జీవించే సమాజ చిత్రణ తన రచనల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. తాను పుట్టి పెరిగిన వాతావరణం, తనకు ఉన్నటువంటి పరిచయాలు తాను చదివిన నా రచనలు, తాను విన్న ప్రసంగాలు మొదలైనవన్నీ కూడా తన రచనలో ప్రతిబింబిస్తుంటాయి. వాటిని బట్టే ఆ రచయిత దృక్పథం అతని సామాజిక జీవన విధానాన్ని తెలుసుకోగలుగుతాం. ఈ నేపథ్యం నుండే రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలను పరిశీలించడం జరిగింది.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు- విశ్లేషణ: తెలంగాణ విస్తృతంగా కథలు వ్రాసిన కథకుల్లో తుమ్మేటి రఘోత్తమ రెడ్డి ఒకరు. ధిక్కారం సవారి-1,సవారి-2 బొగ్గు పొరల్లో, ఇల్లు, వేటగాడి చూపులు, శత్రువు వంటి ప్రసిద్ధ కథల్ని వ్రాశారు. ఆయన రాజమల్లుతో కలిసి సింగరేణి కార్మికులు ఎలాంటి అన్యాయాలకు గురి అవుతున్నారో చూపించారు. ఆయన 'కార్మిక' అనే కలం పేరుతో కూడా కథలు వ్రాశారు.అలాగే కైతికాల పోశెట్టి అనే పేరుతో 'బండకిందూతుకులు' అనే ఫూచర్ కథలు వ్రాశారు.రఘోత్తమరెడ్డి బడుగు వర్గాల కథల్నే ఎక్కువగా వ్రాసారు. ఆయన వ్రాసిన 'పనిపిల్ల' ఒక చోట పనిపిల్లగా చేరిన ఒక బాలిక కథ. ఈ కథ ఆలోచింపజేసేదిగానే గాక ఒక దుఃఖ దృశ్యాన్ని ఈ కథలో ఆవిష్కరించారు రఘోత్తమ రెడ్డి.

'పనిపిల్ల' కథ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ కథ చదువుతుంటే విభిన్న భావోద్వేగాలకు లోనవుతాం. ఆ రోజు రాత్రి-తాను నిదురించిన గడీలో జరిగిన కరువుదాడిలో 'పనిపిల్ల' కళ్ళలో వెలుగును చూసిన మహేంద్ర మానసిక ఉద్వేగమే' ఈ కథకు ప్రాణం. భార్యను అర్థం చేసుకోవడంలో మహేంద్ర మానసిక స్థితిలోని లోపాలను, జ్ఞాన సముపార్జన ద్వారా జయించాలే తప్ప, మరో మార్గం లేదు. 'పనిపిల్ల' చాలా వివాదాస్పదమైన కథ. హాలివుడ్ మూవీ 'దిలా స్ట్ సమురాయ్'లో హీరో టామ్ క్రూజ్ మాదిరిగా 'పనిపిల్ల' కథలో మహేంద్ర నాగరికుడివలె పట్నం నుంచి వచ్చి, అనాగరిక గిరిజనుల కరువుదాడిని చూసి చలించిపోయి, మనసులో మద్దుతునివ్వడం ఈ కథలో కన్పిస్తుంది. మహేంద్ర కోణంలోంచి సాగిన ఈ కథలో అతని అంతరంగాన చెలరేగే అనేకానేక ఆలోచనలు పాఠకుణ్ణి కూడా చుట్టుముడుతాయి. అందుకే కాబోలు ఈ కథ అంతగా చర్చనీయాంశమైంది.

కథలో పేద వారి బతుకుల గురించి ఆలోచించి, వారి జీవితాలను బాగు చేసే మనుషులుంటారా? స్వార్థంతో నిండి ఉన్న ఈ ప్రపంచంలో నిరుపేదైనా, గొప్పవారైనా వారి బతుకు ఒకే విధంగా ప్రారంభ మవుతుంది. ఆ

తరువాతే మార్పులు మొదలవుతాయి. "పనిపిల్లగా చేరిన పసిపాప సన్నగా, నల్లగా తిండిలేక ఎముకలు తేలి కనిపిస్తుంది. బట్టలు చిరిగి ఉన్నాయి. జుట్టు పరికి కంపలాగా రేగి ఉంది. కళ్లలో ఏ భావముందో కూడా తెలియదు". పేదరికం పాపని అట్లా తయారుచేసింది. విధ్వంసమైన, గాయపడిన గూడెం నుంచి ఆ పాప బయటి ప్రపంచంలోకి వచ్చింది. ఇలాంటి జీవితాలు ప్రపంచీకరణలో కొట్టుకు పోతున్నాయని కథలు, కవిత్వాలు రాస్తున్నాం. రాసే పదాలు, మాట్లాడే మాటలు వారికి చేరుతున్నాయా? అనేదే ప్రశ్నగా మారింది.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథలో పేద వారి బతుకుల గురించి ఆలోచించి, వారి జీవితాలను బాగు చేసే మనుషులుంటారా? స్వార్థంతో నిండి ఉన్న ఈ ప్రపంచంలో నిరుపేదైనా, గొప్పవారైనా వారి బతుకు ఒకే విధంగా ప్రారంభ మవుతుంది. ఆ తరువాతే మార్పులు మొదలవుతాయి. "పనిపిల్లగా చేరిన పసిపాప సన్నగా, నల్లగా తిండిలేక ఎముకలు తేలి కనిపిస్తుంది. బట్టలు చిరిగి ఉన్నాయి. జుట్టు పరికి కంపలాగా రేగి ఉంది. కళ్లలో ఏ భావముందో కూడా తెలియదు". పేదరికం పాపని అట్లా తయారుచేసింది. విధ్వంసమైన, గాయపడిన గూడెం నుంచి ఆ పాప బయటి ప్రపంచంలోకి వచ్చింది. ఇలాంటి జీవితాలు ప్రపంచీకరణలో కొట్టుకు పోతున్నాయని కథలు, కవిత్వాలు రాస్తున్నాం. రాసే పదాలు, మాట్లాడే మాటలు వారికి చేరుతున్నాయా? అనేదే ప్రశ్న...తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన పనిపిల్ల కథలో స్త్రీ తన అస్తిత్వాన్ని కోరుతుందని వసుమతి అనే పాత్రతో మాట్లాడిస్తాడు. మనం కొలిచే గ్రామదేవతలు రోడ్డు పక్కన చెట్ల కింద ఉంటారు.

ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ, ఉప్పలమ్మ తదితర గ్రామదేవతలు వీరంతా. కానీ దేవుళ్లు మాత్రం గుట్టలమీద పెద్ద పెద్ద గోపురాలతో నిర్మించిన గుళ్లలో ఉంటారు. వీరికి నిత్య దీపారాధన జరుగుతుంది. దీన్ని బట్టి నిజమైన అర్థంలో మనిషికి ఉండాల్సిన మానసిక, శారీరక లక్షణాలను స్త్రీ, పురుషులిద్దరూ ఎప్పుడో కోల్పోయారు. ఇవాళ స్త్రీ ఎలాంటి పరిస్థితుల్లో బతుకుతుంది. సమాజంలో ఎట్లా చూడబడుతుందనే ప్రశ్నలకు పరిష్కారం స్త్రీ, పురుషుల ఆలోచనలోంచే పుట్టాలి.

**తుమ్మేటి – సవారీ :**

పూర్వకాలంలో దొర సవారీ కచ్చరంలో కూర్చొని పోతుంటే ఆ బండి వెనకాల, ముందు తక్కువ కులస్థులు ప్రాణాలకు తెగించి బాడీగార్డుల్లా నడవాలి. అవసరమైతే పరుగెత్తాల్సి రావడం ఆచారంగా ఉండేది. అలా దళితులు, చాకలి వారు ఎక్కువగా బలయ్యేవారు. ప్రతాపరావు దొర ప్రయాణిస్తుంటే చాకలి ఓదేలు పరుగెత్తుతూ అలసిపోతాడు. ఓ సమయంలో దూరంగా సంఘపోళ్ళ పాటలు విన్న దొర భయంగా వాణ్ణి బండి ఎక్కిస్తాడు. అప్పుడు వాడికర్థం కాదు సంఘపోళ్ళంటే దొరకు భయమని. దగ్గరైన సంఘపోళ్ళు దొరతోబాటు బండ్లెకూసున్న ఓదేలును చూసి 'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ' అనుకుని నవ్వుకుంటారు. తిరిగి వారెళ్ళిపోయిన క్రమంలో దొర ఓదేలుతో 'దిగురా గాడ్డి' అని తిడతాడు. అప్పుడు గ్రహిస్తాడు ఓదేలు సంఘానికున్న బలమేమిటో దాంతోవాడింక ఆగకుండా సంఘపోళ్ళు వెళ్ళిన వైపుతాను కూడా పరుగు తీయడం దొరను తలదించేట్లు చేస్తుంది. ప్రజలు సంఘబలంతో ఐక్యమైతే దొరలేం చేయలేరని తీర్పునిచ్చిన చక్కటి కథ. ఆనాటి ఆచారాలకే ఓ సవాల్ విసిరింది.

**బి.ఎస్.రాములు కథలు – విశ్లేషణ :**

**కరువు :**

కరువు అనేది రైతుకు కొలిమి కాదు. అనావృష్టి పరిస్థితులున్నప్పుడు నీటికి, ధాన్యానికి, తిండిగింజలకు, పశువుల మేతకు సాధారణంగా కరువు ఏర్పడుతుంది. ఆ కరువును ఎట్లాగో అధిగమించవచ్చు. కానీ మానవ సంంధాలలో ఆప్యాయత అనురాగాలకు కరువు ఏర్పడితే నివారించడం కష్టమని తెలియజేసే కథ 'కరువు'. ఈ కథలో రాజిరెడ్డి

అనే రైతు తన రెక్కల కష్టంతో కొడుకును ఇంజనీరింగ్ చదివిస్తాడు. పట్టణంలో స్థిరనివాసం ఉంటూ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్న రాజిరెడ్డి కొడుకు పల్లెకు రావడమే నామోషిగా భావిస్తుంటాడు. ఆయేడు వర్షాలు పడాల్సినంత పడక పోవటంతో మొదటిసారి వేసిన విత్తనాలు మొలకెత్తకుండా పోయాయి. రెండవసారి వేస్తే మొలకలు వాడి పోయాయి. పశుగ్రాసానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. దీంతో కొడుకు ఏదైన సహాయం చేయకపోడా? అన్న ఆలోచనతో కొడుకు దగ్గరికి వెళ్తాడు రాజిరెడ్డి. తండ్రి చెప్పిందంతా విన్న ఆ కొడుకు ఊళ్ళో ఉన్న భూమంతా అమ్మి డబ్బు తెస్తే, బ్యాంకులో వేసి దానిపై వచ్చే వడ్డీ నెలా నెలా పంపిస్తానంటాడు. కొడుకు పలికిన మాటలు మనస్సును బాధించగా ఇల్లు చేరుకుంటాడు. మానవత విలువలకు, ఆప్యాయతలకు కరువు ఏర్పడినట్లుగా ఈ కథ నిరూపిస్తుంది.

నాయనమ్మ కోరిక: ఉత్తమ పురుష కథనంలో సాగిన 'నాయనమ్మకోరిక' మానవ సంబంధాల ఔన్నత్యాన్ని తెలిపేకథ. ఈ కథలోని నాయనమ్మకు మనమడు రాజయ్య అంటే ఎంతో ప్రేమ. ఇంట్లో తన పెద్దరికం నడిచి నన్నాళ్ళు రాజయ్యను ఎంతో ప్రేమగా చూసుకునేది. ఆమె పూర్తిగా వృదురాలై చేతగాకుంట అయిన స్థితిలో ముగ్గురు కొడుకులు ఆస్తిని సమానంగా పంచుకొని వంతుల వారిగా తలా నెల చొప్పున ఆమెను పోషించుకుంటూ వచ్చారు. రాజయ్య పదవ తరగతికి వచ్చే నాటికి నాయనమ్మ బ్రతికే ఉంది. ఆమెకు చుట్ట త్రాగే అలవాటుంది. రాజయ్య వాళ్ళింట్లో ఉన్న నెలరోజుల్లో చుట్ట త్రాగవద్దని రాజయ్య తల్లిదండ్రులు ఆంక్షలు విధించేవారు. కానీ నాయనమ్మకు చుట్టత్రాగకుంటే ఆదోలా ఉంటుందని రాజయ్యతో చెప్పుకొని ఏడ్చింది. జీవిత చరమాంకంలో ఉన్న నాయనమ్మ కోరిక తీర్చాలని అనుకున్న రాజయ్య చిన్నప్పుడు తన నాయనమ్మ ప్రేమతో కాలికి తొడిగించిన వెండి బేడిని అమ్ముతాడు. ఆ డబ్బులో కొంత ఖర్చు చేసి పొగాకు తెచ్చి తల్లిదండ్రుల లేని సమయంలో త్రాగడానికి ఏర్పాటు చేస్తాడు. మరో నెల తర్వాత చిన్నాన్న ఇంట్లో ఉన్నప్పుడు నాయనమ్మ కన్ను మూస్తుంది. ఇంకా మిగిలి ఉన్న డబ్బును నాయనమ్మ పేరున దేవుని హుండిలో వేస్తాడు. కొన్ని రోజుల తర్వాత రాజయ్య తల్లిదండ్రులు బేడి గురించి అడిగితే చెరువులో స్నానం చేస్తున్నప్పుడు పోయిందని అబద్ధం చెప్పి, తల్లిదండ్రుల చేత తిట్లు తింటాడు. అయినా నాయనమ్మ కోరికను తీర్చాను కదా ! అనే తృప్తి రాజయ్యకు మిగిలి పోతుంది. వృద్ధాప్యంలోకి చేరుకున్న వారి పోషణను గురించి కడుపున పుట్టిన వాళ్ళే నిర్లక్ష్యం చేయడం, వృద్ధాప్యంలో వారు పడే ఇబ్బందులు 'అమ్మమ్మ' కథలో చిత్రిత మవుతాయి. తల్లినొకరు, తండ్రినొకరు వంతుల వారిగా పోషణాభారం వహించడం చూస్తుంటే మానవ సంబంధాలు ఎట్లా అధ్వాన్న స్థితికి చేరుకున్నాయో అర్థం చేసుకోగలం.

**ఆ వృద్ధుడు మరణిస్తే :**

రోజురోజుకు లుప్తమవుతున్న మానవసంబంధాలు, రక్తసంబంధాల్లో, ఆర్థికాంశం చోటు చేసుకొని అమానవీయ విలువలు పెరగడం 'ఆ వృద్ధుడు మరణిస్తే' కథలో కన్పిస్తుంది. పారిశ్రామిక ప్రాంతంలో కూలీ పని చేసుకుంటూ బతికే అరవై ఏళ్ళు పైబడిన వృద్ధుడిని చూచినప్పుడల్లా చంద్రశేఖర్ అనే ఇంజనీరు జాలి కలుగుతుంది. అందుకే అతనితో చనువు పెంచుకొని కన్పించడం, తన అలవాట్లను అసహ్యించుకొని కొడుకు, కోడలు ఇంట్లోకి రానివ్వరని పల్లెలో భార్య చనిపోవడం వల్ల తాను ఇక్కడే కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నానని ఆ వృద్ధుడు చెప్తాడు. ఆ వృద్ధుని కుమారుడైన కృష్ణమూర్తి ఇంజనీరుగా తనకు తెలిసినవాడే కావడంతో చంద్రశేఖర్ అతన్ని కలుస్తాడు. మాకుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోవడానికి మీరెవ్వరంటూ ఎదురు ప్రశ్నవేసి వెళ్ళిపోతాడు. కొన్నాళ్ళ తర్వాత ఆ వృద్ధుడు మరింత చిక్కిపోతాడు. ఆ వృద్ధుడు మరణిస్తే ? ఆ పాపం ఎవ్వరిది అన్న ఆలోచన కల్గి చంద్రశేఖర్ ఆ వృద్ధుణ్ని చేరదీసి తన ఖాళీ షెడ్‌లో ఉంచుతాడు. పూర్తి అస్వస్థకు చేరిన వృద్ధుడు చంద్రశేఖర్‌ను తన వద్ద గల డబ్బు సంచి ఇచ్చి, ఆ డబ్బుతో తన కర్మ జరిపించి మిగిలిన డబ్బును కొడుక్కు ఇవ్వమని చెప్తాడు. చంద్రశేఖర్

వృద్ధుని కొడుకు గురించి తెలుసుకుంటే అతను బదిలీ చేయించుకొని ఉత్తరప్రదేశ్ వెళ్ళాడని తెలుస్తుంది. మరి కొద్ది రోజుల్లోనే వృద్ధుడు మరణిస్తే చంద్రశేఖర్ తన ఖర్చుతోనే కర్మ జరిపిస్తాడు. కృష్ణమూర్తి చిరునామా అతి కష్టం మీద సంపాదించి ఉత్తరం రాస్తాడు. భార్యను వెంటబెట్టుకొని వచ్చిన కృష్ణమూర్తికి అతని తండ్రిచ్చిన డబ్బు సంచి ఇస్తే నాలుగు వేలకు పైగా డబ్బులుంటాయి. తాము రావడానికి అయిదువేయిల రూపాయలు ఖర్చు అయ్యాయని లెక్కగడుతారు. పైగా ఎలాంటి డబ్బు తీసుకోకుండానే కర్మ జరిపించావా? అని చంద్రశేఖర్ ముఖం పై అనేయడంతో, చంద్రశేఖర్ కి వాళ్ళ ముఖం చూడాలంటే అసహ్యమేసి లోనికెళ్లాడు.

**ప్రశాంతం :**

ప్రపంచీకరణ ప్రభావాలతో పాత వృత్తులు, కొత్తవృత్తులు రెండూ కోల్పోతున్న తీరును 'ప్రశాంతం' కథ తెలుపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణలో సాఫ్ట్ వేర్ రంగంలో పెరిగిన ఉపాధి అవకాశాలను పేదలుకూడా అందిపుచ్చుకొని ఎదిగిన తీరు 'బతుకుపయనం' కథ తెలుపుతుంది. అందర్ని గొట్టి ఈ పరిశ్రమలు ఎవర్ని బతికిస్తున్నాయి మామా? బక్కోడు, కుంటోడు కార్ల పోయేటోనితోని పోటి పడతారా?... పని చేసే రెండు చేతులకు పని కల్పించని ప్రణాళిక లేందుకు? ప్రభుత్వాలేందుకు?". (1. బతుకుపయనం-ప్రశాంతం, పుట. 43) అని కులవృత్తులపైన, గ్రామీణ వ్యవస్థపైన ఆధారపడిన నేటి రాజకీయ వ్యవస్థను ఈసడించుకునే పరిస్థితి దాపురించింది. ఇలా మారిపోతున్న సామాజిక నేపథ్యంలో దాదాపు అన్ని కులాల, వర్గాల ప్రజలు వెతలకు గురైనారు. దాదాపు అన్ని కులాల వృత్తులు దెబ్బతిన్నాయి. ఇలా ఆయా కులవృత్తులు విధ్వంసమై, వారి బతుకుల్లో ఎలాంటి కష్టాలు వచ్చాయో అనే విషయాన్ని అనేక మంది కథాకారులు తమ కథలలో ప్రతిఫలించారు.

పరిణామాలు సమాజంలో, సంస్కృతిలో, మానవ సంబంధాల్లో, బహుజన జీవితాల్లో తెచ్చిన మంచి, చెడులను చాలా కథల్లో చిత్రిస్తూ, చర్చిస్తూ విశ్లేషించి చూపాను. 'ప్రశాంతం', 'నానమ్మ', ' రాత్రిపూలు' కథలు గ్లోబలైజేషన్ తెచ్చిన విషాదాలను విశ్లేషించాయి. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వాటి వెనుక గల సామాజిక పరిణామాలు, ఆడపిల్లలకు పెళ్ళి చేయలేని తల్లిదండ్రుల దురవస్థ, ఆడపిల్లలు లేచిపోవడాలు తదితరాలను 'నానమ్మ', 'ప్రేమధార' కథలు రికార్డు చేశాయి. 'అసందిగ్ధ కర్తవ్యం'లో కుల మతాల కారణంగా ప్రమోషన్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా అడ్డుకుంటూ అగ్రకులాల వాళ్లు, అధికారులు ఎలా వక్రమార్గాలు పడతారో, , తద్వారా బాధితుల మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో చిత్రించారు. 'విధ్వంస దృశ్యం' కథలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ పరిణామాల్లో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ విలువలు చిత్రించారు.

**సమన్వయం :**

సంస్కృతి సమాజం నిరంతరం మార్పు చెందుతూ వుంటాయి. నన్నయ కాలం నాటి సమాజ పరిస్థితులు వీరేశలింగం కాలంలో లేవు. వీరేశలింగం సామాజిక పరిస్థితులు తరువాత కాలంలో లేవు సమాజం మారుతున్నప్పుడు సాహిత్యం మారుతూ వుంటుంది. మారతున్న సాంఘీక సాంస్కృతిక వాతావరణాన్న నిరంతరం అధ్యయనం చెయ్యడం రచయిత లేక రచయిత్రి బాధ్యత అలా చేయలేక పోవడం వైఫల్యం క్రింద లెక్క. వీటన్నింటిని అధికమించి కథా వస్తువులో వైవిధ్యాన్ని చూపుతూ గొప్ప కమిట్ మెంట్‌తో చాలా మంచి కథలు రాశారు. బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి

చాలా వేగంగా మారుతున్న ప్రపంచంలో రచయితలు మారగలిగితే పాఠకులు కూడ మారతారు. కథ శిల్పంలోనూ వస్తువు విషయంలో ఎంత గొప్పగా వున్నా అది పాఠకుడి మనస్సుకి హత్తుకోకపోతే ప్రయోజనం వుండదు. దీనిని గమనించిన రామాచంద్రమౌళి పాఠకుడికి మార్గదర్శకుడిగా వుంటూ మనిషి జీవితంలో అనేక కోణాలను చూపే కథలకు రాశారు. బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు వస్తువుతో పాటు శిల్పానికి ప్రాధాన్యతను ఇచ్చారు.

బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథానికల ఎత్తుగడలలో ఎన్నో పోకడలు అవలంబిండం వల్ల అవి పాఠకులకు ఉత్సుకతను రేకెత్తించి ఆద్యంతం చదివించే విధంగా ఉన్నాయి. కథల ముగింపు విషయంలో వారు నాటకీయ పద్ధతిలో కొసమెరుపు ముగింపివ్వడం వల్ల అవి పాఠకుల్ని ఆలోచింపచేస్తూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేసినవిగా మనకు కనబడతాయి. ఉదాహరణకు వారసత్వం, అయిదవ వాడు, నడిపోడు, ప్రశాంతం, నానమ్మ, కరువు, నాననమ్మకోరిక, ఆ వృద్ధుడుమరణిస్తే, పేగుబంధం, ఇంటర్వ్యూ మొదలైన కథలు ద్వారా బి.ఎస్.రాములు పాఠకుల హృదయాలను ఆలోచింపజేశారు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో పనిపిల్ల, సవారి మొదలైన కథల్లో తెలంగాణ సమస్యలను చక్కగా చూపించారు. వీటితోపాటు బి.ఎస్.రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఇద్దరి కథల్లో తెలంగాణ సంస్కృతి స్పష్టంగా కన్పిస్తుంది.

**ముగింపు :**

నాలుగు దశాబ్దాలకు పైగా తెలంగాణ సాహిత్యంలో నిబద్ధతతో రచనలు చేస్తున్న బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి తెలంగాణ ప్రాంత నేపథ్యాన్ని కథా వస్తువుగా తీసు కొన్నప్పటికి ఆ క్రమంలో విశ్వమానవుడు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్నారు. అన్నీ సమస్యలను వారు తనదైన మానవతా దృక్పథంలోంచి ఆవిష్కరించారు. చాలా వరకు వీరి కథలు ఉత్తమ పురుష రచనా పద్ధతిలో సాగుతూ వస్తువు, శిల్పం, అనుభూతి సమన్వయంతోవుండి ఆలోచింపజేస్తూ జీవితాన్ని దిద్దుకునేలాగ కనిపిస్తాయి. సమాజంలో మధ్య తరగతి ప్రజల జీవితాన్ని అనేక కోణాల్లోంచి దర్శించి తనదైన వాస్తవికత దృక్పథంతో అనంతమైన శిల్ప వస్తు వైవిధ్యంతో తెలంగాణ కథా సాహిత్యాన్ని సుసంపన్నం కావడానికి దోహదం చేస్తున్న కథా రచయిత బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి అని చెప్పడానికి ఈ కథలు ప్రత్యక్ష సాక్ష్యాలు. అన్నీ కథల్లో ప్రప్రథమంగా కొట్ట వచ్చినట్లు కనిపించేది వాస్తవికత బి.ఎస్‌రాములు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో వాస్తవికత చాలా నిడివి కలిగిందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. అయిలయ్య బన్న. 2017. 'తెలంగాణ కథ- పరామర్శ, (ప్రపంచతెలుగు సభలు సందర్భంగా) కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్.
2. రాములు. బి.ఎస్. 2008. తెలంగాణ కథకులు-కథానరీతులు, యువభారతీ ప్రచురణలు
3. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథా సంపుటాలు.
4. బి.ఎస్.రాములు కథా సంపుటాలు


★★★

**BHAVAVEENA**
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
*Journal of Arts, Literary, Culture & Language Study*
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# నాటి సామెతలు - నేటి కాలానికి చమత్కార అన్వయ పరిశీలన



డా॥. బండి జగన్మోహన్
తెలుగు అధ్యాపకులు, ఎస్వీ డిగ్రీ కళాశాల, కలకడ, అన్నమయ్య జిల్లా.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాససంగ్రహం :**

ఈ వ్యాసం తెలుగు జానపద సాహిత్యంలో అత్యంత కీలకమైన సామెతల పరిణామాన్ని విశ్లేషిస్తుంది. నాటి వ్యవసాయ ఆధారిత, గ్రామీణ సమాజం నుండి నేటి పట్టణ, సాంకేతిక మరియు గ్లోబలైజ్డ్ సమాజం వైపుగా సాగిన ప్రయాణంలో సామెతలు తమ రూపాలను, స్వభావాలను ఎలా మార్చుకున్నాయో ఇందులో చమత్కారంగా వివరించడం జరిగింది. ఆర్థిక మార్పులు, నగరీకరణ, సాంకేతిక విప్లవం మరియు ఆధునిక విద్యా విధానాల కారణంగా సామెతలలోని పదజాలం మరియు సందర్భాలు మారినప్పటికీ, వాటి వెనుక ఉన్న మానవ స్వభావం మాత్రం మారలేదని ఈ వ్యాసం స్పష్టం చేస్తోంది. నిరంతరం మారే సామెతలు భాషా జీవనానికి మరియు సజీవ సంస్కృతికి ప్రతీకలని ఈ పరిశీలన నిరూపిస్తుంది.

**కీలక పదాలు :**

జానపద సాహిత్యం, సాంకేతిక విప్లవం, సమాజ పరిణామం, పేరడీ, సామెతలు, డిజిటల్ యుగం, భాషా పరిణామం, వృత్తులు, నమ్మకాలు, దమ్మిడి, ఎద్దులు, నాగలి, బావులు, చెరువులు, పొలాలు, డిజిటల్ కరెన్సీ, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఐఫోన్, బ్యాక్‌గ్రౌండ్, ఇన్ఫ్లుయెన్స్, గ్లోబలైజ్డ్, సాఫ్ట్‌వేర్, హెల్మెట్, ఏసి, లోకోక్తి, జనస్మృతి.

## 1. ప్రవేశిక :

భాష మానవ నాగరికతకు ప్రాణం అయితే, సామెతలు ఆ భాషకు ఆభరణాలు. ఒక జాతి సంస్కృతిని వారి ఆలోచనా విధానాన్ని, జీవన శైలిని ప్రతిబింబించే సజీవ దర్పణాలు సామెతలు. తెలుగు జానపద సాహిత్యంలో

సామెతలకు అత్యున్నత స్థానం ఉంది. వందల పేజీల గ్రంథం చెప్పలేని నిజాన్ని, ఒక చిన్న సామెత సూటిగా గుండెలకు హత్తుకునేలా చెప్తుంది.

'సామెత' అనే పదం 'సామ్యత' (పోలిక) అనే సంస్కృత పదం నుండి ఉద్భవించింది. దీనిని లోకోక్తి, జనశృతి అని కూడా అంటారు. ఆంగ్లంలో దీనిని 'Proverb' అంటారు. సామెతలు ఏ ఒక్కరో కూర్చుని నిఘంటువులు చూసి రాసినవి కావు. జీవితంలో ఎదురైన చేదు అనుభవాలు, గమనించిన సత్యాలు, సమాజంలోని విచిత్ర ప్రవర్తనల నుండి ఇవి పుట్టాయి. జానపద సాహిత్యం అడవి పూవులా స్వేచ్ఛగా, సహజంగా వికసించింది. ఈ జానపద సాహిత్యంలో సామెతలు ప్రాణ వాయువు లాంటివి.

**2. విషయ వివరణ :**

సమాజం స్థిరమైనది కాదు; అది నిరంతరం ప్రవహించే నది లాంటిది. కాల గమనంలో ఆచారాలు, వృత్తులు, నమ్మకాలు, సాంకేతిక పరిజ్ఞానం మారుతూ వస్తున్నాయి. సమాజంలో వచ్చే ఈ మార్పుల ప్రభావం భాషపైన, ముఖ్యంగా జానపద సాహిత్యంపై స్పష్టంగా కనిపిస్తుంది. నాటి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత సమాజంలో పుట్టిన సామెతలు, నేటి పట్టణ, పారిశ్రామిక, గ్లోబలైజ్డ్ సమాజంలో తమ రూపాన్ని, స్వభావాన్ని మార్చుకున్నాయి. కొన్ని సామెతలు పూర్తిగా మరుగున పడిపోగా, మరికొన్ని సామెతలు ఆధునిక కాలానికి అనుగునంగా కొత్త అర్థాలతో, కొత్త పదాలతో రూపాంతరం చెందాయి. ఈ వ్యాసంలో నాటి నుండి నేటి వరకు తెలుగు సామెతలలో వచ్చిన మార్పులను, వాటి వెనుక ఉన్న సామాజిక కారణాలను సమగ్రంగా విశ్లేషిద్దాం.

**2.1 సామెతలలో మార్పుకు గల సామాజిక, ఆర్థిక కారణాలు :**

నాటి సామెతలు నేడు మార్పులకు లోనవడానికి లేదా కొత్త రూపాలు దాల్చడానికి ప్రధానంగా నాలుగు శక్తులు కారణమయ్యాయి.

**2.1.1 ఆర్థిక వ్యవస్థలో మార్పు (Economic Shift) :**

నాటి సమాజం వస్తు మార్పిడి (Barter System) పద్ధతిపై, కవులు, రాజుల నాణేలపై ఆధారపడి ఉండేది. నేడు అది పేపర్ కరెన్సీ, ప్లాస్టిక్ మనీ, మరియు డిజిటల్ ట్రాన్సాక్షన్ (UPI) వైపు మళ్ళింది. ఆర్థిక మార్పు సామెతల పదజాలాన్ని మార్చేసింది.

**2.1.2 నగరీకరణ మరియు వలసలు (Urbanization) :**

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై, గ్రామాల్లోని యువత ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస రావడం వల్ల, పల్లెటూరి వాతావరణానికి సంబంధించిన చిహ్నాలు సామెతల నుండి దూరమయ్యాయి.

**2.1.3 సాంకేతిక విప్లవం (Technological Revolution) :**

ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్) రావడంతో మనుషుల ఆలోచనలు మారిపోయాయి. నాటి సమాచార సాధనాల స్థానంలో నేటి డిజిటల్ సాధనాలు చేరాయి.

**2.1.4 విద్యా విధానం, ఆధునికత (Modern Education) :**

ఆంగ్ల విద్యా ప్రభావం వల్ల తెలుగు పదాల స్థానంలో ఇంగ్లీష్ పదాలు వచ్చి చేరాయి. సామెతలు కూడా "మిక్స్‌డ్ లాంగ్వేజ్" (కోడింగ్ భాష) లోకి మారిపోయాయి.

**3. నాటి సామెతలు నేటి కాలానికి చమత్కార అన్వయం :**

సామెతలు సమాజపు అనుభవ సారాలు. కాలం మారుతున్నకొద్దీ మనుషుల జీవన విధానం, ఆలోచనలు, వృత్తులు, సాంకేతికత మారాయి. ఆ మార్పులకు అనుగుణంగానే నాటి సామెతలు, అవి కాలంతోపాటు నేడు ఎలా మారాయో రంగాల వారీగా విశ్లేషించుకుందాం.

**3.1.1 నాటి వ్యవసాయ సమాజం – నేటి సాంకేతిక సమాజం :**

పూర్వం సామెతలు ఎక్కువగా ఎద్దులు, నాగలి, బావులు, చెరువులు, పొలాలు, పిట్టలు, అడవి జంతువుల చుట్టూ తిరిగేవి. ఎందుకంటే నాటి మానవుడి ప్రపంచం అంతవరకే. ఉదాహరణకు, "అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదన్నట్లు" అనేది నాటి సహజ కుటుంబ స్థితి. కానీ నేటి బిజీ లైఫ్‌లో అది "అడగనిదే గూగుల్ అయినా ఇన్ఫర్మేషన్ ఇవ్వదన్నట్లు" అనే స్థాయికి చేరింది.

వ్యవసాయ కూలీలు, రైతుల కష్టాల నుండి పుట్టిన "ఎండకు ఎండి, వానకు తడిసినట్లు" అనే మాట, నేటి సాఫ్ట్‌వేర్ యుగంలో "కంప్యూటర్ స్క్రీన్ వేడికి కండ్లు మండి, చల్లటి ఏసి లకు చలికి ఒనికినట్లు" అనే సామెతగా రూపాంతరం చెందింది. అంటే, కష్టం యొక్క స్వభావం మారింది. కాబట్టి ఆ కష్టాన్ని వ్యక్తపరిచే సామెత రూపం కూడా మారింది.

**3.1.2 ఆర్థిక మరియు ద్రవ్య చలామణి మార్పులు :**

పూర్వం డబ్బును వరహాలు, పైసలు, దమ్మిడీలలో కొలిచేవారు. లోభిత్వాన్ని లేదా పేదరికాన్ని చెప్పడానికి ఆ పదాలనే వాడేవారు.

**నాటి సామెత** : "దమ్మిడి ఆదాయం లేదు కానీ, దర్జాకు మాత్రం లోటు లేదన్నట్లు"

**నేటి సామెత** : "బ్యాంక్ బ్యాలెన్స్ సున్నా.. చేతిలో ఐఫోన్ ఉన్నట్లు!"

నాటి 'దమ్మిడి' (చాలా తక్కువ విలువ గల నాణెం) స్థానాన్ని నేటి 'బ్యాంక్ బ్యాలెన్స్' ఆక్రమించింది. నాటి 'దర్జా'కు ప్రతీక అయిన గుర్రాలు లేదా పట్టువస్త్రాల స్థానంలో నేడు 'ఐఫోన్' వచ్చి చేరింది.

**నాటి సామెత** : "పైసలు లేనివారు పసలేని వాడన్నట్లు"

**నేటి సామెత** : "ఐఫోను లేనోడు పసలేని వాడన్నట్టు"

**3.1.3 వ్యవసాయం – పారిశ్రామిక, ఐటీ రంగాల ప్రభావం :**

వ్యవసాయంలో మోసాలు, శ్రమను బట్టి ఫలితం ఉండటం వంటి అంశాలపై నాటి సామెతలు ఉండేవి. నేడు ఐటీ రంగం, ఆఫీస్ కల్చర్ వాటిని మార్చేశాయి.

**నాటి సామెత** : "కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లు"

**నేటి సామెత** : "యూట్యూబ్‌ను నమ్ముకుని ఆపరేషన్లు చేసినట్లు"

నమ్మకూడని సాధనాన్ని నమ్ముకుని ప్రమాదంలో పడటాన్ని నాటి జానపదులు కుక్క తోకతో పోలిస్తే, నేటి ఆధునిక జానపదులు (నెటిజన్లు) ఏఐ (AI) సాధనాలపై అతిగా ఆధారపడటాన్ని వ్యంగ్యంగా చెప్తున్నారు.

**నాటి సామెత** : "పనిలేని మంగలి పిల్లి తల గొరిగినట్లు"

**నేటి సామెత** : "పని లేనోడు ఫేస్‌బుక్‌లో కామెంట్లతో అడ్డంగా తల తిన్నట్లు"

**3.1.4 కుటుంబ వ్యవస్థ – మానవ సంబంధాలు మార్పులు :**

అత్తాకోడళ్ల సంబంధాలు, ఉమ్మడి కుటుంబాలలోని గొడవలు నాటి సామెతలలో ఎక్కువగా ఉండేవి. నేడు అణుకుటుంబాలు (Nuclear Families), ఫ్లాట్ కల్చర్ రావడంతో ఇవి మారాయి.

**నాటి సామెత** : "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు"

**నేటి సామెత** : "కంపెనీ బడ్జెట్‌తో మేనేజర్ పార్టీలు ఇచ్చినట్లు".

నాటి గ్రామీణ కుటుంబంలో అత్తగారి అధికారాన్ని, అల్లుడి నిర్లక్ష్యానిన చూపించే ఈ సామెత, నేడు కార్పొరేట్ రంగంలో కంపెనీ డబ్బుతో ఎంజాయ్ చేసే ఉద్యోగుల ప్రవర్తన అద్దం పడుతోంది.

**నాటి సామెత :** "ఇల్లు కాలి ఒకడేడుస్తుంటే.. ఇంకోడు చుట్టు కాల్చడానికి నిప్పు అడిగినట్లు"

**నేటి సామెత :** "రోడ్డు మీద యాక్సిడెంట్ అయి ఒకడు ఏడుస్తుంటే.. ఇంకొకడు సెల్ఫీ కోసం ఫోజులు అడిగినట్లు"

మానవత్వ లేమిని, స్వార్థాన్ని చెప్పడానికి నాటి చుట్ట (పొగాకు) ఉదాహరణ అయితే, నేటి డిజిటల్ క్రేజ్ (సెల్ఫీలు, రీల్స్) నేటి క్రూరమైన నిజం.

**3.1.5 రవాణా, ప్రయాణ సాధనాల మార్పులు :**

పూర్వం ప్రయాణాలు ఎడ్లబండ్లు, నడక ద్వారా సాగేవి. కాబట్టి ఆలస్యాన్ని, వేగాన్ని వాటితోనే పోల్చేవారు.

**నాటి సామెత :** "ఆత్రగాడికి కూడు చల్లారదు.. ఎడ్లబండి సాగదన్నట్లు"

**నేటి సామెత :** "సాఫ్ట్‌వేర్ వారికి ఉరుకులు పరుగులు... వర్క్ ఎంత చేసినా తరగదన్నట్లు"

**3.1.6 హాస్యం, వ్యంగ్యం మరియు ఆధునికత**

జానపద సాహిత్యంలో హాస్యానికి, వ్యంగ్యానికి కొదవ లేదు. ఆధునిక యువత (మరియు) పాత సామెతలను తలకిందులు చేస్తూ, నేటి కాలపు సోషల్ మీడియా పిచ్చిని, బద్ధకాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తూ "పేరడీ సామెతలను" సృష్టించారు. ఇవి కూడా ఒక రకమైన ఆధునిక జానపద సాహిత్యమే. ఎందుకంటే వీటికీ నిర్దిష్ట రచయిత ఉండరు, ఇంటర్నెట్‌లో ఒకరి నుండి ఒకరికి వ్యాప్తి చెందుతాయి.

**నాటి సామెత :** "గోడకు చెవులుంటాయన్నట్లు"

**నేటి సామెత :** "ఫోనుకు హ్యాకర్లు ఉంటారన్నట్లు"

**నాటి సామెత :** "మౌనం అర్ధంగీకారమన్నట్లు"

**నేటి సామెత :** "వాట్సాప్‌లో బ్లూటిక్ (Blue ticks) పడితే చూసిన లెక్కన్నట్లు"

**నాటి సామెత :** "రూపం చూసి మోసపోకన్నట్లు"

**నేటి సామెత :** "తంబ్‌నెయిల్‌లోని టైటాన్స్ చూసి వీడియో చూసి మోసపోయినట్లు"

**నాటి సామెత :** "చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకోవడమన్నట్లు"

**నేటి సామెత :** "బ్యాక్‌గ్రౌండ్ చెప్పుకొని ఇన్ఫ్లుయెన్స్ చేసినట్లు"

**నాటి సామెత :** "కంటికి చూసేది నిజం, వినేది అబద్ధమన్నట్లు"

**నేటి సామెత :** "మేకప్ లేకుండా చూసేది నిజం, పోటో చూసి అందంగా ఉందనుకోవడం అబద్ధమన్నట్లు"

ఈ సామెతలను గమనిస్తే, నాటి భయాలు, నమ్మకాలు వేరు, నేటి డిజిటల్ భయాలు (Privacy Issues) వేరని స్పష్టమవుతుంది.

**3.1.7 మాండలికాల నుంచి ఇంగ్లీష్ పదాల కలయిక వరకు :**

సామెతలలో వచ్చిన మార్పు కేవలం వస్తువులలోనే కాదు, వాడే భాషలో కూడా వచ్చింది. నాటి సామెతలలో తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర మాండలికాల సొబగులు, అచ్చ తెలుగు పదాలు (ఉదాహరణకు : కంచె, చేను, మోటబావి, కుండ, చిలుక) ఉండేవి.

**నాటి సామెత :** "గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు" అనేది నాటి భాష.

**నేటి సామెత :** "సర్వర్ డౌన్ అయినప్పుడే బాస్ నుంచి తక్షణమే రిపోర్ట్ సమ్మిషన్ చేయాలన్నట్లు" అనేది నేటి భాష.

ఇక్కడ భావం ఒక్కటే (కష్టం మీద ఇంకో కష్టం రావడం) కానీ వాడిన పదాలు పూర్తిగా ఆధునిక సాంకేతిక రంగానికి చెందినవి. దీనినే భాషా పరిణామం అంటారు.

**4. ఆధునిక సామెతల ఆవశ్యకత :**

కొందరు పండితులు పాత సామెతలు మారిపోవడాన్ని భాషా క్షీణతగా భావిస్తారు. కానీ జానపద విజ్ఞాన శాస్త్రవేత్తల ప్రకారం, ఇది భాషా జీవనానికి చిహ్నం. చనిపోయిన భాషలోనే మార్పులు ఉండవు; బ్రతికున్న భాష నిరంతరం మారుతూనే ఉంటుంది.

నేటి కాలంలో పుడుతున్న ఈ కొత్త సామెతలు లేదా మార్పు చెందిన సామెతలు ఎందుకు అవసరమంటే నేటి పిల్లవాడికి 'రోకలి' అంటే తెలియదు. 'కుంచం' అంటే తెలియదు. వాడికి "రోట్లో తలదూర్చి రోకటి పోటుకు భయపడినట్లు" అని చెప్తే వెంటనే అర్థమవుతుంది.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌క్రైమ్స్, సోషల్ మీడియా అడిక్షన్ వంటి ఆధునిక రుగ్మతలను విమర్శించడానికి పాత సామెతలు సరిపోవు. కొత్త సామెతలు పుట్టాల్సిందే. ఉదాహరణకు : "లైకుల కోసం పాకులాడేవాడు, కామెంట్ల కోసం గొంతు కోసుకున్నాడు అన్నట్లు" అనేది నేటి సామెత.

**5. ఉపసంహారం :**

తెలుగు జానపద సాహిత్యంలో సామెతలు నాటి నుంచి నేటి వరకు సాధించిన పరిణామం అద్భుతమైనది. వ్యవసాయ క్షేత్రాల నుండి సాఫ్ట్‌వేర్ క్యూబికల్స్ వరకు, ఎడ్లబండి నుండి ఎలక్ట్రిక్ కార్ల వరకు, వస్తు మార్పిడి నుంచి క్రిప్టో కరెన్సీ వరకు సమాజం సాధించిన ప్రగతి అంతా ఈ సామెతల మార్పులో నిక్షిప్తమై ఉంది.

రూపం మారినా, వాడే పదాలు మారినా, వాటి వెనుక ఉన్న "మానవ స్వభావం" (Human Nature) మాత్రం మారలేదు. నాటి మానవుడిలో ఉన్న స్వార్థం, వెటకారం, ప్రేమ, కష్టం, భయం నేటి మానవుడిలోనూ ఉన్నాయి. అందుకే సామెత శరీరాన్ని మార్చుకుంది కానీ ఆత్మను మార్చుకోలేదు. ఈ మార్పులను గమనించడం ద్వారా మనం మన సమాజం ఎటువైపు పయనిస్తుందో అర్థం చేసుకోవచ్చు. జానపద సాహిత్యం అనేది గతం మాత్రమే కాదు. అది నిరంతర వర్తమానం అని నిరూపించడానికి ఈ మారిన సామెతలే సజీవ సాక్ష్యాలు.

**ఆధార గ్రంథాలు :**


1. "తెలుగు సామెతలు" - డా॥. చిలుకూరి నారాయణరావు.
2. "సామెతలు - జనజీవనం" - డా॥. పి. ధర్మారావు.
3. "ఆంధ్రుల జానపద విజ్ఞానం" - డా॥. ఆర్.వి.ఎస్. సుందరం.
4. చిత్తూరు జిల్లా జానపద విజ్ఞానం - డా॥. పేట శ్రీనివాసుల రెడ్డి.
5. తెలుగు సామెతలు జనజీవనం - డా॥. నరసింహారెడ్డి పి.
6. "తెలుగు సామెతలు : ఒక పరిశీలన" - డా॥. ఎం. కృష్ణకుమారి.


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలుగు సినిమాపై సాహిత్య ప్రభావం



**డా॥. శివయ్య రాజులపాటి**
అతిథి అధ్యాపకులు, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
Cell No. 94916 47639, E-mail : rajulapatiratnam1@gmail.com.

**సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026**

తెలుగు సినిమా తన ఆవిర్భావ దశ నుండే తెలుగు సాహిత్యంతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంది. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, జానపద కథలు, బుర్రకథలు, ఆధునిక కథానికలు, జీవిత చరిత్రలు, ఇతర భారతీయ భాషా రచనలు, పాశ్చాత్య ఆంగ్ల కథలు మొదలగు విభిన్న సాహిత్య ప్రక్రియలు తెలుగు చిత్రసీమకు మాతృకలుగా నిలిచాయి. ప్రస్తుత పరిశోధనా వ్యాసం తెలుగు సినిమాపై ఈ సాహిత్య ప్రక్రియల ప్రభావాన్ని చారిత్రక దృక్పథంతో పరిశీలిస్తుంది. కథ నుండి సినిమా చిత్రీకరణ వరకు జరిగిన పరివర్తన ప్రక్రియను, సామాజీకరణ (సోషలైజేషన్) ధోరణిని, ఇతర భాషా సాహిత్య అనువాదాల పాత్రను విశ్లేషిస్తుంది. ఈ అధ్యయనం ద్వారా తెలుగు సినిమా - సాహిత్యానికి కేవలం దృశ్యరూపం ఇవ్వడమే కాకుండా, దానిని పునఃసృష్టి చేస్తూ సమకాలీన సమాజానికి అన్వయించుకుంటూ వస్తోందని తేటతెల్లమవుతుంది.

## పరిచయం

సినిమా అనేది దృశ్య కళ; సాహిత్యం శబ్దకళ. ఈ రెండింటి మధ్య అన్యోన్య సంబంధం తెలుగు చిత్రసీమ ఆవిర్భావం నుండే కొనసాగుతూ వస్తోంది. తెలుగు సినిమా తొలి నాళ్ళ నుండే వివిధ సాహిత్య ప్రక్రియలను అడాప్ట్ చేసుకుంది. కథల కొరత వచ్చినప్పుడో, ప్రయోగ వైచిత్రి కోసమో దర్శక-రచయితలు తెలుగు సాహిత్యం వైపు మొగ్గుచూపారు. వారు కల్పనా చాతుర్యంతో వివిధ గ్రంథాలను సినిమాగా రూపొందించారు. ప్రధానంగా పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, జానపదాలు, బుర్రకథలు, కథానికలు, జీవిత చరిత్రలు, వివిధ గ్రంథాలు తెలుగు సినిమాలుగా రూపొందాయి.

## తెలుగు సినిమాపై పురాణాల ప్రభావం

వేదాల్లోని కథలను గ్రహించి, కథా విస్తరణ గావించి, నీతి ప్రబోధాత్మకంగా చెప్పడమే పురాణాల్లోని వైశిష్ట్యం.

పురాణాలు, పౌరాణికాలు తెలుగువారి సొత్తు అన్నంతగా దర్శక రచయితలు వీటిని అడాప్ట్ చేసుకున్నారు. అష్టాదశ పురాణాలే తెలుగు సినిమాలకు మాతృకలయ్యాయి.

1933లో బి.ఎస్. రంగా శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన 'పృథ్వీపుత్ర' చిత్రం నరకాసుర వధ ఘట్టం ఆధారంగా రూపొందించబడింది. ఇది సరస్వతీ సినీటోన్ నిర్మాణ సంస్థ తీసిన తొలి తెలుగు చిత్రం కావడం గమనార్హం. బమ్మెర పోతన రాసిన భాగవతం ఆధారంగా 1935లో చిత్రపు నరసింహారావు దర్శకత్వంలో 'కృష్ణలీలలు' చిత్రం రూపొందింది. ఈ ఇతివృత్తంతో మూడు స్ట్రెయిట్ చిత్రాలు, రెండు అనువాద చిత్రాలు రూపొందాయి. భాగవతంలోని దశమ స్కంధంలోని రుక్మిణీ కల్యాణం ప్రధాన ఘట్టంగా 1937లో 'రుక్మిణీ కల్యాణము' (లేక 'రుక్మిణీ హరణ్') చిత్రం రూపొందింది.

'మోహినీ భస్మాసుర' (1938, 1966), 'ఉషా పరిణయము లేక బాణాసుర' (1939, 1961, 2009), 'దక్షయజ్ఞము' (1941, 1962), 'పార్వతీ కల్యాణం' (1941), 'కృష్ణప్రేమ' (1943, 1961), 'చెంచులక్ష్మి' (1943, 1958), 'నారద నారది', 'రాధిక', 'దీపావళి' (1960), 'సోమవార వ్రత మహాత్మ్యం' (1963), 'శ్రీకృష్ణ మహిమ (భక్త కుచేల)' (1967), 'శ్రీకృష్ణ విజయము' (1971), 'యశోదకృష్ణ' (1975) వంటి చిత్రాలు పౌరాణిక ఇతివృత్తాలతో నిర్మించబడినవి. ప్రాచీన తమిళ పురాణ గ్రంథం 'ఆర్యమాల' ఆధారంగా 'కార్తవరాయని కథ' (1958) తెలుగులో రూపొందింది.

### ఇతిహాసాల ఆధారంగా వచ్చిన చిత్రాలు

ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలు, ఉపదేశాలు, పూర్వ వృత్తాంత కథలతో కూడుకొన్నదాన్నే ఇతిహాసమంటారు. 'ఇతింహాస' = 'ఇలా జరిగింది' అని చెప్పడమే ఇతిహాసం. రామాయణ, మహాభారతాలను ఇతిహాసాలంటారు. ఈ ఇతిహాసాలను ఆధారంగా చేసుకొని తెలుగులో పదుల సంఖ్యలో సినిమాలు రూపొందాయి.

### రామాయణాధారిత చిత్రాలు

రామాయణంలోని పాదుకా పట్టాభిషేకం ఘట్టం ఆధారంగా 1932లో సాగర్ మూవీటోన్, 1945లో శ్రీరాజరాజేశ్వరీ ఫిల్మ్ కంపెనీ, 1966లో అమరావతి చిత్ర వారు తెలుగులో మూడు సినిమాలు నిర్మించారు. 'సతీ సులోచన' (1936, 1961), 'లంకాదహనం' (1936), 'మోహినీ రుక్మాంగద లేక ఏకాదశి మహాత్మ్యము' (1937, 1962), 'సంపూర్ణ రామాయణము' (1936, 1958, 1961, 1971, 1997), 'మైరావణ లేక చంద్రసేన' (1940, 1964), 'సేతుబంధన్' (1947), 'రత్నమాల' (1948), 'వాలిసుగ్రీవ' (1950), 'ఋష్యశృంగ' (1961), 'వీరాంజనేయ' (1968), 'సీతారామ వనవాసము' (1977) వంటి చిత్రాలు రామాయణ ఆధారిత ముఖ్య చిత్రాలు.

### మహాభారతం ఆధారంగా వచ్చిన చిత్రాలు

మహాభారతం తెలుగు సినిమాకు అపార సాహిత్య సంపదను అందించింది. ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని 1936లో లక్ష్మి ఫిల్మ్స్ వారు 'ద్రౌపదీ మాన సంరక్షణం' చిత్రాన్ని నిర్మించారు. అభిమన్యుని వృత్తాంతం ఆధారంగా 'వీర అభిమన్యు' (1936), 'వీరాభిమన్యు' (1965) చిత్రాలు; జరాసంధ వధ ఇతివృత్తంతో 'కృష్ణ జరాసంధ' (1938); 'పాశుపతాస్త్రం' (1939), 'బభ్రువాహన' (1942, 1964), 'గరుడ గర్వభంగం' (1943), 'శ్రీకృష్ణ గారడీ' (1958), 'శ్రీకృష్ణ రాయబారం' (1960) వంటి చిత్రాలు రూపొందాయి.

భీష్ముని జీవిత కథ ఆధారంగా 1921లో తొలిసారి మూకీ చిత్రం, 1945లో, 1962లో రెండు టాకీ చిత్రాలు వచ్చాయి. 1962లో బి.ఎ. సుబ్బారావు దర్శకత్వంలోని 'భీష్మ' చిత్రం ఎన్టీఆర్కు ఎంతో పేరు తీసుకొచ్చింది. తిక్కన రాసిన విరాట పర్వం ఆధారంగా 'నర్తనశాల' (1963), 'శ్రీమద్విరాట పర్వము' (1979) చిత్రాలు రూపొందాయి. మహాభారతంలో వీరోచిత పాత్ర కర్ణుని జీవితంపై 'కర్ణ' (బి.ఆర్. పంతులు), 'దానవీరశూరకర్ణ' (1977 --- ఎన్టీఆర్)

వచ్చాయి. 'పాండవ వనవాసం' (1965), 'శ్రీకృష్ణ పాండవీయం' (1966), 'భీమాంజనేయ యుద్ధం' (1966), 'శ్రీకృష్ణావతారం' (1967), 'శ్రీకృష్ణ సత్య' (1971), 'బాలభారతము' (1972), 'కురుక్షేత్రం' (1977 --- తెలుగులో మొదటి సినిమాస్కోప్ చిత్రం), 'ఏకలవ్య' (1982) వంటివి మహాభారత ఆధారిత ముఖ్య చిత్రాలు.

**కావ్యాలే సినిమాకు మాతృకలు**

తెలుగులో వివిధ కావ్యాలు సైతం సినిమా చిత్రీకరణను పొందాయి. కంకంటి పాపరాజు రాసిన ఉత్తర రామాయణం, కె. సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన లవకుశ నాటకం, భవభూతి రాసిన ఉత్తర రామచరిత గ్రంథాలను కలగలిపి తయారు చేసిన కథ 'లవకుశ'. ఈ కథతో సి. పుల్లయ్య దర్శకత్వంలో 1934లో, తిరిగి 1963లో 'లవకుశ' సినిమా రూపొందింది. 1963 చిత్రానికి కేంద్ర ప్రభుత్వ రజత కమలం పురస్కారం లభించింది.

పిల్లల మర్రి పినవీరభద్రుడు రాసిన 'జైమినీ భారతం' ఆధారంగా 'రాణీ ప్రమీల' (1936), అదే గ్రంథం నుండి 'ప్రమీలార్జునీయం' (1936, 1965); శ్రీనాథుని 'హరవిలాసం', పాల్కురికి సోమనాథుని 'బసవ పురాణం' ఆధారంగా 'భక్త శిరియాళ' (1948); ధూర్జటి రాసిన 'కాళహస్తి మహాత్మ్యం' ఆధారంగా 'కాళహస్తి మహాత్మ్యం' (1954); సారంగు తమ్మయ్య రాసిన 'వైజయంతీ విలాసం' ఆధారంగా 'విప్రనారాయణ' (1954); ఎర్రన హరివంశం, పోతన భాగవతం కలిపి 'దీపావళి' (1960); వాల్మీకి రామాయణం, భవభూతి ఉత్తర రామచరిత, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణాల ఆధారంగా బాపు దర్శకత్వంలో 'శ్రీరామరాజ్యం' (2011); ఇళంగో వడిగళ్ తమిళ కావ్యం 'సిలప్పదిగారం' ఆధారంగా 'పత్ని' (1943) వంటి చిత్రాలు రూపొందాయి.

**ప్రబంధ ఆధారిత చిత్రాలు**

వర్ణనాతిశయం, పదాడంబరాలతో అల్లుకున్న కావ్యాన్నే ప్రబంధం అంటారు. తెలుగులో 15వ శతాబ్దిలో అవతరించిన ప్రబంధ ప్రక్రియ సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. తెనాలి రామకృష్ణ రాసిన 'పాండురంగ మహాత్మ్యం'లో మహాభక్తుడైన పుండరీకుని కథ చిత్రితమైంది. దీని ఆధారంగా 1939లో, 1957లో, 2008లో ('పాండురంగడు') చిత్రాలు రూపొందాయి. నంది తిమ్మన 'పారిజాతాపహరణం', చిలకమర్తి లక్ష్మీనరసింహం 'గయోపాఖ్యానం', 'సుభద్రా పరిణయం' గ్రంథాల ఆధారంగా 1962లో కె.వి. రెడ్డి దర్శకత్వంలో 'కృష్ణార్జున యుద్ధం' తెరకెక్కింది. ధూర్జటి 'శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం', భారవి 'కిరాతార్జునీయం' ఆధారంగా బాపు దర్శకత్వంలో 'భక్త కన్నప్ప' (1976) రూపొందింది.

**జానపద కథల ప్రభావం**

అటు పిల్లల్ని, ఇటు పెద్దల్ని ఆబాలగోపాలాన్ని అలరించేవి జానపద కథలు. మంత్రతంత్రాలు, విచిత్ర వేషధారణ, వింత వస్తువులు, ఎన్నెన్నో అద్భుతాలు జానపద కథల్లో చోటు చేసుకుంటాయి. ఇవి మనల్ని అద్భుత లోకంలో విహరింపజేస్తాయి. మధిర సుబ్బన్న దీక్షితకవి రాసిన 'కాశీమజిలీ కథలు' తెలియనివారుండరు; ఇవి జానపద బాణిలో ఉండి విస్తృత ప్రజాదరణ పొందాయి.

కాశీమజిలీ కథల ఆధారంగా తెరకెక్కిన మొదటి చిత్రం 'గులేబకావళి' (1938). పారామౌంట్ ఫిల్మ్ కంపెనీ తొలి జానపద చిత్రంగా దీనిని నిర్మించింది. తరువాత 1962లో ఎన్టీఆర్ దర్శకత్వంలో 'గులేబకావళి కథ' తెరకెక్కింది; కవి సి. నారాయణ రెడ్డికి పాటల రచయితగా ఇదే మొదటి చిత్రం. 'భోజకాళిదాసు' (1940), 'మాయాలోకం / కాంభోజరాజు కథ' (1945, 1965), 'గొల్లభామ', 'బాలరాజు' (1948), 'కీలుగుర్రం' (1949), 'రక్షరేఖ' (1949), 'స్వప్నసుందరి' (1950), 'నవ్వితే నవరత్నాలు' (1951), 'భట్టి విక్రమార్క' (1960), 'సహస్రశిరచ్ఛేద అపూర్వ చింతామణి' (1960), 'మదన రామరాజు కథ' (1962), 'ప్రతిజ్ఞా పాలన' (1965), 'చిక్కడు దొరకడు', 'పేదరాశి పెద్దమ్మ' (1968), 'మల్లమ్మ కథ' (1973), 'జగదేకవీరుని కథ' (1961) వంటి చిత్రాలు ఈ సంప్రదాయంలో ముఖ్యమైనవి.

**తెరరూపం దాల్చిన బుర్రకథలు**

పల్లె పదాలు, వంత పాటలు, కథనాలు, పద్యాలు సమ్మిళితమైన జానపద కళారూపం బుర్రకథ. తెలుగునాట ఎంతో ప్రజాదరణ పొందిన ప్రక్రియ ఇది. 'బాలనాగమ్మ' బుర్రకథ ఆధారంగా 1942లో సి. పుల్లయ్య దర్శకత్వంలో జెమినీ స్టూడియోస్ నిర్మించిన చిత్రం రూపొందింది. 1959లో వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో ఇదే కథతో పునర్నిర్మాణం జరిగింది. 'ముగ్గురు మరాఠీలు' (1946), 'శ్రీలక్ష్మమ్మ కథ' (1950), సర్దార్ సర్వాయి పాపారాయుడు జీవిత చరిత్ర ఆధారంగా 'శభాష్ పాపన్న' (1972) వంటి చిత్రాలు బుర్రకథలను తెరకెక్కించిన ఉదాహరణలు.

**ఆధునిక కథ / కథానిక సినిమాగా**

తెలుగు కథ లేదా కథానిక అన్ని సాహిత్య ప్రక్రియల కంటే బాగా ప్రాచుర్యం పొందిన ప్రక్రియ. కథానికల్లో నీతి, ధర్మం, సాహసం, ఔదార్యం, శృంగారం వంటి అంశాలు ప్రస్ఫుటమవుతాయి. కథ దీర్ఘంగా కాక పొందికగా ఉండడం, ఉదాత్తత కలిగి ఉండడం, సంభ్రమాశ్చర్యాలను కలిగించడం, కరుణ-అద్భుత రసాలను పోషించడం, ఆనందాన్ని కలిగించడం కథానిక ప్రధాన లక్షణాలు.

త్రిపురనేని గోపీచంద్ 'పెంకిపిల్ల' ఆధారంగా 'గృహప్రవేశం' (1946); పాలగుమ్మి పద్మరాజు 'పడవ ప్రయాణం' ఆధారంగా బి.ఎన్. రెడ్డి దర్శకత్వంలో 'భాగ్యరేఖ' (1957) --- తరువాత 1995లో 'స్త్రీ'; పి. పుల్లయ్య కుమార్తె రచన ఆధారంగా 'మురళీకృష్ణ' (1964); ముళ్ళపూడి వెంకటరమణ 'బేతాళ' కథల ఆధారంగా 'కథానాయకుడు' (1969); ఎం. బాలయ్య 'నలుపు-తెలుపు' ఆధారంగా 'చెల్లెలి కాపురం' (1971 --- నంది అవార్డు); పి. చంద్రశేఖర్ రెడ్డి సోదరి మాలతీదేవి కథ ఆధారంగా 'ఇల్లు-ఇల్లాలు' (1972); బాపు దర్శకత్వంలో 'అందాల రాముడు' (1973 --- గోదావరిపై చిత్రీకరణ); గురజాడ 'దేవుళ్ళారా? మీ పేరేమిటి?' ఆధారంగా 'దేవుడు చేసిన మనుషులు' (1973); రాజబాబు రచన ఆధారంగా 'ఎవరికి వారే యమునా తీరే' (1974); త్రిపురనేని గోపీచంద్ 'ధర్మవడ్డీ' ప్రేరణతో 'కొల్లేటి కాపురం' (1970); కాళీపట్నం రామారావు 'యజ్ఞం' ఆధారంగా (1992); పాలగుమ్మి పద్మరాజు 'పడవ ప్రయాణం' ఆధారంగా 'స్త్రీ' (1995); శ్రీరాజ్ యథార్థ ఘటన ఆధారంగా 'ప్రేమించు' (2001 --- ఐదు నంది అవార్డులు); గుడిపాటి వెంకటాచలం 'దోషగుణం' ఆధారంగా 'గ్రహణం' (2004); రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'ఆరు సారా కథలు' ఆధారంగా 'సారాయి వీర్రాజు' (2009); గురజాడ 'ఘోష' ం గుడిపాటి 'నాయుడు పిల్ల' ఆధారంగా '1940లో ఒక గ్రామం' (2010 --- ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం జాతీయ అవార్డు); శ్రీ రమణ 'మిథునం' (2012 --- ఆస్కార్కు నామినేట్); దేవరకొండ బాలగంగాధర తిలక్ 'ఊరి చివరి ఇల్లు' ఆధారంగా 'కమలతో నా ప్రయాణం' (2014) వంటివి తెలుగు కథల అడాప్టేషన్లకు ఉదాహరణలు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే తెలుగు కథల ఆధారంగా తెరకెక్కిన చిత్రాలు దాదాపు అవార్డు చిత్రాలుగా నిలిచాయి. కథల కొరత వచ్చినప్పుడు తెలుగు దర్శక-రచయితలు తెలుగు కథలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

**కవులు, రచయితల జీవిత చరిత్రలు**

'భోజ కాళిదాసు' (1940 --- హెచ్.వి. బాబు), 'తెనాలి రామకృష్ణ' (1941), 'భక్తపోతన' (1948 --- కె.వి. రెడ్డి, పునర్నిర్మాణం 1966), 'వాల్మీకి' (1945, 1963), 'భక్త తులసీదాస్' (1946), 'యోగి వేమన' (1947 --- కె.వి. రెడ్డి), 'శ్రీ వేమన చరిత్ర' (1986), 'జయభేరి' (1959 --- మరాఠీ కవి రామ్ జోషి స్ఫూర్తితో), 'మహాకవి కాళిదాసు' (1960), 'వేములవాడ భీమకవి' (1976), 'కబీర్దాస్' (2003) వంటి చిత్రాలు కవులను అమరుల్ని చేసాయి..వారి కళాసృజనకు శాశ్వతత్వాన్ని అందించాయి.

**నాయకులు, పోరాట యోధుల జీవిత చరిత్రలు**

మహాత్మాగాంధీ జీవితం ఆధారంగా 'మహాత్మాగాంధీ జీవితము' (1941 --- డాక్యుమెంటరీ); టంగుటూరి ప్రకాశం పంతులు జీవితంపై 'ఆంధ్రకేసరి' (1983 --- విజయచందర్); డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితంపై 'డా. అంబేద్కర్' (1992); సర్దార్ సర్వాయి పాపన్న జీవితంపై 'సర్దార్ పాపారాయుడు' (1980 --- ఎన్టీఆర్), 'సర్దార్ పాపన్న' (2006); గోండు వీరుడు కొమురం భీం జీవితంపై 'కొమురం భీం' (1990) వంటి చిత్రాలు తెలుగు ప్రేక్షకులకు చారిత్రక నాయకుల త్యాగాలను పరిచయం చేశాయి. చారిత్రక చిత్రాలుగా 'చాణక్య చంద్రగుప్త' (1977), 'రుద్రమదేవి' (2015 --- గుణశేఖర్), 'గౌతమీపుత్ర శాతకర్ణి' (2010 --- క్రిష్ --- బాలకృష్ణ) వంటివి కూడా ఈ కోవలోకే వ

**ముగింపు**

ఈ విధంగా తెలుగు చిత్రసీమకు పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, జానపదాలు, బుర్రకథలు, కథానికలు, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, స్థల చరిత్రలు, చరిత్ర గ్రంథాలు, వివిధ గ్రంథాలు స్ఫూర్తిని, ప్రేరణను కలిగించాయి. తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. నిజానికి కథ సినిమా చిత్రీకరణ అన్నప్పుడు ఒక రూపకల్పనకు కావలసినంత క్యాన్వాస్ ఆ కథలో ఉండకపోవచ్చు. కాబట్టి ఆయా కథలను చిత్రానువాదం చేసేటప్పుడు పెంచి, మార్పులు, చేర్పులు చేయడమనేది జరిగింది. ఈ పెంపు-మార్పు ప్రక్రియలోనే తెలుగు సినిమా సృజనాత్మకత ఇమిడి ఉంది.

సాహిత్యం-సినిమా సంబంధం పరస్పర పోషకమైనది. సాహిత్యం సినిమాకు కథా-భావ సంపదను అందిస్తే, సినిమా సాహిత్యానికి విస్తృత ప్రజాదరణను, దృశ్య రూపాన్ని ప్రసాదిస్తోంది. తెలుగు సినిమా 80కి పైగా సంవత్సరాల ప్రయాణంలో సుమారుగా అన్ని ముఖ్య సాహిత్య ప్రక్రియలను అడాప్ట్ చేసుకుంది. భవిష్యత్తులో సమకాలీన తెలుగు కథల --- ముఖ్యంగా కాళీపట్నం రామారావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, శ్రీ రమణ, దేవరకొండ బాలగంగాధర తిలక్ వంటి రచయితల కథల --- చిత్రీకరణ మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ఇది తెలుగు సినిమాకు సాంస్కృతిక గంభీరతను, కథన సాంద్రతను అందిస్తుంది. మరోవైపు, యువ దర్శకులు సాహిత్య మూలాలను ఆశ్రయించడం ద్వారా అశ్లీలత, హింస-ప్రధాన చిత్రాల ధోరణికి ప్రత్యామ్నాయంగా అర్థవంతమైన చలనచిత్రాలను అందించగలరు.

సారాంశంగా చెప్పాలంటే, తెలుగు సినిమా-సాహిత్య అనుబంధం కేవలం అడాప్టేషన్కు పరిమితమైనది కాదు; అది ఒక సాంస్కృతిక సంభాషణ, ఒక తరం నుండి మరో తరానికి జ్ఞాన-భావ ప్రసారం, ఒక సాంఘిక చైతన్య ప్రక్రియ. ఈ అనుబంధం మరింత బలోపేతమైతే తెలుగు సినిమా జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో మరింత గౌరవనీయ స్థానాన్ని సాధించగలదు.

**ఆధార గ్రంథాలు**

1. భారతేతిహాస సినిమాలపై జానపద సాహిత్య ప్రభావం, తిరుపతి, మే, 1999.
2. అంతర్జాలం, వికీపీడియా
3. ఆనాటి అద్భుత చిత్రాలు, హైదరాబాదు, జనవరి, 2017.
4. భక్తి చిత్ర మందారాలు, హైదరాబాదు, ఆగస్టు, 2016.
5. నాటి 101 చిత్రాలు, కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాదు.
6. తొలి 30 వసంతాల తెలుగు సినీ ప్రభ, వి.ఎన్.ఆర్. పబ్లికేషన్స్, విజయవాడ.
7. ఆకాశవాణి ప్రసారాలు

★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# బంజారాల పొడుపు కథలు – ఆచార వ్యవహారాలు



డా॥. తోట రామకృష్ణ
స్కూల్ అసిస్టెంట్, తెలుగు, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల,
పుల్లాయిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఫోన్ : 7569518663.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**ఉపోద్ఘాతం :**

సామాన్యంగా పొడుపు కథలు జనజీవనంలోనూ, వివాహ సందర్భాలలోనూ, పండుగలు తదితర వినోద కార్యక్రమాల్లోనూ ఎక్కువగా వినపడుతూ ఉంటాయి. పొడుపు కథను ఇప్పగలిగిన వాడే జీవితంలో ఏర్పడే కష్టాలను ఎదుర్కొనగలడని జానపదులు నమ్మకం. పూర్వం వివాహ సమయంలో వధువు వేసే పొడుపు కథకు వరుడు సమాధానం చెప్పవలసి వచ్చేది. ఈ పొడుపు కథలు అనేక గిరిజన తెగల వారి సాంప్రదాయాలలో కూడా ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. ఉదాహరణకు దక్షిణాఫ్రికాలో 'బింటు' అనే తెగలోని స్త్రీలు దిగంబరులై నృత్యం చేస్తే వాన పడుతుందనే సాంప్రదాయం ఉంది. ఈ సందర్భంలో మగవారు అక్కడికి వస్తే వారిని కొట్టి అశ్లీలమైన పొడుపు కథలను వేసి వారిని విప్పమనేవారు. అలాగే బంజారాల సంప్రదాయాన్ని కూడా పరిశీలిస్తే బంజారాలు పొడుపు కథలను సామాన్యంగా వర్షాకాలంలోను, వెన్నెల రాత్రులలోను, విశ్రాంతి సమయంలోను, పండుగ పబ్బాలలోనూ, పశువులను కాచే సమయంలోనూ, పొలంలో కలుపు తీసే సమయంలోనూ, తాడు పేనేటప్పుడు కూడా ఈ పొడుపు కథలను చెప్పుకుంటారు ముఖ్యంగా వివాహంలో పెళ్లి కుమారుని తెలివితేటలను పరీక్షించడానికి కూడా పొడుపు కథలు వాడుతారు వారు. ఈ పొడుపు కథలను విశ్లేషించుట ద్వారా మన దేశంలోనే బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకోవచ్చు.

**సంక్షిప్త పరిచయం :**

బంజారాల పొడుపు కథలను సూక్ష్మంగా పరిశీలిస్తే వాటి ద్వారా వారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ను తెలుసుకోవచ్చు. గిరిజనుల జీవితంలో పొడుపు కథలు వ్యక్తి జీవితానికి, అందరికీ సుపరిచితమైన మరొక వస్తువుని అన్వయించుట ద్వారా అశ్లీల పొడుపు కథలను ప్రయోగిస్తారు. కుటుంబ బాంధవ్యాల మధ్య ఏర్పడే పొడుపు

కథలు, వివాహానికి సంబంధించిన పొడుపు కథలు తెలుసుకోవడం వల్ల బంజారాల సంప్రదాయాలు మనం తెలుసుకోవచ్చు, బంజారాలు అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొన్నట్లయితే ఆ సందర్భంలో తీర్పునిచ్చేటప్పుడు కొన్ని పొడుపు కథలు ఆ గ్రామ పెద్ద మనుషులు తమ అనుభవాలతో కూడిన కొన్ని పొడుపు కథలు ఆ సందర్భాలలో అడిగి సమన్యాయ పద్ధతి అవలంబిస్తారు. అంతేకాకుండా శవం మీద పచ్చబొట్టు మీద బంజారాలకు తమకున్న నమ్మకాలను పొడుపు కథ రూపంలో వున్న లోతైన విషయాలు తెలుసుకోవచ్చు. బంజారాలుకు తీజ్ పండుగ దీనికి సంబంధించిన పొడుపు కథలు మనకు కనిపిస్తాయి. విశేషంగా ఇది స్త్రీలకు సంబంధించిన పండుగ ఈ సందర్భంగా బంజారా స్త్రీలు వెదురు బుట్టలో గోధుమ నారను పెంచి 9వ రోజు దాన్ని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంలో కొన్ని పొడుపు కథలు సందర్భాన్ని బట్టి వాడుతుంటారు.

**కీలక పదాలు :**

గాండ్ గండారి, జలేర్ లోటా, కనలోత్, నసాబ్ (పంచాయితీ), పచ్చ బొట్టు, నసి (నార) మొదలైనవి.

**విశ్లేషణ :**

బంజారాలు ఎక్కువగా అరణ్యాలలోనూ, కొండ ప్రాంతాల్లోనూ నివసించడం వల్ల వీరి జీవన విధానం మిగిలిన జానపదుల జీవన విధానం కంటే భిన్నంగా ఉంటుంది. ఈ బంజారాలో మాట్లాడే భాషను 'గోర్ జోలి' అంటారు. వీరి భాషలో పొడుపు కథని, 'నణ్ కిసాన్‌కి' 'ఫోడేర్ సాంకి' అని అంటారు.

నాణ్ కి అంటే చిన్న అనీ, సాంకి అంటే కథ అని అర్థం. అదేవిధంగా 'పోడేర్' అంటే 'పగలగొట్టడం' అని అర్థం. అంటే కథను పగలగొట్టడం. బంజారాలో వివిధ సందర్భాలలో వస్తువులపై తమ ఆచార సాంప్రదాయాలపై, సామాజిక కట్టుబాట్లపై వివిధ రకాల పొడుపు కథలను విచ్చుతూ ఉంటారు. వాటిని పరిశీలిస్తే ఈ క్రింది విధంగా మనం తెలుసుకోవచ్చు.

**వస్తువు మీద – పొడుపు కథ :**

ఇక్కడ బాగుగా అందరికీ పరిచయం ఉన్న వస్తువును వర్ణించి, ప్రసిద్ధమైన మరో వస్తువును తద్వారా సూచిస్తుంది.

**ఉదా :** నాని కీస్ చోరీర్
గాండ్ గండారి (కొత్తిమీర)

**తెలుగు :**

చిన్న పాపకు గుదమంతా వాసన (కొత్తిమీర). చిన్నారి శిశువు మలవిసర్జన చేసిన తరువాత ఆ స్థానం ఎలా ఉంటుందో అందరికీ పరిచయమే. దీని ద్వారా చిన్న పరిమాణం ఉన్న రెండు చెట్లను సూచిస్తున్నారు. 1. కొత్తిమీర, 2. శనగ చెట్టు. ఇక్కడ గాండ్ అనే శబ్దం వృక్షమూలాని సూచిస్తున్నది. ఎలా మర్మ అవయవాల ప్రసక్తి నిరభ్యంతరంగా ఉండటం జానపదులలో ఉన్న గిరిజనులలో ఎక్కువ ఈ అశ్లీలతను ఏ దాపరికం లేకుండా స్త్రీలు అంగీకరించడం, ప్రయోగించడం గిరిజన జీవితంలో ప్రత్యేకంగా చెప్పవలసి ఉంటుంది.

**వ్యక్తులు మధ్య – పొడుపు కథ :**

అత్త కోడలు ఇద్దరు
వదిన మరదలిద్దరూ
చేశారు మూడు రొట్టెలు
తిన్నారు ఒక్కొక్కటి

పై పొడుపు కథలోనే వ్యక్తుల సంబంధాన్ని తెలుసుకోలేని వారు నలుగురూ మూడు రొట్టెలు ఒక్కొక్కటి పూర్తిగా

తినడానికి ఏ విధంగా సాధ్యం? అని చెప్పవచ్చు. కానీ, ఆలోచించి సమస్యను విడిపించినప్పుడు వచ్చే జవాబు చాలా సులభం. (అత్తకు కోడలు ఎవరో; ఆమె మరదలికి వదినే అవుతుంది. అప్పుడు ముగ్గురే అవుతారు). చేసేది మూడు రొట్టెలు. ముగ్గురికి ఒక్కొక్కటి వస్తుంది అన్నప్పుడు సమర్థవంతమైన జవాబు దొరికింది అనిపిస్తుంది.

**వివాహానికి సంబంధించిన – పొడుపు కథ :**

ఉప్పర్ పాడ హాత్
నాయక్ కర ఓతి తవాత్
రామ్ రచ్ ఓరసాద్ (జలేర్ లోటా)
ఊకాయి ఏయే

**తెలుగు :**

పైకి చేతులెత్తి నాయకుడు మాట్లాడతాడు
రాముడు ఉంటాడు అతని వెంట
అది ఏమై ఉంటుంది (నీళ్ల చెంబు)

బంజారాల సాంప్రదాయాలలో 'జలేర్ లోటా' చాలా విశిష్టతను పొందింది. సామాన్యంగా వారి పెళ్లి, పేరంటాలలో ఇది ప్రముఖ పాత్ర వహిస్తుంది. బయటి నుండి వచ్చిన అతిథులకు నీరు నింపిన చెంబును ఇవ్వడం వారి ధర్మం. ఈ విధంగా తనకు ఇచ్చిన నీరును అతిధి కూడా వెంటనే తాగడు. కారణం అది సామాన్యమైన నీరు కాదు. పవిత్రమైన నీరు. ఆ నీరుని స్వీకరించే ముందు అక్కడ ఉండే నలుగురు పెద్దలు అనుమతిని పొందాలి. అతిధి కూడా తనకిచ్చిన నీళ్ళ చెంబును పైకెత్తి దానికి తోడు 'రామ్ రామ్' అని క్షేమ సమాచారాలు అడుగుతూ ఆ నీటిని తాగుతాడు. వారు అడిగే క్షేమ సమాచారాన్ని కనళోత్ అంటారు.

**పంచాయతీకి సంబంధించిన – పొడుపు కథ :**

బంజారాలలో 'గోర్' పంచాయితీ (నసాబ్) ఉంటుంది. సమాజంలో జరిగే ఎలాంటి ఘోర అపరాధాలకైన న్యాయ సమ్మతమైన తీర్పునిస్తారు. ఎంతటి జటిలమైన సమస్యలైనా బంజారాలో తమ పొడుపు కథల మూలంగా పరిష్కరించుకుంటారు. సమాజ కట్టుబాట్లను ఎవరు దాటినడవరు. అపరాధానికి తగిన శిక్షను ప్రతి ఒక్కరు అనుభవించి తీరాలి. బంజారాల తీర్పునిచ్చేటప్పుడు ఎలాంటి మార్గాన్ని అనుసరించేవారనడానికి అనేక పొడుపు కథలు దొరుకుతాయి.

డోర్ డోర్ బెసోమత్
కన్ కన్ బేసో
ఓన్ సోస్ దూండో
ఓర్ నామ వీయే కయి (నసాబ్)

**తెలుగు :**

దూరం దూరం కూర్చోకండి
దగ్గరకు రండి
ఆలోచించి వెతకండి
దాని పేరేమి? (పంచాయితీ)

ఇలాంటి పొడుపు కథ తెలుగులో మనకి కనిపించదు. కారును ఈ పంచాయతీ పద్ధతి బంజారాల్లో మాత్రమే ఉండటం వల్ల దూరం కూర్చోకండి అంటే అభిప్రాయ భేదాలు కలిగి ఉండటం. దగ్గరకు రావడం అంటే ధర్మానికి

అందరూ తల ఒగ్గడం. ఆలోచించి వెతకడం అంటే పెద్ద మనుషులు తమ అనుభవాలతో న్యాయాన్ని గురించి ఆలోచించి చెప్పడం.

**శవం మీద – పొడుపు కథ :**

భారతీయుల అందరి లాగానే సుగాలీలో కూడా దేహం అశాశ్వతమైనది. ఆత్మ నిత్యమని భావన ఉంది. దీనికి సంబంధించిన పొడుపు కథ ఇలా ఉంది.

తీగ ఉండిపోతుంది
కట్టి కాలిపోతుంది
పార వేస్తాం అడివిలో
దాని పేరేమి? (శవం)

ఎక్కడ తీగ అంటే విస్తరించే శరీరం అని అర్థం. తీగ ఎలా విస్తరిస్తుందో దేహం కూడా అలాగే పెరిగి పెద్దదవుతుంది. చెట్టు పెద్దదైతే కొత్త తీగలు పుడుతూనే ఉంటాయి. క్రమంగా మొద్దు ముసలిదై వాడిపోతుంది. అగ్గిపెట్టి కాల్చి వేస్తాం అయినా కొత్త తీగలు కొనసాగుతూనే ఉంటాయి. అక్కడ అడివిలో కాల్చి పారేయడం అనే ఈ పద్ధతి గిరిజనుల పోడు వ్యవసాయాన్ని సూచిస్తుంది. అడవులు కాల్చి చదును చేసి వారు వ్యవసాయం చేస్తారు. ఆ అనుభవం నుండి పుట్టిన పొడుపు కథ ఇది. కానీ, చిత్రం ఏమిటంటే ఈ వ్యవసాయకి అర్థాన్ని వారు జీవితానికి అన్వయించి మనిషి చనిపోయాక ఆ దేహాన్ని అడవిలో తగలబెట్టి వస్తామని, అయినా అతని వంశం కొనసాగుతూ ఉంటుందని చెప్పడం కోసం ఈ పొడుపు కథలు వాడుతారు. అందుచే ఇక్కడ తీగ అంటే ఒకవైపు ఆకు, మరొకవైపు వంశం. దీనికి మూలంగా వారి వ్యవసాయ జీవితం ఉంది.

**పచ్చబొట్టు మీద – పొడుపు కథ :**

ప్రతి ఒక్క బంజారా స్త్రీ తన శరీరం మీద పచ్చబొట్టును వేయించుకుని తీరాలి. ఎందుకంటే చచ్చిన తర్వాత స్వర్గ స్థానం లభించేది పచ్చబొట్టు ఉంటేనే అనే ఒక అపారమైన నమ్మకం వారిలో ఉంది. అందుకు ఏ స్త్రీ అయితే పచ్చ బొట్టు వేయించుకోదో ఆమెకు నరకమే గతి అనే భావన ఉంది. బహుశా ఈ విధమైన నమ్మకం వేరెక్కడా ఎక్కడ కనిపించదు.

ఘూలేన్ అవచ్
కాడేన్ అయేని (పచ్చబొట్టు)

**తెలుగు :**

వేయడానికి వస్తుంది
తీయడానికి రాదు (పచ్చబొట్టు)
పచ్చబొట్టు పొడిపించుకున్న తర్వాత తీసివేయలేం. కాబట్టి ఈ పొడుపు కథ పుట్టింది.

**తీజ్ పండుగ మీద – పొడుపు కథ :**

బంజారాలకు తీజ్ పండుగ ఎంతో విశిష్టమైనది. దీనికి సంబంధించిన పొడుపు కథలు మనకు కనిపిస్తాయి. విశేషంగా ఇది స్త్రీలకు సంబంధించిన పండుగ. ఈ సందర్భంలో బంజారా స్త్రీలు వెదురు బుట్టలో గోధుమ నారను (నసి) పెంచి 9వ రోజు దాన్ని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంలో పాడే పాటలు పొడుపు కథలు లాగానే ఉంటాయి. బుట్టలో పెంచినటువంటి నారాయణ 9 వ రోజు కోసి వాటిని పరస్పరం పంచుకుంటూ ఇలాంటి పొడుపు కథలు చెప్పుకుంటారు.

తొమ్మిది రోజుల పెళ్లి కాని వాడు
తొమ్మిది రోజుల గోధుమ నార
తొమ్మిది ఘడియాల కననజీ
రుమాలలో అలంకరింపబడతాడు (నార తలపాగాలో వేయుట)

ఇక్కడ తొమ్మిది రోజులు పెళ్లి కానీ వాడు అంటే తీజ్ బుట్టలను వేసే ఆడపిల్లలు. ఈ ఆడపిల్లలకు వివాహం అయితే వారు తీజ్ బుట్టలు వేయడానికి అనర్హులు. అందుకే ఆ కన్యలను నాయక్ తలపాగతో పోల్చడం జరిగింది. ఈ తొమ్మిది రోజులు పెంచిన నారను తొమ్మిది నిముషములకే కోసి వేస్తారు. కోసిన నారను తాండా నాయక్ తలపాగాల యందు అలంకరిస్తారు. ఈ తలపాగానే కసన్ జీ అనే పేరుతో పిలుస్తుంటారు. వీరు అలంకరించే విధానాన్ని ఛూంగాపర్ భాందేరో అంటారు. బంజారాలు తమలో దాగి ఉండే పొడుపు కథలు సాధారణంగా ఎక్కడ ఉంటే అక్కడ బహిరంగంగా చెప్పరు ఎందుకంటే...

వాతేన్ జతన్ కరణ్
పగలేపర్ రకాడన్
ఖర్చు కరణూ

**తెలుగు :**

మాటను భద్రంగా దాచుకొని నీ దగ్గర పెట్టుకో. సమయం వచ్చినప్పుడు కట్ చేస్తూ ఉండు అన్నది వీరిలో సాంప్రదాయకంగా వస్తున్న నీతి. అంటే మాటల్ని చాలా జాగ్రత్తగా వాడుకోవాలనీ, సమయ సందర్భాలలోనే దానిని బయట పెట్టాలని వీరు భావన.

**ముగింపు :**

బంజారాల ఆచార సాంప్రదాయాలు, వ్యవహారాలు జానపదుల ఆచార వ్యవహారాలకి భిన్నమైనవి. మీరు ఎక్కువగా అరణ్యాలలోనూ, కొండ ప్రాంతాల్లోనూ నివసించడం వలన వీరి సంస్కృతి సాంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. వివాహానికి సంబంధించిన పొడుపు కథలు, పంచాయతీకి సంబంధించిన పొడుపు కథలు, పచ్చబొట్టుపై వారికున్న అపార నమ్మకం మరి ఏ ఇతర జానపదుల్లోనూ మనకు కనిపించవు. భారతీయుల అందరి లాగానే వీరిలో కూడా దేహం అశాశ్వతమైనది అనే భావన ఉండటంతో పాటు ఆత్మ నిత్యం అనే భావన వీరిలో అధికంగా ఉంటుంది.

సామాజిక కట్టుబాట్లు, వారి తండాలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలిస్తూ, ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకి పాల్పడితే పంచాయతీ తీర్పులో కూడా సందర్భాన్ని బట్టి పొడుపు కథలును వాడటం వీరిలోనే కనిపిస్తుంది. ఇంత వరకు 'బంజారాల పొడుపు కథలు - ఆచార్య వ్యవహారాలు' అనే అంశంలో భాగంగా వారి యొక్క సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక కట్టుబాట్లను పచ్చబొట్లు పై వారికి ఉన్న అపారమైన నమ్మకాన్ని, తీజ్ పండుగలో ఆచరించే సంప్రదాయాలను విశ్లేషించుటకు ప్రయత్నించితిని.

**ఆధార గ్రంథాలు :**

1) గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం. గోనా నాయక్

★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/



# సామాజిక మాధ్యమాలు, సినిమాలు - జానపద గేయాల ప్రాముఖ్యత

అద్దంకి శ్రీను
తెలుగు అతిథి అధ్యాపకులు, తెలుగు శాఖ, మునగాల కొండల్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) - దేవరకొండ. చారవాణి : 7093944931,
ఈ మెయిల్ : addankisrinu6@gmail.com.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.A.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

జానపద పాటలు ఎన్నో ఏళ్ల నుండి మౌఖిక రూపంలో ఒక తరం నుండి మరొక తరానికి అందుతున్న అద్భుత అమూల్య సాహిత్య సంపద. సామాజిక సాంస్కృతిక చారిత్రక ఉద్యమాలతో ముడిపడి ఉన్నవి జానపద పాటలు. అలాంటి నేపథ్యం కలిగిన ఈ జానపద పాటలు ఒకప్పుడు పల్లె వాసుల నోటి నుండి తప్ప మరొక రూపంలో కానీ మరొక విధంగా కానీ వినేటటువంటి ఆస్కారం లేకుండా ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మారిన ప్రజల జీవన విధానాల దృష్ట్యా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అనేక సామాజిక మాధ్యమాల ద్వారా పల్లె ప్రజల నోటి నుండి ప్రత్యక్షంగా వినే జానపదాలను పరోక్షంగా అనేక గేయాలను నేడు వింటున్నాం. ఈ నేపథ్యంలోనే తెలుగు సినిమాలపై జానపద పాటల ప్రభావం గట్టిగానే పడింది అని చెప్పాలి. సామాజిక మాధ్యమాలలో తెలుగు సినిమాలలో జానపద గేయాల ప్రాముఖ్యతను విశ్లేషించడం, చర్చించడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. పనిలో అలసటను మర్చిపోవడానికి జతకట్టుకున్న జానపదం, పల్లెకు మాత్రమే పరిమితమైన జానపదం, నేడు ప్రపంచానికి విస్తరించి ఎన్నో లక్షల హృదయాలను గెలుచుకుంది. యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, వంటి మాధ్యమాలను సినిమా ప్రపంచాన్ని ఒక ఊపు ఊపుతుంది.

**Key words :**

జానపద పాటలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, పల్లె ప్రజలు, సాహిత్యం,

**ఉపోద్ఘాతం:**

తొలినాళ్లలో జానపపదం ఒక తరం నుండి మరొక తరానికి కేవలం నోటిపాటగా మాత్రమే ప్రత్యక్షంగా ప్రచారంలో ఉండేది. ఎప్పుడైతే రేడియోలు టెలివిజన్లు సినిమాలు సామాజిక మాధ్యమాలు వచ్చాయో అప్పుడే పరోక్షంగా

విస్తృత ప్రచారంలోకి జానపదం అడుగు పెట్టింది. జానపదం ఒక జాతి సంస్కృతి సాంప్రదాయ జీవన విధానానికి అద్దంపట్టే సాహిత్య విజ్ఞాన గని. ఆధునిక సాహిత్య సంగీత ప్రపంచంలో సినిమాలు, సామాజిక మాధ్యమాలు జానపద గేయాల ప్రచారానికి కీలకపాత్ర పోషిస్తున్నాయి.

**జానపద గేయాల స్వరూపం :**

జానపదులు పంట పొలాలలో పనిచేసేటప్పుడు తమ పనిలోని అలసటను మర్చిపోవడానికి అప్పటికి అప్పుడు ఆశువుగా పాటలను అల్లుకున్నారు. అలా అల్లుకున్న అనేకమైన పాటలు మౌఖిక రూపంలో అనగా ఒకరు నోటి నుండి విని మరొకరు నేర్చుకునే పద్ధతి ఇలా ఎన్నో తరాలుగా విస్తరిస్తూ వస్తున్నాయి. జానపద పాటలకు పలానా రచయిత అని కానీ పలానా కాలంలో పుట్టింది అని కానీ ఖచ్చితమైన నిర్ణయం చెప్పలేము. ఏ కాలంలో ఎవరి నోటి నుండి ఒక జానపదం ఉద్భవించిందో చెప్పడం చాలా కష్టం. ఆశు రచన, అజ్ఞాత కర్తృత్వం, అనిర్ణీత రచనాకాలం జానపద గేయాల ప్రధాన లక్షణాలు. పల్లె ప్రజల సహజ జీవన విధానానికి సంబంధించిన జానపద గేయాలు. జానపదం అనగా ఒక చిన్న పల్లె అని అర్థం ఆ పల్లెలో నివసించే వారే జానపదులు వారికి సంబంధించిన గేయాలే జానపద గేయాలు, పల్లె పాటలు. జానపదులు ప్రకృతిని ఆరాధించి, ఆస్వాదించే వాళ్లు మట్టిని గుండెలకు హత్తుకునే మట్టి మనుషులు కనుకనే తమ పాటలలో చెట్టుకు, పుట్టకు, మట్టికి, మనిషికి ప్రాధాన్యత ఇస్తూ పాడుకునేవాళ్ళు.

**జానపద గేయాలు – సామాజిక జీవనం :**

సమాజంలో అక్షర జ్ఞానం లేని పల్లె శ్రామిక సామాన్య ప్రజలు మట్టిని దున్నేటప్పుడు చెట్టును కొట్టి చదును చేసేటప్పుడు నారు పోసినప్పుడు నీరు మలిపినప్పుడు కోత కోసినప్పుడు కుప్పనూర్చినప్పుడు బండికెత్తినప్పుడు పెళ్లిళ్ల చేసేటప్పుడు పండుగలు చేసేటప్పుడు ఇలా అనేక సందర్భాలలో అలవోకగా ఆశువుగా గేయాలను అల్లుకుని తరతరాలుగా ఒక తరం నుండి మరొక తరానికి అందిస్తున్నారు. ప్రకృతి ఒడిలో జీవిస్తున్న పల్లెవాసులు వర్షం పడినప్పుడు వాగులు పొంగినప్పుడు పక్షులు అరిచినప్పుడు లేళ్ళు దునికినప్పుడు ఆనందంతో పరవశించి రాగయుక్తంగా పలికిన ఆ జానపదుల పలుకుల నుండి జానపద గేయం పుట్టింది. బాధ కలిగిన సంతోషం కలిగిన ఆవేశం కలిగిన తమ భాషలో భావయుక్తంగా పాడుకునేవారు. సామాజిక జీవన విధానంలో జానపదులు వివిధ రకాల వృత్తులను నిర్వర్తించేవారు. ఆయా సందర్భాలలో వృత్తిరీత్యా చేసే శారీరక శ్రమ తెలియకుండా ఉండటానికి నూతన ఉత్తేజం పొందడానికి ఈ జానపద గేయాలు పాడుకునేవారు. జానపద గేయాలలో భాంధవ్య విలువలు ప్రకృతిని ఆరాధించి గౌరవించడం సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడం వంటి సామాజిక సందేశాలు అంతర్లీనంగా ఉంటాయి.

**సామాజిక మాధ్యమాలు – జానపద గేయాలు :**

ప్రస్తుతం శరవేగంగా విస్తరిస్తున్న డిజిటల్ యుగంలో ఫేస్ బుక్, యూట్యూబ్,ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్, షేర్ చాట్ లాంటి సామాజిక మాధ్యమాలు జానపద గేయాల ప్రచారానికి ప్రధాన వేదికగా నిలుస్తున్నాయి.

2010 సంవత్సరానికి ముందు ఎక్కువగా ఈ జానపద పాటలను కొంతమంది జానపద కళాకారులు ప్రజల నుండి పాటలు సేకరించి రికార్డింగ్ చేపించి రీల్ క్యాసెట్ ద్వారా విడుదల చేసేవాళ్లు. అలా విడుదల చేసిన రీల్ క్యాసెట్ లను కొనుగోలు చేసి టేపు రికార్డులలో వేసి వినేవాళ్లు. అడపాదడప జానపద పాటలను వీడియో చిత్రీకరణ చేసి సిటీ కేబుల్ లాంటి లోకల్ డిష్ చానల్స్ లలో ప్రసారం చేసేవాళ్ళు.

పల్లెల్లో పని చేస్తూ పాటలు పాడుకునే జానపద కళాకారుల మట్టి పరిమళాల స్వచ్ఛమైన అచ్చమైన జానపద గేయాలతో తెలుగు జానపద సంగీత రియాలిటీ షో "రేలారే రేలా" అనే కార్యక్రమాన్ని తొలిసారిగా 2008 సంవత్సరంలో ప్రముఖ టెలివిజన్ "మాటీవీ" లో ప్రసారమైంది. ఈ కార్యక్రమానికి ఫోక్ డైరెక్టర్ సురేష్ దర్శకత్వం వహించగా ఉదయభాను హోస్టుగా సుద్దాల అశోక్ తేజ, గోరేటి వెంకన్నలు న్యాయనేతలుగా వ్యవహరించారు. ప్రతి శనివారం

ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా ఈ రేలారే రేలా జానపద గేయాల కార్యక్రమం కోసం ఎదురు చూసేవాళ్ళు అంటే ఈ కార్యక్రమం ఎంతగా ప్రజాదరణను పొందిందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నో రకరకాల జానపద గేయాలను ప్రజలు నేరుగా టెలివిజన్ ల ముందు కూర్చుని వింటూ ఆనందిస్తూ ఈలలు వేస్తూ ఆస్వాదించేవాళ్లు.

ఈ మధ్యకాలంలో యూట్యూబ్ వేదికగా విడుదలైన" రాను బొంబాయికి రాను" అనే జానపద పాట ప్రపంచ వ్యాప్తంగా 850 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి తెలుగు జానపద గేయం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి సాటి చెప్పింది. యూట్యూబ్లో ఒక తెలుగు జానపదం సంచలనం సృష్టించి ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది. ఈగేయాన్ని రాథోడ్ ట్యూన్స్ అనే యూట్యూబ్ ఛానల్ లో రాము రాథోడ్ లిరిక్స్ రాసి పాడి నటించగా, ఫిమేల్ వర్షన్ సింగర్ ప్రభ, సంగీతం కళ్యాణ్ కీస్, కొరియోగ్రఫీ శేఖర్ వైరస్, డి.ఓ.పి హరీష్ పటేల్ తదితరులు కలిసి సృష్టించిన జానపద ప్రభంజనం. ఈ పాటే కాకుండా 100 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన జానపద పాటలు చాలానే ఉన్నాయి.

ఈ సామాజిక మాధ్యమాల ద్వారా మరుగున పడిన అనేకమంది కళాకారులు ప్రపంచానికి పరిచయం అవుతున్నారు. తమలోని నైపుణ్యాలను వెలికి తీసి ఎంతో మంది వెలుగులోకి వచ్చారు. ఇంకెంతో మంది ఈ జానపద పాటలను చిత్రీకరించి ఆర్థికంగా సామాజికంగా బలపడుతున్నారు. ఇలా చిత్రీకరించిన జానపద పాటలను పాడిన వారు నటించిన వారు రాసిన వారు ఈ సామాజిక మాధ్యమాల ద్వారా నేరుగా సినిమా రంగంలో అవకాశాలు పొందుతున్నారు. అలా సినిమాలలో అవకాశాలు పొంది పాటలు పాడిన కొంతమంది జానపద కళాకారుల వివరాలు అందిస్తాను.

"ఫిదా" సినిమాలో వచ్చిండే మెల్ల మెల్లగా వచ్చిండే అనే పాట మరియు "సరిలేరు నీకెవ్వరు" సినిమాలో హీస్ సో క్యూట్ అనే పాట అలాగే "సంక్రాంతి వస్తున్నాం" సినిమాలో గోదారి గట్టు పైన రామచిలకవే అనే పాటలను జానపద గాయని మధుప్రియ ఆలపించారు. జానపద గాయని మంగ్లీ కూడా అనేక సినిమాలలో పాటలు పాడారు అందులో కొన్ని ముఖ్యమైనవి "లవ్ స్టోరీ" సినిమా లో సారంగదరియా అనే పాట, "జార్జిరెడ్డి" సినిమాలో వాడు నడిపే బండి రాయల్ ఎన్ఫీల్డ్ అనే పాట ,"అలవైకుంఠపురంలో" రాములో రాముల అనే పాట, "బలగం" సినిమాలో ఊరు పల్లెటూరు అనే పాటలను ఆలపించారు. అలాగే "పుష్ప" సినిమా మొదటి భాగంలో సామీ సామి అనే పాటను మౌనిక యాదవ్, ఊ అంటావా మావ అనే పాటను ఇంద్రావతి చౌహన్, "బ్యాండ్ మేళం" సినిమాలో తిప్పుకుంటాన్నవ్ అనే పాటను రాము రాథోడ్, "పుష్ప సినిమా రెండవ భాగంలో" వచ్చుండాయి ఫీలింగ్స్ అనే పాటను దాస లక్ష్మి, శంకర్ బాబు మరియు "ప్యారడైజ్" సినిమాలో ఆయా షేర్ అనే పాటను జంగిరెడ్డి ఆలపించారు. ఇలా జానపద గాయకులు ఆలపించిన ఈ సినిమా పాటలన్నీ కూడా ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన పాటలే. జానపద కళాకారులు సినిమాలలో అనేక పాటలు పాడుతూ సినిమా రంగంలో తమకంటూ ఒక గుర్తింపు పొందుతున్నారు.

**తెలుగు సినిమాలు – జానపద గేయాలు :**

తెలుగు చలనచిత్ర పరిశ్రమ పైన జానపద పాటల ప్రభావం ఎంతగానో ఉంది అని చెప్పాలి.అనేకమైన తెలుగు చలనచిత్రాలలో జానపద నేపథ్యం కలిగిన పాటలు బాణీలు చోటుచేసుకుని ప్రేక్షకులను అలరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలలో వైరల్ అయిన ఒక జానపద పాటను లేదా గాయకుడిని గుర్తించి సినిమాలలో అవకాశాలు ఇస్తున్నారు. అంతగా జానపద పాటలు సినిమాలను ప్రభావితం చేస్తున్నారు.

నాటి ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్ లాంటి తొలితరం తెలుగు సినిమా కథానాయకుల నుండి నేటి వరకు అనేక తెలుగు సినిమాలలో జానపద బాణీలకు కొత్తగా సంగీతాన్ని మార్చి అందించడం వలన జానపదాలను నేటి యువతరం ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా తెలుగు సినిమా రంగం ప్రారంభం నుండి జానపద పౌరాణిక కథల

పైననే ఎక్కువగా ఆధారపడింది. ఆ కథలకు అనుగుణంగానే జానపద పాటలను జోడిస్తూ ప్రజల మధ్య ఉన్న జానపద గేయాలకు కొత్త రూపం ఇచ్చి సరికొత్తగా మళ్లీ ప్రజల వద్దకే సినిమాలు తీసుకువస్తున్నాయి.

పల్లెకు పరిమితమైన జానపద గేయాలు సినిమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి.తమ పల్లెల్లో ఉండే వాతావరణం,తమ పల్లెల్లో పాడుకునే పాటలు, తమ పల్లెల్లో నర్తించే వివిధ రకాల నృత్యాలను సినిమాలలో చూసి ఆనందిస్తూ ప్రజలు అమితంగా ఆదరిస్తున్నారు. అందుకే తెలుగు చలనచిత్రాలలో జానపద పాటలకు విశేష ఆదరణ లభించింది. అనేక రకరకాల జానపద గేయాలు కనుమరుగు కాకుండా సినిమాలు కాపాడుతున్నాయని చెప్పాలి. ఇది జానపదులకు జానపద గేయాలకు జానపద సాహిత్యానికి జానపద విజ్ఞానానికి ఒక శుభ సూచికమని చెప్పాలి. యువతలో జానపద బాణీల పట్ల జానపద సంగీతం పట్ల ఆసక్తి పెరగడానికి కూడా సినిమాలు కారణం అవుతున్నాయి.

వివిధ సినిమాలలో జానపద పాటల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి

1) సర్కస్ సత్తిపండు (1997)-వస్తావా జానకి వంగతోటకి, (2)రాజా ది గ్రేట్ (2017)-గున్న గున్న మామిడి, (3) కృష్ణార్జున యుద్ధం (2018)-దారి చూడు దుమ్ము చూడు మామ, (4) పలాస1978(2020)-నాది నక్కిలీస్ గొలుసు, బావొచ్చాడోలక్క బావొచ్చాడు, (5) శ్రీకారం (2021)-భలే ఉంది బాల, (6) లవ్ స్టోరీ (2021)-దాని పేరే సారంగా దరియా, (7) ధమాకా (2022)-పల్సర్ బైక్ మీద రారా మామ, (8) కోట బొమ్మాలి (2023)-లింగి లింగి లింగి లింగిడి, (9) గరివిడి లక్ష్మి (2026)-కోసింది కోయిగూర కట్ట, నల జీలకర్ర మొగ్గ

ఈ విధంగా జానపద గేయాలను, బాణీలను, నృత్యాలను వేషధారణను, వాతావరణాన్ని అనేక సినిమాలలో చూపిస్తూ తెలుగు చలనచిత్ర పరిశ్రమ జానపద సాహిత్యానికి కొత్త రూపాన్ని అందిస్తుంది.

**జానపద గేయాలు – యువతపై ప్రభావం :**

జానపద గేయాలు యువతరాన్ని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.సినిమా పాటల కంటే ఎక్కువ జానపద గేయాలపై మక్కువ పెంచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం డీజేల ప్రభావం వలన జానపద పాటలకు అమితంగా ఆకర్షితులు అవుతున్నారు. ఎన్నో రకాల జానపద గేయాలు ఇన్ స్టాగ్రామ్ రీల్స్ ల రూపంలో యూట్యూబ్ షార్ట్ వీడియోలు రూపంలో తక్కువ సమయంతో ఎక్కువ మందికి చేరువవుతున్నాయి. పెళ్లిళ్ల పుట్టినరోజు వేడుకలు పండుగలు మొదలైన వివిధ కార్యాలలో పల్లె మట్టి వాసన కలిగిన జానపద డీజే గేయాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా దేవతారాధన జానపద గేయాలు అయినా దుర్గమ్మ మేలుకొలుపు గేయాలు మల్లన్న గేయాలు బోనాల పండుగ సందర్భాలలో మైసమ్మ ఎల్లమ్మ గేయాలు యువతను మరింతగా ఆకర్షిస్తున్నాయి. ఇలా ఈ జానపద గేయాల ప్రభావంతో యువత తమ సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన అభిమానం పెంచుకుంటున్నారు. జానపదం అనేది కేవలం ఒక వినోదం మాత్రమే కాదని అది మన వారసత్వ సాహిత్య సాంస్కృతిక సంపదని తెలుసుకుంటున్నారు.

**జానపద గేయాల పరిరక్షణ – తీసుకోవలసిన జాగ్రత్తలు :**

జానపద గేయాలు అనేక తరాలుగా మౌఖికంగా సంక్రమిస్తూ వస్తున్నాయి. అలాంటి స్వచ్ఛమైన పల్లె పాటల వారసత్వాన్ని పరిరక్షించడం కోసం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

1. అశేషంగా పడి ఉన్న గ్రామీణ ప్రాంతాలలోని జానపద గేయాలను సేకరించి ప్రచురించి భద్రపరచాలి. ఇలా చేయడం వలన అనేక జానపద గేయాలు సజీవంగా ఉండిపోతాయి.
2. సేకరించిన జానపదాలను ప్రచురించడమే కాకుండా ఆడియో వీడియోల రూపంలో రికార్డింగ్ చేపించి సామాజిక డిజిటల్ మాధ్యమాలలో నిలువ చేయాలి. తద్వారా అనేక మందికి జానపద గేయాలు ఇంకా దగ్గరవుతారు.

3. పల్లెల్లో ఈ జానపద గేయాలను పాడే వారిని గుర్తించి వారిని వెలుగులోకి తీసుకువచ్చి ప్రోత్సహించాలి. ఇలా చేసినట్లయితే మరుగునపడిన ఎందరో జానపద గాయకులు ప్రపంచానికి పరిచయం అవుతారు.
4. తెలుగు పాఠ్యపుస్తకాలలో ఈ జానపద గేయాలను పొందుపరిచి విద్యార్థి దశ నుండి జానపద సాహిత్యం పైన ఆసక్తి కలిగించాలి.
5. ఆధునీకరణ పేరుతో స్వచ్ఛమైన జానపద గేయాల అసలు భావం భాష రూపం దెబ్బతినకుండా చూడాలి.
6. ఈ జానపద గేయాలపై జానపద సాహిత్యం పై విశేషమైన పరిశోధనలు చేపట్టేలా పరిశోధన సంస్థలు విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాలి.

**ముగింపు :**

సామాజిక మాధ్యమాలు సినిమాలు జానపద గేయాలకు కొత్త ఊపిరిని అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినప్పటికీ మన పుట్టుపూర్వోత్తరాలను సంస్కృతి సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను మనం మర్చిపోకుండా ఉండడానికి ఈ జానపద గేయాలు ఎంతగానో దోహదపడతాయి. సినిమాలు సామాజిక మాధ్యమాలు జానపద గేయాలను సజీవంగా ఉంచడానికి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. పల్లె ప్రజల భాషా సంపద,సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే అమూల్యమైన నిధులు జానపద గేయాలు.ఇలాంటి మన జానపద సంపదను పరిరక్షించి,ప్రచారం చేసి ముందు తరాలకు అందించడం మనందరి బాధ్య త.వెలుగులోకి రాని మరుగున పడిన మాణిక్యాల లాంటి జానపద గేయాలు పల్లెల్లో ఇంకా అనేకంగా ఉన్నాయి.అలాంటి స్వచ్ఛమైన జానపద గేయాలను పాడే వారిని ఆదరించి అభిమానించి ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత మన పైన ఎంతైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. రామరాజు, బిరుదురాజు, తెలుగు జానపద గేయ సాహిత్యం, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 1978.
2. సుందరం, ఆర్ వి ఎస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1983.
3. సుందరం, ఆర్ వి ఎస్, జానపద సాహిత్య స్వరూపం, విశాలాంధ్ర పబ్లికేషన్స్,హైదరాబాద్, 1993.
4. దామోదరరావు, బి, జానపద విజ్ఞానం పరిశోధన, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్, 2001.
5. శ్రీరామచంద్రమూర్తి, చల్లా,జానపద విజ్ఞాన పరిశోధక బ్రహ్మ ఆర్ వి ఎస్ సుందరం, ఔచిత్యం అంతర్జాల తెలుగు పరిశోధక మాసపత్రిక, 2023.
6. సంపత్ కుమార్ రెడ్డి, మట్ట,వర్తమానంలో జానపద గేయం సేకరణ సవాళ్లు అవగాహన, ఔచిత్యం అంతర్జాల తెలుగు పరిశోధక మాసపత్రిక, 2025.
7. ధాత్రి టీవీ యూట్యూబ్ ఛానల్, తెలుగు సంతకం బిరుదు రాజు రామరాజు, 2026.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# ప్రజా కళ – బుర్రకథ



డా॥. లింగా శ్రీనివాస్
లోక కళా వికాస పరిషత్తు, హైదరాబాద్, సెల్ : 9030340884.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**పరిచయం :**

గ్రామీణ జీవనంలోని సాంస్కృతిక వికాసానికి జానపద ప్రదర్శన కళల పాత్ర ముఖ్యమైనది. ఆయా కుల పురాణాలు గానం చేయుటలోనూ, రామాయణ, మహాభారత ఇతిహాస గాథలను ప్రదర్శించి తరతరాలకు అందించుటలోనూ కళలే ప్రధానం. జానపద ప్రదర్శన కళలలో వృత్తికళలు, ఔత్సాహిక కళలు కలవు. అలాగే జానపద సంగీతంలో పల్లెపాటలు, పనిపాటలు, నిత్య జీవనంలో అలసటను మరచేందుకు అలవోకగా, అశువుగా పాడుకునే పాటలు అనేకం కలవు.

కాలానుగుణంగా వచ్చే మార్పుల దృష్ట్యా సమాజంలో జరిగే అనేక అరిష్టాలను, సామాజిక రుగ్మతలుగా భావించి వాటిని రూపుమాపడానికి, ఉద్దీపనగా కొన్ని కళా రూపాలు వినియోగింపబడుతున్నాయి. ప్రజాక్షేత్రంలో రచ్చబండ, సమావేశ మైదానాలు వేదికగా గ్రామాలలో ఎక్కువ జనాధరణ కలిగి సామాజిక చైతన్యం కోసం దోహదపడే కళారూపాలు కలవు.

తెలుగు రాష్ట్రాలలో ప్రాంతాలవారీగా యాసలు వేరైనా ప్రజాక్షేత్రంలో ప్రదర్శించే లక్ష్యం మాత్రం ఒక్కటే. అదే ప్రజా సంక్షేమం. వివిధ సమస్యలను కథావస్తువుగా చేసుకొని సాగే ఈ కళారూపాలు ప్రజల సామాజిక అసమానతలను, సాంఘీక సమస్యలను, సాంస్కృతిక పరిరక్షణ విలువలను గూర్చి సవివరంగా వివరించి, సమస్యల సాధనకై పరిష్కారదిశగా పనిచేయగలవు.

**కీలక పదాలు :**

నిర్వచనం, వాద్యాలు, ఆహార్యం, వంతలు, బుర్రకథ - అవతరణ (జంగం కథలు, శారద కథలు) వికాసం, స్వరూప స్వభావాలు, ఉత్తమ కళారూపం, ఆనాటి కథా విధానం, కథలోని అంశాలు, ఇతివృత్తంలో వచ్చిన మార్పులు,

కథావస్తువు. సుప్రసిద్ధ బుర్రకథలు - రచయితలు, ప్రదర్శన సమయాలు - సందర్భాలు, వేదిక, ప్రదర్శనా బేధాలు, వంత పదాలు. ఉద్యమాలు - సామాజిక చైతన్యం, తెలంగాణ తొలిదశ ఉద్యమం.

**విషయ చర్చ :**

**తెలుగు రాష్ట్రాలలోని అపురూపమైన కళాప్రదర్శన బుర్రకథ :**

కథాగానాలలో ప్రాచీనంగా వెలుగొందిన శారద కథ, జంగం కథలలోని తందాన వరుసలను, రగడలను క్రోఢీకరించి పద్మశ్రీ షేక్ నాజర్ గారు కాకుమాను సుబ్బారావు, సుంకేటి సత్యనారాయణ గారి వంటి ప్రసిద్ధ కళాకారులు, ప్రజా అవసరాల కోసం తయారు చేసిన సరికొత్త కళారూపం "బుర్రకథ".

**వాద్యాలు :**

ఇందులో ముఖ్యంగా ప్రధాన కథకుడు, ఇద్దరు వంతలు ఉంటారు. వారిలో ఒకరు హాస్యగాడు మరొకరు రాజకీయ వంత. ప్రధా కథకుడు తంబూర వాయిస్తూ కథను నడిపిస్తాడు. ఇద్దరు వంతలు డక్కి లేదా బుర్ర మరికొన్ని ప్రాంతాలలో "గుమ్మెట" అనబడే వాద్యాలు వాయిస్తూ కథను గానం చేస్తారు.

**ఆహార్యం :**

ప్రధాన వంత అందమైన మహరాజును పోలిన అంగారక వస్త్రం, తలపాగ నడుముకు దట్టి కట్టుకొని తురాయి ధరిస్తాడు.

**వంతలు :**

హాస్యగాడు, రాజకీయ వంతలు సైనికులవలె (పూర్వకాలం) పొట్టి అంగారక మరియు నడుం పంచే కట్టుకుంటారు. కాళ్ళకు అందరూ గజ్జెలు కట్టుకొని ప్రదర్శిస్తారు.

**కథ :**

సంధర్భానుసారంగా కథా వస్తువు మార్చుకుంటూ హాస్యాన్ని రాజకీయాన్ని పండిస్తూ రస రమ్యంగా సాగుతుంది.

**ప్రజాకళ – బుర్రకథ :**

మనుషుల్లో సామాజిక స్పృహను పెంపొందించుటకు సృష్టించుకున్న ఆశుకళే బుర్రకథ. అందుకే తొలిదశలో బుర్రకథలు రాయాలంటే ముఖ్యంగా ప్రధాన కథకులే స్వయంగా రచించేవారు. ప్రజానాట్యమండలి ద్వారా ప్రతి మండలాల్లోనూ బుర్రకథ బృందాలు వెలిశాయి. రసజ్ఞులైన ప్రేక్షకులను కట్టిపడేసే విధంగా వంతలు ప్రదర్శించే హాస్యం, ఛలోక్తులు, రాజకీయ బాష్యం, అలాగే ప్రధాన కథకుని భాష, గానం, అభినయం వెరసి ప్రజలలో ఒకవైపు ఉల్లాసాన్ని నింపుతూనే సామాజిక కోణంలో ఆలోచింపజేసేవి.

**బుర్రకథ వికాసం :**

బుర్రకథా గానంలో కథా వస్తువుగా రామాయణ, మహాభారత, పౌరాణిక, జానపద కథలే కాకుండా, సామాజిక, చారిత్రక కళలు కూడా ఉన్నవి. స్థానిక సమస్యల నుండి జాతీయ, అంతర్జాతీయ విషయాలనూ బుర్రకథ విశేషంగా స్పృశించింది. 19వ శతాబ్దపు తొలినాళ్ళలో ఫాసిజాన్ని నిరసిస్తూ వచ్చిన 'టాన్యా' కథ, ఆనాటి కాలమాన పరిస్థితులను, జమిందారీ వ్యవస్థను వివరించిన 'కష్టజీవి'., 'బెంగాల్ కరువు' తదితర అంశాలలోనూ బుర్రకథలు ఉండేవని వివిధ పరిశోధన గ్రంథాలలో తెలుపబడినది. (పుట-7,డా॥వై.పి.రాజు. బుర్రకథ - సామాజికాంశాలు). ఆనాటి కాలంలోని అభ్యుదయ వాదులైన కందుకూరి, గురజాడ మొదలగు వారి కథలను కూడా బుర్రకథలో గానం చేశారు. ఝాన్సీ లక్ష్మీభాయి, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ మున్నగు వారి త్యాగాలను కథలుగా గానం చేసింది ఈ కళారూపం. పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం కథలతో ఆనాటి జనాలకు ప్రేరణ కల్గించింది. జానపద కథలైన బాలనాగమ్మ,

లక్ష్మమ్మ కథలే కాకుండా మహా భారత, పురాణ ఇతిహాస గాథలైన వీరాభిమన్యు, ప్రమీలార్జునీయం, భక్త మార్కండేయ, నరకాసుర వధ, మాయాబజార్, మొదలైన కథలు ఎన్నో ఈ బుర్ర కథలో కథా వస్తువులుగా విలసిల్లాయి.

**భాషా వైశిష్ట్యం :**

జానపద వాఙ్మయ చరిత్రలో బుఱ్ఱకథకు ప్రత్యేక స్థానమే కలదు. పూర్వకాలంలో ద్విపదలలో కథలు చెప్పబడేవని. వాటిలో ఎక్కువగా శ్లోకాలు కలిగి, గ్రాంథిక భాష ఎక్కువగా ప్రయోగించినట్లు, రాను రాను తెలుగు భాషాభివృద్ధి జరుగడం, తద్వారా ప్రాచీన భాషనుండి ఆధునిక భాషలో కవిత్వాలు పుట్టడం, తెలుగు పలుకు బడులు, ఛలోక్తుల ద్వారా ఈ ప్రదర్శన కళా రూపంలో గ్రాంథిక, వ్యవహారిక భాషలు ప్రయోగించబడినాయి. అందుకు కారణం కళాకారుల యొక్క భాషా సౌలభ్యమని అనేకన్నా వ్యవహారిక భాష పట్ల గల ప్రజాధరణే అని చెప్పవచ్చును.

ఉదాహరణకు సుంకర సత్యనారాయణ గారి "అల్లూరి సీతారామరాజు" బుర్రకథలో గ్రాంథికంలోని ఈ క్రింది వాక్యములు చూద్దాం!

అందచందముల నందన వనమీ - యాంధ్ర దేశమోయి
వినరా యాంధ్రుడ, మన్య సోదరుల విప్లవ కథ నేడు
శ్రీలలరారెడు తెనుగు దేశమున జీవనదులు గలవు
మేలు రకపు మైదానములడవులు - వేలగనులు గలవు"

(సుంకర సత్యనారాయణ - సీతారామరాజు బుర్రకథ పుట-7)

అదే విధముగా వ్యవహారికములో మురారి గారి రచన ఈ విధంగా కలదు.

"భారత దేశపు కీర్తి ప్రతిష్ఠలు - పంజాబు పెంచిందీ
భారతదేశపు దాస్య విముక్తికి - ప్రాణాలొడ్డిందీ
అట్టి వీరుని వీర చరిత్రను - అన్నలార వినుడీ
అమర జీవి మన "భగత్సింగ్" కథ అమ్మలార వినుడీ"

ఇంకోచోట : పటపట పళ్ళే కొరికెనురా
పట్టుబట్టి పడదోసెనురా
కోపావేశం పట్టలేకనే
కుస్తీకే తలపడ్డాడా
చింత నిప్పులే కక్కాడా
సింహంలా ఎగబడ్డాడా" "భళనంటి భయ్ తమ్ముడా మేలు భళానొయ్ దాదానా"

పై విధంగా అటు గ్రాంథికం, ఇటు వ్యవహారిక భాషయే కాకుండా అవసరాన్ని బట్టి హిందీ, ఆంగ్లము, సంస్కృత పదాలు కూడా ఉపయోగింపబడినాయి అని తెలుపుటలో అతిశయోక్తిలేదు.

**బుర్రకథ ప్రదర్శన భేదాలు :**

**నృత్యాభినయం :**

తెలుగు భాష ఒక్కటే అయినా ప్రాంతాలను బట్టి మాండలీకాలు, ప్రదర్శనా పద్ధతులలోనూ బేధాలు కలవు. ప్రధాన కథకుని అభినయం, నృత్యం వేదిక సమన్వయం, వంతలతో గల పరస్పర అవగాహన అన్ని ప్రాంతాలలోని బృందాలలో ఒకే రకంగా కనిపించదు. అవి ఆయా ప్రాంతావారీగా, గురు శిష్య పరంపరపైననూ ప్రభావితం కలిగి ఉంటాయి.

ఉదాహరణకు స్వాతంత్రోద్యమకాలంలో పద్మశ్రీ షేక్ నాజర్ గారి ప్రదర్శనలలో పద్యాలు మరియు శిష్య సాహిత్యములతో ఆనాటి చరిత్రను ప్రజలకు సవివరంగా వివరించారు. అది అలా ఉంటే స్వర్గీయ వై.పి.రాజు గారి సుప్రసిద్ధమైన బుర్రకథలలో ఒకటైనా 'లక్ష్మమ్మ కథ' ప్రాచీన జానపద కథయైనను ఆధునిక సాహిత్యంతో ఎక్కువ ప్రజాధరణ పొందింది. ఇటీవల ప్రదర్శిస్తున్న సామాజిక బుర్రకథలలో ప్రముఖ గురువైనా శ్రీ వల్లంపట్ల నాగేశ్వర్ రావు గారి శిష్య బృందంచే పలు రకాల బుర్రకథలు తెలంగాణ మాండలికంలో పల్లె పల్లెనా విజయవంతంగా ప్రదర్శించబడుతున్నాయి. పై విధముగా కాలానుగుణంగా బుర్రకథ సాహిత్యపరంగానూ, ప్రదర్శనా పరంగానూ రూపాంతరం చెందుతుందని చెప్పుకోవచ్చు.

**సంభాషణా చాతుర్యం :**

ప్రాంతాలను బట్టి, ప్రదర్శనలలోని విషయాన్ని జనాలకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేందుకు కొంతమంది కథకులు వారి భాషా ప్రతిభను, ఛలోక్తులను, సామెతలను, హాస్యాన్ని జోడించి పండిత పామర జనరంజకంగా ప్రదర్శిస్తారు. ఒక్కొక్కరి ప్రదర్శన ఒక్కో విధంగా కనపడుతుంది.

**వాద్య వైవిధ్యం :**

ఆంధ్రప్రదేశ్‌లోని విశిష్టమైన కళాబృందాలు పద్మశ్రీ నాజర్ గారి శిష్యపరంపర నుండి వచ్చిన వారు తంబూర, డక్కీలు (గుమ్మెట్లు), అందెలు మాత్రమే కాకుండా అవసరాన్నిబట్టి హార్మోనియం, ఫిడేలు (వయోలిన్), తబలా, డోలక్ వంటి వాయిద్యాలు కూడా ఉపయోగించేవారు. వర్తమాన కాలంలో ఈ పద్ధతి కనుమరుగైపోయింది. తెలంగాణ ప్రాంతంలోని కళాకారులు కథను మాత్రమే ప్రధానంగా నడిపిస్తారు. కథను రంజుగా నడిపించుటలో ఇరు ప్రాంతాల వారూ సిద్ధహస్తులనే చెప్పవచ్చును.

**ఆద్యంతం నవరసభరితం :**

బుర్రకథలో సమయానుకూలమైన రసభావాలను అభినయంలో పలికించుటలో ప్రధాన కథకుని ప్రతిభ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బుర్రకథలో ఎక్కువగా కరుణ, భీభత్స, రౌద్ర, దుఃఖ రసాలు ప్రదర్శింపబడతాయి. సందర్భానుసారంగా వంతలు కూడా ఇలాగే గానం చేయుట కనిపిస్తుంది.

**బుర్రకథలోని వంత పదాలు – తందాన వరుసలు :**

ప్రధాన కథకుని గానంలోని వాక్యాలన్నింటినీ అనుసంధానం చేస్తూ రాగం చెడిపోకుండా, రసాభినయంతో నడిచే ఈ వంత పదాలు కథకు ప్రాణం.

- వినరా భారత వీరకుమారా విజయం మనదేరా!
- వినరా ఆంధ్రకుమారా ధీరా వీరగాధ వినరా!
- జయము జయము మన భరతమాతకు దిగ్విజయము జయము'
- ఓ భారతీయుడా. ఓ వీర యోధుడా లేవయ్య లేచి రావయ్యా!
- రామ రామ జయ రామరామా - రామా రఘు రామా వహ్వా!
- తందానా దేవనందనానా!
- తందానె తాన!
- తందానా... అయ్యో తందానా దేవ నందనాన! (దుఃఖ సమయాల్లో వాడుతారు)
- భళా భళి.
- భళిరె భళి

- సై... సై...!
- వహ్వా!
- వ్వారె వహ్వా!
- సోదర భారత వీరుల్లార తందానా....తానె తందనా!

ఇలా ప్రతి కథలోనూ ప్రధాన కథకుడు గానం చేసే రాగాన్నీ బట్టి సందర్భోచితమైన రస ప్రాధాన్యతను కల్గిన పదాలను వంతలు ఉపయోగించి కథను రసరమ్యంగా నడిపిస్తారు. (రామకృష్ణారెడ్డి పడాల- తెలుగువారి జానపద కళలు, పుట- 62,63)

**తొలిదశ తెలంగాణ ఉద్యమం :**

ఆనాటి తెలంగాణ ఉద్యమంలో బుర్రకథ యొక్క పాత్ర అద్వితీయమని చరిత్ర ద్వారా విధితమౌతుంది. ప్రాంతం కోసం పోరాటం జరిగినా, 1944 కాలంలో గుంటూరు జిల్లాకు చెందిన తిరునగరి రామాంజనేయులు గారి వంటి కథకులు తెలంగాణ వీర యోధుల బుర్రకథను రచించి, ప్రజాసక్తికరంగా ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత వచ్చిన మార్పులను గమనించిన ఆనాటి ప్రభుత్వం కొన్నాళ్ళు వారి కథను నిషేధించినదని చరిత్ర కలదు.

అంతేకాకుండా తొలిదశ తెలంగాణ పోరాటంలో కాంగ్రెసువారు, ఆర్యసమాజంవారు నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగానూ, బ్రిటీష్ వ్యతిరేక విశేషాలను పరిమిత లక్ష్యాలతో బుర్రకథలుగా వచ్చాయని పరిశోధనా గ్రంథాల్లో తెలియపరిచారు. (వై.పి.రాజు గారు. పిహెచ్.డి.గ్రంథం - పుట- 71) కాశీం రజ్వి బుర్రకథ, నైజాం విప్లవం, ప్రజా విజయం, జమీందార్ బుర్రకథలు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందాయని కూడా వివరించారు.

ఆ కాలంలో ప్రాదేశికంగా వివిధ ఘటనలు, ఉదాహరణలలో, వరంగల్‌లో మొగిలయ్య హత్య, నిజామాబాద్‌లో నరసింహారెడ్డి కాల్చబడటం, వంటి సందర్భాలు బుర్రకథాగానం ద్వారా వార్తా ప్రతీకలుగాను, సామాజిక చైతన్య ప్రచారంలోనూ ఉపయోగపడినాయి.

ఇలా సమకాలీన పరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా గాన చేయడం ద్వారా ప్రజల స్థితిగతులు అందరికీ అర్థమయ్యేట్లుగా ప్రదర్శింపబడిన 'కష్టజీవి' బుర్రకథ మరో తార్కాణం.

**మలిదశ తెలంగాణ ఉద్యమం కాలం :**

ఆధునిక కాలంలో బుర్రకథ వివిధ కారణాల ద్వారా అంతరించిపోయినదిగా చెప్పుకోవచ్చును. 2000 సం॥ తొలినాళ్ళలోనూ చాలా తక్కువ బృందాలు మనుగడలో ఉన్నాయని చెప్పవచ్చును. తెలంగాణ ధూం ధాం" అను పేరిట ఆవిర్భవించిన సరికొత్త కళా ప్రదర్శన ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతోమంది ప్రసిద్ధ కళాకారులు పాల్గొని విజయం సాధించారు. తత్కారణంగా కొన్ని ప్రాచీన కళారూపాలకు ప్రజాధరణ కరువైనదనేకన్నా, అవి నిలదొక్కుకోలేక పోయాయన్నది ప్రజల మాట.

**కళాకారుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు :**

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలోనూ బుర్రకథ పట్ల ప్రజాధరణ తగ్గిపోయిందనే చెప్పవచ్చును. అందుకు కారణం కళాకారుల వర్తమాన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు ప్రతిభ మొదలైనవి ప్రభావితమైన కారణాలు, బుర్రకథ కళాకారులు టెక్నాలజీ వృద్ధి చెందిన ఈ పరిస్థితులలో ప్రదర్శనలు మానుకోలేక, రసవత్తరంగా ప్రదర్శించలేక, ప్రదర్శించినా జనాధరణ లేక నిర్వీర్యమై పోతున్నారు.

అడపాదడపా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే కార్యక్రమాలు, మూఢనమ్మకాలు, ఎయిడ్స్ నిర్మూలణ వంటి ప్రచార కార్యక్రమాలలో పాల్గొని జీవనం సాగిస్తున్నారు.

**ముగింపు :**

కవితా సాహిత్యం, వచన సాహిత్యం, గాత్రం, నృత్యం, అభినయ కౌశలం, హాస్యం, అన్ని హంగులు కలిగిన ఈ 'బుర్రకథ' కళారూపం మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియా ద్వారా కొత్త సొబగులను దిద్దుకొని, సామాజికాంశాలను, సమకాలీన స్థితిగతులను స్వీకరించి, కథా వస్తువును మెరుగుపరుచుకొని, భావితరాలకు ఉపయుక్తకరమయ్యే సరికొత్త కళారూపంగా, మార్చుకొని దాని అస్థిత్వంను కోల్పోకుండా తనను తాను కాపాడుకుని లోకానికి, సమాజానికి వెలుగునిచ్చే రోజు రావాలని ఆశిద్దాం!

**ఆధార గ్రంథాలు :**


1. డా॥ రాజు, వై.పి.బుర్రకథ -పిహెచ్.డి. పరిశోధనా గ్రంథం.
2. బాబూజీ షేక్, పద్మశ్రీ నాజర్ గారి తనయుడు - బుర్రకథ కళాబోధిని, పొ.శ్రీ.తె.వి.వి.
3. వయోజన విద్య - బుర్రకథ, క్రిష్ణారెడ్డి చిగిచర్ల, చిగిచర్ల వ్యాసావళి.


**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. క్రిష్టారెడ్డి చిగిచెర్ల, "కళావిద్య" - తెలుగు అకాడమీ, హైదరాబాద్
2. క్రిష్ణారెడ్డి చిగిచెర్ల, "జానపద నృత్యకళ" (2016)
3. శ్రీదేవి చీటి, "జానపద కథా గేయాలు (2016)
4. వసుంధరా రెడ్డి చింతపల్లి, "తెలుగు జానపద సాహిత్యం - స్త్రీల గేయములలో సంప్రదాయం" (1984)
5. తెలంగాణ సంగీత నాటక అకాడమి, (2021) "తెలంగాణలో నాటకం"
6. రామరాజు బిరుదురాజు, "తెలుగు జానపద గేయ సాహిత్యం" తెలుగు అకాడమి (2015)
7. సుందరం ఆర్.వి.యస్. "ఆంధ్రుల జానపద విజ్ఞానం" పొ.శ్రీ.తె.వి.వి.(2004)
8. రాధాక్రిష్ణ మిక్కలినేని "తెలుగువారి జానపద కళారూపాలు"
9. ఆం.ప్ర.జానపద సాహిత్య పరిషత్తు, "జానపద సరస్వతి" (2013)


**అనుబంధం :**

ఒకప్పుడు నడిచిన మేటి బృందాలు - కథలు

- వయోజన విద్య - బుర్రకథ - 2023 ప్రొ. చిగిచర్ల కృష్ణారెడ్డి, - గిరిజన జానపద విజ్ఞాన వ్యాసావళి (2024)
- జల్ - జంగిల్. జమీన్ - ప్రజానాట్యమండలి (గోండు వీరుడు - కొమురం భీం)
- మనుషులంతా ఒక్కటే.. - ప్రజానాట్యమండలి (గోండు వీరుడు - కొమురం భీం)
- కష్టజీవి
- కాసిం రజ్వీ
- శ్రీకృష్ణ రాయబారం, పల్నాటి యుద్ధం, బొబ్బిలియుద్ధం
- వీరాభిమన్యు, అల్లూరి సీతారామరాజు

- వై.పి. రాజు పార్టీ: బొబ్బిలి యుద్ధం, వీరాభిమన్యు, తప్పిపోయిన కుమారుడు,
- అజ్జరపు సత్యనారాయణ : వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం,(హైదరాబాద్)
- ఇమిటేషన్ రాజు బృందం: బాలనాగమ్మ, నర్తనశాల, మాయాబజార్ (కడప)
- బెనర్జీ బృందం: రుద్రమదేవి (హైదరాబాద్)
- దేవయ్య బృందం: అక్షర సంక్రాంతి, కుటుంబ నియంత్రణ (కొత్తపల్లి కరీంనగర్)
- కరంటు మల్లేశం బృందం: వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర (జగిత్యాల)
- వల్లంపట్ల నాగేశ్వర్ రావు బృందం : అక్షర కిరణం, అందరికి విద్య (రాత్రిబడి), ఎపిటిఫ్ ఉద్యమ చరిత్ర, భగత్‌సింగ్ (జీవిత చరిత్రపై) ఈనాటి చదువులు (ప్రైవేట్ స్కూళ్ళపై), కళ్ళు తెరవండి, కార్మికుల ఉద్యమ భేరి, మన కర్తవ్యం, మార్పు, మతమౌఢ్యం, రేపటి ముచ్చట్లు (ఎయిడ్స్ నియంత్రణపై), సత్యాన్వేషణ (మూఢనమ్మకాలపై) , సేంద్రియ వ్యవసాయం, శారద పెళ్ళి (బాల్య వివాహాలపై), విష వలయం. నిషా వలయం (మత్తు పదార్థాలపై) మొదలగు బుర్రకథలే కాకుండా ఆధునిక వీధి నాటకాలు కలవు.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలుగు - బంజారాల సామెతలు - ఒక పరిశీలన



డా. భూక్యా వీరన్న
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ.), నల్లగొండ.
సెల్ : 95428 37542.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

సామెతలను బంజారా భాషలో 'కావత్' అని అంటారు. కావత్ అనే పదం ఉత్తర భారతదేశ భాషలైన హిందీ, గుజరాతీ, రాజస్థానీ భాషల్లో పేర్కొనే 'కహావట్' అనే పదం నుండి ఆవిర్భవించినట్లు భావిస్తున్నారు. సామెతలు లేదా 'కావట్'లు బంజారాల జీవితంలోని వివిధ సందర్భాలతో సమ్మిళితమై ఉంటాయి. సందర్భానుసారంగా సామెతలను బంజారాలు వాడడం పరిపాటి. తమ జీవితంలో తారసపడే వివిధ సంఘటనల సందర్భంలో సామెతలను, నానుడులను వాడి తమ చర్చను కొనసాగించడం సర్వసాధరణం. బంజారాల సామెతలు ఎక్కువగా వారి సామాజిక జీవనానికి సంబంధించిన అంశాలను వివరిస్తూ ఉంటాయి. అవి వారికి సమాజంపై గల అవగాహనను సూచిస్తాయి.

'కహావట్'లు, 'సాకీ'లు బంజరాల సమాజంలో పరంపరాగతంగా వాడుకలో ఉన్న సందేశాలుగా పేర్కొనవచ్చు. ఇవి పూర్వీకులు అనుభవంతో చెప్పిన మాటలు. ఒక తరం నుండి మరో తరం వారికి పరంపరానుగతంగా బదిలీ కాబడినవిగా భాషా పండితులు పేర్కొంటారు.

సామెతలను అనుభవాల సారంగా మనం భావిస్తాం. 'సామెత' అనే పదం 'సామ్యం' నుండి ఆవిర్భవించింది. ఏదైనా ఒక విషయం గురించి వివరంగా చెప్పేటప్పుడు పోలిక కోసం చెప్పే సమానార్థకంతో కూడిన ఒక వాక్యమే 'సామెత'.

"సామెత అనే అర్థంలో నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రములు, మాటలు అనే పదాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి."

"సామెతకు మారుగా లోకోక్తి, శ్లోకము, సామ్యము, జననాదం, లోకహితోక్తి, కత, నానుడి, నుడికారం అనే పదాలు తెలుగు సాహిత్యంలో ఉపయోగింపనబడ్డాయి."

అరిస్టాటిల్ ప్రకారం సామెత "మానవుని పరంపరానుగత జ్ఞానము అనుభవ జన్యమైన లేక నిరీక్షణ జన్యముతో కూడిన లోకసిద్ధ, ప్రభావోత్పాతదకమైన, పృష్ఠభూమిని నిర్మించగల కళాత్మక సంక్షిప్త వాక్యము."

"వేదాలు మహర్షుల యొక్క జ్ఞానసముదాయములైతే సామెతల్ని సామాన్య జనుల యొక్క అనుభవ సాగరాలుగా పేర్కొనవచ్చు."

"సంక్షిప్తమైన, వివేకయుతమైన, తీక్షణమైన, సాంప్రదాయకమైన సామెతల్ని సామాన్య జనుల యొక్క అనుభవ సారాలుగా పేర్కొనవచ్చు."

"ఒక పిండితార్థాన్ని కొద్ది మాటల్లో చెబుతుంది సామెత."

**కీలక పదాలు**

సామెతలు ఓ భాషకు సంబంధించినవైనా వాటిని పరిశీలిస్తే సుమారుగా అవి ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటాయి. అయితే అట్టి సామెతల సంక్షిప్తతలోనూ, ప్రాచుర్యంలోనూ కొంత మార్పు ఉంటుంది. సామెతలను గల ముఖ్య లక్షణాలను సామ్యం, ప్రాచుర్యత, తరతరాల అనుభవ మూలం, సాంప్రదాయికత, సారవత్త - సంక్షిప్తత, శ్రావ్యత అనేవిగా పేర్కొనాలి. ఈ సామెతల లక్షణాలను క్రింది విధంగా వివరించవచ్చు.

**సామ్యం :**

సామెతకు 'పోలిక' ఒక విశిష్టమైన లక్షణం. పోలిక లేనిది సామెతకు ప్రయోగార్హత లేదు. ఒక సామెతను సమాన పోలికలు కలిగిన సందర్భంలో మాత్రమే వాడడం జరుగుతుంది. అప్పుడే ఆ సందర్భంలో సాగుతున్న చర్చకు సంపూర్ణమైన న్యాయాన్ని చేకూర్చినట్లవుతుంది.

**ప్రాచుర్యం :**

ప్రజల నాలుకల మీద పరంపరానుగతంగా ప్రాచుర్యాన్ని కలిగి ఉండడం.

**అనుభవ మూలం :**

తరతరాల అనుభవసారాలుగా ఉండి, నేటి కాలమాన పరిస్థితులకు సరిపోయినట్లుండడం.

**సాంప్రదాయికత :**

సామెతలు అలనాటి సంస్కృతుల సాక్ష్యాలు. నాటి సంప్రదాయాలు నేటికీ మరిచిపోకుండా గుర్తుచేసే లక్షణం ఉండడం.

**సారవత్త – సంక్షిప్తత :**

తక్కువ పద సమూహాలతో, నిగూఢమైన అర్థాన్ని కలిగి ఉండి సంక్షిప్తంలో వైశాల్యాన్ని దాచుకునే లక్షణం.

**శ్రావ్యత :**

వినడానికి సొంపుగా ఉండి, అనడానికి సరళంగా ఉండేవి.

**ప్రవేశిక :**

జానపద విజ్ఞానంలో సామెతలు ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని, ప్రాముఖ్యతనూ కలిగి ఉన్నాయి. ప్రాచీన గ్రంథాలైన వేదాలూ, ఉపనిషత్తులూ, బైబిలు గ్రంథాలలో సామెతల ప్రస్తావనలున్నాయి. జానపద విజ్ఞానం ఎంత ప్రాచీనమైందో సామెతలు కూడా అంత ప్రాచీనతను కలిగి ఉన్నాయి. "అది మానవుడు తన సుఖదుఃఖాలను అభివ్యక్తీకరించడానికి, అనుభవాలను ఎదుటివారికి తెలియజెప్పడానికి గీతాలను, కథలను, సామెతలను ఉపయోగించుకున్నాడు. మౌలికమైన ప్రతిభాశక్తి, కల్పనాశక్తి ఉండిన అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడనడంలో సందేహం లేదు. "డా॥. ఆర్వీయస్ సుందరంగారి ఈ నిర్వచనం ప్రకారం మౌలికమైన ప్రతిభాశక్తి

కలిగిన ప్రాచీన మానవుడే సామెతలను 'సృష్టించడాన్ని భావించాలి. దీన్నిబట్టి గిరిజానపదులు ముందుగా సామాజికపరమైన అంశాలను బట్టి అనుభవాన్ని జోడించి సామెతలను వాడినట్లు భావించాలి.

జానపద గీతం, జానపద కథలాగే సామెత కూడా ఒక క్షణంలో ఒక అజ్ఞాత కళాకారుని నోటి వెంట వెలువడి ప్రాచుర్యాన్ని పొందింది. సామెత పుట్టుకకు ఆధారాలు అనేకం. "సామెతల పుట్టుకకు ఆధారాలు స్థూలంగా ఇవి : 1. కుటుంబం, సంఘంతో వ్యక్తికి గల సంబంధాలు, అనుబంధాలు, అనుభవాలు, 2. పురాణాలు - చరిత్ర, 3. జానపద కథలు, 4. సన్నివేశాలు, 5. సూక్తులు, 6. పరభాషా సామెతలు, 7. జానపద గేయాలు, 8. నమూనా సామెతలు." భాష సామెతల వ్యాప్తికి సాధనంగా ఉంటుంది. సామెతల వ్యాప్తి భాషావ్యాప్తిని బట్టి ఉంటుంది. ఒక భాష ఎంతైతే వ్యాప్తిని కలిగి ఉంటుందో అంతగా భాషలోని సామెతలు వ్యాప్తిలోకి వస్తాయి. బంజారా బాషకు లిపి లేదు. భాషా సాహిత్యం వ్యాప్తి చెందలేదు. కాబట్టి బంజారాల సామెతలు వారి సమాజంలోనే వ్యాప్తిని కలిగి ఉన్నాయి. ఇతరులకు వారి సామెతలు తెలిసే అవకాశం లేదు.

బంజారాల భాషకు లిపి లేకపోవడం వల్ల భాషావికాసం, పరిణతి జరగలేదు. అలాగే వీరి భాషలోని సామెతలు కూడా అంతగా ప్రాచుర్యాన్ని పొందలేదు. కాని అవి బంజారాల నాలుకలపై నర్తిస్తూనే ఉన్నాయి. ఆధునికులు మన దేశంలోని వివిధ గిరిజన సమూహాలపై పరిశోధనలు చేస్తున్నప్పటికీ, ఆ పరిశోధనలు గిరిజనుల సామాజిక, ఆర్థిక అంశాలపైననే ఆధారపడి ఉన్నాయి. కాని గిరిజానపదుల భాషా వికాసానికీ, సాహితీ వికాసానికీ జరిగిన కృషి మృగ్యం. గిరిజనుల వికాసం వారి భాషా వికాసం ద్వారానే సాధ్యం. ప్రపంచంలో ఒక జాతి అభివృద్ధి ఆ జాతి భాషాభివృద్ధిపైననే ఆధారపడి ఉంది. భాషా వికాసమే సామాజిక స్పృహను కలుగజేస్తుంది. తద్వారా సాంస్కృతిక వికాసం జరిగి జాతి మొత్తంగా అభివృద్ధి వైపు పయనిస్తుంది. తెలుగు భాషనే ఉదాహరణగా తీసుకుంటే ఈ విషయంపై మనకు అవగాహన కలుగుతుంది. నేడు తెలుగు భాషలో కొన్ని వేల సామెతలున్నాయి. ఎన్నో సామెతల సంకలనాలు వచ్చాయి. బంజారా భాషలోని సామెతలపై సవివరమైన సంకలనాలు గాని, వ్యాఖ్యలు గాని ఇంతవరకు రాలేదు.

**విషయ వివరణ :**

నేను క్షేత్ర పరిశీలనం ద్వారా కూడగట్టిన కొన్ని బంజారాల సామెతలను శాస్త్రీయంగా పరిశీలించి వారి జీవన విధానాన్ని సమూలంగా వివరించే ప్రయత్నం చేశాను. బంజారాల సామెతలు విలక్షణమైన రీతిలో ఉండి, వారి జీవన సరళిని, నిరాడంబరతను తెలియజేస్తాయి. వారు సామెతలను తమ సంభాషణల్లో సందర్భోచితంగా ఉపయోగిస్తారు.

**బంజరాల సామెతలు :**

1. శరీరాధరమైన సామెతలు
2. వస్త్రాధారమైన సామెతలు
3. పశు, కీటకాధారమైన సామెతలు
4. జీవనాధారమైన సామెతలు
5. ప్రకృతి ఆధారమైన సామెతలు

**1. శరీరాధారమైన సామెతలు :**

**సామెత** : ఏ కానేతి సామళన్, ఓ కానేతి కాఢ్ణాకే వాళో.

**అర్థం** : ఈ చెవితో విని, ఆ చెవి నుండి తీసేస్తావు.

**వివరణ :**

ఎవరైనా ఏదైనా చెప్పినప్పుడు, వారు చెప్పింది మనం అర్థం చేసుకొని అందుకు తగినట్లుగా నడుచుకుంటే వారు సంతోషిస్తారు. ఒక్కసారి చెప్పినప్పుడు వారు ఏమి చెప్పారో పట్టించుకోకుండా వ్యతిరేకంగా వ్యవహరించినప్పుడు చెప్పినవారికి కోపం రావడం సహజం చెప్పినట్లు వినని వ్యక్తి గురించి ప్రస్తావిస్తూ పలికిన సామెత 'ఒక చెవితో విని రెడో చెబితో తీసేసేవాడి''వనేది. ఈ సామెత తెలుగులో కూడా ప్రచారం ఉంది. మనుషులలో సాధారణంగా కనిపించే వైఖరిని తెలియజేస్తున్నది ఈ సామెత. అందుకే సుమతీ శతకకర్త 'వినదగునెవ్వరు చెప్పిన, వినినంతనె వేగపడక వివరింపదగున్' అని హితోపదేశం చేశాడు.

**2. వస్తువాధారమైన సామెతలు :**

**సామెత** : కాణిన కొచ్చొ దినేతో, పీపీన్ పేట్ ఫోళ్లీది.

**అర్థం** : గుడ్డిదానికి కంచు పళ్లెమిస్తే, కడుపు పగిలే వరకూ తాగిందట.

**వివరణ :**

మనిషి వెల్తితనానికి దర్పణం పట్టేదే ఈ సామెత. ఎవరైనా తన తాహతుకు మించింది. దొరికినప్పుడు దాన్ని కాపాడుకోవాలి, హెూదాకు తగ్గట్టుగా మెలగకపోతే వారి పరువే పోతుందని తెలియచెప్పే నేపథ్యంలో నుంచి ఈ సామెత ఆవిర్భవించింది. అంధురాలికి కంచుపళ్లెం ఇస్తే కడుపు పగిలేదాకా తాగిందనడంలో ఆమె ఆత్యాశ కనబడుతుంది. కంచు పళ్లాలను బంజారాలు విలువైన వస్తువుగా భావిస్తారు. ఒక విలువైన వస్తువు లభించినప్పుడు దాన్ని అతిగా వాడకూడదనీ, దాని విలువను తెలుసుకొని మసలుకోవాలని ఈ సామెతలోని నీతి.

తెలుగులోని 'కనకపు సింహాసనమున శునకము కూర్చుండ తగునా!' అనే సామెతకు ఇది సరిపోతుంది. లంబాడీల పంచలోహాలతో చేసిన ప్రత్యేకమైన పళ్లాలను 'కొచ్చో' లేదా 'ఖాంసేర్ థాళి' అంటారు. బంజారాలలో కాస్త ఉన్నవారు ఈ కోచ్చో, ఖాంసేర్ థాళీలను చేయించుకుంటారు. స్త్రీలు ఉపయోగించే పళ్లాలను కొచ్చో అనీ, పురుషులు ఉపయోగించే పళ్లాలను ఖాంసేర్ థాళి అని పిలుస్తారు. బంజారాల వివాహ సందర్భంలో తల్లిదండ్రులు వధువుకు ఇచ్చే సాధారణమైన వస్తువుల్లో ఈ కంచు పళ్లాలు తప్పక ఉంటాయి.

**3. పశు, కీటాకాధారమైన సామెతలు :**

**సామెత** : కీడి సాంస, మొకోడ ఫాకీ మార.

**అర్థం** : చీమ పొదుపు చేస్తుంది, గండు చీమ తినేస్తుంది.

**వివరణ :**

ఆర్థికంగా ఎంత బాగున్నా పొదుపు చేయకుంటే ఒక రోజు తప్పక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. కష్టాల్లో ఉన్నవారిని చూసినప్పుడు వారు పొదుపును పాటించరని, తల్లిదండ్రులు పొదుపు చేస్తే పిల్లలు ఖర్చు చేస్తారని చెప్పే సందర్భంలో ఈ సామెతను ఉపయోగించడం జరుగుతుంది. ఒకరిద్దరు పొదుపు చేసినా తినేవారు ఎక్కువైతే ఎంత పొదుపు చేసినా ప్రయోజనం లేదని దీని అర్థం. పొదుపు చేసేవారు చీమలైతే, ఖర్చు చేసేవారు గండుచీమలని చక్కని సామ్యాన్ని కలిగి ఉంది ఈ సామెత. నిరంతరం అడవుల్లో సంచరించే బంజారాలకు చీమలతోను, గండు చీమలతోను ఉన్న అనుబంధాన్ని మాటలలో చెప్పలేం.

**4. జీవనాధారమైన సామెతలు :**

**సామెత** : బేటీన జడే లపణన్ బేటీర్ నసీబేన జణే కోణి!

**అర్థం** : బిడ్డను కన్నాం కాని బిడ్డ భవిష్యత్తును కనలేదు కదా!

**వివరణ :**

ఇది లంబాడీ భాషలో చాలా ప్రసిద్ధమైన సామెత. నిదానంగా ఉన్నవాళ్లకు అన్నం దొరుకుతుంది. తొందరపడేవారికి గంజే గతి అనే అర్థం వచ్చే ఈ సామెత వెనక తొందరపాటు పనికిరాదని, తొందరపడితే ఏ పనులూ కావని, నెమ్మదిగా అన్ని పనులూ నెరవేరుతాయనే అర్థం దాగి ఉంది. 'నిదానమే ప్రధానం' అని మన పూర్వీకులు చెప్పిన మాటల్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవచ్చు.

**5. ప్రకృతి ఆధారమైన సామెతలు :**

**సామెత** : తాడేర్ ఛాండీ కత్రాకో బాయర్ ఆస్రో అత్రా.

**అర్థం** : తాటిచెట్టు నీడెంతో జీతగాడి ఆధారమూ అంతే.

**వివరణ :**

తాటిచెట్టు ఎంత పొడుగున్నా అది ఇచ్చే నీడ మాత్రం కొంచమే. అలాగే జీతగాడు ఎంతవాడైనా జీతగాడేనని, యజమాని పూర్తిగా తన జీతగాడి మీద ఆధారపడడం వ్యర్థమని ఈ సామెత తెలియజేస్తుంది. లంబాడీలు స్వతహాగా కష్టజీవులు. ఎవరికి వారు కష్టపడి పనిచేస్తే జీవనం సుఖమయంగా సాగుతుందని వారి నమ్మకం. ఒకరిపై ఆధారపడడం అంత మంచిది కాదని, ఒకవేళ ఆధారపడ్డా వారి ఆధారం మాత్రం తాటిచెట్టు నీడలా కొంచమే తప్ప ఎక్కువ కాదని ఈ సామెత తెలియజేస్తుంది. ఈ సామెత గొప్ప సందేశాన్ని ఇస్తుంది. పరులకై నమ్మకం పెట్టుకోక స్వశక్తినే నమ్ముకొని జీవనం సాగించాల్సిన విధానాన్ని ప్రబోధిస్తుంది.

లంబాడీల సామెతలో సామ్యత, ప్రాచుర్యత, అనుభవమూలం, సాంప్రదాయికత, సారవత్తు - సంక్షిప్తత, శ్రావ్యతలు అలవోకగా కనిపిస్తున్నాయి. బంజారాల ప్రాపంచిక దృష్టికి లోబడి వారి సామెతలు ఉండి, వారి జీవన విధానాన్ని, సామాజిక అవగాహనను సూచించేవిగా ఉన్నాయి.

**ముగింపు :**

బంజారాల సామెతల్లో వాళ్ల జీవన విధానం, సమాజంపై వారికున్న అవగాహన తెలుస్తుంది. ఈ సామెతల లక్షణాల ఆధారంగా వాటిని వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు.

ఇవి మంచి జీవనానికి ఉపదేశాలుగా ఉపయోగపడతాయి. ఈ సామెతల్లోని మానవీయ, తాత్విక కోణాలను పరిశీలిస్తే బంజారా పామరులకు అవే వేదాలు, శతకాలుగా అనిపిస్తాయి. జీవితాన్ని అన్ని కోణాల నుంచి పరిశీలించి అనుభవంతో చెప్పిన సామెతలు బంజారాలవి. కొన్ని సామెతలు తెలుగువారి సామెతలను పోలి ఉన్నాయి. మొత్తం మీద బంజారాల సామెతలు వారి జీవన విధానాన్ని, సామాజిక అవగాహనను సూచించే విధంగా ఉన్నాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. తెలుగు జానపద కథలు, డా॥. జి.యస్. మోహన్, ప్రచురితం, 1984, తెలుగు జానపద కథలు, డా॥. కె. సుమతి, 1991.
2. తెలుగు సామెతలు (అకాడమి), సంపత్ రాఘవాచారి. 3. తెలుగు పొడుపు కథలు, ఆచార్య కసిరెడ్డి, 1990.
4. తెలుగు సామెతలు (వ్యాసం), డా॥. చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి, స్రవంతి, ఫిబ్రవరి, 1980
5. తెలుగు సామెతలు - జనజీవనం, పాపిరెడ్డి నరసింహారెడ్డి, 1983.
6. తెలుగు సామెతలు జనజీవనం, డా॥. పి. నరసింహారెడ్డి, 1983.
7. సుగాలి సంస్కృతి, భాషా సాహిత్యాలు, సిద్ధాంత గ్రంథం - ఆచార్య ఎం. గోనానాయక్.
8. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం, జీవన చిత్రణ - ఆచార్య సూర్యాధనంజయ్.


★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# శేషప్ప త్రిశతి పూర్వకవుల ప్రభావం



డా॥. గోలి శ్రీలత
సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల, (స్వయం ప్రతిపత్తి), జగిత్యాల. చరవాణి : 9293802345.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**ఉపోద్ఘాతం :**

నవ నరసింహ క్షేత్రాలలో ప్రసద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ధర్మపురి. ఈ ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి పై శేషప్ప నరసింహ శతకం, నరహరి శతకం, నృకేసరి శతకాలను రచించాడు. ధర్మపురి పేరు వినగానే మనకు శేషప్ప పేరు, శేషప్ప పేరు వినగానే ధర్మపురి గుర్తుకు వస్తుంది. ఈ మూడు శతకాలు త్రిశతిగా ఎంతో ప్రసిద్ధిగాంచినవి. ఈ శతక పద్యాలు తెలంగాణలోనే కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా ప్రజల నాలుకలపై నేటికీ ఈ శతకాలు సజీవంగానే ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వీటితోపాటు శేషప్ప 'కృష్ణ శతకం', 'ధర్మపురి రామాయణం' అనే యక్షగానాన్ని కూడా రచించాడు.

సాధారణంగా కవుల రచనలలో సమకాలీన అంశాలతో పాటు పూర్వకవుల ప్రభావం, అనుకరణ ఎంతో కొంత ఉంటుంది. శతక కవులపై శ్రీనాథ, పోతన లాంటి వారి ప్రభావం, శ్రీనాథ, పోతనపై వాల్మీకి, వ్యాసుని లాంటి వారి ప్రభావం, వాల్మీకి, వ్యాసుని వంటి వారిపై వేదాల ప్రభావం కొంతమేరకు ఉందని చెప్పవచ్చు. మమ్మటుడు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసంప అనే మూడు కావ్య హేతువులుగా పేర్కొన్నారు. అంట కవి స్వయంగా ప్రతిభావంతుడైనప్పటికినీ వాటికి వ్యుత్పత్తిప, అభ్యాసం అనేవి తోడైనప్పుడే ఆ కావ్యం మరింత పరిపుష్టమవుతుంది.

శతకాలు భక్తి ప్రధానమైనవి. ఇలాంటి భక్తి ప్రధానమైన శకతాలను శేషప్ప విరీతంగా చదివి ఉంటాడు. అంతేకాకుండా తను భారత, భాగవతాలను భక్తితో నిత్యం పారాయణం చేసేవాడు. కనుకనే తన త్రిశతి (నరసింహ, నరహరి, నృకేసరి)లో పూర్వకవులైన పోతన, ధూర్జటి వంటి గొప్ప కవుల భావాలు ప్రతిబింబించి ఉంటాయని చెప్పవచ్చు. ఆయన రచించిన ఈ త్రిశతిలోని పద్యాలను పరిశీలించినట్లయితే మనకు ఈ విషయం ద్యోతకమవుతుంది. శేషప్ప పపరచించిన ఈ త్రిశతిలోని పద్యాల పైన పోతన, ధూర్జటి, రామదాసు, బద్దెన, వేమన మొదలగు వారి

పద్యాల ప్రభావం ఏ విధంగా ఉందో వివరించడమే ఈ వ్యాస ఉద్దేశం. అంతేకాకుండా శతక సాహిత్యం విస్తృతంగా వెలుగొందిన దక్షిణాంధ్ర యుగ ప్రభావం కూడా శేషప్పపై ఉందని అనవచ్చు. ఎందుకంటే దక్షిణాంధ్ర యుగంలోనే శతకాలతోపాటు యక్షగాన ప్రక్రియ ప్రభావం ఉండి ఉంటుంది. శేషప్ప క్రీ.శ. 1780 కాలానికి చెందిన వాడని వంగూరి సుబ్బారావు గారు తన "శతక కవుల చరిత్ర"లో చెప్పారు. (సుబ్బారావు వంగూరి, "శతక కవుల చరిత్ర", పుట 436)

**1. పోతన ప్రభావం :**

1. సీ॥ 'మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు బోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు
రాయంచ చనునే తరంగిణులకు - (సప్తమ స్కం. ప్ర. చ.)

మందార పూల మకరందములోని మాధుర్యమును ఆస్వాదించే తుమ్మెద పూలవైపు పోదు కదా, స్వచ్ఛమైన ఆకాశగపంగా తరంగాలపై విహరించే రాజహంస సాధారణ వాగుల వైపుకు చూపడదు కదా, తీయని మామిడి లేత చిగురులను తిని పులకించి, పాటలు పాడే కోకిల కొండ మల్లెల దరికి వెళ్లదు కదా, నిండు పున్నమిలో విహరింప చకోర పక్షలు దట్టమైన మంచు తెరల మాటకు పోవు కదా. ఈ విధంగానే విష్ణు పాదాల సేవలో మైమరిచిన నా మనసు ఇతర విషయాలపైకి వెళ్లదు కదా.

అనే భాగవతంలోనే పద్య పోలికలు నరసింహ శతకంలోని ఈ పద్యంపై కన్పిస్తున్నాయి.

సీ॥ "ఇభకుంభముల మందకెగిరెడి సింగంబు
ముట్టునే కుఱుచైన మూషికమును?
నవచూతపత్రముల్ నములుచునన పికంబు
కొఱుకునే జిల్లేడు కొనలునోట?
అరవింద మకరంద మనుభవించెడి తేటి
పోవునే పల్లేరు పూలకడకు? - (నరసింహ శ. 76)

ఏనుగు కుంభస్థలమును కొట్టే సింహము చిట్టెలుకను పట్టుకోదు. లేత మామిడి చిగుళ్ళను తినే కోయిల జిల్లేడు చిగుళ్ళను కొరుకుతుందా? పద్మములో మకరందమును ఆస్వాదించే తుమ్మెద పల్లేరు పువ్వుల చెంతకు పోదు. తియ్యని మామిడి పండ్లను తినే చిలుక ఉమ్మెత్త కాయలను తినదు. ఈ లోకంలో నీ కీర్తనలు పాడుటకు అలవాటు పడినవారు పరుల కీర్తనలు పాడలేరు.

ఈ రెండు పద్యాలను పరిశీలించినట్లయితే సీస పద్య నిర్మాణంలో, భావ ప్రకటనలో శేషప్ప పోతన, శ్రీనాథ వంటి కవులను అనుసరించాడని చెప్పవచ్చు.

సీ॥ "ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రంబుల కలిమియేల?
భువనమోహన ! నిన్నుబొడగానంగాలేని
చక్షురింద్రియముల సత్వమేల - (దశమ, స్కం, రు. క)

పోతన భాగవతంలోని రుక్మిణి కళ్యాణ ఘట్టం నందలి ఈ పద్యాన్ని పోలిన పద్యం శేషప్ప నరసింహశతకంలో కన్పిస్తుంది.

సీ॥ "భువన రక్షక ! నిన్ను బొగడనేరని నోరు
ప్రజకగోచరమైన పాడుబొంద
సురవరావరార్చిత నిన్ను జూడగోరనికనుల్
జలములోపల నెల్లి సరపుగుండ్లు - నరసింహ, శ. 30)

తండ్రీ! లోకరక్షకా! నిన్ను స్తుతించని నోరు ప్రజలకు ఉపయోగపడని పాడుపడిన నుయ్యిలాంటిది. సురపూజితా! నిన్ను చూడని కన్నులు నీటిమొగ్గలు. రమనాథా! నీ సేవ చేయని శరీరము పనికిమాలిన తోలు తిత్తి. నీ దివ్య కథలను ఆలకించని చెవులు బండరాతి లోని బొందలు. కమలనయనా! నీ మీద భక్తిలేనివాడు రెండు కాళ్ళు గల దున్నపోతు.

ఈ విధంగా దేవుడిచ్చిన ఇంద్రియాలు శరీరం, ఆత్మ, చిత్తం మొదలగునవి ఆయన సేవ కొరకు వినియోగించకపోతే వాటి ప్రయోజనం వృధా అని ఇరువురి భావాలు ఒకే విధంగా భక్త్యావేశంగా వెలువడినాయి.

**2. ధూర్జటి ప్రభావం :**

చ॥ "కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరే కౌరవేంద్రునకనేకుల్ వారిచేనే గతుల్
వడసెన్? పుత్రులు లేని యా శకునకున్ బాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా" - (శ్రీకాళ. శ. 28)

ఈశ్వరా! ఈ లోకములోని జనులు ఎంతటి అవివేకులయ్యా, కొడుకులు పుట్టలేదనియ, తమకు ఇక ఉత్తమగతులు కలుగవని అజ్ఞానంచేత ఏడుస్తున్నారు. కౌరవచక్రవర్తి యైన ధృతరాష్ట్రునకు వందమంది కొడుకులు పుట్టిరిగదా! వారివల్ల అతడెంత ఉత్తమగతికి పొందినాడు? బ్రహ్మచారిగా నుండి అపుత్రకుడైన శుకమహర్షికి ఏ దర్గతులు గలిగినవి? ఇదంతయు భ్రాంతి తప్ప మరొకటి కాదు; అపుత్రకుడైన వానికి మోక్షమార్గము లేకుండా పోతుందా? ఇదంతా వట్టిదే. ఈ పద్యచ్ఛాయలు శేషప్ప రచించిన నరహరి శతకంలో కన్పిస్తున్నవి.

సీ॥ "సుతులు లేకున్న సద్గతి లేదనిరి గాని
తాను ధన్యుండైన తనయులేల
శుకమునీంద్రుడు సతీసుతుల నార్జింపక
వ్యర్థుడై పోయెనా వసుధలోన
ధృతరాష్ట్రునకు దండి సుతులు నూఱుగురుండి
తాముద్ధరించిరా తండ్రినెల్ల
భక్తులైనటువంటి పరమ భాగవతోత్తముల

తే॥ నీ పద ద్యాస పరులైన నిర్మలులకు
కొడుకులాలును లేకున్న కొదవలేదు" - (నరహరి, శ. 90)

ముక్తికి భక్తే సాధనం తప్ప సంతానం కాదని ధూర్జటి, శేషప్ప ఇరువురు ఒకే భావాన్ని వ్యక్తీకరించారు.

మ॥ "గడియల్ రెంటికో మూటికో గడియకో కాదేని నేదీల్లియో
కడనేడాదికో యెన్నడో యెఱుగమి కాయంబు లీ భూమిపై
బడగానున్నవి ధర్మమార్గ మొకటిం బాటింప రీ మానవుల్
చెడుగుల్ నీ పదభక్తినిం దెలియరో శ్రీకాళహస్తీశ్వరా" - (శ్రీకాళ. శ. 104)

శేషప్ప రచించిన నరసింహ శతకంలోని ఈ క్రింది పద్యంను, ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలోని పై పద్యం రెండును ఒకే రకమైన భావాన్ని కల్గియున్నాయి.

సీ॥. పాంచభౌతికము దుర్భరమైన కాయంబి
దెప్పుడో విడుచుట యెఱుకలేదు
శత వర్షముల దాకా మితము జెప్పిరి గాని
నమ్మరా దామాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
యూరనో, యడవినో యుదక మధ్యముననో
యెప్పుడో విడుచుట యే క్షణం బో'' - (నరసింహ, శ. 20)

తండ్రీ! పాంచభౌతికమైన ఈ దేమమును విడిచేదెప్పుడో ఎవరికీ తెలియదు. బాల్యంలో పోవచ్చు. యౌవనంలో పోవచ్చు. కౌమారంలో పోవచ్చు. వృద్ధాప్యంలో పోవచ్చు. ఊరిలోనో, అడవిలోనో, నీటిలోలో, ఎప్పుడో, ఏ క్షణమో విడచుట తథ్యము. దేహముండగనే బుద్ధిమంతులు నిన్ను తెలుసుకోవాలి, అని శేషప్ప నరసింహ శతకంలో వివరించారు.

**3. రామదాసు ప్రభావం :**

ఉ॥. ''కంటి నదీ తటంబ్బ బొడగంటిని భద్రనగాధి వాసమున్
గంటి నిలాతనూజ, నూరు గార్ముకమార్గణ శంఖచక్రముల్
గంటిని మిముమ లక్ష్మణునంగంటి, కృతార్థుండనైతి నో జగ
త్కంటక దైత్య నిర్ధళన, దాశరథీ, కరుణాపయోనిధీ'' (దా. శ. 21)

ఉ॥. ''చూచితి నీ కిరీటమును జూచితి కుండలముల్ ముఖంబు న్ణ
జూచితి శంకచక్రములు చూచితి కౌస్తుభ వక్షదేహము
జూచితి పీతవస్త్రమును జూచితి లక్ష్మిని నిను లెస్సగా
జూచితి గన్నులారా మధుసూదన ధర్మపురీ నృకేసరీ'' (నృ.శ. 6)

పైన రామదాసు ఒక క్రమపద్ధతిలో నదీతీరాన్ని చూసి, ఆ తర్వాత ఆయన నివాసమైన భద్రాదిని, ఆ తర్వాత సీతాదేవిని, విల్లు, బాణం, శంక చక్రం, చూశానని వివరిస్తే అదేవిధంగా శేషప్ప కూడా నరహరి శతకంలో ముందు నరసింహస్వామి యొక్క కిరీటమును చూసి, ఆ తర్వాత కుండలాలను, ముఖంను, శంఖ చక్రములను చూశానని ఒక వరుస క్రమంలో వివరించాడు.

దాశరధి శతకంలో రామదాసు 'కంటిన్' అనే సమాపక్రియతో పద్యాన్ని ప్రారంభించి ఎత్తుగడలోని సౌందర్యాన్ని ప్రదర్శిస్తే, శేషప్ప 'చూచితి' అనే సమాపక ప్రక్రియతో పద్యాన్ని ప్రారంభించాడు. ఇక్కడ పద్య నిర్మాణంలనూ, ఎత్తుగడలోనూ, భావ ప్రకటనలోనూ శేషప్పపై రామదాసు ప్రభావం కనిపిస్తుంది.

**4. బద్దెన ప్రభావం :**

కం॥. ''తాను భుజింపని యర్థము
మానవ పతి జేరు గొంత మరి భూగతమౌ
గానల నీగలు గూర్చిన

ఈ పద్యాన్ని పోలిన పద్యం శేషప్ప నరసింహ శతకంలో కన్పిస్తుంది.

సీ॥ "తల్లి గర్భము నుండి దనము తోడెవ్వడు
వెళ్లిపోయిడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమే కాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జిన జేసి విఱ్ఱవీగుటె కాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోదు
పొందుగా మరుగైన భూమిలోపల బెట్టి
దాన ధర్మము లేక దాచిదాని

తే॥ తుదకు దొంగల కిత్తురో దొరల కగునో
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు (నరసింహ. శ. 15)

ఇక్కడ సుమతీ శతకంలో 'గానల నీగలు' అని ప్రయోగిస్తే శేషప్ప 'జుంటీగ' (తేనెటీగ) అని ప్రయోగించాడు. సుమతీ శతకంలో 'మానవ పతి జేరు, మరికొంత భూగతమౌ' అనగా ఇక్కడ శేషప్ప 'తుదకు దొంగలకిత్తురో, దొరలకవునో' అనే ఇరువురు ఒకే భావాన్ని ప్రకటించారు. ఈ రెండు పద్యాలను పరిశీలింపగా అనుకరణంగా శేషప్ప ఈ పద్య రచన గావించినట్లుగా తెలుస్తున్నది.

**5. వేముల ప్రభావం :**

"కఫము మీఱి మఱియు గనులు మూతలు పడి" అని వేమన చెప్పిన పద్యాన్ని అనుకరించినట్లుగా ఈ క్రింది పద్యం కన్పిస్తుంది.

సీ॥ "కఫవాత పైత్యముల్ గప్పగా భ్రమచేత
గంపముద్భవమంది కష్టపడుచు" (నరసింహ. శ. 19)

"ఉత్తుత్తి తోలు దీని యుపయోగములు లేవు" వేమన చెప్పగ

సీ॥ "పచ్చి చర్మవుత్తిత్తి పసలేదు దేహంబు
లోపల నంతట రొయ రోత" (నరసింహ శ. 52)

"దానమరసి చేయు దాతదగ్గర జేరి
వక్రభాషణములు" వేమన చెప్పగా

సీ॥ "దాత దగ్గరజేరి తనముల్లె చెడినట్లు
జిహ్వతో చాడీలు చెప్పచుండు" (నరసింహ శ. 16)

"సంధ్య వార్చనేమి? జపము చేయనేమి?
వేద శాస్త్రములను" వేమన చెప్పగా - శేషప్ప

ఉ॥ "జందమింపుగ వేసి సంధ్య వార్చిన నేమి
బ్రహ్మమందక కాడు బ్రాహ్మణుండు" (నరసింహ, శ. 38)

ఈ విధంగా పరిశీలించినట్లయితే శేషప్ప రచనలపై పూర్వకవుల ప్రభావం ఏ విధంగా ఉందో తెలుస్తున్నది. పోతన భాగవతం, ధూర్జట కాళహస్తీశ్వర శతకం, వేమన శతకం, సుమతీ శతకం, దాశరథీ శతకంలోని పద్యాలు ప్రజాదరణను పొంది, ప్రసిద్ధిగాంచినవి. కనుక శేషప్ప అలాంటి పద్యాలను ఎక్కువగా పఠించడం వలననో, గానం చేయడం వలననో వాటి ప్రభావం రచించిన త్రిశతిపై పడిందని మనం భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. శేషప్ప, 'నరసింహ శతకము', 1982.
2. శేషప్ప, 'నరహరి శతకము', 1982.
3. శేషప్ప, 'నృకేశరి శతకము', 1982.
4. వెంకట నరసయ్య, కుందుర్తి, భక్తి రసామృత సింధువు.
5. పోతన, భాగవతం.
6. శ్యామసుందర శాస్త్రి, మద్వాచారి, 'త్రిశతి'.
7. నరసయ్య సంగనపట్ల, శ్రీధర్మపురి క్షేత్ర చరిత్ర, 2004.
8. సుబ్బారావు వంగూరి, శతక కవుల చరిత్రనము, 1957.
9. వెంకటరామ శాస్త్రి కొంపెల్ల, ధూర్జటి మహాకవి విరచిత కాళహస్తీశ్వర శతకము, టికాతాత్పర్యసహితము, రాజమండ్రి.
10. దాశరధి శతకము, 2005, విజయవాడ, వసుంధర పబ్లికేషన్.


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# ఉత్తర తెలంగాణ వాగ్గేయకారులు-గేయాల అధ్యయనం



కొత్తపల్లి నవీన్
పరిశోధక విద్యార్థి తెలంగాణ విశ్వవిద్యాలయం.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

తెలంగాణ రాష్ట్రము అవతరించిన పిమ్మట తెలంగాణ ప్రాంత వాగ్గేయకారులపై నిర్దిష్టమైన పరిశోధనలు జరుగలేదు. వారిని ఈ లోకానికి వెల్లడి చేయటం, తెలంగాణాలో మరుగున పడిన తెలంగాణ వాగ్గేయకారులకు అందులో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ లోని (ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్) "భక్తి" పరంగా, కీర్తాన్ సంకీర్తనలు, భజనలు, తత్వములు రచించిన వాగ్గేయ కారులను వెలికి తీసి వారి గీయాలపై విశిష్ట అధ్యయనం చేయటం, అందులో ముఖ్యంగా (1900-2000) 20వ శతాబ్దం వరకు ఉన్న ఉత్తర తెలంగాణ వాగ్గేయకారులను వెలికి తీసి సాహితీలోకానికి పరిచయం చేయటం ఈ వ్యాస ఉద్దేశ్యం.

తెలంగాణ రాష్ట్రంలో పాత ఉమ్మడి జిల్లాలు అయిన నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలను కలిపి ఉత్తర తెలంగాణ అంటారు, ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాలు అని విభజించకుండా ఈ మూడు ఉమ్మడి జిల్లాలను కలిపి మొత్తంగా "ఉత్తర తెలంగాణ" గా పరిగణించడం.

**కీలక పదాలు :**

వాక్కు, వాగ్గేయకారుడు, తత్త్వం, కీర్తన-సంకీర్తనలు, భక్తి, గేయం, రాగం, ఆద్యాత్మిక, పౌరాణిక, ధాతువు, ఆచలం, ఐహికం, కృతులు.

**ప్రవేశిక :**

విశిష్టమైన భారతీయ వాగ్గేయకార సంస్కృతిని సుసంపన్నం చేయుటలో తెలంగాణ ప్రాంతం కూడా వెనుకంజలో లేదు, బౌద్ధం, జైనం, హైందవం, మాతృ దేవతారాధన వంటి ఎన్నో మత విశ్వాసాలను పెంచి పోషించిన తెలంగాణ ప్రాంతంలో ఈ వాగ్గేయకార సంప్రదాయం ఒక సంస్కృతిగా ఎదగటం ఓ ప్రత్యేకత, అయితే ప్రధానంగా భద్రాచల

రామదాసు (1620-1680) కాలం నుంచి ఈ వాగ్గేయకార సంప్రదాయం తెలంగాణాలో స్థిరపడిందని చెప్పవచ్చు. ప్రధానంగా శ్రీరాముడిని, మనిషి జీవన ధర్మాన్ని, తాత్వికతని వందలాది కీర్తనలలో వర్ణించిన రామదాసు తెలంగాణ వాగ్గేయకారులందరికి ఆదిగురువని చెప్పవచ్చు, తెలంగాణాలో వాగ్గేయకార సంస్కృతి ప్రధానంగా మూడు రూపాలలో కనిపిస్తుంది. 1) శాస్త్రీయ వాగ్గేయకారం, 2) విభజన వాగ్గేయకారం, 3) ప్రజా వాగ్గేయకారం. ఈ మూడు రీతులకు సంబందించిన ఎంతోమంది వాగ్గేయకారులు తెలంగాణాలో ఈ వాగ్గేయకార సంప్రదాయాన్ని బలోపేతం చేశారు, వీరిలో హిందూ వాగ్గేయకారులే కాక, ముస్లిం వాగ్గేయకారులు ఉండడం తెలంగాణ నేలలోని సర్వమత సామరస్య భావనకు నిలువుటద్దం అని చెప్పాలి.

భక్తితత్వం ఆధారంగా మనిషిని మనిషిగా రూపొందించే లక్ష్యంతో భారతీయ తాత్విక, చింతనలో మొగ్గతొడిగిన సంగీత సాహితీ ప్రదర్శన ప్రక్రియే "వాగ్గేయం" వాగ్గేయంలో రెండు ప్రధాన అంశాలు ఒకటిగా కలిసిపోయి దేహాత్మల లాగా ఒక్కటిగా కనిపిస్తాయి. వాక్కు (సాహిత్యం) గేయం (సంగీత బద్ధమైన రాగయుక్త ఆలాపన) ఇందులో వాక్కు గేయం అయితే, గేయం ఆత్మ అని చెప్పవచ్చు, అనగా ఒక భావన పండిత, పాశుర జనరంజకంగా మలచటంలో, పునస్మరణ చేయటంలో మననం చేయటంలో ఈ "వాగ్గేయం" అంతకు ముందటి ఎన్నెన్నో సాహితీ ప్రక్రియలకన్నా ప్రజానుకూలంగా ఉండి ఆదరణ పొందింది.

ఈ విధంగా తెలంగాణ మట్టి మీద ప్రభవించిన ఎంతో మంది వాగ్గేయకారులు తమ రచనలలో గొప్ప, తాత్విక భూమికను ఆద్యాత్మిక స్పృహను గ్రామీణ, పల్లె ప్రాంతాలలో సాహిత్యం కల్పించారు. అయితే తెలంగాణ వాగ్గేయకార సంప్రదాయంలో మరొక విశేషమేమిటంటే ఈ వాగ్గేయకారులలో రామదాసు వంటి వారు మినహా ఇతరులు రాసిన కీర్తనలు అన్ని శిష్ట సాంప్రదాయం కన్నా, దేశీ సంప్రదాయంలో "భజన సంకీర్తనల" పేరిట ప్రజలలో విపరీతంగా వాడకలోకి వచ్చాయి, శాస్త్రీయ సంగీత కచేరీలలోను, సాంప్రదాయ నృత్య రీతులలోను ఈ భాన సంకీర్తనలు చొచ్చుక పోకపోయినప్పటికి, రాష్ట్రం నలుమూలలలో ఉన్న ఆలయాలలో మాత్రం ప్రధాన సంగీత ఉపాసనలుగా జనాదరణ పొందాయి. స్థాయి బేధాలు ఉన్నత నిమ్న వర్గాల వివక్షకు అతీతంగా ఇవి ప్రజలందరికి చేరువై, వారు స్వతంత్రంగా స్వేచ్ఛగా భజన సంకీర్తనలను నేర్చుకొని, పాడి అలరించే సౌలభ్యాన్ని కలిగించాయి.

**వాగ్గేయకారుల పరిచయం :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యోగి పరమేశ్వరయ్య "ఆత్మా సాక్షాత్కారం మార్గదర్శి", కొత్తపల్లి పోశదాసు "ఆత్మజ్ఞాన యోగార్చన" అనే గ్రంథాన్ని ముద్రించారు, దాసానుదాసు గంగాదాసు "స్వదర్శన భజనమాల" అన్న సంకీర్తనలు, కోనేటి ఓం ప్రకాశ్ "సంకీర్తన మాలిక", ఆయుర్వేద వైద్యుడు బ్రహ్మయ "అచల పరిపూర్ణ తాత్వికతలో" రచనలు చేశాడు, జక్కుల కాశయ్య "ఆచల పరిపూర్ణ అమృతసారం" అనే తత్వాలు, మేరుగురాములు "జ్ఞాన ప్రకాశిని", ఉదారి శేషన్న పంతులు "శ్రీ సద్గురు జ్ఞానోల్లాస భజన పూల", దాసదాస స్వామీ "శ్రీ రాఘవ భజనామృతం" అనే భజన పాటల పుస్తకాన్ని రాశారు.

ఉమ్మడి నిజామాబాద్ లో అనంతపురం సిద్దప్ప కవి, పెద్దారం పోచయ్య దాసు, శ్రీ శివరామ భజన కీర్తనలు, వడ్ల వెంకటాచార్యుల తాళ్ళ లక్ష్మి నారాయణ గౌడ్... శ్రీ కృష్ణ గోపిక ప్రణయాస తరంగిణి" మామిండ్ల రామా గౌడ్ శ్రీ శబరీ మాత జీవిత చరిత్ర, పెద్ది హనుమయ్య శ్రీ హరిహర భజనమాల అనే గ్రంథం రాశారు.

ఉమ్మడి కరీంనగర్ లో మామిడిపల్లి సాంబశివ వేదాంతం కాశీనాతం, "వేములవాడ రాజరాజేశ్వర భజన మాల" పద్గుల సాంబశివ శర్మ, ఆవుదుర్తి లక్ష్మన్ శ్రీ కొండగట్టు అంజన్న భక్తిగీతాలు, మద్దివేని శ్రీనివాస్ "అంజన్న దర్శనం", గుండేటి రమేష్ "శబరీమాత భజన కీతనాలు" పిట్టల నారాయణ "బ్రహ్మంగారి భజన కీర్తనలు" అనుమాండ్ల

శంకరయ్య "శ్రీ మాతా భజనామ్రుతం" అనే పాటల పుస్తకాన్ని ముద్రించిన ఉత్తర తెలంగాణ ప్రాంతంలో చాలా మంది వాగ్గేయకారులు కీర్తనలు, సంకీర్తనలు, భజనలు, తత్వములు రచించి సంకీర్తన సాహిత్యాన్ని పరిపుష్టి చేశారు.

**శైవ వైష్ణవ దేవీ తత్వ గేయాలు :**

ఉత్తర తెలంగాణాలో శైవం అనేది ఒక ముఖ్యమైన మతపరమైన సంప్రదాయం, ఇది శివుడిని ప్రధాన దైవంగా ఆరాధించే ఒక మతం.

"గౌరీప్రియ గంగాధర రారా స్మరించెద సద్గురు హరా
పార్వతీ పతి హరహర పరమేశ పాపసంహారా
గారాల కంఠరా నీవెరా మురియును శరణజేరితిరా" : గౌరీ :

యోగీ పరమేశ్వరదాసు తన "ఆత్మా సాక్షాత్కార మార్గదర్శి" గ్రంథంలో పరమశివుడే ముక్తికి మార్గమని తెలియజేశాడు.

తెలంగాణలో తొలినాళ్ళ వైదిక మతంలో వైష్ణవం ఒక ముఖ్యమైన భాగం ఈ వైష్ణవ చరిత్ర రెండు దశల్లో వర్ధిల్లింది.

"హరియతడే పురహరయతడే
పరబ్రహ్మమే శ్రీహరి యతడే
వరలక్ష్మి నేలినా నరహరి యతడే" : హరి :

ఎంతోమంది భక్తులు "హరి" అని రక్షించుమని వేడుకొనగా రక్షించే ఆ శ్రీహరి వైకుంఠ వాసి అని పిట్టల నారాయణ ఈ కీర్తనలో తెలియజేశారు.

దేవీ వైభవం అనేది శక్తి స్వరూపిణి అయిన దేవి యొక్క గొప్పతనాన్ని మహిమను తెలియజేసే ఒక విధానం.

హరుడు ప్రత్యక్షమాయెను - గౌరీదేవికి
శంకరుడు ప్రత్యక్షమాయెను :హరుడు:

రాకచండురుని బోలు - రంగైన మేను కలిగి
శ్రీ కొమరుని గంధర్వుల రాయని - శ్రీధరుని మించిన సుందరుడై.

పార్వతీ దేవికి శివుడు ప్రత్యక్షమైన తీరును ముద్దు బాలంభట్టు శివుని యొక్క వస్త్రాలంకరణ, దేహ నిరుధ్యాన్ని, ప్రస్తుతించిన విధానాన్ని చక్కగా తెలిపాడు.

**ముగింపు :**

వాగ్గేయ సాహిత్యం ద్వారా భక్తి ఆధ్యాత్మిక చింతన, తాత్విక దర్శనం మానవునిలో కల్పించి దేవుడికి - మానవుడికి మధ్య సంబంధాలను బలోపేతం చేయవచ్చు. మనిషిని సన్మార్గంలో నడిపించి, భూత దయ, కరుణ, సాటి మనిషి పట్ల గౌరవం కలిగించి, పరస్పర విశ్వాసం వంటి అనుకూల ఆలోచనలు నెలకొల్పటం, శ్రుత సంప్రదాయంలోకి వచ్చి ప్రజల నాలుకల మీద నిరంతరం నడిచేలా చేసి, మరొక తరానికి అందించవచ్చు, మానవునిలో లౌకిక జ్ఞానాన్ని, సత్యాన్ని ఆవిష్కరించడం.

అంతిమంగా మనిషి జీవితానికి ఆధ్యాత్మిక ప్రాతిపదికగా ఆనంద మార్గాన్ని చూపించి మనిషిలోని జంతు వాంచలను, స్వార్థ కాంక్షను, హింసా ప్రవృత్తిని తగ్గించి, మనిషి ఉదాత్త మానవీయ విలువలతో కూడిన సమున్నత మానవుడిగా ఎదిగేందుకు దారి చూపించడం. అంతిమంగా మనిషి జీవితానికి ఆద్యాత్మిక ప్రాతిపదికగా ఆనంద మార్గాన్ని చూపించి

ఆత్మను పరమాత్మలో విలీనం అయ్యే వరకు పరమాత్మ సాక్షాత్కారం తెలుసుకోవడానికి మార్గాన్ని సుగమం చేయడం ద్వారా మనిషిని భక్తి పరంగా ఎదిగింప జేయడానికి వాగ్గేయకార సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుంది.

**ఆధార గ్రంథాలు :**


1. భాస్కర యోగి పి.2019 తెలంగాణ పద సంకీర్తనలు, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
2. హరి కృష్ణ మామిడి (సం.)2017 తెలంగాణ వాగ్గేయ వైభవము, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
3. రజనీకాంత రావు బాలాంత్రపు (సం.) 1958 ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర, విజయవాడ.
4. కృష్ణ వాడపల్లి (సం.) 2022 తెలంగాణ ప్రముఖ కవులు, కావ్యాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్.
5. త్రివేణి వంగరి (సం) 2013 భక్తి తత్వ కీర్తనలు శ్రీ కృష్ణ ప్రింటర్స్, సికింద్రాబాద్.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# బాల గంగాధర తిలక్ గారి "అమృతం కురిసిన రాత్రి" - ఒక పరిశీలన



మాచిరాజు దుర్గ
తెలుగు ఉపాధ్యాయిని, అన్నవరపు వారి ఉన్నత పాఠశాల, బాపట్ల.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

దేవరకొండ బాల గంగాధర తిలక్ పశ్చిమ గోదావరి జిల్లా, 'తణుకు' తాలూకా మండపాక గ్రామంలో 1921 ఆగష్టు 21న జన్మించారు. తిలక్ పేరు తలుచుకోగానే నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు అన్న వాక్యం స్ఫురించక తప్పదు. తిలక్ కవిగానే కాదు, కథకుడిగా కూడా తనదైన ముద్ర వేశారు. తిలక్ కవిత్వంలో ఆధునికత, భావోద్వేగం, సామాజిక స్పృహ స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన కవితలు సాధారణ మనిషి జీవితాన్ని, బాధలను, ఆశలను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా సంపుటి ద్వారా ఆయనకు విశేష ఖ్యాతి వచ్చింది. ఈ గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచింది.

**కీలక పదాలు :**

అమృత (దివ్యత్వం, ఆనందం), రాత్రి (నిశ్శబ్దం, ప్రశాంతత), ప్రకృతి సౌందర్యం, చంద్రకాంతి, మౌనం, ఆత్మీయ అనుభూతి, కలల లోకం, కవిత్వరసము, హృదయ స్పందనలు, ఆనంద విహారం, సౌమ్యత, శాంతి, భావుకత, రమణీయత, నిశ్శబ్ద సౌందర్యం, ఆత్మానందం, సౌందర్యానుభూతి.

**ప్రవేశిక :**

తెలుగు సాహిత్యంలో ప్రకృతి సౌందర్యాన్ని, మానవ హృదయ భావాలను మధురంగా వ్యక్తపరిచే కవితల్లో 'అమృతం కురిసిన రాత్రి...' ఒక ప్రత్యేక స్థానం కలిగినది. ఈ కవితలో కవి రాత్రి నిశ్శబ్దాన్ని, వెన్నెల కాంతిని, ప్రకృతి అందాలను అద్భుతంగా చిత్రీకరిస్తాడు. రాత్రివేళలో ప్రకృతి అంతా అమృతం కురిసినట్టుగా మారిపోవడం ద్వారా మనసుకు కలిగే ఆనందం, ప్రశాంతతను కవి సున్నితంగా వ్యక్తం చేశాడు. ఈ కవిత కేవలం ప్రకృతి వర్ణన మాత్రమే కాకుండా, మనసులోని భావోద్వేగాలను, ఆత్మీయ అనుభూతులను కూడా ప్రతిబింబిస్తుంది. తిలక్ రచనల్లో సరళమైన

భాష, లోతైన భావం, కొత్త దృక్పథం కనిపిస్తాయి. ఆయన కవిత్వం పాఠకుల హృదయాలను తాకేలా ఉంటుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, మానవ విలువలను తన కవిత్వంలో ప్రతిబింబించారు.

**విషయ వివరణ :**

1.1 తిలక్ వేసవి తీవ్రతను తెలియజేసిన తీరు అద్భుతం. "వేసవి" అనే కవితలో :

"కాలం కదలదు, గుహలో పులి
పంజా విప్పదు, చేపకు
గాలం తగలదు".

"ఎండుటాకులు సుడిగాలికి తిరిగెను
గిర్రున పడగొట్టిన బిక్షుకి అరచెను
వెర్రిగా"

"ఆకాశం తెల్లని స్మశానమై
చెదరెను, సూర్యడి తలలో పెను
మంటలు కదలెను"

1.2 ముసలితనాన్ని (వృద్యాప్యాన్ని) "ముసలివాడు" అనే కవితలో ఎంతో హృద్యంగా వర్ణించాడు తిలక్ :

"కనుగూడులు నల్లనయి
పెనుమ్రోడులు చల్లనయి
కీలు కీలు బాధగా
నాడు నాడులు లాగగా
చలిగాలి చూరులో కసరినటు
చలిచీమ మట్టిలో దొలిచినటు
వచ్చినది మూగినది ముసిరినది
ముసలితనము"

1.3 లోకంలో మనుష్యుల బాధలను తిలక్ ఎంతో ఆవేదనాభరిత హృదయంతో వర్ణించాడు. యంత్రాలతో పనిచేయిస్తూ దురదృష్టవశాత్తు చేతులు, కాళ్ళు తెగిపోయిన కార్మికుల బాధను, కరువు కాటకాల వలనకూడు లేనివారి బాధను ఈ క్రింది విధంగా "భూలోకం" అనే కవితలో వర్ణించాడు :

"అస్థిమూల పంజరాలు
ఆర్తరావ మందిరాలు
ఏ లోకం తల్లీ,
ఏవో భాష జలాలు"

"కూడు లేని లోకంయిది
గుండెలోతు తాపంయిది
......................"

"ఛటచ్ఛటా శబ్దమేమి
చక్రాలకు రక్తమేమి
....................
ఆవులించు యంత్రశాల
చక్రంలో చిక్కుపడ్డ
మనిషి గుండె ఏడ్చిందట !
.............................
"వంగదేశ క్షామం యిది
వ్యంగ్య భాష క్షేమం యిది
పరప్రభుత్వ దానం యిది
ధనిక లోక ధర్మం యిది"

1.4 సమాజాన్ని ఒక చెట్టుతో పోల్చాడు తిలక్. ఆకు పండిపోయి రాలిపోతున్నా చెట్టు మాత్రం మౌనం వహిస్తుందేగాని పైకి చెప్పదు అంటాడు తిలక్. అంటే సమాజంలో ఒకడు తప్పు చేసి దెబ్బతిని పోతే సమాజం ఏ మాత్రమూ స్పందించదు. దీనినే తిలక్ సమాజంలో దాగి ఉన్న కుటిలబుద్ధి అన్నాడు. "సమాజం" అనే కవితలో :

"ఒక ఆకైనా పండబారి రాలిపోతున్న వైనం
చెట్టు చెట్టంతకి తెలుసు కాని చెప్పదు చెప్పలేదు పైకి
ఒకడు తప్పిదం చేస్తే చాలు దాని వెనుక నిలిచి ఉంది
సమాజం సమాజం అంతటా గుప్తంగా ఉన్న
కుటిల బుద్ధి స్వభావం"

**ఉప సంహారం :**

'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి మనకు ప్రకృతితో కలిసిపోయే ఆనందాన్ని, అంతరంగ శాంతిని గుర్తు చేస్తుంది. ఆధునిక జీవితంలోని కలహాల మధ్య కూడా ఇలాంటి ప్రశాంత క్షణాలు మనకు అవసరమని సూచిస్తుంది. అందువల్ల ఈ కవిత పాఠకుని హృదయంలో మధురానుభూతిని మిగుల్చుతూ ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించే స్ఫూర్తిదాయక కవితగా నిలుస్తుందని నా అభిప్రాయం. ఈ కవిత హృదయాన్ని హత్తుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు వచన కవిత్వ ఆకాశంలో చిరస్థాయిగా మిగిలిపోయే తారయే ఈ 'అమృతం కురిసిన రాత్రి'.

**ఆధార గ్రంథాలు :**


1. అమృతం కురిసిన రాత్రి - దేవరకొండ బాలగంగాధర తిలక్.
2. తెలుగు అకాడమి ప్రచురణలు.
3. ఆధునిక తెలుగు కవిత్వ సంకలనాలు.
4. ఈ పుస్తకం (పిడిఎఫ్ రూపంలో ఉన్న తెలుగు సాహిత్య గ్రంథాలు).
5. కేంద్ర సాహిత్య అకాడమి గ్రంథాలు.


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# ఎంకన్నను ఏడుకోలల బాయిలేసి గట్టిగా అరుసుకున్న నర్సన్న

**కళ్ళెం ధనోజ**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ.), నల్లగొండ,
సెల్ : 9347737311.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రచించిన "ఏడుకోలల బాయి - ఎన్నికల శతకం" భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ, రాజకీయ నాయకుల ప్రవర్తన, ఓటర్ల బాధ్యతలను ప్రతిబింబించే విశిష్ట శతకం. తెలంగాణ ప్రజాభాషలో రచించబడిన ఈ శతకం 101 పద్యాల ద్వారా ఎన్నికల సమయంలో చోటుచేసుకునే మోసపూరిత హామీలు, డబ్బు - మద్యం ఈ ప్రలోభాలు, పార్టీ ఫిరాయింపులు, రాజకీయ అవినీతి వంటి అంశాలను విమర్శిస్తుంది. అదే సమయంలో ఓటరుకు చైతన్యాన్ని కలిగిస్తూ బాధ్యతాయుతమైన ఓటు వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ శతకం కేవలం సాహిత్య కృతి మాత్రమే కాదు; ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సామాజిక పత్రంగా నిలుస్తుంది.

**కీలక పదాలు :**

ఏడుకోలల బాయి, ఎన్నికల శతకం, ప్రజాస్వామ్యం, ఓటరు చైతన్యం, ఎన్నికలు, రాజకీయ అవినీతి, ఓటు హక్కు, తెలంగాణ భాష, సామాజిక స్పృహ, రాజకీయ వ్యంగ్యం, ప్రజా సంక్షేమం.

## 1. ప్రవేశిక :

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు మూలస్తంభాలు. ప్రజల చేత, ప్రజల కోసం ఏర్పడే ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రక్రియలో ఓటు అత్యంత విలువైన ఆయుధం. అయితే కాలక్రమేణా ఎన్నికల వ్యవస్థలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. రాజకీయ నాయకులు మాయమాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలు, డబ్బు మరియు మద్యం ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఓటరులో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఏర్పడింది. అలాంటి సామాజిక బాధ్యతతో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రచించిన "ఏడుకోలల బాయి - ఎన్నికల శతకం" ఆధునిక ఎన్నికల రాజకీయాలకు అద్దం పట్టిన గొప్ప సాహిత్య కృతి.

**2. విషయ వివరణ :**

ఓటరు ఎంకన్నను ఎత్తి పొడుస్తూ "ఏడుకోలల బాయి" శతకంలోని ప్రతి పద్యం ఓటరును ఉద్దేశించి రాయబడింది. కవి ఓటరును "ఎంకన్న" అని సంబోధిస్తూ స్నేహపూర్వకంగా, అవసరమైన చోట గట్టిగా హెచ్చరిస్తూ ఎన్నికల వాస్తవాలను తెలియజేస్తాడు.

ఓటరా! పరికించి ఒకసారి చూడరా
అభ్యర్థి అనువాడి లభ్య చరిత
పౌరుడా! క్యాండేటుపల్కులన్ఆలించు
సత్యమ్ము ఎంతో? అసత్య మెంతో? వారు జేసెడి గొప్ప వాగ్దానముల లిస్టు
ఓర్పుగా చూడోయి తీర్పునివ్వ
మాటకూ చేతకూ మాలావు దూరాలు
పెట్టు వాడిని కనిపెట్టి చూడు
శతకంలోని మకుటం :
మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండా ఓట్లెట్ల గుద్దుతావు?
ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!
ఒక్క మాటన్నవినవార! తిక్కలోడ?

ఈ మకుటం మొత్తం శతకానికి ప్రాణం వంటిది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు చేసే మాయమాటలను నమ్మి ఓటు వేయవద్దని కవి ఓటరును హెచ్చరిస్తాడు. నాకు ఇది చదివినప్పుడు కాళోజి గారు ఓటర్ ను హెచ్చరించిన

అభ్యర్థి ఏ పార్టీ వాడో కాదు
ఏ పాటి వాడో కాదు
ఎన్నుకుంటే ఎలగ బెట్టడం కాదు

ఇందాక ఏం చేశాడో చూడు పెట్టుకున్న టోపీ కాదు పెట్టుకునే టోపీ చూడు అన్న కవిత స్ఫురణకు వస్తుంది.

నటనకు మారుపేరు నాయకులు
తెల్లవారకముందే గల్లీ జొరబడి
మోరీల కంపెల్ల పారజూసి
సందులోగందగీఎందుకున్నదియని
అధికార గనముపై ఆడిపోసి
మంజీరా నల్లాల మంచినీళ్ళేవని
ఉగ్రుడై బజారునూపి ఊపీ
ఇప్పుడున్నోనిపై నిప్పు కనిక లేసి
అభివృద్ధికి దూరమామెడనుచు
తనను గెలిపించ చూపింతు పనితనంబు
ఇటుల జేతను కార్యముల్ చిటికెలోన

అంటు వాగ్దానమాలికన్ అరచిపాడు
వాడె ఈ కాలపోల్లకు లీడరంటే

ఎన్నికల సమయంలో నాయకుల నటనను కవి వ్యంగ్యంగా చిత్రించాడు. సాధారణంగా ప్రజల మధ్య కనిపించని నాయకులు ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరుగుతూ, ప్రజల బాధలను పంచుకుంటున్నట్టు నటిస్తారని చెబుతాడు. వారి నటన ముందు సినిమా నటుల నటన ఆఖరికి ఆస్కారు అవార్డ్ కూడా చిన్నబోతుందని కవి అభిప్రాయపడతాడు.

ఈ శకతంలో రాజకీయ పార్టీల స్వార్థపూరిత ధోరణి, పార్టీ ఫిరాయింపులు, అధికారం కోసం జరిగే రాజకీయ కుట్రలు, ప్రజా సంక్షేమం కంటే పదవులకే ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు తీవ్ర విమర్శకు గురవుతాయి. గెలిచిన తర్వాత ప్రజలను మరిచిపోయే నాయకుల స్వభావాన్ని కవి పదేపదే గుర్తు చేస్తాడు.

అలాగే ఎన్నికలలో డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే దుస్థితిని కవి ఖండించాడు. ఓటు విలువను డబ్బుతో కొలవకూడదని, తాత్కాలిక ప్రయోజనాల కోసం భవిష్యత్తును పణంగా పెట్టవద్దని సూచించాడు.

శతకంలో ఓటరు బాధ్యతకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అభ్యర్థి వ్యక్తిత్వం, చరిత్ర, ప్రజాసేవా దృక్పథం, మాటలకు చేతలకు పొంతన ఉన్నదా లేదా అనే అంశాలను పరిశీలించి ఓటు వేయాలని కవి పిలుపునిస్తాడు.

గతమెంత ఘనకీర్తి నాయకులుండే
ఎంపీలు వెళుతుండ్రి ఎర్రబస్సుల నెక్కి
పియ్యేలు అనుమాట తీయకుండా
సభలోకి ఎమ్మెల్యే సైకిలెక్కొస్తుండే
తను కూడా మామూలు మనిషిననియె
ఇప్పుడు వచ్చు ఎమ్మెల్యే ఇవరయే దొరకదు
కారు జీపుల గుంపు బారులోన
ఎటులొచ్చునో ఎంపి ఎవ్వరూహిస్తారు
తీరైన కాన్వాయి తీరులోనలి

గతంలో ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చిన నాయకులు సాధారణ జీవనం గడిపేవారని, నేడు రాజకీయాలు ధనబలం ఆధారంగా మారిపోయాయని కవి ఆవేదన వ్యక్తం చేస్తాడు. నేటి పరిస్థితుల్లో ధనం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడం కూడా కష్టసాధ్యమైందని చెబుతాడు.

తెలంగాణ యాస పదాలు
చచ్చిపోయిన బర్రె చాలా మంచిది రోరి
పగిలిపోయిన పట్వ పాలనిచ్చు
బతికియున్నన్నాళ్లు బద్మాషుగాడైన
చచ్చినోని కనులు చారడుసి
చాకిరేవున గాలి చల్లనౌనే గాని ఆకలైన దూపకైన నీరె
దొరగారితో గల్సి దోస్తాన ఫలమేమి
ఏమి చెప్పిన దానికెస్సనాలె
అంటు నీతులు జెప్పేరు అద్భుతంగ

చిన్న జోకేసి మనమంత చిందులేయ
ఆట జూతురు ! అంటారు ఆహా! ఓహో!
వారి వలలోన మనమంత చేరిపోగ

ఈ శతకం ప్రత్యేకత తెలంగాణ జానపద భాష, స్థానిక నుడికారాలు, సామెతలు, వ్యంగ్య శైలిలో ఉంది. సాహిత్యపరంగా సీసపద్య రూపాన్ని ఉపయోగిస్తూ, సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే సరళమైన భాషలో రచించడం దీని విశిష్టత.

“ఏడుకోలల బాయి” అనే పేరుకూ ప్రత్యేకమైన అర్థం ఉంది. జానపద భాషలో “ఏడు కోలల బావి” అంటే అత్యంత లోతైన బావి. ఎన్నికలు, రాజకీయాలు కూడా అంతే లోతైనవి, సామాన్యులకు సులభంగా అర్థంకాని అంశాలు అనే భావంతో ఈ పేరును రచయిత ఎంచుకున్నారు.

**3. ఉపసంహారణ :**

“ఏడోకోలల బాయి - ఎన్నికల శతకం” కేవలం పద్యాల సమాహారం కాదు; ఇది భారత ఎన్నికల వ్యవస్థకు పట్టిన దర్పణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటుచుసుకుంటున్న లోపాలను ఎత్తిచూపుతూ, ఓటరులో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే సామాజిక బాధ్యత గల కవితా కృతి. ప్రజల భాషలో, ప్రజల కోసమే రచించబడిన ఈ శతకం ఓటు విలువను గుర్తుచేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తుంది. సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ప్రజలకు, నాయకులకు సరైన దిశానిర్దేశం చేసే ఈ శతకం ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఓటు హక్కును వినియోగించే ప్రతి పౌరుడు చదవదగిన ప్రజాచైతన్య గ్రంథంగా “ఏడు కోలల బాయి” చిరస్థాయిగా నిలిచిపోతుంది.

జనమంతా ఒక మార్పు రణముకై గొంతెత్తి
దినమొసైనే తప్ప కనము మార్పు

జనమంతా గొంతు ఎత్తితేనే మార్పు వస్తుంది అనే నరసింహారెడ్డి గారి ఆశాభావం ప్రతి ఓటర్‌ల కలగాలని ఆశిద్దాం!!

**4. ఆధార గ్రంథాలు :**


1. ఏడుకోలల బాయిఎన్నికల శతకం - డా॥. ఏనుగు నరసింహారెడ్డి.
2. నా గొడవ - కాళోజీ నారాయణరావు
3. ఓటరన్న శతకం - డా॥. కోయి కోటేశ్వరరావు.
4. ఎన్నికల ఎండమావి - అలిశెట్టి ప్రభాకర్.


★★★

**భావవీణ** **BHAVAVEENA**
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
*Journal of Arts, Literary, Culture & Language Study*
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలుగు జానపద గీతాలు – సోషల్ మీడియా పాత్ర : ఒక విశ్లేషణ



**డోబిల విజయ**
పరిశోధకురాలు, తెలుగు విభాగము, కాకతీయ విశ్వ విద్యాలయము, వరంగల్,
సెల్ నం: 9177362430.

**జరుపుల రమేశ్**
సహాయ ఆచార్యులు, తెలుగు విభాగము, కాకతీయ విశ్వ విద్యాలయము, వరంగల్,
సెల్ నం: 9177362430



సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**సారాంశం**

ముఖ్యమైన ప్రజాసాహిత్య రూపాలు. సంప్రదాయంగా మౌఖికంగా తరతరాలుగా సంక్రమించిన ఈ గీతాలు, నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికల ద్వారా కొత్త గుర్తింపును సంతరించుకున్నాయి. ఈ అధ్యయనం తెలుగు జానపద గీతాలపై సోషల్ మీడియా ప్రభావాన్ని విశ్లేషించడమే లక్ష్యంగా సాగింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల జానపద గీతాలను అధ్యయనానికి తీసుకొని, YouTube, Facebook, Instagram వంటి వేదికలలో అవి ఎలా ప్రాచుర్యం పొందుతున్నాయో పరిశీలించబడింది. ఫీల్డ్ డేటా మరియు కేస్ స్టడీల ఆధారంగా, సోషల్ మీడియా గ్రామీణ కళాకారులకు గుర్తింపు, ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తించబడింది. అదే సమయంలో వాణిజ్యీకరణ, అసలితనం కోల్పోవడం, గీతాల వక్రీకరణ వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. కాబట్టి జానపద గీతాల సంరక్షణకు డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం సూచిస్తుంది.

**Keywords :**

తెలుగు జానపద గీతాలు, సోషల్ మీడియా, ఉత్తర తెలంగాణ, డిజిటలైజేషన్, ప్రజాసంస్కృతి

## పరిచయం

తెలుగు జానపద గీతాలు తెలుగు ప్రజల జీవన విధానం, భావోద్వేగాలు, సంప్రదాయాలు, ఆచారాలు మరియు సామాజిక అనుభవాలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. తరతరాలుగా మౌఖిక సంప్రదాయంగా కొనసాగిన ఈ గీతాలు పల్లె సంస్కృతికి ప్రాణాధారంగా ఉండేవి. అయితే సమాచార సాంకేతికత విస్తరించిన నేటి డిజిటల్ యుగంలో, ముఖ్యంగా సోషల్ మీడియా వేదికల ద్వారా జానపద గీతాలు కొత్త రూపం దాల్చుతున్నాయి.

YouTube, Facebook, Instagram, WhatsApp వంటి వేదికలు ప్రజాసంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు జానపద గీతాలు సోషల్ మీడియా ద్వారా ఎలా మారుతున్నాయి? వాటి సంరక్షణకు, వ్యాప్తికి సోషల్ మీడియా ఎంతవరకు దోహదపడుతోంది? అన్న ప్రశ్నలకు సమాధానంగా ఈ వ్యాసం రూపొందించబడింది. ఈ అధ్యయనం ప్రధాన లక్ష్యం సోషల్ మీడియా తెలుగు జానపద గీతాలపై చూపుతున్న ప్రభావాన్ని విశ్లేషించడం, అవకాశాలు సవాళ్లను గుర్తించడం.

### తెలుగు జానపద గీతాల స్వరూపం

#### జానపద గీతాల అర్థం

జానపద గీతాలు సాధారణ ప్రజల జీవితం నుంచి పుట్టిన గీతాలు. వీటికి నిర్దిష్ట రచయిత ఉండరు. సామాజిక అనుభవాలు, శ్రమ, ఆనందం, బాధ, పండుగలు, ఆచారాలు ఇవన్నీ జానపద గీతాలలో సహజంగా ప్రతిఫలిస్తాయి. జానపద గీతాలు గ్రామీణ ప్రజల జీవన విధానం, శ్రమ, ఆనందం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఒక జానపద గేయం:

#### జానపద గేయం

రేలారే రేలారే రేలా రేలా రే...
రేలారే రేలారే రేలా రేలా రే...

పల్లె పొలాల పంటలన్నీ
పసిడి ధాన్యమై పండెనే,

రైతు చెమట చుక్కలతో
రత్నాల భూమి వెలిగెనే.

రేలారే రేలారే రేలా రేలా రే...
రేలారే రేలారే రేలా రేలా రే...

బతుకమ్మ పండుగ వచ్చెనమ్మా,
బంగారు పూలు పూచెనమ్మా,

అక్కచెల్లెళ్లు చేరి పాటలు పాడగా
పల్లె అంతా సందడయ్యెనమ్మా.

రేలారే రేలారే రేలా రేలా రే...
రేలారే రేలారే రేలా రేలా రే...

ఈ గేయం రైతుల శ్రమ, పల్లె జీవితం, మరియు బతుకమ్మ వంటి సాంస్కృతిక పండుగల ఆనందాన్ని ప్రతిబింబించే జానపద గేయానికి ఒక ఉదాహరణ.

### తెలుగు జానపద గీతాల రకాలు

తెలుగు ప్రాంతంలో అనేక రకాల జానపద గీతాలు కనిపిస్తాయి. వ్యవసాయ పనుల సమయంలో పాడే గీతాలు, పండుగల సమయంలో వినిపించే గీతాలు, పెళ్లి, జాతర, బతుకమ్మ, బోనాలు వంటి ఆచారాల్లో పాడే గీతాలు ముఖ్యమైనవి. మహిళల జీవన అనుభవాలను ప్రతిబింబించే స్త్రీ జానపద గీతాలు ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉన్నాయి.

మహిళల జీవన అనుభవాలు, కుటుంబ బంధాలు, పండుగల ఆనందం, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ఒక ప్రసిద్ధ తెలంగాణ జానపద గేయం (బతుకమ్మ పాట) ఉదాహరణ:

**బతుకమ్మ జానపద గేయం**

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
గున్నెపూలు తెచ్చి ఉయ్యాలో
గుట్టగా పేర్చితి ఉయ్యాలో
తంగేడు పూలతో ఉయ్యాలో
తల్లి నిన్ను పూజింతు ఉయ్యాలో
అక్కచెల్లెళ్లు కలిసి ఉయ్యాలో
ఆటపాటలాడెదం ఉయ్యాలో
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో

ఈ గేయంలో మహిళల సామూహిక జీవనం, సోదరీభావం, ప్రకృతిపట్ల అనుబంధం, పండుగ సంబరం స్పష్టంగా కనిపిస్తాయి. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు వలయాకారంగా చేరి ఇలాంటి పాటలను పాడుతూ ఆడతారు. ఇది తెలంగాణ స్త్రీ జానపద గేయ సంప్రదాయానికి మంచి ఉదాహరణ.

**సామాజిక సందేశాలు**

జానపద గీతాలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయి. కులవ్యవస్థ, లింగ వివక్ష, పేదరికం, శ్రమ విలువ వంటి అంశాలు వీటిలో వ్యక్తమవుతాయి. ప్రజల ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవడానికి ఇవి చారిత్రక ఆధారాలుగా ఉపయోగపడతాయి.

సామాజిక చైతన్యం, శ్రమ విలువ, పేదరికం, సమానత్వం వంటి అంశాలను ప్రతిబింబించే జానపద శైలిలోని ఒక గేయం :

శ్రమజీవి జానపద గేయం
కష్టపడి దున్నే రైతన్నా
కడుపు నింపే దేవుడన్నా

చెమట చుక్కలు నేలపై రాలి
బంగారు పంటలు పండెనయ్యా

కులమేమిటి మనిషికయ్యా
గుణమే గొప్పదని చెప్పెనయ్యా

ఆడ మగల తేడా లేక
అందరం కలిసే సాగెనయ్యా

పేదవాడి కన్నీటి కథను
పాటలో పలికె జానపదం

శ్రమకు గౌరవం ఇవ్వమని
సమాజానికి నేర్పె గీతమయ్యా

ఈ గేయంలో శ్రమ గౌరవం, కుల వివక్షకు వ్యతిరేక సందేశం, స్త్రీ-పురుష సమానత్వం, మరియు పేదల జీవిత వాస్తవాలు ప్రతిబింబిస్తాయి. ఇటువంటి జానపద గీతాలు ప్రజలలో సామాజిక అవగాహనను పెంపొందించడంతో పాటు, ఆ కాలపు సామాజిక పరిస్థితులను తెలియజేసే చారిత్రక ఆధారాలుగా కూడా ఉపయోగపడతాయి.

**సోషల్ మీడియా మరియు జానపద సాహిత్యం**

**సోషల్ మీడియా భావన**

సోషల్ మీడియా అనేది వినియోగదారులు తమ అభిప్రాయాలు, సృజనాత్మకత, సమాచారం పంచుకునే డిజిటల్ వేదిక. ఇది ప్రజాసంస్కృతిని వేగంగా విస్తరించే సాధనంగా మారింది.

**జానపద గీతాల డిజిటలైజేషన్**

మౌఖిక సంప్రదాయంగా ఉన్న జానపద గీతాలు ఇప్పుడు ఆడియో, వీడియో రూపాల్లో డిజిటల్ మాధ్యమాల్లో అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ కళాకారులు కూడా స్మార్ట్‌ఫోన్ల సహాయంతో తమ గీతాలను రికార్డు చేసి ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.

**ప్రముఖ సోషల్ మీడియా వేదికలు**

YouTubeలో అనేక జానపద గీతాల ఛానెల్స్ లక్షలాది వీక్షణలు సాధిస్తున్నాయి. Instagram Reels eT]jáTT Shorts ద్వారా చిన్న వీడియోల రూపంలో జానపద గీతాలు యువతకు చేరువవుతున్నాయి. WhatsApp ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఈ గీతాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

**సోషల్ మీడియా వల్ల వచ్చిన మార్పులు – విశ్లేషణ**

**ప్రాచుర్యం మరియు వ్యాప్తి**

సోషల్ మీడియా వల్ల ఒకప్పుడు ఒక గ్రామానికే పరిమితమైన జానపద గీతాలు ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తున్నాయి. వీక్షణలు, లైక్స్, షేర్లు గీతాల ప్రాచుర్యాన్ని పెంచుతున్నాయి. ఉత్తర తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన జానపద గీతాలు`శిబుబఎవ మరియు Facebook ద్వారా విస్తృత గుర్తింపు పొందుతున్నాయి. కరీంనగర్ ప్రాంతంలో వ్యవసాయ శ్రమకు సంబంధించిన గీతాలు, వరంగల్ ప్రాంతంలో బతుకమ్మ, బోనాల గీతాలు, ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల్లో కోయ, గోండు సముదాయాల గీతాలు ప్రత్యేకంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

**రూపాంతరం మరియు ఆధునికీకరణ**

సాంప్రదాయ జానపద గీతాలకు ఆధునిక సంగీతం, ఎలక్ట్రానిక్ వాయిద్యాలు జోడించబడుతున్నాయి. ఇది యువతను ఆకర్షిస్తున్నప్పటికీ, అసలైన స్వరూపం కొంత మేర కోల్పోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు వరంగల్ ప్రాంత బతుకమ్మ గీతాలు ఐజీ మిక్స్‌లుగా మారడం వల్ల సంప్రదాయ లయ, పదప్రయోగం మారుతున్నది.

**యువత పాత్ర**

ఉత్తర తెలంగాణ గ్రామీణ యువత Instagram Reels, Shorts ద్వారా జానపద గీతాలను నృత్య రూపంలో ప్రదర్శిస్తోంది. ఇది జానపద సంగీతాన్ని కొత్త తరం దగ్గరకు తీసుకువెళ్తున్నా, కొన్నిసార్లు గీతాల భావార్థం పక్కనపడుతోంది.

**మహిళా కళాకారుల ప్రాతినిధ్యం**

కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన మహిళా జానపద గాయనులు సోషల్ మీడియా ద్వారా గుర్తింపు పొందుతున్నారు. గ్రామీణ మహిళలు స్వీయ సమూహాల కార్యక్రమాలు, పండుగల సందర్భంగా పాడిన గీతాలు వీడియోల రూపంలో వైరల్ అవుతున్నాయి. ఇది మహిళల సాంస్కృతిక స్వరాన్ని బలపరుస్తోంది.

**ఫీల్డ్ డేటా – పరిశీలన విధానం**

ఈ అధ్యయనం కోసం ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో లభ్యమైన సోషల్ మీడియా కంటెంట్‌ను పరిశీలించారు. YouTube #ó HîýÙà, Facebook పేజీలు, WhatsApp గ్రూపుల్లో ప్రచారంలో ఉన్న జానపద గీతాల వీడియోలను నమూనాగా తీసుకున్నారు. వీక్షణలు, షేర్లు, వ్యాఖ్యలను విశ్లేషణకు ఉపయోగించారు.

**కరీంనగర్ జిల్లా :**

కరీంనగర్ జిల్లాలో వ్యవసాయ పనుల సమయంలో పాడే జానపద గీతాలను స్థానిక యువకులు వీడియోలుగా రూపొందించి YouTube లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక నిర్దిష్ట ఛానెల్‌లో ఈ గీతాలు వేలాది వీక్షణలు సాధించడం గమనార్హం. దీని ద్వారా స్థానిక కళాకారులకు ఆదాయం మరియు గుర్తింపు లభిస్తోంది.

**వరంగల్ జిల్లా :**

వరంగల్ ప్రాంతంలో బతుకమ్మ, బోనాల గీతాలు పండుగ కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వస్తున్నాయి. మహిళా బృందాలు పాడిన గీతాలు Instagram Reels రూపంలో వైరల్ అవుతున్నాయి. ఇది సంప్రదాయాన్ని కొనసాగించడంలో సహాయపడుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో వాణిజ్య దృష్టితో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

**ఆదిలాబాద్ జిల్లా :**

ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల్లో కోయ, గోండు సముదాయాల జానపద గీతాలు డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోల రూపంలో సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఇవి గిరిజన సంస్కృతిని ప్రజల ముందుకు తీసుకువస్తున్నప్పటికీ, భాషా స్వచ్ఛతను కాపాడాల్సిన అవసరం ఉంది.

**సమస్యలు మరియు సవాళ్లు**

సోషల్ మీడియా ద్వారా జానపద గీతాలకు వచ్చిన ప్రాచుర్యంతో పాటు కొన్ని సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. అసలితనం కోల్పోవడం, కాపీరైట్ సమస్యలు, కళాకారులకు తగిన ప్రతిఫలం లభించకపోవడం వంటి సవాళ్లు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో గీతాల అర్థాన్ని వక్రీకరించడం, అశ్లీలత జోడించడం సాంస్కృతిక విలువలను దెబ్బతీస్తోంది.

**సంరక్షణ మరియు అభివృద్ధికి సూచనలు**

తెలుగు జానపద గీతాల సంరక్షణకు డిజిటల్ ఆర్కైవ్స్ ఏర్పాటు చేయాలి. విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక సంస్థలు జానపద గీతాల డాక్యుమెంటేషన్‌కు ముందుకు రావాలి. అసలైన కళాకారులకు ఆర్థిక సహాయం, గుర్తింపు ఇవ్వడం అవసరం. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించేలా అవగాహన కల్పించాలి.

**ఉపసంహారం**

ఈ అధ్యయనం ద్వారా తెలుగు జానపద గీతాల పరిరక్షణలో మరియు విస్తరణలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తున్నదని స్పష్టమైంది. ఉత్తర తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల జానపద గీతాలు డిజిటల్ వేదికల ద్వారా స్థానిక పరిధిని దాటి విశాల ప్రజానీకానికి చేరుతున్నాయి. సోషల్ మీడియా వేదికలు గ్రామీణ కళాకారులకు గుర్తింపు, ఆర్థిక అవకాశాలు కల్పించడంలో సహాయపడుతున్నప్పటికీ, వాణిజ్యీకరణ,

అసలితనం కోల్పోవడం వంటి సవాళ్లను కూడా తెస్తున్నాయి. సంప్రదాయ జానపద గీతాలు ఆధునిక రూపాంతరాలతో యువతను ఆకర్షిస్తున్నా, వాటి మౌలిక సాంస్కృతిక విలువలను కాపాడాల్సిన అవసరం ఉంది. కాబట్టి ప్రభుత్వ సంస్థలు, అకడమిక్ వర్గాలు, డిజిటల్ మాధ్యమాలు కలిసి జానపద గీతాల సంరక్షణకు సమన్వయ చర్యలు చేపట్టాలి. అలా చేసినప్పుడే తెలుగు జానపద సాహిత్యం ఆధునిక యుగంలో సజీవంగా కొనసాగుతుంది.

**ఆధార గ్రంథాలు :**


1. బ్రౌన్, చి.పి. తెలుగు జానపద గీతాలు. మద్రాస్: ఆసియాటిక్ సొసైటీ, 1894.
2. సీతారామయ్య, కె. తెలుగు జానపద సాహిత్యం - అధ్యయనం. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 1998.
3. నరసింహారెడ్డి, జి. తెలంగాణ జానపద గీతాలు. వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం, 2005.
4. రమణారెడ్డి, టి. జానపద విజ్ఞానం. హైదరాబాద్: ఎమెస్కో, 2010.
5. తెలంగాణ సాహిత్య అకాడమీ. తెలంగాణ జానపద సంస్కృతి. హైదరాబాద్, 2016.


**డిజిటల్ & ఆన్‌లైన్ వనరులు**


1. Selected Telugu Folk Song Channels on YouTube (Karimnagar, Warangal, Adilabad regions).
2. Articles on Folk Culture and Social Media, EPW (Economic and Political Weekly).
3. Reports of Ministry of Culture, Government of India – Folk Arts & Digital Preservation.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# భూమి పుత్రుడు నవల – భాషా పరిశీలన



డి. సరళ

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026


**వ్యాస సంగ్రహం**

కాలువ మల్లయ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని, తేలుకుంట గ్రామంలో జన్మించారు. వీరి సాహితీ ప్రస్థానంలో ఇప్పటి వరకు 1000కి పైగా కథలు, 18 నవలలు, 800 పైగా వ్యాసాలు , 8 కవితా సంపుటాలు వెలువడ్డాయి. వీరు తెలంగాణలోని గ్రామీణ జీవితాన్ని, దళిత, బహుజన సంస్కృతిని చిత్రిస్తూ ఎన్నో రచనలు రాశారు. వీరి తొలి నవల భూమి పుత్రుడు. ఇది చతుర పత్రికలో చలసాని ప్రసాదరావు గారి సంపాదకత్వంలో 1991 డిసెంబర్ సంచికలో వెలువడింది. ఈ నవలకు 1992వ సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. భూమి పుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు అనే మూడు నవలలు కలిపి కాలువ మల్లయ్య నవలులు అనే పుస్తకంగా 2001 డిసెంబర్లో ముద్రించారు.

ఈ నవల ముందుమాటలో “విశాఖ మాండలికానికి రావిశాస్త్రి, రాయలసీమ మాండలికానికి నాయిని సాహితి గౌరవాన్ని కలిగించినట్లే తెలంగాణ మాండలికానికి కాలువ మల్లయ్య సాహితి కీర్తిని ఆర్జించి పెట్టారని, తన మాండలిక రచనలను అన్ని ప్రాంతాల తెలుగు వాళ్ళతో చదివించిన ఘనత కాలువ మల్లయ్యకే దక్కుతుందని” ఎన్. గోపి గారు అన్నారు.

కాలువ మల్లయ్య రచించిన భూమి పుత్రుడు నవలలోని భాషా విశిష్టతలను పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం నవలలో రచయిత ఉపయోగించిన కరీంనగర్ మాండలిక భాష, గ్రామీణ పదజాలం, పాత్రోచిత సంభాషణలు, సామెతలు, జాతీయాలు, నుడికారాల వైవిధ్యాన్ని విశ్లేషించడం జరిగింది. రైతు జీవితానికి, గ్రామీణ సంస్కృతికి, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా రచయిత భాషను వినియోగించిన తీరును ఈ పరిశోధన వివరిస్తుంది. నవలలోని భాష కథనానికి సహజత్వాన్ని, పాత్రలకు జీవాన్ని, భావవ్యక్తీకరణకు బలాన్ని చేకూర్చిందని ఈ అధ్యయనం నిర్ధారిస్తుంది

**కీలక పదాలు**

కాలువ మల్లయ్య, భూమి పుత్రుడు, రైతులు, కరీంనగర్ మాండలికం, మాండలిక పదాలు, సామెతలు, రైతు జీవితం.

**ప్రవేశిక**

భాష సాహిత్యానికి ప్రాణం. నవలలో కథ, పాత్రలు, సంఘటనలతో పాటు భాష కూడా సమాన ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ముఖ్యంగా ప్రాంతీయ జీవితాన్ని ప్రతిబింబించే నవలల్లో మాండలిక భాష, స్థానిక పదజాలం, నుడికారాలు రచనకు వాస్తవికతను అందిస్తాయి.

భూమి పుత్రుడు నవలలో ఉపయోగించిన మాండలిక పదాలు, సామెతలు, జాతీయాలు, పాత్రోచిత సంభాషణల నిర్మాణాన్ని విశ్లేషించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం.

**భూమి పుత్రుడు**

ఈ నవలను కాలువ మల్లయ్య గారు కరీంనగర్ మాండలికంలో రాశారు. తెలంగాణ రైతాంగ జీవితానికి అక్షర రూపం భూమి పుత్రుడు. కుల మతాలకు అతీతంగా కల్లా కపటం లేని స్వచ్ఛమైన ప్రేమతో జీవనం సాగించే పల్లె ప్రజలు, ప్రశాంత వాతావరణంలో రాజకీయాల కారణంగా ఏర్పడిన ఒడిదొడుకులు, వ్యవసాయం పనులు, ఒకసారి అతి వృష్టి, మరో సారి అనావృష్టి కారణంగా రైతులు పడే ఇబ్బందులు, ఒకవేళ మంచిగా వర్షాలు పడి పంట బాగా పండితే ఆ పంటకు గిట్టుబాటు ధరలు రాకపోవడం, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను సరిగా ఆదరించని కొడుకుల బాధ్యతా రాహిత్యం నవలలో కనిపిస్తుంది.

బొగ్గుపనుల్లో పనిచేసే శ్రామికులు, వారు పడే కష్టాలు, భూమి శిస్తు కట్టలేని రైతుల పాట్లు, వడ్డీ వ్యాపారులు, బ్యాంకు అధికారులు వారిని పెట్టే బాధలు, అవమానాలు, ప్రభుత్వ బాకీల సుడిగుండంలో రైతులు విలవిలలాడటం ఈ నవలలో చిత్రితమయ్యాయి.

**కథా కథనం**

ఈ నవలలో కథ సర్వసాక్షి దృష్టి కోణం(ప్రథమ పురుష) వ్యవహారిక భాషలో ఉన్న, వ్యాఖ్యానం అంతా ఉత్తమ పురుష మాండలికంలో ఉన్నది. ఇంటి వాతావరణం, ముఖ్య పాత్ర ఆలోచనలతో నవల మొదలవుతుంది. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది ఏదీ లేదని నమ్మిన భూమి పుత్రుడు, వ్యవసాయాన్నే నమ్ముకుని, భూమినే జీవనాధారంగా ఎంచుకొని బతుకును వెల్లదీస్తున్న రైతు" కొండమల్లయ్య, ఇతని కుటుంబం, వ్యవసాయంలోని వెతలను మాండలికంలో కళ్లకు కట్టినట్లు రాసారు రచయిత. ఈ నవలలోని కథనం ఇలా ఉంటుంది.

ఆ ఊర్లో దాదాపు నాలుగు వందల గడుపుంటుంది. వివిధ వృత్తుల వారున్నా చాలామంది వ్యవసాయదారులుగానో, వ్యవసాయ కూలీలుగానో బ్రతుకుతుంటారు కులాలేవైనా వాళ్లంతా అన్నా, అక్క, బావ అనీ, వదినే అనీ, తాత అనీ వరుసలు పెట్టుకొని ఆప్యాయంగా పిలుచుకునేవారు. ఒకరి కష్టాల్లో ఒకరు పాలుపంచుకునేవారు.(పుట:14)

కొక్కోరోకో అని బిగ్గరగా కూసింది కోడిపుంజు. తొలికోడి కూత వినబడగానే ఉలిక్కిపడి లేచాడు. తెల్లవారితే ఉగాది. కొత్త సంవత్సరాది. రైతుకు పర్వదినం. ఉగాదిని కొత్త సంవత్సరపు పనుల కారంభ దినంగా భావిస్తాడు రైతు. నూతన సంవత్సరాది రోజున చేసే సాగువాటితో పనులారంభిస్తాడు రైతు. (పుట:18)

'సరేగాని గా గూట్లున్న సబ్బు అన్నకియ్యి పోబిడ్డ' అంది నర్సమ్మ (పుట:20)

'నిండు ముంతెదురయింది.. మంచి శకునమే..' అన్నాడు కొండమల్లయ్య(పుట:21)

'తొందరగానే కాలం కలుపుకుంటది' రైతులు మాట్లాడుకుంటున్నారు.(పుట:24)

కాపయినే అటెనుక కిరికిరి పెట్టేవు మరి.. వడ్లు పావు తక్కువ రెండు పుట్లున్నయి...(పుట:29)

“ఏంది? నీ సంగతెందో చెప్పలేవు... మొకమెందుకు బుడ్డితీరుగ పెట్టుకున్నవు. అసలు సంగతి చెప్పలేవు!.”(పుట:32)

పెరళ్లలో, చేల్లలో గుంటకలు కొట్టడం పూర్తి చేసి తొలి పంట సాగడానికై ఎదరుచూస్తున్నారు రైతులు. తొలకరి వర్షాల కోసం కళ్లల్లో వత్తులేసుకొని ఎదురు తెన్నులు కాస్తున్నారు. మృగశిరకార్తె ప్రవేసించినరోజు కొండకెదురు చూసినట్టు చూశారు.(పుట:52)

**మాండలికం**

నవలలో రచయిత పాత్రల చేత అనేక మాండలిక పదాలను తెలిపాడు. అవి.

**నామపదాలు**

| | | |
|---|---|---|
| కంచుముంత | = | కంచుతో తయారు చేసిన లోహపు పాత్ర(పుట:21) |
| దండోడు | = | చాలా గొప్పోడు (పుట:22) |
| గోతం | = | పెద్ద గోనె సంచి (పుట:29) |
| గుడాలు | = | గుగ్గిళ్ళు (పుట:36) |
| నెర్రెలు | = | గోడలు, నేలలు లేదా ఇతర వస్తువులపై ఏర్పడే పగుళ్లు, చీలికలు లేదా సన్నని గీతలు (పుట:38) |
| బోలుకడెం | = | లోపల బోలుగా ఉన్న కడియం (పుట:22) |
| ఎగిరేకోల్లాగె | = | కోడెదూడ (పుట:57) |
| మాదకురాలు | = | అమాయకురాలు (పుట:60) |
| దాపలెద్దు | = | ఎడమ దిక్కున్న ఎద్దు (పుట:67) |
| వలుపటెద్దు | = | కుడి వైపు ఉన్న ఎద్దు (పుట:68) |
| బోరెం | = | ఎడ్లబండికి వడ్లను తీసుకెళ్ళడానికి సంచులతో నిర్మించేదానిని బోరెం అంటారు. (పుట:106) |
| చిటుకు రోగాలు | = | వర్షాకాలం మొదలవగానే పశువులకు వచ్చే వ్యాధులు. (పుట:67) |
| దీము | = | అండ, దిక్కు(పుట:65) |
| కాట్రేపుల పండుగ | = | ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుపుకునే పశువుల పండుగ. (పుట:66) |
| ఆకుపోకలు | = | వధు పూజ (పుట:36) |
| పునాస పంట | = | వర్షాకాలం పంట(పుట:26) |
| కాపుదన పోల్లు | = | రైతులు(పుట:23) |
| గుంటుకలు | = | ఇది ఒక పరికరం. చాల్ల మధ్యలో పెరిగిన గడ్డిని తొలగించడానికి వాడుతారు. (పుట:52) |
| కంటె బొక్కలు | = | కంఠానికి ఇరువైపుల ఉన్న ఎముకలు(పుట:80) |
| మాగికాలం | = | చలికాలం(పుట:114) |
| పాశెం | = | పాయసం (బెల్లమన్నం) (పుట:117) |
| కుండ తలుగనోడు | = | తినడానికి కూడా తిండి సరిగా లేని వారు (పుట:58) |

దూప = దాహం (పుట:59)

రోకండ్లు = రోళ్ళు (పుట:116)

**విశేషణాలు**

తెల్లగోలు = స్పష్టంగా(పుట:36)

ముంత పోత వాన = కుంభవృష్టి(పుట:88)

నల్లమొకం = చెల్లని మొకం (పుట:91)

**క్రియా పదాలు**

మునిగాళ్ల మీద ఆడటం = ఎవరిని లక్ష్య పెట్టడం లేదు అని(పుట:18)

మురుస్తున్నవా = సంతోషిస్తున్నవ అని(పుట:22)

కాలం కలుపుకుంటది = వర్షాలు పడటం(పుట:24)

పురుసతుంటది = విశ్రాంతి(పుట:35)

అయితెమానాయె = సరే (పుట:35)

రేవు కచ్చుడు = కాస్త బాగుపడడం, గట్టెక్కడం(పుట:57)

కాల్లగోర్లుతీసుడు = రజస్వల అయినాక కాళ్ళ గోర్లు తీసి చీరకట్టించి ఇంట్లోకి పంపించడం, శోభనం

కంటికి కడివెడు ఏడ్చుడు = కన్నీరు మున్నీరుగా విలపించడం

వెన్ను పొడవడం = వ్యవసాయం లో గడ్డిని, వడ్లను మర్లేయడం

**సామెతలు**

నవలలో సందర్భానుసారంగా ఉపయోగించిన సామెతలు

★ ఏరు వడితేనే మేలు మగడా పొత్తుంటేనే పోరు మగడా (పుటలు :15,64)
కలిసి ఉంటే గొడవలు జరుగుతాయి అదే విడిగా ఉంటే జీవితం బాగుంటుంది అని. ఉమ్మడి కుటుంబాల్లోని స్త్రీలు వాడే సామెత.

★ ఢిల్లీకి రాజయినా తండ్రికి కొడుకే (పుట:22)
ఢిల్లీ అంతటి నగరానికి రాజైనా ఓ తండ్రికి కొడుకే. అలాగే మనం ఎంత గొప్పవారమయినా మన మూలాల్ని, గతాన్ని మర్చిపోకూడదు అని దీని అర్థం.

★ చెర్లనీళ్ల పోయి చెరువెనుక వడ్డంక (పుట:30)
అంతా అయి పోయినంక ఏమి చేయలేము. అనే అర్థంలో ఈ సామెతను వాడుతారు

★ ఈతకు ఇచ్చి తాటాకు తీసుకున్నట్టు
కొంచం ఇచ్చి ఎక్కువగా తీసుకోవడం/ దోచుకోవడం. ఇటువంటి సందర్భంలో ఇది వాడుతారు.

★ మోసెటోనికెరుక కావడి బరువు (పుట:37)
ఏదైనా ఒక బాధ్యతను లేదా కష్టాన్ని స్వయంగా అనుభవించే వారికే దానిలో ఉండే బాధ, కష్టం లేదా విలువ తెలుస్తుంది ఆ పని చేయని ఇతరులకు అది చాలా సులభంగా కనిపిస్తుంది.

★ పిలిచి పిల్లనిస్తానంటే కులం తక్కువ (పుటలు:43,69)
మంచి అవకాశం స్వయంగా వస్తే అందులోని లోపాలు వెతికి తిరస్కరించడం

★ ఎద్దు పుండు కాకికేం ముద్దు (పుట:45)
ఎవరి సమస్యలు వారికి ఉంటాయి. ఒకరి సమస్య మరొకరికి చిన్నగా కనిపించ వచ్చు/ కనిపించకపోవచ్చు/ ఆ సమస్యపై పట్టింపే ఉండక పోవడం.

★ ఎప్పటి చిప్ప ఏనుగుల కన్నట్టే (పుట:49)
ఎంత కష్టపడి పని చేసిన ఏమి మిగలడం లేదు అనే అర్థం లో దీనిని వాడుతారు.

★ వానరాకడ పానం బోవుడు ఎవ్వలకు తెలువది (పుట:56)
వాన ఏ సమయం లో కూరుస్తుందో అలాగే ప్రాణం ఎప్పుడు పోతుందొ ఎవలకు తెలియదు అని జనులు మాట్లాడుకుంటారు.

★ గడియ రికాముండది గవ్వరాకయుండది (పుట:57)
విశ్రాంతి తీసుకోకుండా పని చేసిన కూడా పనికి తగినంత ఆదాయం రాకపోవడం. ఈ సామెత వ్యవసాయ దారులకు, వ్యవసాయంతో సంబంధం ఉన్న వ్యక్తులకు వర్తిస్తుంది.

★ కోడలచ్చిన వేళ చీపురు కట్ట వచ్చిన వేళ (పుట:62)
చీపురు కట్టను మంచి రోజు చూసి కొంటారు. అలాగే కొత్త కోడలును కూడా మంచి రోజు ఇంటికి తీసుకువస్తారు. ఆ ఇంటికి మంచి జరుగుతే సరే, లేకపోతే ఆ సంధర్భంలో ఈ సామెతను వాడుతారు.

★ కాల్చుక రమ్మంటె మాడ్చుకచ్చుడేనా (పుట:62)
ఒక పని మంచిగా చేయమంటే దాన్నిఇంకా అధ్వానంగా చేసిన సంధర్భంలో వాడుతారు.

★ ఎద్దుకో నాగలన్నట్టు (పుట:67)

★ ముప్పయారు రోగాలకు మందు చురక
ఎటువంటి వ్యాధి కైనా చేతికి వాత పెట్టడం వల్ల జబ్బు తగ్గుతుంది అనే అర్థంలో దీనిని వాడుతారు

★ ఒడ్డెక్కేదాక ఓడమల్లప్పని ఒడ్డెక్కినంక బోడి మల్లప్పంటె (పుట:74)
అవసరం తీరేవరకూ ముఖస్తుతి చేసి ఆపై హేళన చేసే నీచబుద్ధి.

★ అసలెట్లో ముసలెడ్లు రంకెలేస్తాయి (పుట:84)
వ్యవసాయంలో 'ఆశ్లేష కార్తె'ను తెలంగాణ యాసలో 'అసలేరు' లేదా 'అసలు' అని పిలుస్తారు. సాధారణంగా జూలై నెల మధ్యలో ఈ కార్తె వస్తుంది. ఎండాకాలంలో ఎండ తీవ్రతకు, వర్షం లేక అలసిపోయి ముసలి ఎడ్లు కూడా నీరసించిపోతాయి. అయితే, ఆశ్లేష కార్తె (అసలు) ప్రవేశించగానే వాతావరణం చల్లబడి, వర్షాలు పడటం మొదలవుతుంది.

సాధారణంగా శక్తి లేదా సామర్థ్యం లేని వ్యక్తి, అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు మాత్రం చాలా గొప్పగా ప్రవర్తించే సంధర్భంలో దీనిని వాడుతారు.

★ కొనాబోతె కొరివి అమ్మబోతె అడివోలుందే (పుట:85)
ఇది రైతులకుసంబందించిన సామెత. తాము ఉత్పత్తి చేసిన సరుకులు అనగా కూరగాయలు, ధాన్యం మొదలగు వాటిని అమ్మబోతె సరకు నాణ్యత లేదని, ఇప్పుడు ధరలు లేవని ఎన్నో సాకులు చెప్పి

వ్యాపారస్తులు వాటికి అతి తక్కువ ధరకు కొంటారు. కాని రైతులు తమకు కావలసిన వస్తువులు కొనబోతే, ఆ వస్తువుల గొప్పదనాన్ని, వాటి రూపు రేఖలను వర్ణించి చెప్పి అమాయకులైన రైతులను నమ్మించి అధిక ధరకు విక్రయిస్తారు. ఆ సందర్భంలో పుట్టినది ఈ సామెత.

★ దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడు (పుట:87)
పెద్దవాళ్ళు అనుమతి ఇచ్చిన వారి కింద పనిచేసే వాళ్ళు దానిని తిరస్కరించే సందర్భంలో వాడుతారు.

★ పిల్లికి రొయ్యల మొలతాడు లా (పుట:89)
పిల్లికి రొయ్యలు అంటే చాలా ఇష్టం. అలాంటప్పుడు రొయ్యలను పిల్లి మెడలో మొలతాడుగా వేస్తే అది వాటిని వదిలిపెట్టదు, తినేస్తుంది. అలాగే, ఏదైనా వస్తువు లేదా బాధ్యతను దానిపై ఆశ ఎక్కువగా ఉన్న వ్యక్తికి అప్పగిస్తే దాన్ని సక్రమంగా కాపాడలేడనే భావంలో ఈ సామెతను ఉపయోగిస్తారు

★ గొర్రెల మంద మీద తోడేలు పడ్డట్టు (పుట:90)
అంటే ప్రమాదం దగ్గరలో ఉంది.

★ అడ్డాల నాడు బిడ్డలు కాని, గడ్డాల నాడా (పుట:102)
చిన్నప్పుడు మాట వింటారు గానీ, గడ్డాలు, మీసాలు వచ్చిన తరువాత వింటారా? అని మొక్కై వంగనిది మానై వంగునా!

**ముగింపు**

భూమి పుత్రుడు నవలలో కాలువ మల్లయ్య ఉపయోగించిన భాష కరీంనగర్ గ్రామీణ రైతు జీవనానికి అద్దం పడుతుంది. మాండలిక పదాలు, సామెతలు, నుడికారాలు, సహజ సంభాషణల ద్వారా రచయిత కథకు జీవం పోసారు. పాత్రల స్వభావం, భావోద్వేగాలు, సామాజిక పరిస్థితులు భాష ద్వారానే ప్రభావవంతంగా వ్యక్తమయ్యాయి. "ఢిల్లీకి రాజయినా తండ్రికి కొడుకే" అనే సామెతను కొండమల్లయ్య తన చిన్నకొడుకు తిరుపతయ్యను గురించి అంటాడు. ఈ సామెత వల్ల కొండమల్లయ్యకు తన సంతానం అంటే చాలా ఇష్టం అని అర్థం అవుతుంది. కొండమల్లయ్య తన కూతురు "మాదకురాలు" అని బాధ పడతాడు.  తన కొడుకు మృత్యు కూపాలవంటి బొగ్గుబాయి పనికి వెళ్తానంటే "అడ్డాల నాడు బిడ్డలు కాని, గడ్డాల నాడా" అని తన మాటలు వినని కొడుకు గురించి చింతిస్తాడు. రైతు తన జీవితంలో ఎద్దులు లేకుండా వ్యవసాయం చేయలేడు. వాటిని "వలుపటెద్దు", "దాపలెద్దు" అని అంటాడు. ఇలా ఎన్నోమాండలిక పదాలను, సామెతలను నవలలోని పాత్రల ద్వారా కథను చిత్రించాడు. అందువల్ల భూమి పుత్రుడు నవల భాషా పరంగా కరీంనగర్ జీవన సంస్కృతిని ప్రతిబింబించే విశిష్ట రచనగా నిలిచిందని ఈ పరిశీలన ద్వారా స్పష్టమవుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు**


1. కాలువ, మల్లయ్య. 2001. కాలువ మల్లయ్య నవలలు. కరీంనగర్: తెలుగు వచనం ప్రచురణలు.
2. చైతన్య ప్రకాష్. 2017. తెలంగాణ సామెతలు. హైదరాబాద్ : తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ. మొదటి ముద్రణ.
3. భాస్కర్, నలిమెల. 2003. తెలంగాణ పద(బంధ)కోశం. సిరిసిల్ల: నయనం ప్రచురణలు.
4. లింగరాజు, గడ్డం. 2022. కాలువ మల్లయ్య నవలలు -- వస్తు విశ్లేషణ. పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
5. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 2024. నవల శిల్పం. హైదరాబాద్ : నవ చేతన పబ్లిషింగ్ హౌస్. ద్వితీయ ముద్రణ.


★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# సాహిత్య సమాజంలో కవుల స్థానికతకు ప్రమాణాలు : జన్మస్థలమా? భాషా? ప్రాంతీయ చైతన్యమా?



వొటారికారి సందీప్
పరిశోధకులు, తెలుగుశాఖ.
హైదరాబాద్, విశ్వవిద్యాలయం.
హైదరాబాద్, తెలంగాణ.
సెల్ : 9390280093. Email : sandeepkumarv2903@gmail.com

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగుశాఖ, హైదరాబాద్
విశ్వవిద్యాలయం,
హైదరాబాద్, తెలంగాణ.
సెల్ : 9989628049
Email: darlash@uohyd.ac.in.



సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

"కవుల పుట్టుక, ఏరుల పుట్టుక ఎక్కడ జరుగుతుందో చెప్పలేం" అనేది పెద్దలమాట. బహుశా ఆ మాట కవి రూపుదిద్దుకోవడం, అతని స్థానికతను ఒకే భౌగోళిక ప్రాంతానికి పరిమితం చేయడం అంత సులభం కాదనే విషయాన్ని సూచిస్తుంది. కవి స్థానికత కేవలం జీవిత విశేషాలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు; ప్రాంతీయ అస్తిత్వం, సాంస్కృతిక ప్రాతినిధ్యం, సాహిత్య చరిత్ర నిర్మాణంలో పనిచేసే ఆధిపత్య సంబంధాలతో ముడిపడిన ప్రశ్న. ఈ నేపథ్యంలో జన్మస్థలం, నివాసం, భాషా వినియోగం, సాహిత్యంలో ప్రతిఫలించిన జీవితం, స్వీయప్రకటన, సాహిత్య సమాజ అంగీకారం, మూలాల కొనసాగింపు వంటి ప్రమాణాలను ఈ వ్యాసం విమర్శనాత్మకంగా పరిశీలిస్తుంది. బమ్మెర పోతన, వేములవాడ భీమకవి, పాల్కూరికి సోమన, కాళోజీ, ఎండ్లూరి సుధాకర్, మొల్ల తదితర కవుల స్థానికతకు సంబంధించిన వివాదాలను ఉదాహరణలుగా తీసుకొని ఈ ప్రమాణాల పరిమితులు, ప్రయోజనాలను విశ్లేషిస్తుంది. ఇందుకోసం తెలంగాణ సాహిత్య గ్రంథసూచి, తెలంగాణ ప్రముఖ కవులు -కావ్యాలు వంటి గ్రంథాలను ప్రథమ ఆకారాలుగా, Biographical Sketches of Deccan Poets, కవి జీవితములు, సమగ్ర ఆంధ్రసాహిత్యం తదితర గ్రంథాలను ద్వితీయ ఆకారాలుగా ఉపయోగించింది. గుణాత్మక విశ్లేషణ పద్ధతి ద్వారా కవి స్థానికతను ఏకైక ప్రమాణంతో నిర్ణయించడం సాధ్యం కాదని, సాహిత్యం, భాష, జీవనానుభవం, చారిత్రక సందర్భం, సామాజిక అంగీకారాలను సమన్వయంగా పరిగణించినప్పుడే స్థానికతను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చని ఈ వ్యాసం ప్రతిపాదిస్తుంది.

**కీలక పదాలు :**

అస్తిత్వం, స్థానికత, సాహిత్యచరిత్ర, కవులచరిత్ర, జన్మస్థలం, భాషావినియోగం, స్వీయప్రకటన, సాహిత్య వస్తు పరిణామం.

**ప్రవేశిక**

ఒక కవి ఫలానా ప్రాంతానికి చెందినవాడని నిర్ణయించడం కేవలం సమాచార సంబంధమైన విషయమా? లేక జన్మస్థలాన్ని నమోదు చేయడాన్ని మించిదానికి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందా? అనే ప్రశ్నలు సహజంగానే ఎదురవుతాయి. సాహిత్యచరిత్రను నిశితంగా పరిశీలిస్తే కవి స్థానికత కేవలం వ్యక్తిగత జీవిత విశేషాలకు సంబంధించిన అంశం కాదని, ప్రాంతీయఅస్తిత్వం, సాంస్కృతిక ప్రాతినిధ్యం, ఆధిపత్య సంబంధాలతో ముడిపడిన ప్రశ్న అని స్పష్టమవుతుంది.

ఏ సమాజంలోనైనా ఆధిపత్యవర్గం తన తాత్విక భూమిక ద్వారా ఇతర వర్గాల ఆలోచనలను, విలువలను, హేతుబద్ధ ధోరణులను ప్రభావితం చేస్తుందనేది కాదనలేని సత్యం. సాహిత్య ప్రపంచం ఇందుకు ఏమాత్రం మినహాయింపు కాదు. ఎందుకంటే సాహిత్యం కేవలం సృజనాత్మక వ్యక్తీకరణ మాత్రమే కాదు. అది భావజాలాల ప్రసారానికి, సామాజిక విలువల పునరుత్పత్తికి కూడా ఒక సాధనం. ఆధిపత్య సమాజంతాను నిర్మించుకున్న ప్రాతిపదికలను, తాను ప్రతిపాదించిన సిద్ధాంతాలను శాశ్వత సత్యాలుగా ప్రతిష్టించడానికి ప్రయత్నిస్తుంది. అది కూడా ఒక నిర్దిష్ట చారిత్రక సందర్భంలో ఏర్పడిన భావనలేనన్న విషయాన్ని మరుగునపరుస్తుంది. ఫలితంగా ఆ సిద్ధాంతాలు విమర్శకు అతీతమైనవిగా, ప్రశ్నించరానివి గాక నిపించడం ప్రారంభమవుతాయి. ఎప్పుడైతే ఇతర సామాజిక వర్గాలు కూడా ఈ తాత్విక భూమికను సహజమైనవిగా అంగీకరిస్తాయో లేదా తమ స్వరాన్ని వినిపించడానికి వెనుకాడుతాయో అప్పుడే అసలైన ప్రశ్న అదృశ్యం అవుతుంది. ప్రశ్న అదృశ్యమైన చోటే ఆధిపత్యం మరింత బలపడుతుంది.

ఒక ప్రాంత చారిత్రక ఉనికిని అర్థం చేసుకోవడంలో శాసనాలు, కట్టడాలు, నాణాలు ఎంతముఖ్యమో, సాహిత్యం కూడా అంతే ప్రాముఖ్యాన్ని కలిగిఉంటుంది. ఎందుకంటే సమకాలీన సమాజాన్ని నిరంతరం నమోదుచేసే సాధనం సాహిత్యమే. కనుక ఒక ప్రాంతంలోని కవులు, రచయితలు, వారిరచనాసంప్రదాయాలనుగుర్తించడంద్వారా ఆ ప్రాంత సాహిత్య, సామాజికపరిణామాన్నిఅర్థంచేసుకోవచ్చు. ఈ అవసరాన్ని విస్మరిస్తే ఒకప్పుడు ముడుంబై వెంకట రాఘవా చార్యులు చేసిన "తెలంగాణ యందు కవులు పూజ్యం" వంటి వ్యాఖ్యలు చారిత్రక సత్యాలుగా స్థిరపడే ప్రమాదం ఉంటుంది.

"ప్రతి సమాజం తన ప్రత్యేక అస్తిత్వాన్ని స్థాపించుకునే క్రమంలో సొంత చరిత్రను నిర్మించుకుంటుంది; కలిపి ఉంచే ప్రాతిపదికలను అప్రధానం చేసి విభజనరేఖలను స్పష్టపరచాలని ప్రయత్నిస్తుంది" (శ్రీనివాస్ కె. పు.39, తెలంగాణ సాహిత్య చరిత్ర : పునర్మూల్యాంకనం,). అందువల్ల చరిత్ర రచనను పూర్తిగా నిష్పాక్షిక ప్రక్రియగా భావించడం సాధ్యం కాదు. ప్రతిచరిత్ర రచన వెనుక కొన్ని ఎంపికలు, కొన్ని మౌనాలు, కొన్ని ప్రాధాన్యతలు పనిచేస్తుంటాయి.

ఈ నేపథ్యంలో ఒకకవి ఏ ప్రాంతానికి చెందినవాడు? అతని సాహిత్య వస్తువు ఏమిటి? అతడు తనను తాను ఎలా నిర్వచించుకున్నాడు? సమకాలీనులు, సాహిత్య చరిత్రకారులు అతనిని ఎలా గుర్తించారు? వంటి ప్రశ్నలను సమగ్రంగా పరిశీలించకుండా స్థానికతను నిర్ణయించడం సాధ్యం కాదు. అందుకే ఈ వ్యాసం వివిధ సాహిత్య చరిత్రలు, కవుల జీవిత చరిత్రలు, విమర్శాగ్రంథాల ఆధారంగా కవుల స్థానికతను నిర్ధారించడానికి ఉపయోగించిన ప్రమాణాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ, ప్రాంతీయ చైతన్యం సాహిత్యచరిత్ర నిర్మాణంలో ఎలా పనిచేస్తుందో పరిశీలిస్తుంది.

**కవుల స్థానికతకు ప్రమాణాలు**

ఒక కవి లేదా రచయిత ఫలానా ప్రాంతానికి చెందినవాడని ఇప్పటి వరకు ఏ ప్రాతిపదికన నిర్ణయించారో పరిశీలిస్తే కొన్ని ప్రధాన ప్రమాణాలు కనిపిస్తాయి. అయితే ఇక్కడ కవి లేదా రచయిత అన్న ప్రతిసారి అది కేవలం పుంలింగం అన్నట్లు కాదు. ఆ భావుకత (కవితాత్మక) ఉన్న ప్రతి ఒక్కరని అని గుర్తించాలి.

**i. జన్మత :**

ఒక కవి ఏ ప్రాంతంవాడో నిర్ణయించడానికి మొట్టమొదట పరిగణనలోకి తీసుకునే ప్రమాణం జన్మస్థలం. సాహిత్య చరిత్ర రచనలో అత్యంత విస్తృతంగా ఉపయోగించిన ప్రమాణం కూడా ఇదే. అయితే ఏ వ్యక్తి పుట్టుకైనా అతడి సంకల్పంతో జరిగేదికాదు; అది యాదృచ్ఛికంగా జరిగే జీవన సంఘటన మాత్రమే. అందువల్ల ఒకవ్యక్తి పుట్టిన నేలతో జీవితాంతం సాంస్కృతిక, సామాజిక, భాషా అనుబంధం కొనసాగుతుందని చెప్పడానికి వీలులేదు. కనుక జన్మస్థలం స్థానికతను నిర్ధారించడంలో ఒక ముఖ్యమైన ఆధారమే తప్ప అంతిమ ప్రమాణం కాదు. తెలుగు సమాజంలో తొలి సంతానం మాతామహుల ఇంట్లో జన్మించడం వంటి ఆనవాయితీలను పరిగణనలోకి తీసుకుంటే ఈ విషయం మరింత స్పష్టమవుతుంది.

ఉదాహరణకు కొరవి గోపరాజు తన తండ్రి "కసవరాజు నిజామాబాద్ జిల్లా ఆర్మూరు తాలూకాకు చెందిన వేమగల్లు వాడిని చెప్పుకున్నాడు. అతని సింహాసన ద్వాత్రింశికలోని 21 బొమ్మకథల్లో గోపరాజు సమీప ధర్మపురి క్షేత్రం గురించి ఐదు గద్యపద్యాలలో వర్ణించాడు" (ఆరుద్ర 15). కనుక గోపరాజు స్థానికతను కేవలం జన్మవృత్తాంతం ఆధారంగా కాకుండా, కుటుంబ మూలాలు, సాహిత్యవస్తువు ఆధారంగా కూడా పరిశీలించాల్సిన అవసరం కనిపిస్తుంది.

వేములవాడ భీమ కవి విషయంలో ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపిస్తుంది. గురజాడ శ్రీరామమూర్తి ఇది కాకినాడకు సమీపంలో ఉన్నది. దీనికి కొంచెం దూరంలోనే ద్రాక్షారామం అని గ్రామం ఉన్నది. అచటనే భీమనాయక స్వామి ఉన్నాడు" (శ్రీరామమూర్తి గురజాడ 01) అని పేర్కొంటూ, ఆయనను ద్రాక్షారామ ప్రాంతానికి చెందినవాడిగా భావించారు. అయితే కావలి వెంకటరామస్వామి" భీమకవి లేములవాడకు చెందినవాడని, ఆయనకు సంబంధించిన విషయాలు తెలింగ ప్రావిన్స్లోని చిన్నపిల్లలు, ఆడవాళ్ల ప్రతిఒక్కరి నోట్లో ఉండేవి" (వెంకట రామస్వామి కావలి 115--117) అని పేర్కొన్నారు. చారిత్రకంగా అప్పటి తెలింగ పదానికి పరిణామక్రమ రూపమే నేటి తెలంగాణ. ఇదే విషయాన్ని తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ప్రచురించిన తెలంగాణ ప్రముఖ కవులు-కావ్యాలు గ్రంథం కూడా బలపరుస్తుంది. అందులో" కరీంనగర్‌కు చెందిన వేములవాడవాడేనని, ఆయన జన్మ వృత్తాంతానికి సంబంధించిన రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాలయంతోపాటు అప్పాలవాళ్లు కూడా ఇప్పటికీ ఉండడం వల్ల అతడు ఇక్కడివాడేనని రూఢీ అవుతుంది" (హరికృష్ణ మామిడి (సం.) 14) అని పేర్కొన్నారు.

ఈ ఉదాహరణలు ఒకే కవి విషయంలో భిన్న ఆధారాలు, భిన్న నిర్ధారణలు సాధ్యమవుతాయని తెలియజేస్తాయి. అందువల్ల జన్మస్థలం స్థానికతను అర్థంచేసుకోవడానికి ఒక ముఖ్యమైన ఆధారమే అయినప్పటికీ, దానినే అంతిమ ప్రమాణంగా స్వీకరించడం సరైందికాదు. స్థానికతను నిర్ణయించేటప్పుడు కుటుంబ మూలాలు, సాహిత్య వస్తువు, భాషా వినియోగం, చారిత్రక సందర్భం వంటి ఇతర ప్రమాణాలను కూడా సమన్వయంగా పరిగణించాల్సి ఉంటుంది.

**ii. నివాసం**

జన్మస్థలాన్ని స్థానికతకు అంతిమ ప్రమాణంగా అంగీకరించకపోతే, నివాసాన్ని ప్రమాణంగా తీసుకోవచ్చా? మొదటగా ఈ కోణంలో ఆలోచిస్తే ఎవరికైనా అది సహేతుకంగానే కనిపిస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి జీవితం, అనుభవాలు,

సంబంధాలు అతడు నివసించిన ప్రాంతంతో ముడిపడి ఉంటాయని అనిపిస్తుంది. కానీ కొంత లోతుగా పరిశీలిస్తే నివాసం కూడా జన్మస్థలం మాదిరిగానే పాక్షిక ప్రమాణమేనని తెలుస్తుంది.

ఉద్యోగం, విద్య, వలసలు లేదా ఇతర జీవన అవసరాల వల్ల ఒక వ్యక్తి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లవచ్చు. అయితే అలా వెళ్లినంత మాత్రాన అతని సామాజిక, సాంస్కృతిక, భాషాపరమైన మూలాలు వెంటనే మారిపోవు. అందువల్ల నివాసాన్ని మాత్రమే ఆధారంగా చేసుకొని ఒక రచయిత స్థానికతను నిర్ణయించడం సాధ్యం కాదు. అసలు ప్రశ్న అతడు ఎక్కడ నివసించాడన్నది కాదు; ఆ ప్రాంతంతో అతని జీవితానికి, సాహిత్యానికి ఉన్న సంబంధం ఏమిటన్నదే. తనరచనల్లో ఏ జీవనానుభవాలను ప్రతిబింబించాడు? ఏ భాషను, ఏ సంస్కృతిని, ఏ సామాజిక వాస్తవికతను వస్తువుగా స్వీకరించాడు? అనే అంశాలే ఇక్కడ నిర్ణయాత్మకంగా ఉంటాయి. ఎందుకంటే ఒకప్రాంతంలో నివసించడం భౌతిక సంబంధం మాత్రమే; ఆ ప్రాంత జీవితాన్ని సాహిత్యంలో భాగం చేసుకోవడం సాంస్కృతిక సంబంధం.

ఉదాహరణకు ఉద్యోగరీత్యా తెలంగాణకు వచ్చి వైద్యవృత్తి నిర్వహించిన కేశవరెడ్డి రచనలను పరిశీలిస్తే, ఆయన నివసించిన ప్రాంతంకంటే తన మూలాలకు సంబంధించిన భాషా--సాంస్కృతిక ప్రపంచాన్నే ఎక్కువగా ప్రతి బింబించినట్లు కనిపిస్తుంది. ఆయన రచనల్లో వ్యక్తమయ్యే జీవితం, భాష, సామాజిక అనుభవాలు తెలంగాణకంటే ఆయన పూర్వనే పథ్యానికే దగ్గరగా ఉంటాయి. కనుక నివాసం ఒక్కటే స్థానికతను నిర్ణయించే ప్రమాణం కాదని ఈ ఉదాహరణ స్పష్టం చేస్తుంది.

అందువల్ల కవి లేదా రచయిత స్థానికతను నిర్ణయించేటప్పుడు అతడు ఎక్కడ నివసించాడన్నదానికంటే, ఏ జీవనానుభవాలను తన సాహిత్యానికి ఆధారంగా చేసుకున్నాడు? ఏ సమాజానికి, ఏ సంస్కృతికి, ఏ భాషకు ప్రాతినిధ్యం వహించాడు? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది. నివాసాన్ని ఒక్కటే ప్రమాణంగా స్వీకరించడం స్థానికత అనే సంక్లిష్టమైన భావనను అతి సరళీకరించడమే అవుతుంది.

**iii. భాషా వినియోగం**

జన్మస్థలం, నివాసం రెండూ స్థానికతను నిర్ణయించడంలో పరిమితులు కలిగిన ప్రమాణాలైతే, భాషా వినియోగం మరింత విశ్వసనీయమైన ఆధారంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఒక కవి తన అనుభవాలను, తన సమాజాన్ని, తన సాంస్కృతిక ప్రపంచాన్ని భాష ద్వారానే వ్యక్తపరుస్తాడు. సాహిత్యానికి వస్తువు జీవితమైతే, ఆ జీవితానికి రూపం ఇచ్చేది భాష.

ఏ రచయిత అయినా తనకు పరిచయమైన భాషద్వారానే ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాడు. తన సామాజిక అనుభవాలు, తన పరిసరాల మాటలు, తన సాంస్కృతిక వ్యక్తీకరణలే అతని రచనల్లో ప్రతిఫలిస్తాయి. అందువల్ల ఒక కవి తన ప్రాంతాన్ని ప్రత్యక్షంగా ప్రకటించకపోయినా, అతని భాష చాలాసార్లు అతని స్థానికతను వెల్లడిస్తుంది. అయితే భాషను కూడా యాంత్రికంగా అర్థం చేసుకోవడానికి వీల్లేదు. విద్య, మతం, వలసలు, ఇతర భాషలతో పరిచయం వంటి అంశాల ప్రభావంతో భాష నిరంతరం రూపాంతరం చెందుతూ ఉంటుంది. అందువల్ల భాష స్థానికతను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ప్రమాణమే అయినప్పటికీ, దానిని చారిత్రక, సామాజిక సందర్భాలతో కలిపి విశ్లేషించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు పూర్వం కరీంనగర్ జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన శతావధాని, అభినవ కాళిదాసుగా బిరుదాంకితుడైన కృష్ణమాచార్య గురించి" కృష్ణమాచార్య సంస్కృతాంధ్ర తమిళభాష నిష్ణాతులు..... మొదట్లో వీరి ఇంటిపేరు సిరిసెనగండ్ల అని ఉండగా వీరి అన్నగారైన వరదాచార్యులు తమిళ శబ్దధ్వనితో దాన్ని సిరిశెనహళ్గా

మార్చారు'' (హరికృష్ణ మామిడి 116) అని పేర్కొన్నారు. ఈ ఉదాహరణ భాషస్థానికతను తెలియజేయడమేకాక, అది అనేక సాంస్కృతిక ప్రభావాల సంగమమని కూడా సూచిస్తుంది.

అందువల్ల భాషా వినియోగం స్థానికతను నిర్ణయించడంలో అత్యంత ప్రామాణికమైన ప్రమాణాలలో ఒకటే అయినప్పటికీ, దానిని స్థిరమైన లక్షణంగా కాకుండా చారిత్రక, సామాజిక, సాంస్కృతిక పరిణామాల ఫలితంగా చూడాలి.

**iv. సాహిత్యంలో జీవిత ప్రతిఫలనం**

జన్మస్థలం, నివాసం, భాషా వినియోగం స్థానికతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ప్రమాణాలే అయినప్పటికీ, ఒక రచయిత స్థానికతను అత్యంత స్పష్టంగా వెల్లడించేది అతని సాహిత్యంలో ప్రతిఫలించిన జీవితం. ఎందుకంటే సాహిత్యానికి వస్తువు జీవితమే. ఊహ, కల్పన, ప్రతీకలు కూడా చివరకు రచయిత అనుభవించిన లేదా అర్థం చేసుకున్న జీవితం నుంచే రూపుదిద్దుకుంటాయి. అందువల్ల ఒక రచయిత ఏ సమాజానికి, ఏ సంస్కృతికి, ఏ ప్రజల అనుభవాలకు ప్రాతినిధ్యం వహించాడనే ప్రశ్నలకు సమాధానం అతని రచనల్లోనే కనిపిస్తుంది.

రాబర్టాలీ అభిప్రాయపడినట్లుగా, "The act of writing itself might be considered a form of mapping or a cartographic activity. Like the map maker the writer must survey territory, determining which feature of a given landscape to include, emphasize or to diminish" (Tally Jr. 45). రచన ఒకవిధమైన మ్యాపింగ్ ప్రక్రియ. మ్యాప్ రూపొందించే వ్యక్తి ఒకప్రాంతంలోని ఏ అంశాలను నమోదు చేయాలో నిర్ణయించుకున్నట్లే రచయిత కూడా తనకు తెలిసిన జీవితప్రపంచంలోని ఏ అంశాలను సాహిత్యంలో ప్రతిబింబించాలో నిర్ణయించు కుంటాడు. అందుకే టాలీ''The writer organises life as he sees it on to the plane of the workμμ (Tally Jr. 58) అని పేర్కొన్నారు. అంటే రచయిత తనకు తెలిసిన జీవితాన్నే తన రచనలో క్రమబద్ధీకరిస్తాడని అర్థం.

అందువల్ల రచయిత తన జన్మస్థలాన్ని పుట్టుకతో మార్చుకోలేడు; నివాసాన్ని మార్చుకోవచ్చు; భాషను కూడా కొంతవరకు అలవర్చుకోవచ్చు. కానీ అతని రచనల్లో పదేపదే ప్రత్యక్షమయ్యే జీవన ప్రపంచాన్ని పూర్తిగా కల్పించలేడు. పాత్రలు, సంభాషణలు, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఆచారాలు, సంఘర్షణలు కలిసి అతడు ఏ సమాజానికి దగ్గరగా ఉన్నాడో వెల్లడిస్తాయి. కనుక కవి లేదా రచయిత స్థానికతను నిర్ణయించడంలో సాహిత్యంలో ప్రతిఫలించిన జీవితం అత్యంత ప్రామాణికమైన ప్రమాణంగా నిలుస్తుంది.

**v. స్వీయ ప్రకటన**

ఒక కవితనను తాను ఏ ప్రాంతానికి చెందినవాడిగా భావిస్తున్నాడో, ఏ సంస్కృతితో తన అనుబంధాన్ని గుర్తిస్తున్నాడో కొన్నిసార్లు స్వయంగా ప్రకటించుకుంటాడు. కవుల చరిత్ర నిర్మాణంలో ఈ స్వీయ ప్రకటన కూడా ఒక ప్రమాణంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఒకవ్యక్తి తన అస్తిత్వాన్ని తానే నిర్వచించుకునే హక్కును నిరాకరించడం సాధ్యం కాదు.

అయితే స్వీయప్రకటన ఒక్కటే స్థానికతను నిర్ధారించే అంతిమ ప్రమాణం కాదు. ఒకవ్యక్తి తనను తాను ఎలా నిర్వచించుకున్నాడనేది ఒక అంశమైతే, అతని జీవితం, భాష, సాహిత్యం, సామాజిక అనుబంధాలు మరోఅంశం. ఈ రెండూ పరస్పరం అనుసంధానమైనప్పుడే ఆ ప్రకటనకు చారిత్రక ప్రామాణికత లభిస్తుంది.

ఉదాహరణకు కాళోజి తండ్రి మరాఠ ప్రాంతానికి చెందినవారు. తల్లి కన్నడ ప్రాంతానికి చెందినవారు. కాళోజి జన్మించిన ప్రాంతం కూడా తెలంగాణ వెలుపలే. అయినప్పటికీ హైదరాబాద్ రాష్ట్ర సామాజిక - రాజకీయ జీవితంతో ఆయనకు ఏర్పడిన అనుబంధం, నిజాం వ్యతిరేక ఉద్యమాల్లో ఆయన పాత్ర, తెలంగాణ భాషా--సాంస్కృతిక

జీవితాన్ని తన సాహిత్యవస్తువుగా స్వీకరించడం వంటి అంశాలు ఆయన తనను తెలంగాణకు చెందినవాడిగా ప్రకటించుకోవడానికి చారిత్రక బలాన్ని ఇచ్చాయి. కనుక స్వీయ ప్రకటన స్థానికతను నిర్ధారించే ఒక ప్రమాణమే అయినప్పటికీ, ఇతర ప్రమాణాలతో కలిపి పరిశీలించినప్పుడే దానికి సంపూర్ణత లభిస్తుంది.

### vi. సాహిత్య సమాజ అంగీకారం

ఒక రచయిత తన స్థానికతను స్వయంగా ప్రకటించుకోవచ్చు. అయితే సాహిత్య చరిత్రలో అది ఎలా నమోదవుతుందనేది చాలాసార్లు సాహిత్య సమాజ అంగీకారంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే కవుల చరిత్రను కేవలం కవులు మాత్రమే కాదు; విమర్శకులు, పరిశోధకులు, సంపాదకులు, విద్యాసంస్థలు, పాఠ్యాంశ రూపకర్తలు కూడా నిర్మిస్తారు.

అయితే ఈ అంగీకారం ఎల్లప్పుడూ నిష్పాక్షికంగాఉండదు. సాహిత్య సమాజం కూడా తనకాలంలోని భావజాలాలకు, ప్రాంతీయ ప్రాధాన్యాలకు, ఆధిపత్యధోరణులకు అతీతం కాదు. అందువల్ల ఒక రచయితను ఒక ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించడం వెనుక చారిత్రక, సామాజిక కారణాలు పనిచేస్తుంటాయి.

ఉదాహరణకు ఎండ్లూరి సుధాకర్ పూర్వీకులు ఒంగోలు సమీపంలోని కనిగిరి ప్రాంతానికి చెందినవారు. కానీ ఆయన కుటుంబం తెలంగాణలో స్థిరపడటంతో ఆయన తెలంగాణలోనే జన్మించారు. భాషా వినియోగం, జీవనానుభవం, సాహిత్యసంబంధాలు, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలు ఆయనను తెలంగాణ రచయితగా గుర్తించడానికి దోహదపడ్డాయి. అదే సమయంలో మల్లెమొగ్గల గొడుగు - మాదిగ కథలు వంటి రచనల్లో తన పూర్వీకుల ప్రాంతీయ జ్ఞాపకాలు, భాషా ఆనవాళ్లు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. కనుక ఒకే ప్రమాణంతో కాకుండా, సాహిత్య సమాజం ఆయనను ఎలా స్వీకరించిందన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

అందువల్ల సాహిత్య సమాజ అంగీకారం స్థానికతను నిర్ణయించడంలో ఒక ముఖ్యమైన ప్రమాణమే అయినప్పటికీ, అది కూడా విమర్శనాత్మక పరిశీలనకు లోబడాలి.

### vii. మూలాల కొనసాగింపు

ఆధునిక కాలంలో వలసలు విస్తరించడంతో అనేకమంది రచయితలు తమ జన్మస్థలాలకు దూరంగా జీవిస్తున్నారు. వారి రచనలను సాధారణంగా ప్రవాస సాహిత్యంగా పరిగణిస్తారు. అయితే ప్రవాసం అంటే మూలాలతో సంబంధం పూర్తిగా తెగిపోవడం కాదు. చాలాసార్లు భౌగోళిక దూరం పెరిగినకొద్దీ జ్ఞాపకాలు, అనుబంధాలు మరింత బలపడతాయి. అందుకే రచయిత తన బాల్యం, గ్రామం, భాష, సామాజిక అనుభవాలను తిరిగి సాహిత్యంలో నమోదు చేస్తాడు. అప్పుడు రచన భౌతికంగా వేరే ప్రాంతంలో రూపొందినా, సాంస్కృతికంగా తన మూలప్రాంతంతోనే అనుసంధానమై ఉంటుంది.

అందువల్ల ఒక రచయిత స్థానికతను నిర్ణయించేటప్పుడు అతడు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నాడన్న దానికంటే, తన రచనల ద్వారా ఏ మూలాలను కొనసాగిస్తున్నాడన్నదే ముఖ్యమైన ప్రమాణం. ఎందుకంటే స్థానికత కేవలం భౌగోళిక ఉనికికాదు; జ్ఞాపకాలు, భాష, సంస్కృతి, జీవనానుభవాల నిరంతర కొనసాగింపుతో నిర్మితమయ్యే చారిత్రక సంబంధం కూడా.

### స్థానికత నిర్ధారణలో శేషప్రశ్నలు :

కవి స్థానికతను నిర్ధారించడానికి ఇంతవరకు చర్చించిన ప్రమాణాలు ఉపయుక్తమైనవే అయినప్పటికీ, వాటితోనే సమస్య పూర్తిగా పరిష్కారమై పోదు. కొన్ని సందర్భాల్లో స్థానికతను నిర్ధారించడానికి ఉపయోగించే ఆధారాలే కొత్తప్రశ్నలను సృష్టిస్తాయి. అందువల్ల స్థానికత అనేది స్థిరమైన తీర్పుకాదు; నిరంతర పరిశీలనకు లోబడే చారిత్రక సమస్య.

ఉదాహరణకు గ్రామనామాలను ఆధారంగా చేసుకొని కవి స్థానికతను నిర్ధారించే ప్రయత్నాలు తరచూ కనిపిస్తాయి. బమ్మెర పోతన విషయంలో జయంతి రామయ్య పంతులు ఏకశిలానగరం పరిసరాల్లో బమ్మెరగ్రామం లేదని, బొమ్మెర మాత్రమే ఉందని, కాలక్రమంలో అదే బమ్మెరగా మారి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం పోతన ఒంటిమిట్టకు చెందినవాడనే వాదన కూడా వచ్చింది. అయితే సంగనభట్ల నరసయ్య వంటి పరిశోధకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ప్రచురించిన గ్రంథాలు ఆయనను తెలంగాణ కవిగానే గుర్తించాయి. దీనివల్ల గ్రామనామం ఒక్కటే స్థానికతను నిర్ధారించలేదని స్పష్టమవుతుంది.

ఇదే పరిస్థితి కందుకూరి రుద్రకవి, ఆతుకూరి మొల్ల విషయంలోనూ కనిపిస్తుంది. రుద్రకవి ఇంటిపేరు ఆధారంగా ఆయనను ఆంధ్రప్రాంతీయుడిగా పేర్కొన్నప్పటికీ, ‘‘కందుకూరు గ్రామం నల్లగొండ జిల్లాలో ఉన్నందున రుద్రకవి ఇబ్రహీం కుతుబ్షాచే అగ్రహారం దానంగా పొందినందున తెలంగాణ ప్రాంతీయుడుగానే పరిశోధకులు తేల్చి చెప్పారు’’ (హరికృష్ణమామిడి 63--64). అలాగే కావలి వెంకట రామస్వామి మొల్లను కృష్ణదేవరాయల ప్రాంతానికి చెందినవారిగా పేర్కొనగా, ‘‘ఆమె పూర్తిపేరు ఆతుకూరి మొల్ల. ఆతుకూరు తెలంగాణది అని రామప్ప శాసనంలో ఉంది. రామప్ప ఉన్నచోట ఆతుకూరు ఉండేదని అంటే ఆమె ఇక్కడమూలాలు ఉన్న వ్యక్తి కావచ్చు’’ (సత్యనారాయణ ద్యావనపల్లి 16) అనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఈ ఉదాహరణలు స్థలనామాలు మాత్రమే ఆధారంగా తీసుకుంటే విభిన్న నిర్ధారణలు ఏర్పడతాయని సూచిస్తున్నాయి.

అలాగే శాసనాలను ఆధారంగా చేసుకొని కవుల స్థానికతను నిర్ణయించడంలోనూ జాగ్రత్త అవసరం. ఒక కవి ఇతర రాజ్యాలను సందర్శించి ఉండవచ్చు, ఇతర రాజుల ఆశ్రయంలో రచనలు చేసి ఉండవచ్చు. శాసనాలు అలాంటి సందర్భాలను నమోదు చేస్తాయి; కానీ ఒక వ్యక్తి జీవితమంతటినీ ప్రతిబింబించవు. అందువల్ల శాసనాలను సహాయక ఆధారాలుగా మాత్రమే పరిగణించాలి.

అదేవిధంగా ఆశ్వాసాంత గద్యాలు, అవతారికలు, పూర్వకవుల ప్రస్తావనలు కూడా స్థానికత నిర్ధారణలో ఉపయోగించబడ్డాయి. అయితే ఇవి చాలాసార్లు కవి కాలాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి గానీ, స్థానికతను నిర్ధారించడానికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలవవు. ఉదాహరణకు కొరవి గోపరాజు రచనల ఆధారంగా పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడి కాలాన్ని నిర్ణయించే ప్రయత్నం జరిగింది. అలాగే సుమతీ శతకకర్త బద్దెన విషయంలో దేశకాలవివరాలు స్పష్టంగా లభించకపోయినా, ఆయన రెండవ అరికేసరి కుమారుడైన రెండోబద్దెగుడేననే అభిప్రాయం పరిశోధకులలో కనిపిస్తుంది. ఈ వాదనకు కాజీపేట శాసనం, రాజకీయ పరిస్థితులు, గ్రామ నామాలు, బద్దిపోచమ్మ వంటి ఆలయనామాలు ఆధారాలుగా ఉపయోగించబడ్డాయి. అయినప్పటికీ ఇవన్నీ ప్రత్యక్షసాక్ష్యాలు కాక, చారిత్రక సంభావ్యతలపై ఆధారపడిన నిర్ధారణలేనని గుర్తించాలి.

సాహిత్య వస్తువు ఆధారంగా స్థానికతను నిర్ణయించడంలోనూ ఇదే సమస్య ఎదురవుతుంది. పాల్కూరికి సోమన బసవపురాణం రచించినందున కన్నడ సంప్రదాయం ఆయనను తమకవిగా పరిగణించినప్పటికీ, ఆయన జనగామ ప్రాంతానికి చెందినవాడని అనేక ఆధారాలు సూచిస్తున్నాయి. అలాగే తొలి కందపద్య శాసనకర్త జినవల్లభుడు తెలంగాణ వాసిగా గుర్తింపు పొందగా, ఆయన సోదరుడు పంపకవి కన్నడ కవిత్రయంలో స్థానం పొందాడు. ఈ ఉదాహరణలు సాహిత్యాన్ని ఒకస్థిర భౌగోళికచట్రంలో బంధించడం ఎంత క్లిష్టమో తెలియజేస్తాయి.

కాబట్టి స్థానికతను అర్థం చేసుకోవాలంటే రాజకీయ సరిహద్దులకన్నా చారిత్రక కాలాన్ని పరిగణలోకి తీసుకోవాలి. నేటి రాష్ట్రసరిహద్దులను గతశతాబ్దాలపై యథాతథంగా ప్రయోగించడంవల్ల అపార్థాలు ఏర్పడతాయి. ఈ కారణంగానే పంపకవి కన్నడ సాహిత్యచరిత్రలో భాగమైనప్పటికీ, తెలంగాణ ప్రాంతచరిత్రలో కూడా తన స్థానాన్ని కలిగి

ఉంటాడు. అచ్చమాంబ వంటి రచయితల విషయంలోనూ బాల్యజీవితం ఒక ప్రాంతంలో, సాహిత్య జీవితం మరో ప్రాంతంలో కొనసాగిన వాస్తవాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. చరిత్రకు అవసరమైంది సరళీకరణ కాదు; సంక్లిష్టతను అంగీకరించడం. ఉదాహరణకు 1947 తర్వాత భారతదేశం నుండి పాకిస్తాన్ వేరుపడి ప్రత్యేకదేశంగా ఏర్పడటంవల్ల అంతకు ముందు ఉమ్మడిగా ఉన్నప్పుడు జన్మించినవారు భారతదేశంవారు కాదనడం ఎంత హాస్యాస్పదం అవుతుందో ఇప్పుడు కవుల స్థానికతను అదేవిధంగా నిర్ధారించడం కూడా హాస్యాస్పదమే అవుతుంది. అట్లాగే దేశవిభజనకు ముందు ఏర్పడిన సింధునాగరికత విషయాలు ఇప్పటి భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా చూసి అవి వేరేదేశంలో ఉన్నాయి గనుక అది భారతదేశానికి వర్తించదు అని ఎలా చెప్పలేమో కవి స్థానికతను నిర్ధారించే విషయంలోనూ అప్పటి ప్రాదేశిక ఉనికిఇప్పుడు వేరేప్రాంతంలో ఉండడంవల్ల అతడు ఇతర ప్రాంతానికి చెందినవాడు అనడం కూడా తప్పే అవుతుంది. కనుక సాహిత్య చరిత్రలో కవి స్థానికతను నిర్ధారించేముందు అతడి జీవితాన్ని స్పష్టమైన కాలక్రమంతో తెలపడం అవసరం.

అందువల్ల సాహిత్యచరిత్రను నిర్మించేవారు ఒక కవిని ఎందుకు ఒకనిర్దిష్టప్రాంత పరిధిలో చేర్చుతున్నారో స్పష్టంగా తెలియ జేయాలి. అది సమగ్ర ఆంధ్రసాహిత్యంలో అయినా, ఆధునిక గ్రంథసూచికల్లో అయినా, తెలంగాణ సాహిత్య చరిత్రలో అయినా అదే వర్తిస్తుంది. అలా చూస్తే ఇటీవలకాలంలో తెలంగాణ నుండి ప్రచురించిన తెలంగాణ సాహిత్యగ్రంథసూచీలో ఈ విషయాన్ని స్పష్టంగా అవగాహనలో ఉంచుకొని" మేం ప్రధానంగా ఎదుర్కొన్న సమస్య తెలంగాణ వారు ఎవరు? అన్నది, ఇది సాంకేతిక సమస్య. సెంటిమెంట్ సమస్య. సున్నితమైన సమస్య. తెలంగాణ ఆవిర్భావం (2014 జూన్ 2) ముందురోజు వరకు తెలంగాణలో ఉన్నవారంతా తెలంగాణ వారనుకోవాలా? ఇక్కడ కొన్నేళ్ళుగా ఉన్నవారిని కూడా పరిగణించాలా? ఉద్యోగం రీత్యా వచ్చిన తల్లిదండ్రులను ఒకరకంగా వారి సంతానాన్ని మరొకరకంగా భావించాలా? ఇలాంటి సమస్యలు ఎన్నో తలెత్తాయి. దివాకర్ల వెంకటావధాని, నాయని కృష్ణకుమారి, జీ.వీ. సుబ్రహ్మణ్యం లాంటి వారందరూ తమ జీవితకాలమంతా ఇక్కడే గడిపి ఇక్కడి నేలలోనే కలిసిపోయారు. సైద్ధాంతికంగా విభేధించినా వారిని తిరస్కరించలేం. ఇలాంటి సమస్యలతో, చర్చలు వాదోపవాదాలతో మాకున్న పరిమిత కాలాన్ని వృధాచేసుకోకుండా మధ్యేమార్గంలో వెళ్లాలనుకున్నాం. తరతరాలుగా ఇక్కడ ఉన్నవారితో ఈ సంపుటిని ప్రచురించి ఆంధ్రానుండి వచ్చి ఇక్కడే స్థిరపడిన వారితో భవిష్యత్తులో మరో సంపుటం ప్రకటించే అవకాశాన్ని ఆశిద్దాం.

ప్రముఖ రచయితలు హైదరాబాదులో ఉన్నవాళ్లు ఎక్కువమందికి తెలియవచ్చు. కానీ రచయితల్లో తెలంగాణ వారు, తెలంగాణేతరులు అని స్పష్టంగా గిరిగిస్తే కొలమానం కోసం మరింత తెలివిడితో కృషిచేయవలసి వచ్చింది. అయినప్పటికీ జిల్లాల్లో స్థిరపడిన కొందరు ఆంధ్రప్రదేశ్ప్రాంతం వారు కూడా చేరే అవకాశం ఉంది" (దత్తయ్య అట్టెం (సం). ముందుమాట Xiii). అని స్పష్టంగా వివరించారు. వాస్తవానికి ఇలా ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం కూడా చాలా అవసరం. ఎందుకంటే ఆ గ్రంథమాలను పరిశీలిస్తున్నప్పుడు వారన్నట్లుగానే అనేక ఆంధ్ర వ్యక్తులు ఇందులో కనిపిస్తారు కూడా. కొన్నిసార్లు కొంతమంది పేర్లు చూసిన తర్వాత ఇక్కడ స్థిరపడటమే కారణమా? లేక ఇక్కడి వ్యక్తిని వివాహం చేసుకోవడం వల్ల ఇక్కడ స్థానికతను గుర్తిస్తున్నారా? అనే ప్రశ్న కూడా వస్తుంది.

అందువల్ల కవి స్థానికతను నిర్ధారించడానికి ఎన్ని ప్రమాణాలను రూపొందించినా కొన్ని శేషప్రశ్నలు మిగిలిపోతూనే ఉంటాయి. అదే స్థానికత అనే భావన స్వభావం. అది ఒకసారి తేలిపోయే నిర్ణయం కాదు; ప్రతికొత్త ఆధారం, ప్రతికొత్త పునర్విమర్శతో తిరిగి పరిశీలించవలసిన చారిత్రక ప్రక్రియ.

**ముగింపు :**

మొత్తంగా కవి స్థానికతను కేవలం జన్మస్థలం, నివాసం లేదా భాషతోనే నిర్వహించడం సాధ్యం కాదు. రచయిత

తన రచనల్లో ఏ జీవితం, ఏ ప్రాంతం, ఏ సంస్కృతిని ప్రతిబింబించాడు? తాను ఏ ప్రాంతీయ చైతన్యంతో ముడిపడ్డాడు? అన్నదే ప్రధాన ప్రమాణంగా పరిగణించాలి. కనుక కవి స్థానికత అనేది జన్మస్థలం ద్వారా లభించే భౌగోళిక గుర్తింపు మాత్రమే కాదు. సాహిత్యం, భాష, జీవనానుభవం, చారిత్రక సందర్భం, సామాజిక అంగీకారాల పరస్పర సంబంధాలతో నిర్మితమయ్యే సాంస్కృతిక అస్తిత్వం. దానిని ఒక ప్రమాణంతో నిర్ధారించే ప్రయత్నం చరిత్రను సరళీకరించడమే అవుతుంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. ఆరుద్ర, సమగ్ర ఆంధ్రసాహిత్యం - I, 1st.ed, ప్రజాశక్తి బుక్ హౌజ్, 1989.
2. దత్తయ్య. అట్టెం (సం), తెలంగాణ సాహిత్య గ్రంథసూచీ, 1st.ed, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురణలు, 2024.
3. మల్లారెడ్డి తూర్పు (సం), తెలంగాణ సాహిత్యం - జీవిత చిత్రణం, 1st.ed, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళాశాల ప్రచురణలు, 2007.
4. వేంకటరావు నిడదవోలు, తెను (గుకవుల చరిత్ర, 1st.ed, మద్రాసు విశ్వవిద్యాలయం, 1953.
5. శ్రీరామమూర్తి గురజాడ, కవి జీవితములు, 1st.ed, సరస్వతీ నిలయము, ద్రాక్షర శాల, 1913.
6. సత్యనారాయణ ఎస్వీ, నందిని సిధారెడ్డి (సం), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, 1st.ed, పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురణలు, 2018.
7. హరికృష్ణ మామిడి(సం), తెలంగాణ ప్రముఖ కవులు - కావ్యాలు, 1st.ed, భాషా సాంస్కృతిక శాఖ, 2022.
8. Venkata ramaswami cavelly, biographical sketches of deccan poets, 1st.ed, 1829.
9. Tally Jr. Robbert.T, spatiality,1st.ed, routledgetaylors & francis group, 2013.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : *https://www.bhavaveena.com/*

# కస్తూరి మురళీకృష్ణ కథలు - అద్భుతరసం



**కర్రి రమేష్**
పరిశోధక విద్యార్థి (పా/టై)
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం-03
చరవాణి : 6281109892.

**ఆచార్య జర్రా అప్పారావు**
పరిశోధక పర్యవేక్షకులు
తెలుగువిభాగం - ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్నం - 03



సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాససంగ్రహం :**

పాఠకులను ఆశ్చర్యంలో ముంచెత్తే, అసాధారణమైన, అద్భుత లోకంలో విహరింపజేసే అనుభూతిని కలిగించే రసం అద్భుత రసం. ప్రాచీన తెలుగు సాహిత్యంలో కంటే ఆధునిక సాహిత్యంలో దీన ఉనికి ఎక్కువ. జానపద కథలు, పురాణ గాథలలో తరచుగా ఈ రసం ఉంటుంది, ఇందులో అసాధారణ శక్తులు, మాయాజాలం, విచిత్రమైన సంఘటనలు ఉంటాయి, ఇది పాఠకులలో విస్మయాన్ని, ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తుంది. ఇది నవరసాలలో ఒకటి, ఇది అసాధారణమైన, అద్భుతమైన విషయాలను చూసినప్పుడు కలిగే ఆశ్చర్యం, విస్మయం అనే భావోద్వేగాన్ని సూచిస్తుంది. భరతుడు తన నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలను ప్రతిపాదించగా అందులో అద్భుతం ఒకటి. అలాగే తెలుగు జానపద కథలలో అద్భుత రసం ప్రధానంగా కనిపిస్తుంది, ఇక్కడ మాయాజాలం, అద్భుత శక్తులు, ఊహించని మలుపులతో కూడిన కథలు ఉంటాయి. చిన్న కథలలో కూడా అద్భుత రసం ఉంటుంది. కొన్ని కథలు కరుణ, భయానకంతో పాటు అద్భుత రసాన్ని కలిగి ఉంటాయి, ఇవి సున్నితమైన అంశాలతో కూడిన కథలలో కనిపిస్తాయి. ఇలాంటి అద్భుతాన్ని ఇతివృత్తంగా ఎంచుకుని రచయిత కస్తూరి మురళీకృష్ణ కథలు రాశారు. ఆ కథలో ఉన్న అద్భుతాంశాలను విశదీకరిస్తూ అధ్యయనం చేయడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు :**

1. బిగ్ బాంగ్ థియరీ 2. మార్ఫికల్ రెసొసెన్స్ 3. మొర్గెలన్స్ సింద్రోమ్ 4. సైన్స్ ఫిక్షన్ 5. సైన్స్ ఫాంటసి

**ప్రవేశిక :**

పురాణ కథలలో దేవుళ్ళు, రాక్షసుల పాత్రలు, అద్భుత సంఘటనలు అద్భుత రసాన్ని పెంపొందిస్తాయి. జానపద

కథలలో వచ్చే మంత్రాలు, మాయలు, అదృశ్యమయ్యే శక్తులు ఈ కోవలోకే వస్తాయి. పురాణ గాథలలోని అసాధారణ పాత్రలు, అద్భుతమైన కార్యాలుగా చెప్పొచ్చు. అద్భుత రసం లక్షణాలను పరిశీలిస్తే, ఆశ్చర్యం, విస్మయం ప్రధానంగా కనిపిస్తుంది. ఊహకందని, నమ్మశక్యం కాని సంఘటనలు, పాత్రల వల్ల కలిగే అనుభూతి ఇందులో ఆశ్చర్యానికి గురిచేస్తాయి. మాయాజాలం అనేది మరొక అంశం. అంతే కాకుండా, అద్భుత శక్తులు, మంత్రాలు, దేవతలు, రాక్షసుల ప్రవేశం కూడా దీనిలో భాగంగా చెప్పుకోవచ్చు.

తెలుగు కథలో చిత్రించబడే కొన్ని సంఘటనలు పాఠకులలో ఆశ్చర్యంతో పాటు ఒక రకమైన గౌరవాన్ని, భయాన్ని కలిగిస్తాయి. వాస్తవానికి దూరంగా ఉండి, పాఠకులను పూర్తిగా ఊహా ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది, అది వారిని మంత్రముగ్ధులను చేయడం ఉంటుంది. సాధారణ జీవితంలో అనుభవించలేని ఒక గొప్ప అనుభూతిని, పారవశ్యాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు 'బంగారు బాతు', 'మాయా దీపం' వంటి జానపద కథలలో అద్భుత శక్తులు, మాయాజాలం ప్రధానంగా ఉంటాయి. ఆ కోణంలో కస్తూరి మురళీకృష్ణ రాసిన కథల్లో భాగంగా 13 కథలను అద్భుతకోణంలో చిత్రించి పాఠకులకు కొత్త అనుభూతిని పంచారు. వాటిని పరిశీంచడమైంది.

**1. రచయిత పరిచయం :**

కస్తూరి మురళీకృష్ణ 1965 జనవరి 10 వ తేదీన తెలంగాణాలోని నిజామాబాద్ జిల్లా, బోధన్ తాలూక, శక్కర్ నగర్‌లో జన్మించారు. వీరి తల్లి కస్తూరి సత్యవతి, తండ్రి కస్తూరి సూర్యనారాయణ. వీరి విద్యాభ్యాసం అంతా తెలంగాణాలోనే సాగింగి. 1984లో డిగ్రీ విద్యను పూర్తి చేశారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1986లో ఎం.ఎస్సీ. 1995లో ఎం.ఏ. ఫిలాసఫి, 2025లో ఎం.ఏ సైకాలజీని పూర్తిచేశారు. అలాగే భోపాల్‌లోని మానససరోవర విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీలో ప్రస్తుతం పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక రైల్వేలో ఉద్యోగంలో చేరారు. 1989లో ఎంక్వైరీ కమ్ రిజర్వేషన్ క్లర్కుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. తరువాత 1996లో అకౌంట్స్ డిపార్ట్‌మెంటుకు మారి ఉద్యోగోన్నతి పొంది సీనియర్ సెక్షన్ ఆఫీసర్‌గా 2025 జనవరి 31 న ఉద్యోగ విరమణ చేశారు.

**2. అద్భుతరస కథల విశ్లేషణ :**

ఆధునిక కథానికలలో అద్భుత రస చిత్రణ కనిపిస్తుంది. అద్భుత రసం సాహిత్యాన్ని మరింత ఆసక్తికరంగా, రసవత్తరంగా మారుస్తుంది, పాఠకులను కథలోకి లీనం చేసి, ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుంది. ఈ కోణంలో అద్భుతాన్ని తన కథలలో ఆవిష్కరించి పాఠకుల మెప్పు పొందిన రచయిత కస్తూరి మురళీకృష్ణ. వీరి కథల్లో భయానక రసంతో పాటు అద్భుతాన్ని చాలా ఆకట్టుకునేలా చిత్రించారు. ఈ కథలను సంక్షిప్తంగా విశ్లేషించదలిచాను.

**2.1. సాలీడుగూడులో... :**

ఈ కథలో ఒక వ్యక్తి యొక్క అనుభవాలు, ముఖ్యంగా అతను నివసిస్తున్న హోటల్ గదిలో, ఆ గది చుట్టూ ఉన్న విచిత్రమైన సంఘటనల గురించి వివరిస్తూ అద్భుత రసాన్ని ఆవిష్కరింబడింది. ప్రధానంగా ఒక ఆడ సాలీడు గూడు, ఒక మగ సాలీడు మధ్య జరిగే ప్రకృతి వ్యవహారాన్ని, దానిని గమనించే తన అనుభూతులను ఈ రచన తెలియజేస్తుంది. కథానాయకుడు తాను చూసిన సాలీడు గూడును కేవలం ఒక కీటకం తాలూకు ఆవాసంగా కాక, ఒక ప్రేమ బంధం సంకేతంగా భావించాడు. ఇది అతనికి ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనితో పాటు, హోటల్ గదిలో ఒక మహిళతో అతనికి ఏర్పడిన పరిచయం, ఆ గదిలో జరిగిన, జరుగుతున్న మరణాలు, అనుమానాస్పద పరిస్థితులు పోలీసుల నివేదికలతో కలగలిసి కథ నడుస్తుంది. చివరగా, ఆ సాలీడు భయంకర రూపం దాల్చడం, ఆ అనుభవాలన్నీ అతనికి భయానకమైన స్వప్నంలా మారడం అనేది ఈ కథ సారాంశంగా గమనించవచ్చు.

ఈ కథలో రచయిత చిత్రించిన అద్భుత రసం అసాధారణ సంఘటనలు భయంకరమైన పరివర్తనల ద్వారా పాఠకులపై తీవ్ర ప్రభావాన్ని చూపించేదిగానే ఉంది. ఈ అద్భుత రస చిత్రీకరణ ప్రధానంగా హోటల్ గది నేపథ్యం అంతు తెలియని స్త్రీ పాత్ర సాలీడు రూపకల్పన చుట్టూ కేంద్రీకృతమై కథ సాగింది.

ఈ కథ ఆరంభమే అసాధారణ నేపథ్యంతో కూడిన అద్భుతారంభం. రచయిత కథను సాలీడు వల చుట్టూ నడిపాడు. ప్రారంభ దృశ్యం భవిష్యత్తులో జరగబోయే వింత సంఘటనలకు ఒక సూచనలా కనిపిస్తుంది. కథానాయకుడు బస చేసిన హోటల్ గది నెంబరు 305 కూడా ఈ అద్భుత రసానికి ఆలంబనగా చిత్రించబడింది. ఆ గదిలో అంతకుముందు నలుగురు వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకుంటారు. వారికి ఆత్మహత్య చేసుకోవాల్సిన కారణాలు ఏవీ లేవని పరిశీలనలో తేలుతుంది. ఈ గదిలో ప్రతి శనివారం రోజు రకరకాల సంఘటనలు జరగడం, అది తెలిసిన ఉద్యోగులు ఆ గది వైపు వెళ్లకపోవడం, అక్కడ జరిగిన హత్యలను ఆత్మహత్యలుగా చూపడం వెనుక ఏదో ఒక అంతుచిక్కని అంశమేదో దాగిఉందనే అనుమానం బలపడుతుంది. ఈ అంతులేని రహస్యం హోటల్ గది లోపల అద్భుత వాతావరణాన్ని సృష్టించింది. అలాగే ఒక స్త్రీ బయట కిటికీ ఎదురుగా నవ్వుతూ కనిపిస్తుంది. తాను కిటికీ అవతలి అమ్మాయిని అని ఆమె పరిచయం చేసుకుంటుంది. ఈమె ఎప్పుడు చూసినా కిటికీ లోపలకే చూడటం, ఈమె ఉనికిని, ఈమె గదిలోకి ప్రవేశించిన విధానాన్ని గ్రహించలేక పోవటం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

**2.2 ఫాంటమ్ లింబ్ :**

ఈ కథలో ఒక ప్రత్యేకమైన మానసిక సంబంధమైన అంశాన్ని చిత్రించారు రచయిత. ఈ కథలోని కథావస్తువు అద్భుతరసావిష్కరణకు కేంద్రబిందువుగా ఉంది. కథలోకి వెళితే డాక్టర్ లియాన్ పాత్ర మరియు కథానాయకుడికి మధ్య జరిగిన సంభాషణ ఈ కథలో ప్రధానంగా కనిపిస్తుంది, అలాగే 'ఫాంటమ్ లింబ్' గురించి, భయంకరమైన పరిస్థితులలో కూడా సంతోషంగా ఉండటానికి ప్రయత్నించడం గురించి, యుద్ధంలో గాయపడిన వ్యక్తి ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు, శారీరక గాయాల గురించి చర్చ జరుగుతుంది. అలాగే యుద్ధ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అనుభవించే కష్టాలు, వేదన ఈ కథలో చిత్రించబడ్డాయి. ముఖ్యంగా యుద్ధంలో అవయవాలు కోల్పోయిన వారి గురించి, ఆ తరువాత వారు అనుభవించే మానసిక ఒత్తిడి గురించి కథనం వివరించింది. అలాగే ఒక సైనికుడి జీవిత అనుభవాలు ఇందులో వివరించబడ్డాయి. అంతేకాకుండా ఈ కథ శారీరక మానసిక పోరాటాల నేపథ్యాన్ని కూలంకషంగా చర్చించింది.

ఈ కథలో రచయిత అద్భుత రసాన్ని చిత్రించే క్రమంలో విషాదంలోని అసాధారణ అంశాలు జోడించి సమర్థ వంతంగా కథారచన చేశారు. ఫాంటమ్ లింబ్ అనేది తిరిగి రాని అవయవాలు ఉన్నట్టుగా మెదడుకు కలిగే అనుభూతి అనే వివరణ ఆశ్చర్యకరమైన మానసిక స్థితిని పరిచయం చేస్తుంది. అలాగే ఈ కథలో వారు చేస్తున్న సామాజిక సేవలో భాగంగా రచయిత చెప్పాలనుకున్న విషయ విశేషాలను స్పష్టంగా చిత్రించారు. యుద్ధం భయానక వాతావరణం నేపథ్యంలో డాక్టర్ లియాన్ పాత్ర చిత్రీకరణ అద్భుత రసానికి తొలిపునాది వేస్తుంది. బాగ్దాద్ లాంటి ప్రమాదకర ప్రదేశంలో పౌరులు తమ నాగరికతను విడిచిపెట్టలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు. ఈ కష్టకాలంలో లియాన్ ఎప్పుడూ నవ్వుతూ కథలు చెబుతూ ఉండటం గొప్ప విస్మయాన్ని కలిగిస్తుంది. 'జీవితం విధి కుస్తీపట్టడానికి మరో పేరు' అన్న లియాన్ మాటలు ఈ పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తాయి. గ్రీన్ జోన్ ప్రాంతం శత్రువుల దాడులకు గురవుతున్న సమయంలో డాక్టర్ లియాన్ అక్కడ పని చేస్తుంటాడు. ఆ ప్రాంతం చుట్టూ ప్రతిచోటా యుద్ధ ప్రమాదాలు నిండి ఉంటాయి. ఈ దారుణ పరిస్థితుల మధ్య ఒక డాక్టర్ నిరంతరం సంతోషంగా ఉంటూ ఇతరులకు కథలు చెప్పడం సాధారణ విషయం కాదు.

**2.3 నాలుగు తలలు :**

ఈ కథలో రచయిత అద్భుత రసాన్ని క్రమంగా భయానక అంశాలతో మిళితం చేస్తూ, ప్రధాన పాత్రలయిన కథకుడు (సాక్షి), రమాకాంత్ (బాధితుడు) అనుభవించిన మార్పుల ద్వారా అద్భుతంగా చిత్రించారు. ఈ విశ్లేషణలో సాధారణ వాతావరణం నుండి అతీత లోకం వైపుకు కథ ప్రయాణించే తీరు, పాత్రలు అనుభవించిన భీకర ఆశ్చర్యపరిచేలా ఉంటుంది.

ఈ కథలో అద్భుత రసానికి నాంది కథకుడు. కథకుడు క్యాంపు దగ్గరకు చేరుకునే సమయానికి, టెంటు లోపలి నుండి వినిపిస్తున్న శబ్దాల ద్వారానే అద్భుత రసం ఆరంభమవుతుంది. టెంటులో ఒకే వ్యక్తి(రమాకాంత్) ఉంటాడు. కాని బయటకు వినబడే అరుపులు నలుగురు మనుషులవి. అది ఎలా సాధ్యం? ఇదే ఈ కథలో చెప్పబడిన అద్భుతం. ఇది ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కథకుడు క్యాంపు చేరేసరికి, క్యాంపు నిర్వాహకుడు భయంతో టెంటు బయట నిలబడి ఉంటాడు. రమాకాంత్ ఉన్న టెంటు నుండి అరుపులు, కేకలు మాత్రమే వినిపిస్తున్నాయి. సాయంత్రం నుండి టెంటులో అరుపులు, కేకలు వినిపిస్తున్నాయని, అవి ఎవరి లోపలికి వచ్చాయో తెలియడం లేదని క్యాంపు నిర్వాహకుడు చెప్తాడు. ఈ అరుపులు క్రమంగా పెరుగుతూ ఉండటంతో పాటు, ఆ వింత శబ్దాలు ఏ భాషవో కూడా తెలియదు. మాటలాడుతున్నట్లు, అరుస్తున్నట్లు తెలుస్తుంటుంది కానీ, ఆ శబ్దాలు ఏ భాషా పదాలలో ఉన్నాయో కూడా బోధపడదు. కొత్తవాళ్ళు ఎవరైనా వచ్చి చేరారా? అని కథకుడు అనుమానం వ్యక్తం చేస్తాడు. ఈ తెలియని, వింత భాష అరుపులు కథకుడికి అసాధారణమైన ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఈ కథలో ఆ అరుపులేంటో తెలుసుకునే సరికి ఒక ఊహించని పరిణామం దర్శనమిస్తుంది. అది వింతగా తోస్తుంది. మనిషి ఊహకందని ఏ విషయమైనా అది అద్భుతమే. ఆదే ఈ కథ ద్వారా కొత్తగా ఆవిష్కరించే ప్రయత్నం చేయబడింది.

**2.4 అతడికోపం అయ్యింది శాపం :**

ఈ కథలోని అద్భుత రసం ప్రధానంగా పాత్రల అసాధారణ ప్రవర్తన, అదృశ్య శక్తులు, వాటి ప్రభావం ద్వారా ఆవిష్కృతమైంది. రచయిత చిత్రీకరించిన అద్భుతం కేవలం సంఘటనలలో మాత్రమే కాక, ఆ సంఘటనలకు కారణభూతులైన, వాటిని అనుభవించిన పాత్రల చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది.

ఈ కథలో అవధాని పాత్ర చిత్రణ అద్భుతానికి కేంద్ర స్థానంగా చిత్రించబడింది. అతడు తన జీవితంలో చేసిన పాపం అతడిని అనుసరించింది. ఈ పాపం అతడి కోరిక మేరకు అంతమయ్యే వరకు తనతోనే ఉండాలని నిర్ణయించుకుంది. సాధారణంగా పాపం అనేది ఒక నైతిక భావన లేదా చేసిన తప్పు పరిణామం మాత్రమే అవుతుంది. కానీ అవధాని విషయంలో ఆ పాపం ఒక అద్భుతమైన భౌతిక శక్తిగా రూపాంతరం చెంది విస్మయం కలిగేలా చేస్తుంది. అతడి జీవితం మారిన తీరు చూస్తే ఆ అద్భుతం ఏంటనేది స్పష్టమవుతుంది. అవధాని పాత్ర చిత్రణ పాఠకులలో ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా ఉంటుంది. రచయిత చేసిన ఈ ప్రయోగం వింతగా అనిపించినా కొత్త అనుభూతికి లోనుచేసేలా ఉంటుంది. ఈ పాత్ర దైవిక శాపానికి లేదా అదృశ్య శక్తుల నియంత్రణకు లోబడి ఉన్నట్లు చిత్రించబడింది. అతడు తన చర్యలను గురించి వివరిస్తున్నప్పుడు, వాటిని చూసే ఇతరులకు అవి పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేసేలా ఉంటాయి. ఉదాహరణకు, నష్టం జరిగినప్పుడు లేదా ప్రమాదం జరిగినప్పుడు, అవధాని ఏమీ తెలియనివాడిలా ప్రవర్తించడం అందరిలోనూ ఆశ్చర్యం కలిగిస్తుంది. తాను చేసిన నేరం లేదా ప్రమాదం తన మనస్సు మీద ముద్ర పడిందని, అది తనకు తెలిసి కూడా దానికి బానిసయ్యానని అతడు వెల్లడిస్తాడు. ఇదంతా విన్న సుందర్ మరియు అధికారులు అతడి అసాధారణ పరిస్థితిని చూసి విస్మయం చెందుతారు.

నిజానికి ఒక రసాన్ని అనుభవించాలి అంటే అక్కడ ప్రేక్షకులు అవసరం. అద్భుత రసం కథలో నిలబడటానికి, దానిని చూసి ఆశ్చర్యపోయే పాత్రలు అవసరం.ఈ కథలో రచయిత చిత్రించిన అద్భుతాన్ని అనుభవించేవారుగా

సుందర్ మరియు ఇతర అధికారులే ప్రేక్షకులుగా చిత్రించబడ్డారు. అవధాని పనిచేసే దగ్గర తనతో పాటు ఉన్న సుందర్, అధికారులు ఈ పాత్రను పోషించారు. ఇంకా చెప్పాలంటే అవధాని జీవితంలో జరుగుతున్న అద్భుతాలు, అసాధారణ పరిస్థితులకు ప్రధాన సాక్షి సుందర్.

**2.5 మృత్యునీడ :**

ఈ కథలో రచయిత విస్మయం, భయం, తాత్వికత కలగలిసిన ఒక విలక్షణమైన అద్భుత రసాన్ని చిత్రించారు. ఇది ప్రధానంగా మధు, సుధ, డాక్టరు అనే మూడు పాత్రల ద్వారా వ్యక్తమవుతుంది. కథకు మూలస్తంభం మధు పాత్ర. అతడు తనకు మానసిక సమస్య ఉందని నమ్ముతాడు. అతడి కళ్లు పరిపూర్ణంగా ఉన్నా, శరీరం ఆరోగ్యంగా ఉన్నా, అతడు మాత్రం మానసిక సమస్య ఉన్నట్లుగా భావిస్తాడు. మనిషి మెదడు శక్తివంతమైనదని, మనసులో లేనిది కూడా ఉన్నట్లుగా కనిపించవచ్చని డాక్టరు మధుకు వివరిస్తాడు. ఈ అంతర్గత సంఘర్షణే అతడిలో వింతైన, భయానకమైన అద్భుతానికి నాంది పలికింది. మధులో కలిగే పిచ్చి కేవలం ఒక భ్రాంతి దశ మాత్రమే. అతడు తరచుగా భీతిని అనుభవిస్తాడు. ఏదో జరిగిపోతున్నట్లు, ఏదో నాశనమైపోతున్నట్లు అతడికి అనిపిస్తుంది. కాని ఆ 'ఏమిటి' అనే ప్రశ్నకు సమాధానం దొరకదు. ఈ తెలియనితనమే అతడిని లోతైన విస్మయానికి గురిచేస్తుంది.

ఈ కథలో మధు అనుభవించే అద్భుత రస పరాకాష్ట శవపేటికల సన్నివేశంలో కనిపిస్తుంది. రోడ్డు మీద పయనిస్తున్నప్పుడు అతడు మూడు శవపేటికలు దొర్లుకుంటూ దూసుకుపోవడం చూస్తాడు. అవి దేనికీ కట్టి ఉండవు. వాటిని ఎవరు తీసుకెళ్తున్నారో తెలియదు. ఈ వింత అనుభవం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒక్కసారిగా భీకరం అయిపోతాడు. ఆ శవపేటికలు దూసుకుపోతుంటే మధు శరీరం చల్లబడి, గుండె వేగం పెరిగినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత ఆ శవపేటికలు చనిపోయిన ముగ్గురు పిల్లలవి అని అతడికి తెలుస్తుంది. ఆ దృశ్యం ఆ క్షణాన అద్భుతమనిపిస్తుంది. చుట్టూ ఉన్న జనం కూడా ఆశ్చర్యంతో చూస్తారు. అంతేకాదు పిల్లల మరణం, వాటి శవపేటికలు అలా దొర్లుకుంటూ వెళ్లడం మధుకు ఒక విషాదభరితమైన విస్మయాన్ని ఇస్తుంది. ఈ సన్నివేశం చూసిన తర్వాత అతడి ఆలోచన మరింత వేగవంతమవుతుంది.

**2.6 మనిషి – మృగం !**

ఈ కథ ఒక సీరియల్ కిల్లర్ గురించి తెలుపుతుంది. ఆ హంతకుడు సామాన్య మనిషిగాకాక కొన్ని సందర్భాల్లో ఇద్దరుగా మారడం, అందులో ఒకరు జంతు ప్రవృత్తి కలిగి ఉండటం విశేషంగా చెప్పుకోవచ్చు. ఒక మనిషి సందర్భానుసారంగా మరో మనిషిగా విడిపోవడం ఈ కథలో అద్భుతం. ఎవరూ ఊహించని ఈ పరిణామం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కథలో పోలీసు అధికారి, పరిశీలనా నిపుణురాలు(పరిణీత) మధ్య సంభాషణను బట్టి అది అంతుచిక్కని అంశంగా అర్థంచేసుకోవచ్చు. ముగ్గురు అమ్మాయిల మరణాలపై దర్యాప్తు జరుగుతున్నప్పుడు, అరవింద్ అనే వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా మారుతుంది. ఈ అరవింద్ పరిశీలకురాలి(పరిణీత) భర్త. ఒకానొక సందర్భంలో పరిశీలనా నిపుణురాలు, అరవింద్‌ల మధ్య జరిగిన చర్చ ద్వారా ఈ హంతకుడు కేవలం మనిషి మాత్రమే కాదని, అతనికి జంతువుల లక్షణాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది. చివరికి ఈ కథనం పరిశీలనా నిపుణురాలు ఒక కిల్లర్ జంతువుగా మారిన అరవింద్‌ను ఎదుర్కొనే భయంకరమైన దృశ్యంతో ముగుస్తుంది, ఈ కథలో ఇది టెర్రిఫైయింగ్ క్లైమాక్స్‌ను సూచిస్తుంది.

**2.7 నీటిగోడలోని నిప్పురవ్వలు :**

ఈ కథ ఒక తుఫాను సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న వ్యక్తుల అనుభవాన్ని, వారి భయాన్ని, పోరాటాన్ని చిత్రించింది. పడవలు తుఫానులో చిక్కుకుని నౌక విరిగిపోయింది, మునిగిపోయింది అని నౌకల్లో ఉన్నవారే చెప్పినా, అది తరవాత నమ్మసక్యంకాని విధంగా కొన్ని రోజులకు రాజహంలా ఏమీ జరగనట్లు ఆ నౌక కనబడటం ఊహకందని

అద్భుతమనిపిస్తుంది. అలాగే ఒక హొటల్లో లేని గదిలో ఉన్నట్లు పలువురు ప్రకటించడం వంటి భయంకరమైన అనుభవాలను ఈ కథ చిత్రించింది. తుఫాను సమయంలో ఎదుర్కొన్న విపరీతమైన పరిస్థితులు, తమను తాము రక్షించుకోవడానికి తీసుకున్న చర్యలు ఈ కథలో పాత్రల ద్వారా చెప్పబడ్డాయి. రచయిత అంతర్గత ఆలోచనలు, భయాలు, చివరికి భయం తగ్గిన అనుభవాన్ని ఈ కథనం చర్చించింది.

ఈ కథలో చిత్రించిన ప్రతీ సంఘటన ఆశ్చర్యకర సన్నివేశాన్ని కనబరుస్తుంది. అలలు ఎగిసిపడుతున్న సందర్భంలో కథానాయకుడు చూస్తున్న దృశ్యం నమ్మశక్యం కానిదిగా ఉంటుంది. అతను తన కళ్లను తానే విశ్వసించలేకపోతాడు. ఆ ఆకారం మనిషా? రాక్షసుడా? నీరా? అనే ప్రశ్న అతనికి అస్పష్టంగా ఉంటుంది. కాసేపటికి ఆ ఆకారం కనిపించకుండా పోతుంది. విస్మయభ్రాంతి అయినట్లు అతను భావిస్తాడు. ఆ క్షణం తాను చూసింది భ్రమా? నిజమా? అర్థం కాలేదనే నిస్సహాయత అతనిలో నెలకొంటుంది. ఈ కథలో ఈ విచిత్ర సంఘటన కథానాయకుడి పాత్ర కేంద్రంగా అద్భుత రసాన్ని స్పష్టంగా చిత్రించింది.

**2.8 యోగి పిలుపు :**

ఒక యోగి మరియు ఆండర్సన్ అనే వ్యక్తి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన విశేషాలను ఈ కథ వివరిస్తుంది. ఆండర్సన్ యోగిని కలవాలనే తన కోరిక గురించి తెలుసుకుని, తన ఆశ్రమానికి వచ్చి యోగిని కలుస్తాడు. యోగి తన వద్దకు వచ్చిన ఆండర్సన్‌కు జ్ఞానం, విజ్ఞానం వంటి అంశాల గురించి వివరిస్తాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య కొన్ని అద్భుతమైన సంఘటనలు జరుగుతాయి. యోగి చెప్పిన మాటలతో, ఆండర్సన్‌కి కలిగిన అనుభవాలు ఒక మానావాతీత రహస్యాన్ని తెలియజేస్తాయి. ఆ సంభాషణ ద్వారా వ్యక్తమయిన కొన్ని విశేషాలు చివరికి వారి భవిష్యత్తు గురించి తెలపడంతో పాటు, యోగి ఆండర్సన్‌కు కొన్ని సూచనలు ఇవ్వడంలో అద్భుతాలు వ్యక్తమవుతాయి.

ఈ కథలో రచయిత అద్భుత రసాన్ని చాలా శక్తిమంతంగా చిత్రించారు. కథానాయకుడికి (అండర్సన్‌కి గైడ్) జరిగిన అనుభవం అతీతమైనది, అసాధారణమైనది కావడమే ఈ రస ప్రధాన లక్షణం. అద్భుత వాతావరణం అసాధారణ ప్రయాణం. కథ మొదట్లోనే ఒక యోగి పిలుపు అండర్సన్‌ని ఊహించని ప్రయాణంలోకి తీసుకువెళు తుంది. అండర్సన్‌ని ఎక్కడికి వెళ్లాలని కథానాయకుడు అడుగుతాడు. తాను వెళ్లే ప్రదేశం గురించి చెప్పాక, ఆ ప్రయాణం చాలా నిగూఢంగా ప్రారంభమవుతుంది. ఆ ప్రయాణంలో వారు వెళ్ళే వాహనం ఒక శక్తి క్షేత్రం గుండా వెళ్ళడం అద్భుత రసానికి నాంది పలికిందని చెప్పొచ్చు. ఆ రహస్య ప్రదేశంలో అండర్సన్‌కి ఒక యోగి వేషధారణలో కనిపించడం ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది మరియు ఒక వింత అనుభూతినిస్తుంది. ఆ తర్వాత అండర్సన్ కథానాయకుడితో భవిష్యత్తును గురించి మాట్లాడతాడు. తాను ఎక్కడికి వెళ్లబోతున్నాడో? అతడికి ఎలా తెలిసిందో? అని కథానాయకుడు అద్భుతంగా భావిస్తాడు. ఆ విషయాన్ని గురించి తెలుసుకున్న తర్వాత అతడి ఆశ్చర్యం రెట్టింపు అవుతుంది. అండర్సన్ కథానాయకుడిని కర్మసాక్షి దర్శనానికి ఆహ్వానించడం ఇంకా ఆసక్తిని పెంచుతుంది.

**2.9 అగమ్య 'గోచరం' :**

ఈ కథలో రచయిత చిత్రించిన అద్భుత రసం (విస్మయం) మానవ అవగాహనకు అందని లోకాలను ఆవిష్కరిస్తుంది. ఈ రసం కథానాయకుడి మానసిక స్థితిని, అతడు చూసే అసాధారణ దృశ్యాలను, వాటి వివరణను ఆధారంగా చేసుకుని తీవ్రస్థాయిలో వ్యక్తమవుతుంది.

ఈ కథలో మొదట మనిషి గమనించలేని, తెలియని ఒక ఉనికిని పరిచయం చేయడంలో ఆరంభమౌతుంది. ఈ కథానాయకుడు, రాజు, నరహరి అనే న్యూరోఫిజీషియన్ ప్రధాన పాత్రలు. లోకంలో ఎవరికీ కనబడని వారందరూ

రాజుకి కనబడటం ఈ కథలో చెప్పుకోదగిన విశేషం. కథ ప్రారంభంలో 'ఎవరో ఒక గదిలోకి వచ్చారు' అని రాజు చెప్పినపుడు, ఎవరు వచ్చారు? అన్నదానికి స్పష్టత కొరవడుతుంది. కథానాయకుడు రాజును ప్రశ్నించినప్పుడు, వచ్చినదెవరో రాజుకు సైతం తెలియదు అంటాడు. అది మగా? ఆడా? తెలియదు. ఎందుకొచ్చారు?, ఏమిటనేది? కూడా తెలియదు. రాజు చూసే ఆ ఉనికిని స్పష్టంగా వర్ణిస్తాడు కానీ, చెప్పలేడు. "అది వచ్చి కూర్చుంటుంది. తన దిక్కు చూస్తుంటుంది. అటూ ఇటూ నడుస్తుంటుంది. ఆ గదిలో ఆ వస్తువు ఉందనే విషయం ఖచ్చితంగా తెలుస్తోంది"(థ్రిల్లింగ్ -167) అని రాజు ధృవీకరిస్తాడు. రాజు మాటల తీవ్రత, ఆ ఉనికిని తాను చూడకపోయినా, తెలుసుకోవడం ఈ కథాంశానికి కీలక ఆధారం. 'నాకు కనిపించటం లేదు. కానీ తెలుస్తుంది' అని రాజు బలంగా చెప్తాడు. ఈ అసంభవమైన అనుభవం కథానాయకునిలో, కథను చదివే పాఠకునిలో తీవ్ర విస్మయాన్ని కలిగిస్తుంది.

**2.10 మొలిచే చేయి :**

ఈ కథలో రచయిత చిత్రీకరించిన అద్భుత రసం (విస్మయం) మానవాతీత అంశాల ద్వారా సాధారణ నేర కథనాన్ని ఆశ్చర్యకర స్థాయికి తీసుకువెళ్లింది. అద్భుతం ఆవిష్కరణకు దారి తీసిన అసాధారణ పరిస్థితిని పరిశీలిస్తే రచయిత చిత్రించిన కథనంలోని విశేషం స్పష్టంగా అర్థమౌతుంది. కనకలింగేశ్వరరావు నేరం అంగీకరించి, తనకు లాయర్ అవసరం లేదని స్పష్టం చేస్తాడు. అయినా న్యాయవాది ఈ కేసు వాదించవలసి వస్తుంది. ఈ నేరస్తుడు (కనకలింగేశ్వరరావు) సిరియల్ కిల్లర్ అని, హత్యలు చేసింది తనేనని ఒప్పుకుంటాడు. న్యాయవాదికి ఈ కేసులో గెలిచే అవకాశం ఏ మాత్రం లేదని తెలిసినా, మరో ఆధారం లేకపోవడంతో విధి లేక తీసుకుంటాడు. కనకలింగేశ్వరరావు బాల్యం దుర్భరంగా గడిచిందని, అతడు చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ పెరిగాడని, ఆ తర్వాత హత్యలు చేయడం మొదలుపెట్టాడని న్యాయవాది తెలుసుకుంటాడు. నేరస్తుడు తాను చేసిన హత్యలు కేవలం దొంగతనం కోసమే చేశాడని, చంపాలనే ఉద్దేశం లేదని చెబుతాడు. అది నమ్మశక్యంగా లేకపోయినా అదే నిజం. మరి ఈ హత్యలన్నీ ఎవరు చేస్తున్నట్టు? ఇదే ఆశ్చర్యానికి గురి చేసే అంశం.

**2.11 చెరువు గట్టు...!**

ఈ కథలో రచయిత అత్యంత భయానక అంశాలు, మానవాతీత శక్తులు కలగలిపి అద్భుత రసాన్ని పోషించారు. వైభవ్ అనే ప్రధాన పాత్ర చుట్టూ అల్లుకున్న ఈ వాతావరణం భయాన్ని, ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తుంది. వైభవ్ అనుభవాలు, అతీత లోకాలు, చెరువు పవిత్రతకు భంగం కలిగించిన సంఘటనలు ఈ రసానికి మూల స్తంభాలుగా నిలిచాయి.

ఈ కథలో చిత్రించిన అద్భుత సంఘటనలు గురించి పరిశీలించినపుడు, కళ్ళ ముందు తారసపడిన ఐదేళ్ళ కుర్రాడు క్షణంలో మాయమవడం, అంతకు ముందు ఆ కుర్రాడి కళ్లు జంతువు కళ్ళలా ఉండటం, దయ్యాన్ని తలపించేలా ఉండటం వైభవ్‌లో వింత ఆలోచనలకు తావిస్తుంది. భయంతో పరుగులు తీసినా అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆతృత అతన్ని నిద్రపోనివ్వదు. ఆ దృక్కోణంలోంచి పుట్టినదే ఈ కథనం. ఇది అద్భుతంలో భయానక రసాన్ని మిళితం చేసుకుని పాఠకులకు కూడా వింత మరియు కొత్త అనుభవాన్నిస్తుంది.

**2.12 మరణం లేని మనిషి :**

ఈ కథ ద్వారా రచయిత పాఠకులకు అందించిన అద్భుతాంశం 'కాలాతీతమైన గిరిజన విజ్ఞానం' మరియు 'మనిషికి మరణం లేని స్థితి'. ఇది మూడు ప్రధాన కోణాల్లో వివరించబడింది. రచయిత చేసిన ప్రయత్నంలో భాగంగా అద్భుత రసం ఈ కథలో ప్రతీ సన్నివేశంలోనూ కనిపిస్తుంది ముఖ్యంగా మొదట చెప్పుకోవలసినది ప్రకృతితో మమేకమైన విజ్ఞానం. నాగరిక ప్రపంచానికి అందని, పరిశోధకుల పుస్తకాల్లో చేరని అత్యద్భుతమైన విజ్ఞానం కొండజాతి ప్రజల వద్ద ఉందని రచయిత పేర్కొన్నారు. దీనికి నిదర్శనం ఈ కథలో న్యోమి పాడే పాట. ఆమె పాట కేవలం వినోదం కోసం కాదు, అది ప్రకృతితో చేసే సంభాషణగా చిత్రించబడింది. ప్రకృతి పులకరింపును, కొత్త జీవుల

పుట్టుకను ఆమె తన పాట ద్వారా ఆహ్వానిస్తుంది. మంచిని రమ్మని, చెడును క్షమించి దూరంగా పొమ్మని ఆమె ప్రకృతిని కోరడం, దానికి ప్రకృతి స్పందించడం అద్భుతంగా గోచరిస్తుంది. అలాగే 'మనం అనాగరికులు అని భావించేవారి విజ్ఞానం ముందు మన జ్ఞానం చాలా అల్పమైనదని' దివాకర్ పాత్ర ద్వారా రచయిత విశ్లేషించారు.

**3. ముగింపు :**

ఒక్కోసారి వాస్తవాతీతమైన అద్భుతం చాలా విస్మయానికి గురి చేస్తుంది. కంటికి కనిపించని శక్తి ఎక్కడో దాగివుంటూ దివ్యంగా అనిపించవచ్చు లేదా విపరీతాలను సృష్టించవచ్చు. అలా భయానకాలను అద్భుతాలతో సృష్టిస్తూ సాధ్యం కానివి సాధ్యం అయ్యేలా కల్పనలతో సాగినవి ఒక ఉత్కంఠతకు, అనుభూతులకు దారితీయిస్తాయి. ఇలాంటి కథల్లో రచయిత ఆంగ్ల చలన చిత్రాలకు ఏమాత్రం తీసిపోని విధంగా నిర్మించారు. 'సాలీడు గూడులో', 'నాలుగు తలలు', 'మొలిచే చేయి', 'యోగిపిలుపు', 'చెరువుగట్టు' వంటి కథలన్నీ అలాంటి భావనను అదించాయి. నడిసంద్రంలో నిలిపి ప్రాణాల్ని కబళించే కానరాని విపత్తు నుండి బయటపడటం ఒక అద్భుతం 'రోహిణీ శకట భేదనం', 'బలగముఖి తంత్ర ప్రయోగం' వంటివి సంధానిస్తూ సాగిన కథలు నిజంగా ఒక అద్భుతమే కథాకర్తను గల విషయ జ్ఞానాలు, అచ్చెరువునందించే విశేషాల పట్ల ఉన్న అవగాహన కూడా ఒక అద్భుతమే అనిపించింది. అద్భుతం అన్నది ఒక అనంత అనుభూతితో పాటు జలదరింపుతో మరపు రానిది కాగలదని విశదపరచిన వైనం ఆయా కథలకే సొంతం.

**ఆధార గ్రంథాలు :**


1. దక్షిణామూర్తి, పోరంకి - కథానిక - స్వరూప స్వభావాలు, హైదరాబాద్, 1986.
2. నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వ సంప్రదాయాలు - ప్రయోగాలు, శివాజీ ప్రెస్, సికింద్రాబాద్, 1977.
3. మురళీకృష్ణ, కస్తూరి - ఆ అరగంట చాలు(కథాసంపుటి), కస్తూరి ప్రచురణలు, దమ్మాయిగూడ, హైదరాబాదు-83, 2012
4. మురళీకృష్ణ, కస్తూరి - థ్రిల్లింగ్ - చిల్లింగ్ కథలు(కథాసంపుటి), సాహితి ప్రచురణలు,విజయవాడ, 2024.
5. సిమ్మన్న, వెలమల - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, విశాఖపట్నం, 2005.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# షేక్ ఖాజావలి శ్రీ విశ్వనాథ శతకం - పరిశీలన



**బల్లంకి రాజశేఖర్**
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ, ఆంధ్ర
విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
చరవాణి : 87903 00013.

**ఆచార్య జ్రరా అప్పారావు**
పరిశోధక పర్యవేక్షకులు
తెలుగువిభాగం - ఆంధ్ర
విశ్వవిద్యాలయం
విశాఖపట్నం - 03



సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A): 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

## 1. పరిచయం :

సాహిత్యం ఒక ఝురి. సుగంధాల సుడి. అది అమ్మ పాల ఉగ్గు లాగా జీర్ణించుకున్న ఒక మంచి కవితా ప్రయాణం. ఆయనొక ఉషస్సు, కళల వలల సేద్యగాడు. కమ్మని పిల్ల తెమ్మరలాగా పద్య కుసుమాలను పూజించడం తెలుసు. సన్నని సెలయేరులాగా కవితా గానం చేయడం తెలుసు ఇదిగో ఇక్కడే ఆ కవీశ్వరునిలోని నూతన భావావిష్కరణ ఉదయించింది.

'షేక్ ఖాజావలి' గారు గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, కండ్రిక గ్రామంలో 1954 వ సంవత్సరంలో జూన్ 8వ తేదీన, తన తండ్రి అయిన శ్రీ షేక్ మేరా సాహెబ్, తల్లి హుసన్ బి లకు మొదటి మగ సంతానంగా జన్మించారు.

ఖాజావలి ప్రాథమిక విద్య అంతా స్వగ్రామం అయిన కండ్రిగలోని ఆర్.సి.ఎం. పాఠశాలలో జరిగింది. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు గుంటూరు జిల్లాలోని నుదురుపాడులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు.

1971 లో నరసరావుపేటలోని బరంపేటలో ఉన్న శ్రీరామ కృష్ణ ఓరియంటల్ కళాశాలలో భాషాప్రవీణ తెలుగులో చేరారు.

ఖాజావలి గారికి 1979లో ఖాతుంబితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. ఈయన సుమారుగా 30 సం॥రాలు తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ తెలుగు సాహిత్యం పట్ల అభిమానంతో కవితలు, వ్యాసాలు, పద్యాలు రాసేవారు. ఈయన చేసిన సాహిత్య కృషికిగాను పురస్కారాలు, సన్మానాలు చేయడం జరిగింది.

**అందులో కొన్ని :**

1) 2015లో తెలుగు భాషా దినోత్సవం గుంటూరు వారు పురస్కారం.

2) 2016లో గుంటూరు రచయితల సంఘంచే గిడుగు రామమూర్తి పురస్కారం.

3) 2019లో నవ్యాంధ్ర రచయితల సంఘం విజయవాడ వారిచే సన్మానం.

తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ అత్యంత ప్రజాదరణ పొందిన, విశిష్టమైన ప్రక్రియ. పండితులకే కాకుండా సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో నీతిని, భక్తిని, లోకజ్ఞానాన్ని బోధించే అద్భుతమైన సాధనంగా ఇది వికసించింది. శతక సాహిత్యానికి కొన్ని ప్రాథమిక నియమాలు ఉన్నాయి. సాధారణంగా 100 నుండి 108 పద్యాలు ఉంటాయి. మకుట నియమం కలిగి ఉండటం మరొక ప్రధాన లక్షణం. ప్రతి పద్యం చివర ఒకే పదం లేదా పదబంధం ఉంటుంది. ఇది ఆ శతకానికి ఒక కిరీటం వంటిది. ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్ర భావాన్ని కలిగి ఉంటుంది, ఒక పద్యానికి మరొక పద్యానికి కథా సంబంధం ఉండదు.

తెలుగులో శతక ప్రక్రియ పన్నెండో శతాబ్దంలో శివకవుల కాలంలో ఆవిర్భవించింది. పాల్కురికి సోమనాథుడు వ్రాసిన 'వృషాధిప శతకం' తెలుగులో వెలువడిన తొలి సంపూర్ణ శతకంగా పరిగణించబడుతుంది. మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన 'శివతత్త్వసారము'లో శతక లక్షణాలు ఉన్నప్పటికీ, వృషాధిప శతకమే పూర్తిస్థాయి శతక లక్షణాలతో వెలువడింది. 1242లో ఈయన వ్రాసిన 'సర్వేశ్వర శతకం' భక్తి శతకాల్లో ఆద్యమైనది.

సామాజిక మార్పు కోసం, నైతిక విలువల బోధన కోసం నీతి శతకాలు వికసించాయి. బద్దెన (13వ శతాబ్దం) రచించిన సుమతీ శతకం తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందింది. ఇది లోకరీతిని, వ్యవహార జ్ఞానాన్ని సరళంగా బోధిస్తుంది. 17వ శతాబ్దానికి చెందిన యోగి వేమన 'వేమన శతకం' ఆటవెలది పద్యాలతో సమాజంలోని మూఢనమ్మకాలను, అవినీతిని ఎండగట్టారు. ఈ శతకం సామాన్యుల నాలుకలపై నిరంతరం నానుతుంటుంది.

కాలక్రమేణా శతక సాహిత్యం వివిధ శాఖలుగా విస్తరించింది. కంచెర్ల గోపన్న (రామదాసు) వ్రాసిన 'దాశరథీ శతకం', ధూర్జటి రచించిన 'శ్రీకాళహస్తీశ్వర శతకం' భక్తి రసానికి పరాకాష్టగా నిలిచాయి. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా శతకకర్తలు విభిన్న అంశాలపై వేలాది శతకాలు రచించారు. నేటికీ తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ నిరంతర స్రవంతిలా సాగుతూనే ఉంది, ఇది తెలుగు సంస్కృతికి మరియు భాషా వికాసానికి ఒక గట్టి పునాదిగా నిలుస్తోంది.

దీనిలో రాసిన రెండు శతకాలు 'శ్రీ విశ్వనాథ' శతకం, 'సూక్తి సుధ' నీతి శతకంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను, రచనా శైలిని విశ్లేషించడం జరిగింది.

1. 'శ్రీ విశ్వనాథ' శతకం
2. 'సూక్తి సుధ' నీతి శతకం

## 2. 'శ్రీ విశ్వనాథ' శతకం విశ్లేషణ :

షేక్ ఖాజావలీ గారు రచించిన 'శ్రీవిశ్వనాథ శతకము' తెలుగు సాహిత్యంలోని శతక ప్రక్రియలో ఒక విశిష్టమైన మణిహారంగా నిలుస్తుంది. సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపుతూ, మానవతా విలువలను ప్రబోధించే ఈ శతకంపై లోతైన సమీక్ష ఇక్కడ ఉంది.

### 2.1 మకుటం – సందేశం :

ఈ శతకానికి "విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ" అనే మకుటాన్ని కవి ఎంచుకున్నారు. ఈ మకుటం ద్వారా కవి కేవలం భక్తిని మాత్రమే కాకుండా, 'విశ్వశాంతి'ని మరియు లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తున్నారని స్పష్టమవుతుంది.

"శతకానికి శతవందనములు. ఆంధ్రభాషా సాహిత్య చరిత్రలో మరొక శతకం వెలుగుజూసింది. తెలుగు సారస్వత సరస్వతీ మణిహారంలో మరొక మణి ప్రకాశించింది. తెలుగు సాహిత్య రచనావిధానంలో శతక ప్రక్రియ ఒక విశిష్ట ప్రయోగం. తెలుగు భాషలో వేలాది శతకములు ప్రకాశిస్తున్నా మరొక మణిరాజం వెలుగు లీనింది అనుటలో ఏ మాత్రం సందేహం లేదు. 'విశ్వమెల్లను బ్రోచెడి విశ్వనాథ' అనే మకుటములోనే కవి హృదయం ఏమి కాంక్షిస్తున్నదో అర్థము అవుతున్నది. 'విశ్వశాంతి'ని కోరుతున్న 'ఖాజావలీ'గారు నిజంగా ధన్యుడయ్యారు." లోకాన్ని రక్షించే ఆ పరమశివుడిని వేడుకుంటూనే, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం ఇందులో కనిపిస్తుంది.

**2.3 వస్తు వైవిధ్యం :**

ఈ శతకంలో కవి కేవలం ఆధ్యాత్మిక విషయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని విభిన్న అంశాలను స్పృశించారు.

**2.3.1 నైతిక విలువలు:**

నేటి సమాజంలో నశిస్తున్న విలువలకు ఈ శతకం ఒక వెలుగు దర్పణం వంటిదని విమర్శకులు అభిప్రాయ పడ్డారు. 'రూపం కన్నా గుణం మిన్న' అని చెప్తూ అతివలకు హితబోధ చేయడం, మాట విలువను కాపాడాలని చెప్పడం వంటివి ప్రశంసనీయం.

"తే॥ కీడు చేసిన వారికి కీడు చేయ
కుండ మేజ్జేయు పురుషోత్తముడెపుడును
గంధ తరువు గొడ్డలికిని గంధమీదె
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, తనకు కీడు (అపకారం) చేసిన వారికి కూడా తిరిగి కీడు చేయకుండా, మేలు చేసేవాడే పురుషోత్తముడు. గొడ్డలి తనను నరుకుతున్నా సరే, ఆ గొడ్డలికి కూడా సువాసనను ఇచ్చే గంధపు చెట్టు వంటివాడు ఉత్తమ మానవుడు.

"తే॥ కత్తిరించగోళ్ళు పెరుగు
క్రమముగాను వేళ్ళు దీయుట న్యాయమా!
వెర్రిగాని మొక్క పెరికిన మానులు దక్కగలవె
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, గోళ్ళను కత్తిరిస్తే అవి మళ్ళీ పెరుగుతాయి, కానీ వేళ్ళను తీసేయడం న్యాయం కాదు. మొక్కను వేళ్ళతో సహా పెకిలించడం వెర్రితనం; అలా చేస్తే అది పెద్ద వృక్షంగా ఎలా ఎదుగుతుంది? (అంటే చిన్న తప్పులను సరిదిద్దాలి కానీ, మూలాలను నాశనం చేయకూడదు).

"తే॥ మనిషి పాదాల క్రిందను మట్టి మణిగి
మరణ మొందిన మనిషిపై మట్టి
మెరయు తోడు రావులే కోట?లను తుదవరకును
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, మనిషి బ్రతికున్నప్పుడు తన పాదాల కింద మట్టిని తొక్కుతాడు, కానీ అదే మనిషి మరణించిన తర్వాత ఆ మట్టి మనిషిపై చేరుతుంది. మనం సంపాదించిన కోట్లాది రూపాయలు ఏవీ చివరి వరకు మనతో తోడు రావు.

"తే॥ మాటొకటిజాల్ను( కృంగగ
మనుజ జన్మ నెత్తురును జింద పనిలేదు నిక్కముగను
మాట దూలియాలోచింప మనుజుడౌనె
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, మనిషిని మానసికంగా కృంగదీయడానికి ఒక్క కఠినమైన మాట చాలు, దానికి రక్తం చిందించాల్సిన అవసరం లేదు. మాట్లాడే ముందు ఆలోచించకుండా నోరు పారేసుకునేవాడు అసలైన మనిషి అనిపించుకోడు.

**2.3.2 సమకాలీన సమస్యలు :**

రాజకీయ నాయకుల ద్వంద్వ నీతి, న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సడలడం, మరియు కరోనా కాలంలో ప్రజలు పడ్డ కష్టాలను కూడా కవి తన పద్యాలలో వివరించారు.

"తే॥ మనసు నిలకడ లేనట్టి మనిషియిలను
ఏపనులలోను యేకాగ్రతింతలేక
తెగిన గాలిపటంబులా దిరుగు చుండు
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ.."

అంటూ, మనసు నిలకడ లేని మనిషి ఏ పనిలోనూ ఏకాగ్రత చూపలేడు. అటువంటి వ్యక్తి దారం తెగిన గాలిపటంలా దిక్కుతోచక అటు ఇటు తిరుగుతుంటాడు.

"తే॥ పరుల పొట్టల గొట్టెడి భావముండి
పరుల యాస్తుల నింపుగ్గ(బట్టు కొనెడి
కుత్సితమదితో జనులను కొల్లగొట్టె
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, ఇతరుల పొట్ట కొట్టాలనే ఆలోచనతో, వారి ఆస్తులను అన్యాయంగా సంపాదించాలనే కుత్సిత బుద్ధితో జనులను దోచుకునే వ్యక్తుల గురించి ఈ పద్యం వివరిస్తోంది.

"తే॥ నిరతముశ్రమించి ఘర్మము
నేల(జిలికి మర్మఖర్మలెరుగనట్టి మనిషి
ధరను ఆపదలనున్న వారల నాదు కొనును
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ.."

అంటూ, ఎటువంటి మోసపూరితమైన ఆలోచనలు లేకుండా, నిరంతరం శ్రమిస్తూ చెమటను చిందించే మనిషి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ఎప్పుడూ ముందుంటాడు.

"తే॥ తద్దినపు కూడు కాకులు తన్నుకెళ్ళు
నీవు వాడిన వస్తువు లెవరిపాలు
దానధర్మపుణ్య ఫలమె తనకుదక్కు
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, మనిషి మరణించిన తర్వాత పెట్టే ఆహారాన్ని కాకులు తింటాయి, అతను వాడిన వస్తువులు ఇతరుల పాలవుతాయి. కేవలం అతను చేసిన దానధర్మాలు మరియు పుణ్య ఫలం మాత్రమే అతనికి శాశ్వతంగా దక్కుతాయి.

**2.3.3 మానవ స్వభావం :**

మనిషిలోని అహంకారం, పరనింద, దురాశ వంటి దుర్గుణాలను ఎండగడుతూనే, ఓర్పు, పట్టుదల, దానధర్మాలు వంటి సుగుణాల విశిష్టతను వివరించారు.

"తే॥ బొమ్మలనుబెట్టి మాలేసి పూజసలుప
బాధలన్ని తొలంగియ్యుఁ బరగ గలమె
అన్నమెట్టియా కలిదీర్చ అమరులవును
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, బొమ్మలకు (విగ్రహాలకు) పూలమాలలు వేసి పూజలు చేసినంత మాత్రాన మన బాధలన్నీ తొలగిపోవు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టి వారి ఆకలి తీర్చినప్పుడే ఆ పుణ్యం మనల్ని అమరులను చేస్తుంది. లోకాన్ని రక్షించే విశ్వనాథుడే ఈ సత్యాన్ని తెలుపుతున్నాడు.

"తే॥ పరుల నిందించి దూషించి బరగువాడు
గెలవలేడు జీవితమున గింజుకున్న
ప్రజల మేల్గోరి చనినంత బడయుకీర్తి
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, ఇతరులను నిందిస్తూ, దూషిస్తూ కాలం గడిపేవాడు తన జీవితంలో ఎంతగా కొట్టుకున్నా విజయం సాధించలేడు. ఎవరైతే ప్రజల మేలు కోరి జీవిస్తారో, వారు మరణించినా కూడా గొప్ప కీర్తిని పొందుతారు. సర్వ ప్రపంచాన్ని కాపాడేవాడు ఆ విశ్వనాథుడే.

"తే॥ పురిటి బాధ భరించమ్మ పుణ్యవతియె
సీతకోకిలా గొంగళి హేతువేమి
మట్టితో పోరి విత్తనం చెట్టులాయె
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, తల్లి పురిటి నొప్పులను భరించి బిడ్డకు జన్మనిస్తుంది కాబట్టే ఆమె పుణ్యవతి అయింది. అలాగే ఒక విత్తనం మట్టితో పోరాటం చేస్తేనే అది వృక్షంగా మారుతుంది. కష్టం ఎదురైనప్పుడే గొప్ప ఫలితం దక్కుతుందని దీని అర్థం. ఆ విశ్వనాథుడే ఈ సృష్టికి మూలం.

"తే॥ తిరిగారాదొక బాల్యమే తరచిచూడ
వచ్చిన పిదప పోనిది వయసుగాదె
హద్దు లన్నవి మనసుకు అంతులేదు
విశ్వ మెల్లను బ్రోచెడి విశ్వనాథ."

అంటూ, ఒక్కసారి గడచిపోయిన బాల్యం తిరిగి రాదు, అలాగే వయసు పైబడిన తర్వాత ముసలితనం పోదు. అయితే మనిషి మనసుకు మాత్రం ఎటువంటి హద్దులు, పరిమితులు లేవు; అది అనంతమైనది. లోకాన్ని రక్షించే విశ్వనాథుడే మనల్ని నడిపిస్తాడు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆధునిక తెలుగు కథ మనో విశ్లేషణ - బి. విజయ్ కుమార్
2) శ్రీ విశ్వనాథ శతకం - షేక్ ఖాజావలి
3) కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య

★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# పల్లె జీవితాలకు అద్దం పట్టిన కథ - ఆక్రోశం



అవ్వొల్ల అనిల్ కుమార్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్,
ఈమెయిల్ : 24htph16@uohyd.ac.in, ఫోన్. నెం. : 8142630091

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాస సంగ్రహం :**

'కథ' అను ధాతువుకు సంభాషించు, చెప్పుట అనే అర్ధములున్నవి (సం. తె. నిఘంటువు, 1943). నేటి కథానిక ఆంగ్లంలోని "షార్ట్ స్టోరీ" అను పదమునకు సమానార్థకంగా వాడబడుచున్నది. నేటి వ్యవహారంలో కథ, కథానిక పర్యాయపదాలుగా వ్యాప్తియందున్నవి. (తెలుగు సాహిత్య సమీక్ష, ద్వితీయ సంపుటి, పు.సం. 830). తెలుగు సాహిత్యంలో కొత్త భావజాలాన్ని, కొత్త ఆలోచనలను, కొత్త అనుభూతులను ఆవిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నది కథా ప్రక్రియ. కాలం మారుతున్నకొద్దీ, మనిషి జీవితం కూడా సంక్లిష్టమవుతుంది. ఆ సంక్లిష్టతను అక్షరాల్లో బంధించి, సమాజపు అంతరంగాన్ని కథగా మలచగలిగిన రచయితలే నిజమైన సాహితీవేత్తలుగా నిలుస్తారు. అలాంటి సమకాలీన రచయితల్లో నిజమైన సాహితీవేత్తలుగా నిలుస్తారు. అలాంటి సమకాలీన రచయితల్లో ఆడెపు లక్ష్మీపతి గారు ఒక ప్రత్యేక కథా స్వరంగ గుర్తింపు పొందారు. వృత్తిరీత్యా ఆయన ఒక రసాయనిక ఎరువుల కంపెనీలో సూపర్‌వైజర్, అయినా ప్రవృత్తి రీత్యా సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసే వ్యక్తి. సమకాలీన సమాజంలో సంక్షుభిత జీవిత శకలాలను కథలుగా మార్చే రచయితగా ఆయనకు విశిష్ట స్థానం ఉంది. ఈ కథ ప్రక్రియ ద్వారా ఎందరో రచయితలు ఎన్నో సామాజిక సమస్యలను చర్చించారు. అదేవిధంగా ఆడెపు లక్ష్మీపతి గారు కూడా అనేక సామాజిక సమస్యలను చర్చించి సమాజంలో నైతిక వర్తన కోసం ప్రయత్నించారు. వీరు రైతుల కన్నీళ్లు, కష్టాలు, వారు ఎదుర్కొనే అనేక సంకట పరిస్థితులను, లోతైన పరిశీలనతో ఎన్నో కథలు రాశారు. అందులో "ఆక్రోశం" అనే కథను ఈ వ్యాసంలో పరిశీలనగా స్వీకరించారు.

**కీలక పదాలు :**

పల్లె జీవితం, రైతుల జీవిత విధానం, పల్లె సంప్రదాయాలు, దొరల పీడిత వ్యవస్థ, విప్లవ ప్రబోధం, వర్గ సంఘర్షణ, స్త్రీ-పురుష సంబంధాలు, దినసరి కూలీలు, తొవ్వలు బంద్.

**ప్రవేశిక :**

భారతదేశంలో నూటికి 70 శాతం మంది వ్యవసాయం రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. అందుకే భారతదేశాన్ని వ్యవసాయ ఆధారిత దేశం అంటారు. రైతు పదివేళ్ళు నోట్లోకి వెళ్తాయి. అలాంటి అన్నం పండించే అన్నదాతను నిత్యం ఆకలి దప్పికలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇది పాడి వ్యవసాయ రైతులలో అయితే అత్యంత ఘోరం. తన జీవాల ఆకలి దప్పికలు తీర్చటం ముఖ్యం, తన ఆకలి దప్పికలు ఎప్పుడు వాయిదాలే. ఇంత శారీరకంగా శ్రమ చేసినా కూడా మానసికంగా కూడా హింసించే పట్వారీలు, దొరలు, భూస్వాములు, ఊరి పెద్దలతో వ్యవస్థీకృతమైన, దోపిడి స్వభావంతో కూడిన సమాజ వ్యవస్థ మనది. ప్రభుత్వం రైతులపై కురిపించే వాగ్దానాల వర్షం ఎండమావుల తీరే. "అన్నదాత బలమే అందరికీ బలం". "అన్నదాత కంట నీరు అందరికీ అరిష్టం". వంటి చిలుక పలుకులు ఎన్నో పలికి ఏవో కొన్ని వాగ్దానాలు ఇచ్చి వాళ్లను ఉబ్బితబ్బు చేసి ఓట్లు మాత్రం దండిగా గుంజుకుంటారు. చివరికి గెలిచాక చేతులెత్తేస్తారు. ప్రజలేమో "అన్నదాత", "రైతే రాజు", "జై కిసాన్" రైతు దేశానికి వెన్నుముక వంటి బిరుదులతో ప్రశంసిస్తారు. అనేక విధాలుగా రైతును ప్రభుత్వం, ప్రజలు ఆహా!ఓహో! అని పొగిడేటోళ్ళే తప్ప అతని స్థితిని ఏమాత్రం పట్టించుకోని వ్యవస్థ మనది. ఇక్కడ రైతులకు పెట్టుబడులే తప్ప రాబడులు ఉండవు. గ్రామంలో కనీసం సరైన సదుపాయాలు (విద్యుత్తు, రోడ్లు) ఉండవు. పంట వేయడానికి మంచి విత్తనాలు ఉండవు. మంచి విత్తనం ఉన్నా దానికి పురుగు సోకితే సరైన మందులూ ఉండవు. ఆ పురుగు మందులకు కూడా చులకనైపోయాడేమో రైతు. పురుగుల పానం తీయట్లేదు రైతులు ప్రాణమే పోతుంది ప్రతిసారి. మందులు మాకులు కొట్టి, కలుపు తీసి, కంటికి రెప్పలా చూసుకుని, పంట ఏపుగా పెరిగితే, చెప్పకుండా వచ్చి సర్వనాశనం చేసి వెళ్తుంటాయి ప్రకృతి వైపరీత్యాలు. వాటి ద్వారా పోయిందిపోను మిగిలిందానిని మార్కెట్‌కు తెచ్చేందుకు సరైన మార్గాలు ఉండవు, తెచ్చిన ధాన్యానికి మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధరలు ఉండవు. వ్యాపారులు, దళారుల మోసాలు. అసలుకు కాదు మిత్తికే ఆలి మెడలో పుస్తే కుదువ. అప్పులు తీరవు, బతుకులు మారవు. ఇలాంటి సమ్యలను, సామాజిక స్పృహ కలిగిన కొందరు కవులు, రచయితలు, సాహిత్యకారులు తమ కలాలకు పదును పెడుతున్నారు. రైతుల సమస్యలను వాటికి గల కారణాలను లోతుగా పరిశీలిస్తూ వారి వారి రచనల్లో రైతుల జీవనాన్ని, జీవిత విధానాన్ని పలుకోణాల్లో ఆవిష్కరిస్తున్నారు. రైతుల అభివృద్ధిని కాంక్షిస్తూ రచనలు చేస్తున్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఆ రచనలు రైతుల గురించిన పోరాటంలో ఫలించాయి. ఇదే కోణంలో రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసిన కథ ఆక్రోశం.

**కవి పరిచయం :**

వస్తు గాఢత, శిల్పనైపుణ్యం, మేధోస్పర్శ, మేలిమి కలయికతో కథలు రాసే రచయిత (మరుపురాని ప్రయాణ కథలు, పు. సం. 83) ఆడెపు లక్ష్మీపతి 1955 మార్చి 5న కరీంనగర్ జిల్లాలో ఒక చేనేత కుటుంబంలో జన్మించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో 30 సంవత్సరాలు ఉద్యోగం చేసి, స్వచ్ఛంద పదవి విరమణ పొందారు. మొదటి కథ 'ఆదర్శం'. 1972లో అచ్చయింది. ఇప్పటివరకు 25 కథలకు పైగా రాశారు. "నాలుగు దృశ్యాలు" "త్రిభుజపు నాలుగో కోణం" పేరుతో రెండు కథా సంపుటాలను వెలువరించారు. వీటిలో కొన్ని కథలు ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి. డజనుకు పైగా కథలు ప్రతిష్టాత్మక సంకలనాల్లో చోటుచేసుకున్నాయి. కవిత్వం, కథ, నవలలు, మొదలైన ప్రక్రియలపై మరియు కొత్త రచన రీతులు, వాదాలు, తాత్విక ధోరణుల విశ్లేషణ, అనేకానేక విమర్శ వ్యాసలు వీటన్నిటి సమ్మేళనంగానే "దిక్చక్రం" అనే సాహిత్య వ్యాస సంపుటిని ప్రచురించారు. రాజీవ్ విద్యామిషన్, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురణల విభాగం, డైమండ్ పాకెట్ బుక్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రాష్ట్ర ఎన్నికల కమీషన్, మొదలైన సంస్థలకు ఇంగ్లీష్, హిందీ

భాషల నుండి తెలుగులోకి అనేక అనువాదాలు చేశారు. తెలుగు అకాడమీ కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజకీయ ప్రసంగాల ప్రధాన భాగం, తెలంగాణలో ముస్లింల స్థితిగతులపై సుధీర్ కమీషన్ నివేదిక అధ్యయనాలను తెలుగులోనికి అనువదించారు.

**విషయ వివరణ :**

ప్రకృతిలో మార్పులు వస్తున్నాయి, సమాజంలో మార్పులు వస్తున్నాయి, కానీ రైతు జీవితంలో, జీవన విధానంలో మాత్రం మార్పులు రావడం లేదు. వాళ్ల జీవితం సమస్యల వలయంలో చిక్కుకొని తండ్లాడుతున్న చేపపిల్ల లాగా ఉంది. రైతులు అనుభవిస్తున్న కష్టనష్టాలను, కన్నీళ్లను, అనేక ఆటుపోట్లను, పల్లె జీవనంలో రైతుల జీవితాలలో పొద్దు పొడిచి, పొద్దు మూకుతున్న పరిసరాల మార్పులను కథ ఆధారంగా పరిశీలిద్దాం.

**ఆక్రోశం కథ సంగ్రహం :**

సెలయేటి గలగలలు, పిల్ల తెమ్మెరలు, బసవన్న మువ్వల నాదాలు, శారద కాండ్ర బుడిగే రాగాలు, అందమైన పల్లెపడుచులు. ఇది పల్ల స్వరూపం. ఇంత అందమైన పల్లెలో, తండ్రి తాతల రాగాలు, అందమైన పల్లెపడుచులు ఇది పల్లె స్వరూపం. ఇంత అందమైన పల్లెలో, తండ్రి తాతల నుంచి వారసత్వంగా వస్తున్న రెండు ఎకరాల భూమిని సాగుచేయడం, కొంత పాడి వ్యవసాయం ఇదే రైతు జీవితం. ఆ రైతు పేరు వెంకటి, అతని భార్య పార్వతమ్మ. వెంకటి శారీరకంగా శ్రమచేస్తూ అంతకు మించిన వేదన భరిస్తూ కాలం గడుపుతుంటారు. అతడే కథానాయకుడు. శారదకాండ్రు ఆశ్రిత కులాలు వారి బతుకుదెరువు కోసం ఊరూరు అడుక్కుంటూ, కథానాయకుడి గ్రామానికి చేరుకుంటారు. వాళ్లతో మంచిచెడ్డలు ముచ్చటించిన వెంకటికి వాళ్ల జీవితాలు కూడ ఏం సక్కగా లేవని అడుక్కుంటేనే కలో, గంజో దొరుకుతుందని కథానాయకుడకి అర్థం అవుతుంది. కానీ వాళ్ల జీవితమే రైతు జీవితాలకంటే ఒక్కింత మేలైనదిగా వెంకటికి తోస్తుంది. వాళ్లకు లేకుంటే అడిగి పెట్టించుకుని తినే యోగ్యత ఉంది. కానీ రైతుకు లేకపోయినా, పేగులు మలమల మాడినా ఎవరిని అడగడు. ఆ శారద కాండ్రు అడిగిన అడ్డెడన్ని గింజలు ఇవ్వడానికి కూడా ఆ యేడు ఎక్కువ గింజలు రాలవు. పురుగు సోకి ఎన్ని మందులు కొట్టినా పురుగు సావక చేను చచ్చిపోతుంది. ఈ సమస్య వలన రెండు ఎకరాలకు రెడుపుట్ల గింజలు కూడా రాలలేదు. ఈ సంకట స్థితి శారదకాండ్ల పాత్ర పోశమల్లుకు అవగతం అవుతుంది. కథానాయకుడి శ్రమ, రికాము దొరకని పనులు, వ్యవసాయ సంక్షోభాలను గుర్తు చేసుకుంటూ వెంకటి కొడుకు జ్ఞాపకాన్ని గుర్తు చేస్తాడు పోచమల్లు. ఒక్కసారిగా కథానాయకుడు శూన్యంలోకి వెళ్లిపోతాడు. అతనికి తన కొడుకు రూపొ ఒక్కసారిగా మదిలో మెదులుతుంది. తన కొడుకు కూడా తనలాగే పొడుగరి, ఎండకు, వానకు, చలికి కాయకష్టం చేసిన వాడు కనుక శరీరం కండలు తిరిగి ఉంటుంది. చదువులోనూ, ఆటపాటల్లోనూ, తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండడంలోనూ, అన్నింటిలో సత్తయ్యది మొదటి స్థానమే. వేరుశనగ పంటలప్పుడు ముసిముసి చీకట్లలో తిరుగాడే అడవి పందులను, ఎలుగుబండ్లను వడిసెల విసిరి తరిమేవాడు. సత్తయ్య తమ గ్రామంలో అందరికీ తలలో నాలుక లాగా ఉండేవాడు. యువకులను కూడగట్టి సంఘం పెట్టాడు. ఊరి సమస్యల గురించి రైతుల సమస్యల గురించి వీలు దొరికినప్పుడల్లా స్నేహితులతో చర్చించేవాడు. నీటి పంపకం, శిస్తులెక్క, వ్యవసాయ సమస్యలు, రోడ్ల మరమ్మత్తులు, విద్యుత్ ఆటంకాలు, ఇలా ఎన్నో అంశాల మీద ఊరి వాళ్లకు సలహా ఇస్తూ పై అధికారులకు విన్నపాలు పంపించేవాడు. తన కొడుకుని ఊరందరి నోళ్ళల్లో మంచోడు అని నానుతున్నందుకు, కథానాయకుడు మనస్సులో చాలా సంతోషిస్తాడు. బద్దెన గారు అన్నట్టు "ఏ తండ్రికైనా పుత్రుడు పుట్టినప్పుడు కాదు పెరిగి పెద్దవాడు అవుతుంటే అతని గురించి నలుగురు కనుగొని పొగిడినప్పుడే కదా ఆ తండ్రికి నిజమైన పుత్రానందం". ఒకరోజు ఆ ఊరి సర్పంచ్ కథా నాయకుడితో నీ కొడుకు నాలుగు అరాలు నేర్చుకోగానే ఎగిరెగిరి పడుతుండు. సంఘం పెట్టి మాతో కయ్యాలు

పెట్టవద్దని చెప్పు. ఎర్రివేషాలేసి వాడిని పాడు కావొద్దు అని చెప్పు... అంటూ సర్పంచ్ హెచ్చరించగానే కథానాయకుడు కొద్దిగా భయపడతాడు. మన మానాన మనం బతకాలి బిడ్డ... మనం గరీబోళ్లం... దొరలతోట పేచీలు వద్దు కొడుకా అంటూ కొడుకును వారించే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు సత్తయ్య మనం న్యాయంకోసం అడుగుతున్నాం. మనకెందుకు భయం? అంటాడు. కొడుకు చెప్పిన మాటలు సబబుగానే అనిపించినప్పటికీ కథానాయకుడి మనసులో కొద్దిగా భయం గూడు కట్టుకుంది. అంతలో సుశీల తండ్రి రామస్వామి అటుగా వచ్చాడు. సుశీల సత్తయ్యను ఎంతగానో ప్రేమించింది. సత్తయ్యకు కూడ సుశీల అంటే ఎంతో ఇష్టం. కలిసి తిరిగారు. కలలు కన్నారు. ఇద్దరు కలిసి ఒక్కటవ్వటం కోసం వేచివేచి చూశారు. కానీ విధి వారిద్దరిని శాశ్వతమైన ఎడబాటుకు గురిచేసింది. రామస్వామితో ముచ్చటించిన వెంకటికి వరంగల్ మార్కెట్లో వడ్లకు, మిరపకాయలకు, మొక్కజొన్నలకు సరైన గిట్టుబాటు ధర లేవని, వాళ్ళ ఉమ్మడి కుటుంబం కూడా విడిపోవడానికి సిద్ధంగా ఉన్నదని, అంతిమంగా అందరూ కలసి ఉన్నప్పుడే సుశీల పెళ్లి చేసి అన్నదమ్ములతో పంపకాలు జరుపుకొని విడిపోదామని చూస్తున్నాడని అర్థమవుతుంది. తన ఇంటి కోడలు కావలసిన పిల్ల పరాయిసొత్తు కాబోతుందనీ నిరాశ-నిస్పృహలతో కూడిన దుఃఖం కంట్లో నుంచి మెల్లగా జారుతుంది. కొన్ని నెలల తర్వాత వరి కోత సమయంలో దినసరి కూలీలను దొరలు పాత రేట్లకే కూలికి రమ్మంటారు. ఆ కూలీలు పాత రేట్లు తమకు గిట్టుబాటు కాదని కూలికి రామని తెగేసి చెబుతారు. సత్తయ్య మిగతా సంఘం యువకులు కూలి జనానికి అండగా నిలబడతారు. దీనికి కోపించిన దొరతనం గల ప్రముఖులు ప్రతీకారంగా ఎప్పటినుండో తాత ముత్తాతల కాలం నుండ చలామణిలో ఉన్న బాటలను మూసేసి, మా పొలాల్లోకి మీ బండ్లు రాకూడదు, మీరు మా పొలాలను అంటడానికి వీల్లేదు, మీ బండ్లను ఎటు నుంచి అయినా పోనిచ్చుకోండి అంటూ విచిత్రమైన పేచీ లేవనెత్తుతారు. దీంతో ఆ గ్రామస్తులందరూ ఇదేం న్యాయం అంటూ అడగగా సంఘం యువకులు తిరగబడతారు. ఆ ఘర్షణలో ఆ రోజే కథానాయకుడు తన కొడుకుని ఆఖరిసారి చూడడం. పంటకుప్పల కావలి పడుకున్న తండ్రి కొడుకులను మఫ్టీలో ఉన్న పోలీసులు ఇక్కడ సత్తయ్య అంటే ఎవడు అని అడగ్గానే, ఉలిక్కిపడి లేస్తాడు వెంకటి. మనసులో బుగులు, భయం మెల్లమెల్లగా శరీరం అంతటాపాకి అంతటి చలిలో కూడా చెమటలు పట్టుతుంటాయి. ఆ పోలీసులు సత్తయ్యను సర్కిల్ సాబ్ తీసుకురమ్మన్నాడని జీపులో ఎక్కించుకొని పోగా, మరునాడే వెంకటి ఆ ఊరు స్కూల్ టీచర్ని తోలుకొని పోలీస్ స్టేషన్కి వెళ్లి అడగగా సత్తయ్యను వరంగల్కు తీసుకెళ్లరంటే ఆగమాగం మీద అక్కడికురికి అడుగుతారు. అక్కడ వారు విచారణ కోసం పిలిచి వెంటనే వదిలేసాం అంటారు. కానీ సత్తయ్య జాడ దొరకదు. చివరికి శవమై కాలువలో కనిపిస్తే పోలికలన్నీ తన కొడుకువేనని గుర్తుపట్టి గుండెలు పడిలేలా విలపించాడు. సత్తయ్య మరణం మీద విచారణ జరిపిస్తే దానికి పోలీసులు పాడిన సరికొత్త రాగం "మిస్సింగ్‌శైలి" అని, మానవ హక్కుల సంఘాలకు చెందిన ప్రజాస్వామ్య వాదులు, మేధావులు పాత్రికేయులు.. జోక్యం చేసుకొని వాస్తవాలను వెతికి తీయాలని దోషులను కఠినంగా శిక్షించాలని పత్రికాముఖంగా పేర్కొన్నారు. ఎవరెన్ని విధాల న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుతం వెంకటి బాధ గుండెల్లో నుంచి కన్నుల్లోకి ఎగజిమ్ముకొచ్చి చంటి పిల్లాడిలా వెక్కివెక్కి ఏడవడానికి నిర్ణయించుకున్నాడు. బోర్లా పడుకొని గొంగడిలో ముఖం దాచుకున్నాడు. జ్ఞాపకాలన్నీ జతగుడి ఒకదాని వెంట ఒకటి గుర్తుకువస్తూ... మళ్లీ మళ్లీ ఏడిపిస్తూనే ఉంటాయి. అంతకుముందు నుండి కూడా ఈ మానసిక వేదనను మోస్తున్నందుకు ఏమో ఆరోజు దుఃఖం పొర్లిపొర్లి వస్తు ఉంటుంది. అంతలో దబేల్‌మని శబ్దం తరచిచూస్తే ఇంకేముంది భార్య ఎప్పుడో, పొద్దున వండి మూటగట్టి పెట్టిన సద్ది కుక్క కిందేసి తింటూ ఉంటుంది. కుక్క అన్నం పాడు చేసిందన్న కోపం నషాళానికి ఎక్కి, అనాలోచితంగా రోకలిబండను దానిపైకి విసురుతాడు. అది అచేతనంగా పడి ఉంటుంది. అప్పుడు కథానాయకుడు ఏదో ఉపశమనం పొందినట్లుగా భావించి తన కోపాన్ని శాంతించుకొని తేలికగా ఒక బీడీ దమ్ము లాగుతాడు. అంతటితో కథ ముగుస్తుంది.

**కథ విశ్లేషణ :**

చేతికి అందిన కొడుకు శవంలా పడి ఉంటే కన్న తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుంది. వర్తమాన, భవిష్యత్తులకు గత జ్ఞాపకం తోడవుతూ, ఎంత మానసిక వేదనకు గురిచేస్తుంది. రైతు పడే శారీరక శ్రమతోపాటు మానసికమైన ఆవేదనకు కూడా వారిని నిత్యం ఎలా బాధిస్తుందో రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించారు. వ్యవసాయ రంగంలోని సంక్షోభాన్ని, రైతుల ఆర్థిక స్థితిగతులను, సామాజిక ఆత్మగౌరవాన్ని ఎలా దెబ్బతీస్తుందో కథలో స్పష్టంగా చెప్పబడింది. రచయిత నేటి గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగం ఎదుర్కొంటున్న అనేక క్లిష్టమైన సమస్యలను, వారి జీవన పోరాటాన్ని లోతుగా విశ్లేషించారు. భారతదేశ గ్రామీణ వ్యవసాయ రంగంలో సన్నకారు రైతులే ఎక్కువ. వారి జీవితం మొత్తం పటేల్, పట్వారి మొదలైన ప్రముఖులతో ఘర్షణలతో మొదలై ఘర్షణలతోనే అంతమవుతుందని ఈ కథ స్పష్టం చేస్తుంది. వెంకటి పాత్ర ద్వారా రచయిత నేటి రైతు స్థితిగతులను కళ్ళకు కట్టినట్లు చూపించారు. దొరల దౌర్జన్యాల కారణంగా మానసిక వేదనకు గురికాని సామాన్య రైతు లేడు. రచయిత సమస్యను పలు కోణాల నుంచి విశ్లేషించాడు. కానీ, పరిష్కార మార్గం చూపలేదు. పాఠకుని ఆలోచనలను పదునుపెట్టడానికే వదిలేశాడు.

**సంచార జాతుల సమస్యలు :**

సంచార జాతులకు ఊరురు తిరిగి అడుక్కుంటేనే గంజో, కలో దొరుకుతుంది. లేకుంటే వాళ్లు ఉపాసమే. వారికి ఇండ్లు లేవు. భూములు లేవు. సర్కార్లు మారుతున్నాయి. వాళ్ల కొరకు ఎన్నో కొత్త పథకాలను అమలు చేశామంటారు. అయినా వారి బతుకులు మాత్రం యాడేసిన గొంగడి గాన్నే అన్నట్టుగానే ఉన్నాయి. ఓట్లప్పుడు కూడా వాళ్లని పట్టించుకోరు. వాళ్లలో చాలామందికి ఇప్పటివరకు రేషన్ కార్డులు కూడా లేవు అంటే వాళ్లు సమాజానికి ఎంత దూరంగా విసిరి వేయబడ్డారో అర్థం అవుతుంది. ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం, వారు కనీస అవసరాలను కూడా తీర్చలేని ప్రభుత్వ వైఫల్యాన్ని... సమాజ ఈసడింపును వాస్తవిక కోణంలో చిత్రించారు.

**వెట్టిచాకిరి, బానిసత్వం :**

కథలో వెంకటి పాత్ర గ్రామీణ వ్యక్తుల నిజ జీవితాలకు దర్పణం పట్టినట్లుగా ఉంటుంది. పల్లెలో సర్దుకుపోతూ కష్టపడే సగటు రైతు వెంకటి. గ్రామీణ ప్రాంతంలో అధికశాతం భూమి దొరలు, పటేళ్ళ ఆధీనంలోనే ఉంటుంది. పేద రైతులను బానిసలుగా చూస్తూ, వారి రెక్కల నెత్తురును నిత్యం జలగలా తాగుతారు. వారికి రెక్కల కష్టంతో బతికేవారంటే, వాళ్ల జీవితాలంటే భూకామందలకు వేడుక. అందుకే ఏమాత్రం జంకు లేకుండా వారిని దోచుకోవడానికి ఇష్టపడుతుంటారు. అందుకే "భారతదేశంలో లౌకికవాదం అంటే కుల నిర్మూలనే" అన్న కె. బాలగోపాల్ గారి మాటలు అక్షర సత్యాలు.

**విప్లవ ప్రబోధం :**

సత్తయ్య వెంకటిని ఆ ఊరి సర్పంచ్ కొడుకు గురించి నిలదీసి అడిగినప్పుడు కథానాయకుడు కృంగిపోయాడు. కొద్దిగా భయపడ్డాడు కూడా. ఆ భయంతోనే ఇలా అంటాడు మన మానాన మనం బతకాలి బిడ్డ... మనం గరీబోళ్లం... దొరలతో పేచీలు పెట్టుకోవద్దు. ఆళ్లు గొప్పోళ్లు.. దానికి కొడుకు "దొరలు, దొరతనాలు పోయినాయి. జమీందారులు జమానా మట్టిలో కలిసిపోయింది. దొర వస్తాండు అంటే చెప్పులు పట్టుకుని నిలబడే కాలం కాదు ఇది. ఇది ప్రజల రాజ్యం. ఒకడు మరొకడికి బానిస కాదు. అందరికీ సమన హక్కులు ఉన్నాయి. పెద్ద మనుషులంతా ఊరిని దోసుకుతింటుంటే చూసుకుంటూ ఊకోవాలనా? గ్రామీణ క్రాంతి పథకం పేరిట మంజూరైన నిధులను ఎమ్మెల్యే, అతని బామ్మర్ది కలిసి స్వాహ చేశాడు. రోడ్లు వేయించినట్టు దొంత కాంట్రాక్ట బిల్లులు చూపెడుతున్నారు. రోడ్డు కోసం శ్రమదానం చేసింది ఊర్లో అందరం కాదా? మరి సర్కారు సొమ్ముని వాడు ఎలా మెక్కుతాడు? రక్షిత మంచినీటి కోసం వసూలైన చందాలు మాయమైనవి నాసిరకం బోరింగులు చిలుంపట్టి ఊడిపోతున్నాయి. ఇదంతా

మోసం అని నిలదీస్తున్నాం. పై అధికారులకు, కలెక్టర్లకు ఫిర్యాదులు రాస్తున్నాము. మనం న్యాయం కోసం అడుగుతున్నాము. మనకెందుకు భయం" అంటూ సత్తయ్య తండ్రికి విప్లవ ప్రబోధం చేస్తాడు. ఇక్కడ సత్తయ్య సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేయడానికి యువతరానికి ప్రాతినిధ్యం వహించే నాయకుని పాత్ర.

**వర్గ సంఘర్షణ :**

ఈ దేశంలో బీదవారికి ధనికులకు మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకవైపు పూరి గుడిసెలు, మరొకవైపు దివ్య భవంతులు. ఒకపూట కూడా తిండి దొరకని దారిద్ర్యం ఒకవైపు, పంచభక్ష్య పరమాన్నాలతో విందులు మరోవైపు. ఇలాంటి కథలు మనదేశంలో అతి సాధారణ విషయాలే అయినా ఈ సాధారణ విషయాన్ని నేపథ్యంగా తీసుకుని భయంకరమైన అడవి పందులను, ఎలుగుబంట్లను తరిమికొట్టే సత్తా ఉన్న సత్తయ్య, పేదవాడైన కారణంగా ఒక ధనిక దొర గడీలకు ఎలా బలయ్యాడో చక్కటి కథనంతో చెప్పాడు రచయిత.

**స్త్రీ పురుష సంబంధాలు :**

సుశీల సత్తయ్యలది నిస్వార్థ ప్రేమ.. సత్తయయ సుశీలకు మనసిచ్చాడు. సుశీల సత్తయ్యను ప్రాణాధికంగా ఆరాధించింది. ఎన్నో కలలు కంది. ఇద్దరికీ ఈడు-జోడు సరిపోయిందనీ, వారి జంట చిలకా-గోరింకల్లా ఉంటారని ఊరంతా ఆశీర్వదించారు. ప్రేమ బంధంతో పెళ్లికాకమునుపే పట్నంలో కొత్త సినిమా వచ్చినపుడు వెంకటి ఇంటికి వచ్చి "అత్త! ఓ అత్త! బావ ఏడి? అని పార్వతమ్మని అడుగుతూ... కాలు గాలిన పిల్లిలా తిరుగుతుండేది. ఓసారి పార్వతమ్మ గంభీరంగా అడిగింది. "ఏందే పిల్ల, లగ్గం గాక మునుపే నా కొడుకుని సినిమాలకు లేవతీసుకపోతున్నావ్? ఇదేం సోద్యమే? వద్దు గీ తొవ్వలు మర్చిపో! ఎక్కువ సోపతి ముదిరిపోనియ్యను నేను. వాడు సత్తిగాడు రేపో-మాపో మిలటరీలకు పోయేటోడు. దేశం గాని దేశాలు పట్టి పోతాడు. వానితోటి నువ్వేమి సుఖపడతావే ఎర్రి పిల్ల? మీ నాయనలు నీకు బంగారమసొంటి పిలగాన్ని, సర్కారు నౌకరి కలిగినోన్ని, బగ్గ చదువుకున్న వాణ్ణి, చూసి లగ్గం చేస్తారు. మా వొన్ని మర్చిపో" అప్పుడు సుశీల అంది అత్త మల్ల గట్ల మాట్లాడితే నా మీద ఒట్టు. నాకు మనువంటూ అయితే సత్తయ్య బావ తోటే అంతే! వెంకటి పార్వతమ్మ, విషయంలో ఆదర్శవంతమైన దంపతులను, సత్తయ్య సుశీల కథలో ఆదర్శవంతమైన ప్రేమను చూపించాడు రచయిత. ప్రేమ అనేది కనులకు సంబంధించినది కాదు. శరీరాలకు సంబంధించినది అంతకన్నా కాదు. అది మనసుకు సంబంధించిన వ్యవహారం అని, రెండు గుండెలు జతగూడి గూడుకట్టుకున్నాక అవి కొట్టుకోవడం ఆగిపోయే వరకు వాటిని విడదీయలేమని పాఠకులకు అర్థమవుతుంది.

**పోలీసు వ్యవస్థ :**

డబ్బు సూపితే సాలు ఈదిలో కోతి ఆడిద్ది. ఇంట్లో ఆడది కోతిలా గాడుద్ది (కథానిక స్వరూప స్వభావాలు, పు.సం. 456) పోలీసులు డబ్బులకు కోతికన్నా హీనంగా ఆడుతున్నారు. లంం ఇవ్వడం, లంచం తీసుకోవడం నేరం. చట్టం ఎవరికి చుట్టం కాదంటారు. ఈ మాటలు పేదల పాలిట అవాస్తవిక అంశాలే అన్నట్లుగా ఉంటాయి. కథలో సత్తయ్యను దొరలు పోలీసుల సహకారం వల్లే హత్య చేయగలిగారు. విధి నిర్వహన పట్ల శ్రద్ధ లేకుండా, లంచాలు తీసుకొని పేదవారు అమాయకులైన సత్తయ్య లాంటి అభ్యుదయ వాదులను మట్టు పెట్టడం ఈ వ్యవస్థకు ఏమి కొత్తకాదు. ఆధారాలు లేకుండా విచారణ కొనసాగకుండా సత్తయ్య హత్యకు "మిస్సింగ్ శైలి" అనే కొత్త రాగం పలుకుతారు. విధి నిర్వహణలో లంచాలకు అమ్ముడుపోయే వ్యవస్థగా పోలీస్ డిపార్ట్మెంట్కు పేరుంది.

**దినసరి కూలీలు :**

భారతదేశ గ్రామీణ వ్యవస్థలో అధికశాతం జనాభా దినసరి కూలీలే. వీరికి రెక్కాడితే గాని డొక్కాడదు. ఇల్లింటిపాది ఏదో కష్టం చేస్తేనే నాలుగు మెతుకులు కంచంలోకి వస్తాయి. అలాంటి దినసరి కూలీలను ఊరి దొరలు ముందుగా

తమ పొలాల్లోకి వరి కోతలకు రావాలని అజ్ఞాపిస్తారు. పాత కూలీరేట్లకు అయితే మేం రామని గిట్టుబాటు కాదని, ఎక్కడికైనా వెళ్లి పని చేసుకునే హక్కు కలదని తెగేసి చెప్తారు. కోపించిన దొరలు ప్రతీకారంగా బాటలు మూసేస్తారు. దొరల దౌర్జన్యం దినసరి కూలీల పైన ఎంత ఉందో మనకు అవగతమవుతుంది. దినసరి కూలీలు వాళ్ల రెక్కల కష్టంతో బతుకుతారు. ఇలాంటి వాళ్ళ రెక్కలు అంటేనే కద భూకామందులకు వేడుక.

**తొవ్వలు బంద్ :**

రచయిత చిత్రించిన అనేక సమస్యల్లో ప్రధానమైన భూ సమస్య, తొవ్వలు బంద్. గ్రామంలో అధికశాతం భూమి దొరతనం గల ప్రముకుల దగ్గర కేంద్రీకృతమై ఉంటుంది. ఊరి మొదట్లోనే వారి భూములు ఉంటాయి. వారి భూములను దాటుకొని మధ్యతరగతి, బీదవారి భూములు ఉంటాయి. దొరలకు ఎదురు తిరిగి చాకిరి చేయలేము. మా హక్కులు మాకు ఉంటాయి. అని తెగేసి చెప్పినందుకే వారు విచిత్రమైన పేచీని లేవనెత్తారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా సాధారణ రైతులకు ఇంకా స్వేచ్ఛ లేదు. తాత ముత్తాతల కాలం నుంచి చలామణిలో ఉన్న బాటలను వీరు తమ స్వార్థం కోసం మూసివేసి సామాన్య రైతులకు మానసిక ప్రశాంతత లేకుండా నిత్యం వేదనకు గురి చేస్తున్నారు. దీంతో విసిగిపోయిన రైతులు హత్యకు పూనుకోవడమో, హత్య కావింపబడటమో లేదా ఆత్మహత్య చేసుకోవడమో జరుగుతుంది.

**ముగింపు :**

ఆక్రోశం కథ కేవలం వెంకటి కుటుంబ కథ మాత్రమే కాదు. యావత్ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో అనేక రైతు కుటుంబాలకు చెందిన కథ. గ్రామంలో యువత అక్షరజ్ఞానం కలవారై అన్యాయాలనెదిరిస్తూ అక్రమలకు తిరుగుబాటు చేస్తూ, ఉద్యమాల జెండాలనెగరేస్తారు. ఉద్యమాలకు ఎంతగానో ఆకర్షితులవుతారు. పోరాటాలకు వెనుదిరుగని వీరుని వలె ఉంటారు. కానీ ఇది నచ్చని రాజ్యం కన్నెర్ర చేస్తూ వాళ్ల తల్లిదండ్రులకు తీరిన కడుపుకోతను మిగిలిస్తున్నది అనే అంశాన్ని చక్కటి శిల్పంతో, వాస్తవికమైన, చారిత్రాత్మక సందేశాన్ని అందించారు రచయిత ఆడెపు లక్ష్మీపతి గారు. వారి కథల్లో హృదయం ఉంది. కనుకనే హృదయవిదారకమైన సంఘటనలను కూడా సహజత్వంతో చిత్రీకరించి పల్లె నిజజీవితాలకు అద్దం పట్టారు.

**ఉపయుక్త రచనల సూచి :**


1. ఖాదీర్‌బాబు మహమ్మద్, 2026, మరపురాని ప్రయణ కథలు, హైదరాబాద్, అన్విక్షికి పబ్లికేషన్స్.
2. దక్షిణమూర్తి పోరంకి, 2009, కథానిక స్వరప స్వభావాలు, హైదరాబాద్, విప్ల కంప్యూటర్ సర్వీసెస్.
3. నాగయ్య జి., 2021, తెలుగు సాహిత్య సమీక్ష (ద్వితీయ సంపుటి), హైదరాబాద్, నవ్య పరిశోధక ప్రచురణలు.
4. నారాయణ సింగమనేని (సం. పా), 2004, తెలుగు కథకులు - కథన రీతులు (నాలుగో సంపుటి), హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్.
5. లక్ష్మీపతి ఆడెపు, 1991, ఆక్రోశం, హైదరాబాద్, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక.
6. లక్ష్మీపడి ఆడెపు, 2022, దిక్చక్రం, హైదరాబాద్, ఆదిత్య లిటరరీ పబ్లికేషన్స్.
7. శ్రీదేవి కిన్నెర, 2009, ఈ దశాబ్ది కథానికలు (1956-65) సామాజిక విశ్లేషణ, మైసూర్ : విశాలాంధ్ర ప్రజాశక్తి ప్రచురణలు.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# చందమామ పత్రికలో భేతాళ కథల వైశిష్ట్యం – పరిశీలన



కాపరపు అనిల్ బాబు
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.
చరవాణి : 8897934202
Mail : Kaparapuanil8897@mail.com

ఆచార్య జర్రా అప్పారావు
పరిశోధక పర్యవేక్షకులు
తెలుగువిభాగం - ఆంధ్ర
విశ్వవిద్యాలయం
విశాఖపట్నం - 03



సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

## వ్యాస సంగ్రహం

ఈ వ్యాసంలో చందమామ పత్రిక ఆవిర్భావం, అభివృద్ధి, అలాగే ఆ పత్రికలో ప్రచురితమైన భేతాళ కథల పుట్టుకకు దారితీసిన పరిస్థితులను విశదీకరించడం జరిగింది. ముఖ్యంగా, చందమామలో వెలువడిన కల్పిత భేతాళ కథల రూపకల్పన, వాటి సృష్టికర్త కొడవటిగంటి కుటుంబరావు గారి సాహిత్య కృషి, ఆ కథలలో ప్రతిఫలించిన సామాజిక స్పృహ, నైతిక విలువలు మరియు పాఠకులపై వాటి ప్రభావాన్ని విశ్లేషించడం జరిగింది. అదేవిధంగా, భేతాళ కథలకు ప్రారంభం నుండి చివరి వరకు చిత్రాలను అందించిన ప్రముఖ చిత్రకారుడు శంకర్ గారి కళా వైశిష్ట్యం, చందమామ పత్రికతో ఆయనకున్న అనుబంధం, కథల ప్రజాదరణలో ఆయన చిత్రాల పాత్ర వంటి అంశాలను కూడా ఈ వ్యాసంలో వివరించడం జరిగింది.

## కీలక పదాలు

చందమామ పత్రిక, చందమామ స్వరూపం, భేతాళ కథలు, భేతాళ కథల ఆవిర్భావం, కొడవటిగంటి కుటుంబరావు, సామాజిక స్పృహ, శంకర్, చిత్రకళ.

## ప్రవేశిక

సాహిత్య ప్రక్రియలన్నింటిలో కథకు విశిష్టమైన స్థానం ఉంది. తక్కువ పదాలతో, సరళమైన వాక్య నిర్మాణంతో, అనవసర వర్ణనలకు తావులేకుండా ఒక భావాన్ని సమర్థవంతంగా వ్యక్తీకరించగల ప్రక్రియ కథ. అందువల్లే దిన, వార, మాస సాహిత్య పత్రికలలో కనీసం ఒకటి లేదా రెండు కథలు తప్పనిసరిగా ప్రచురించబడుతూ ఉంటాయి.

కథలు అన్ని వయస్సుల పాఠకులను ఆకర్షించినప్పటికీ, పిల్లలపై వాటి ప్రభావం అత్యంత ఎక్కువగా

ఉంటుంది. పిల్లలకు ఏ విషయాన్నైనా సులభంగా, ఆసక్తికరంగా బోధించడానికి కథ ఒక ఉత్తమ సాధనంగా నిలుస్తుంది. కథ ద్వారా అందించిన సందేశం పిల్లల మనసులో చిరకాలం నిలిచిపోతుంది.

తెలుగు పత్రికారంగ చరిత్రలో బాలసాహిత్యానికి విశేష సేవ చేసిన పత్రికలలో చందమామ ప్రముఖమైనది. ఇది కేవలం బాలలకే కాకుండా పెద్దలను కూడా ఆకట్టుకున్న విశిష్ట బాలసాహిత్య మాసపత్రిక. విభిన్నమైన శీర్షికలు, ఆకర్షణీయమైన కథలు, భారతీయ సంస్కృతి, నీతి, విజ్ఞానం, వినోదం వంటి అంశాలను సమన్వయం చేస్తూ తరతరాల పాఠకుల ఆదరణను పొందింది.

చందమామ పత్రికలో అత్యధిక కాలం పాటు నిరంతరంగా ప్రచురించబడిన శీర్షికలలో భేతాళ కథలు విశేష ప్రజాదరణ పొందాయి. ఉత్కంఠభరితమైన కథనం, నైతిక విలువలు, తార్కికతను పెంపొందించే ప్రశ్నలు, వినోదంతో కూడిన శైలి వంటి అనేక విశిష్ట లక్షణాల వల్ల ఈ కథలు బాలలతో పాటు పెద్దలను కూడా ఆకట్టుకున్నాయి. చందమామ పత్రికలో భేతాళ కథలు ఇంతటి ఆదరణ పొందడానికి గల కారణాలను విశ్లేషించడం ద్వారా ఈ శీర్షిక యొక్క వైశిష్ట్యం, ప్రజాదరణకు దోహదపడిన అంశాలు స్పష్టమవుతాయి.

ఈ పరిశోధన వ్యాసంలో ''చందమామ పత్రికలో భేతాళ కథల వైశిష్ట్యం -- పరిశీలన'' అనే అంశాన్ని విశ్లేషిస్తూ, వాటి కథన శైలి, విలువలు, బాలలపై చూపిన ప్రభావం, తెలుగు బాలసాహిత్యంలో వాటి స్థానం వంటి అంశాలను సమగ్రంగా వివరించడం జరిగింది.

**విషయ వివరణ**

చందమామ పత్రిక కేవలం కథల పుస్తకం కాదు భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను మరియు నైతిక విలువలను సరళమైన భాషలో పిల్లలకు అందించాలని లక్ష్యంతో ప్రారంభమైంది. సంస్కృతంలో భేతాళ పంచ వింశతి ఆధారంగా పిల్లల కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన చందమామ లో భేతాళ కథలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వడ్డాది పాపయ్య, భేతాళ కథల శంకర్ చిత్రాలు కథాపాత్రలకు జీవం పోసాయి. చందమామలోని భేతాళ కథలు కల్పనా సాహిత్యమైనప్పటికీ చాలా సంక్లిష్టమైన కోణాలను ఆవిష్కరించాయి. మరియు తార్కికంగా ఆలోచించడం సమస్యా పరిష్కార నైపుణ్యాలను పిల్లలకు పెద్దలకు వినోదాత్మకమైన కథా రూపంలో అందించాయి.

**పరిచయం**

విజ్ఞాన వినోద వికాస మాస పత్రిక.
ఆ బాలగోపాలాన్ని అలరించే పత్రిక.
చక్రపాణి గారి మానస పుత్రిక - చందమామ.

చూపుల్ని తిప్పుకోనివ్వకుండా ఆకట్టుకొని, కట్టిపడేసే, జీవం ఉట్టిపడే రంగురంగుల బొమ్మలు. కళ్లకు ఆహ్లాదం కలిగించే సైజులో కుదురైన పెద్ద అక్షరాలు. ఆరంభించింది మొదలు మనస్సును పరిగెత్తిస్తూ లాక్కొని వెళ్ళిపోయే సరళ వ్యవహార భాషాశైలి. చదువరిని అద్భుత ఊహాలోకాలకు కొనిపోయి కాసేపు తమతో సహజీవనం చేసే అలౌకిక పాత్రలు. చిక్కని కథ, దానితో పోటీపడే కథనం, ప్రతి కథలో విశ్లేషణాత్మక సంఘర్షణ, అంతర్లీన సందేశం, మెరుపు (ఫ్లాష్), ఉత్కంఠభరిత జానపద సీరియల్స్, భారతీయ సంస్కృతికి అద్దం పట్టే పౌరాణిక సీరియల్స్---ఇవన్నీ కలసి చందమామను బాలసాహిత్య ఆకాశంలో చిరస్థాయిగా నిలిపాయి.

పిల్లలను కథల ద్వారా ఆకర్షించి వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో అనేక బాలల పత్రికలు వచ్చినప్పటికీ, ప్రారంభం నుంచి ముగింపు వరకు నిరంతర ప్రజాదరణ పొందిన విశిష్ట కథల మాసపత్రిక చందమామ. ఆరేళ్ల పిల్లల నుంచి ఎనభై ఏళ్ల వృద్ధుల వరకు అందరూ ఆస్వాదించే కుటుంబ పత్రికగా అది నిలిచింది.

చందమామ పత్రిక వ్యవస్థాపకులు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి గారు, సంచాలకులు చక్రపాణి గారు. తెలుగులో పిల్లల కోసం ప్రత్యేక పత్రికను ప్రారంభించాలనే చక్రపాణి గారి సంకల్పానికి నాగిరెడ్డి గారి సహకారం లభించడంతో 1947 జూలై 1న తెలుగు, తమిళ భాషల్లో 64 పేజీలతో,అరణాలవెలతో ౹37 పైసలురి చందమామ వెలువడింది. తర్వాత భారతదేశంలోని 12 భాషల్లో, బ్రెయిలీ లిపిలో కూడా ప్రచురితమైభాషాభేదం లేకుండాభారతీయ బాలలకు వినోదాన్ని, విజ్ఞానాన్నిఅందిస్తూ జాతీయ సమైక్యతకు తోడ్పడింది.

## భేతాళ కథల ఆవిర్భావం – మూల కారణం

తెలుగు కథా సాహిత్యంలో భేతాళ కథలు అత్యంత ప్రజాదరణ పొందిన కథలలో ఒకటి. పురాణ కథనం ప్రకారం పార్వతీ పరమేశ్వరుల మధ్య జరిగిన సంభాషణలో పరమేశ్వరుడు పార్వతికి 24 విశిష్ట కథలను చెప్పాడు. దేవాలయ పూజారి శివశర్మ ఆ కథలను రహస్యంగా విని తన భార్యకు చెప్పడంతో అవి భూలోకమంతా వ్యాపించాయి.

దీనికి కోపించిన పరమశివుడు శివశర్మను భేతాళుడిగా శపించాడు. అనంతరం విక్రమార్కుడికి ఈ కథలను చెప్పి ప్రశ్నలు అడగడం ద్వారా శాప విమోచనం పొందే వరాన్ని అనుగ్రహించాడు. ఈ విధంగా భేతాళుడు విక్రమార్కునికి చెప్పిన కథలే "భేతాళ కథలు"గా ప్రసిద్ధి చెందాయి. ఇవి "భేతాళ పంచవింశతి"లో చెప్పబడ్డాయి. గుణాఢ్యుడు ఈ గ్రంథ రచయితగా ప్రసిద్ధి చెందాడు. శతాబ్దాలు గడిచినా ఈ కథలు పాఠకుల తార్కికత, వివేచనాశక్తి, ధర్మబుద్ధిని పెంపొందించే విలువైన సాహిత్యంగా నిలిచాయి.

## చందమామ పత్రికలో శీర్షికగా "భేతాళకథలు'

భారతీయ బాలసాహిత్యంలో చందమామ బేతాళకథలు ఒక ప్రత్యేకమైన ముద్రవేసి దాదాపు 60 ఏళ్లపాటు ప్రతినెల ఒకచిక్కు ప్రశ్నతో పాఠకులను అలరించి భేతాళకథలు అచిరకాలంలోనే అశేష జనాదరణ పొందిన కథలుగా చెప్పవచ్చు. అంతేకాకుండా ఒక బాలసాహితీ పత్రికలో అత్యధికకాలం శీర్షికగా ముద్రింపబడిన కథలుగా గుర్తింపు పొందాయి. అయితే భేతాళ పంచవింశతిలో చెప్పబడిన కథలు 25 మాత్రమే! అందులో కూడా చందమామ శైలికి సరిపడిన కథలు మూడంటే మూడు మాత్రమే. ఆ కథలను మాత్రమే ప్రచురించడం జరిగింది. మిగిలిన కథల్లో జారత్వం పాళ్లు ఎక్కువగా ఉండటంచేత వాటిని ప్రచురణకు తీసుకోలేదు. 1955వ సంవత్సరం సెప్టెంబరు నుండి "భేతాళకథలు" శీర్షికను చందమామ పత్రికలో ప్రచురిస్తున్నారు. అయితే ఇక్కడ చెప్పాల్సిన ముఖ్యవిషయం ఏమిటంటే చందమామలో 600 పైగా భేతాళకథలు ప్రచురించబడ్డాయి. ఇవన్నీ "కల్పిత భేతాళ కథలు". జారత్వం పాళ్లు అధికంగా ఉన్న భేతాళ కథలను ప్రచురించడానికి చక్రపాణి గారు ఆసక్తి చూపలేదు. అప్పుడు ప్రసిద్ధ రచయిత అయిన కొడవటిగంటి కుటుంబరావు గారు తన కల్పనాచాతుర్యంతో మామూలు పిల్లల కథలను తీసుకొని వాటిని భేతాళ కథలుగా మార్చి రాయడం జరిగింది. అయితే మామూలు పిల్లల కథలకు సమస్యను జోడించి ఒకచిక్కు ప్రశ్న సృష్టించడం, దానికి సమాధానం చెప్పించడం అంత సులభమైన విషయం కాదు. చందమామ పత్రిక సాధారణ పిల్లల కథలను భేతాళ కథలుగా మార్చి ప్రచురించినప్పటికీ అసలు భేతాళకథల యొక్క ప్రతిష్టకు ఏమాత్రం భంగం కలగకుండా జాగ్రత్త పడింది. ఒకకల్పనాత్మక కథలతో కూడిన శీర్షికతో సుదీర్ఘకాలం పాఠకలోకాన్ని రంజింప జేయగలగడం ఒక గొప్ప విషయం. భేతాళ కథల ప్రచురణ 1955 నుండి పత్రిక ప్రస్థానం ముగిసిపోయేంత వరకు నిర్విరామంగా కొన్ని దశాబ్దాల పాటు కొనసాగింది. అయితే 1972 సంవత్సరంలో చందమామ పత్రిక స్థాపించి 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జులై నెలలో వెలువడిన చందమామ సంచికలో మొట్టమొదటి భేతాళ కథను రంగుల్లో పునర్ముద్రించడం జరిగింది. చందమామ పత్రికలోని భేతాళ కథలు శీర్షికకు వచ్చిన ఆదరణను చూసి మరికొన్ని పిల్లల పత్రికలు ఇదే పద్ధతిలో కథలను ప్రచురించే (కరాళ కథలు) ప్రయత్నం చేశాయి. అయితే అవి అంతగా విజయవంతం కాలేదు.

**కల్పిత భేతాళ కథల సృష్టికర్త కొ.కు**

కుటుంబరావు గారు చక్రపాణి గారి సమవయస్కులు. యువ పబ్లికేషన్స్ తరుపున కుటుంబరావు గారి పుస్తకాలను చక్రపాణి గారు ప్రచురించేవారు. తరువాత కాలంలో చక్రపాణి గారి ఆధ్వర్యంలో చందమామ పబ్లికేషన్స్ నుండి వెలువడిన "కినిమా" మాసపత్రికలో కుటుంబరావు గారు పనిచేశారు. 1955లో కినిమాపత్రికఆగిపోయింది. దాంతో కుటుంబరావు గారు చందమామ సంపాదకవర్గంలో చేరారు. పురాణ కథలు, భేతాళ కథలు వంటి ప్రముఖ ధారావాహికలు ఈయన రాసినవే. భేతాళ కథలకు మూలగ్రంథమైన భేతాళ పంచవింశతిలో చెప్పబడిన భేతాళ కథలను ఆదర్శంగా తీసుకుని అటువంటి కథలను సుమారు 500 వరకు సృష్టించారు. ఈ కల్పిత భేతాళకథల సృష్టికర్త ఈయనే. ఇది ఆయన కల్పనాచాతుర్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఆధునిక సాహిత్యం, నూతన ప్రయోగాలవట్ల ఆసక్తిగల కుటుంబరావు గారికి 1957లో చందమామ ఎడిటర్గా నియమితులైనవేణుగోపాలరెడ్డిగారిచేయూతలభించింది. ఆయనసహకారంతోకుటుంబరావుగారుఅరేబియన్, గ్రీకు, రోమన్, స్కాండినేవియన్, చైనా ,జానపదకథలను, ఆంగ్లసాహిత్యంలోఉన్నప్రసిద్ధకథలనుసేకరించి చక్రపాణిగారి భావాలకుఅనుగుణంగా భారతీయత ప్రతిబింబించే విధంగామలిచి చందమామపత్రికలోప్రచురించారు. "లెజెండ్స్ అండ్ మిథ్స్ " అనేఆంగ్లమూలగ్రంథంనుంచిగ్రీకుపురాణకథలనుసేకరించివాటినిచిన్నపిల్లలకుఅర్థమయ్యేవిధంగా సులభశైలిలోచిన్నచిన్నకథలధారావాహికలుగా తిరగరాసి పత్రికలోప్రచురించారు. ఆంగ్లసాహిత్యంలోని షేక్స్పియర్ రచనలను వెనిస్వర్తకుడు, ఆదర్శప్రేమికులు, మోసపోయినమోసగాడు, లియర్రాజు పేర్లతో తెలుగులో అనువదించి పత్రికలో ప్రచురించారు. ప్రపంచ ప్రాచీన అద్భుతాలు, ప్రకృతి వింతలు, మీకుతెలుసా?, మీరు విన్నారా?, భూగోళం, చందమామ వద్దకు ప్రయాణం వంటి శీర్షికలతో ఎన్నో వైజ్ఞానిక అంశాలను చందమామలో చేర్చారు. కుటుంబరావు గారు "సమీర కుమార విజయం" కావ్యం నుండి వచన రూపంలో రాసిన "వీరహనుమాన్" ధారావాహిక, రూపధరుడి యాత్రలు, భువనసుందరి వంటి గ్రీకు పురాణగాథలు చందమామకు అశేష పాఠకాదరణను సంపాదించి పెట్టాయి. నిత్యం నూతనత్వంకోసం తపిస్తూ, చందమామ కథలస్థాయి పెరుగుటకు కారణమైన కుటుంబరావు గారు 17-08-1980న పరమపదించారు.

**చందమామలో భేతాళ కథలు – సామాజిక స్పృహ**

చందమామ పత్రిక 'భేతాళ కథలు' శీర్షిక ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా మానవ విలువలు, నైతికత, బుద్ధిబలం, ధైర్యం, రాజకీయం, స్నేహం, ప్రేమ, వ్యక్తుల యొక్క భిన్నమనస్తత్వాలు, సమాజం పోకడ, ధనప్రభావం వంటి సామాజిక అంశాలను కథల్లో చేర్చి చెప్పడం జరిగింది. ధర్మోరక్షతి రక్షితః అనే సూత్రాన్ని భేతాళకథలు ప్రతికథలో నిరూపిస్తాయి. చెప్పే సమాధానాల ద్వారా సంక్లిష్ట సమస్యలకు తార్కికంగా పరిష్కారాలను ఎలా వెతకాలో పిల్లలకు మరియు పెద్దలకు ఒక అవగాహన కలుగుతుంది. సమాజంలో మనిషి ఎలా జీవించాలి, ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించాలి అనే నైతిక సూత్రాన్ని ఈ కథలు సులభంగా బోధిస్తాయి.

**భేతాళ కథలు శంకర్ – మేటి చిత్రకారులు**

చందమామ పత్రిక ఎక్కువ జనాదరణ పొందడానికి మరొకప్రధాన కారణం ఆకర్షణీయమైన రంగురంగుల చిత్రాలు. పత్రిక అంత ఆకర్షణీయంగా మరియు అందంగా తయారు కావడానికి ఎంతోమంది మేటి చిత్రకారులు పనిచేశారు. వారిలో ఒకరు చందమామ పత్రికతో ప్రత్యేక సంబంధం, అనుబంధం కలిగిన చిత్రకారులు శంకర్ గారు. "చందమామ తాతయ్య"గా గుర్తింపు పొందిన శంకర్ గారి పేరు తీయగానే గుర్తొచ్చేవి భేతాళకథలు. బాలలపత్రిక చందమామలోచిత్రకారుని గా విక్రమ్ - భేతాళ కథలకు చిత్రాలను వేయడం ద్వారా శంకర్ గారు గుర్తించబడ్డారు. ఆయనచిత్రాల్లో "శంకర్" అనే సంతకం ఉంటుంది. ఆయన వేసిన బొమ్మలన్నీ ఒక ఎత్తు. భేతాళ కథలు శీర్షికకు

ఆయన వేసిన బొమ్మలు - విక్రమార్కుడు చేతిలో కరవాలం, భుజాన శవాన్ని మోసుకుంటూ వెళుతుండగా శవంలోని భేతాళుడు కథ చెప్పే చిత్రం - ప్రపంచ ప్రసిద్ధిపొందాయి. తెలుగు పత్రికారంగ చరిత్రలో ఎక్కువకాలం ధారావాహికగా కొనసాగిన శీర్షిక చందమామలో భేతాళ కథలు. ఈ శీర్షికకు 1955 నుండి శంకర్ గారు గీయడం ప్రారంభించారు. అప్పటినుండి పత్రిక ప్రస్థానం ముగిసే వరకు, అంటే 2012 సంవత్సరం వరకు కూడా శంకర్ గారే భేతాళ కథల శీర్షికకు చిత్రాలను గీశారు. ఒక బాలసాహిత్య పత్రికలో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రముఖ చిత్రకారులు శంకర్ గారు. భేతాళ కథల శీర్షికకు మాత్రమే కాకుండా చందమామలో వచ్చిన రామాయణం, మహాభారతం సీరియల్స్కు వేసిన చిత్రాలతో పౌరాణిక పాత్రలకు దివ్యత్వం కలిగించిన గొప్ప ఆర్టిస్ట్ శంకర్ గారు. పౌరాణిక పాత్రలను పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా కళ్లకు కట్టిన ఘనత ఆయనది. ఈ విధంగా ఎన్నో ఆకర్షణీయమైన అజరామరమైన చిత్రాలను గీసిన శంకర్ గారు 2020 సెప్టెంబర్ 29న చెన్నై సమీపంలోని పోరూర్ లోని ఆయన స్వగృహంలో మరణించారు.

**ఉపసంహారం**

చందమామ పత్రిక కేవలం కథలను అందించడమే కాకుండా భారతీయ సంస్కృతిని కాపాడుతూ భావితరాలకు గొప్ప మార్గదర్శిగా నిలిచింది. భేతాళ కథలను కేవలం కల్పిత కథలుగా కాకుండా ఒక సమగ్ర సామాజిక విద్యా సాధనంగా పాఠకలోకానికి అందించింది. ఇవి కేవలం పిల్లల కోసం మాత్రమే రాసినవి కావు; లోతైన మానవ స్వభావాలు, సామాజిక విలువలను ప్రతిబింబించే ఉత్తమ సాహితీ సృష్టిగా చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ విషయం పాఠకలోకం చందమామ పత్రికకు, అందులోని భేతాళ కథలు శీర్షికకు వచ్చిన జనాదరణను చూస్తే స్పష్టమవుతుంది.

**ఆధార గ్రంథాలు**


1. గుణాఢ్యుని భేతాళ కథలు - సహవాసి
2. బాలల బొమ్మల భేతాళ కథలు - ఇందిరా సుబ్రహ్మణ్యం
3. చక్రపాణి విజయ పతాక - చక్రపాణి శతజయంతి సంచిక (1908--2008), వెలగా వెంకటప్పయ్య
4. చక్రపాణి జీవితం సాహిత్యం - వెలగా వెంకటప్పయ్య
5. జ్ఞాపకాల పందిరి - బి. నాగిరెడ్డి
6. నాన్నతో నేను - విశ్వం


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ "మా బతుకులు" కథా సంపుటి - ఒక సమగ్ర పరిశీలన



దేవనపెల్లి అనూష
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం,
చరవాణి : 9912787209.

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**సంగ్రహం**

నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ తెలుగు కథా సాహిత్యంలో, ముఖ్యంగా తెలంగాణా గ్రామీణ జీవితాన్ని మరియు గౌడ కులవృత్తిలోని సంక్లిష్టతలను ప్రతిబింబించే అరుదైన రచయిత. ఆయన రాసిన "మా బతుకులు" కథా సంపుటిని, కులవృత్తిని కేవలం ఒక జీవనోపాధిగా మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక అస్తిత్వంగా పరిగణిస్తూ ఈ పరిశోధనా పత్రం బహుముఖ కోణాల్లో (ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక) విశ్లేషిస్తుంది.కులవృత్తిపై ఆధారపడిన కుటుంబాల జీవన పోరాటాలు, ఆధునిక ప్రభుత్వ విధానాలు (సారా/మద్యపాన నిషేధం, బీడీ పరిశ్రమపై ఆంక్షలు) వృత్తికి కలిగించే ముప్పులు, మరియు రాజకీయ కుతంత్రాల వల్ల గౌడ కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ వ్యాసం చర్చిస్తుంది. చివరిగా, గౌడ కులవృత్తిని ఆధునీకరించడం మరియు గౌరవప్రదమైన జీవనోపాధిగా మార్చడం కోసం తీసుకోవాల్సిన సంక్షేమ చర్యలను మరియు అస్తిత్వ పరిరక్షణ మార్గాలను ఈ వ్యాసం సూచిస్తుంది.

**కీలక పదాలు :**

నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్, మా బతుకులు, గౌడ కులవృత్తి, అస్తిత్వ పోరాటం.

## పరిచయం

తెలంగాణా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గౌడ కులవృత్తి కీలకమైనది. తాటి, ఈత చెట్లపై ఆధారపడిన ఈ వృత్తి, కేవలం ఒక జీవనోపాధి మాత్రమే కాదు, అదొక సాంస్కృతిక వారసత్వం. శ్రీనివాస్ గౌడ్ తన కథల ద్వారా గీత కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని, మరియు సమాజంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అక్షరబద్ధం చేశారు.

## వృత్తిపరమైన వాస్తవాలు

గీత కార్మికుల జీవనం ప్రకృతిపై మరియు వ్యవస్థీకృత దోపిడీపై ఆధారపడి ఉంది:

- **జీవనోపాధి పోరాటం :** "కల్లు మండువ", "కల్పవృక్షం" కథలు, వర్షాల వల్ల వృత్తి స్తంభించినప్పుడు కుటుంబాలు పడే ఆకలి బాధలను చిత్రీకరించాయి.
- **దోపిడీ :** ఎక్సైజ్ శాఖ బ్యూరోక్రసీ మరియు భూస్వాముల గుత్తాధిపత్యం వల్ల కార్మికుడు తన శ్రమకు తగిన ప్రతిఫలం పొందలేకపోతున్నాడు.
- **బీడీ పరిశ్రమ ప్రభావం :** "కాలసర్పం" కథ, ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వ విధానాలు పేదల పొట్ట కొట్టడంపై నిరసన తెలుపుతుంది.

**మా బతుకులు – కథల విశ్లేషణ**

**కులవృత్తి :** విజయలక్ష్మి పాత్ర ద్వారా, శ్రామిక మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులను రచయిత కళ్లకు కట్టారు. గౌడ మహిళలు వృత్తి కోసం బయటకు వచ్చినప్పుడు ఎదురయ్యే సామాజిక అభద్రతను ఇది ప్రతిబింబిస్తుంది. నేటికీ కార్మిక రంగాల్లో మహిళల రక్షణ ఒక ప్రధాన సవాలుగా ఉన్న విషయాన్ని ఈ కథ గుర్తు చేస్తుంది.

**కల్పవృక్షం :** నర్సయ్య గౌడ్ వంటి పాత్రలు సంఘం యొక్క బాధ్యతను, రాజకీయాల వల్ల సంఘాలు ఎలా బలహీనపడతాయో చూపుతాయి. నేటి కుల సంఘాల్లోని అంతర్గత కుమ్ములాటలకు, నాయకత్వ సమస్యలకు ఇది అద్దం పడుతుంది.

**కుట్ర :** గంగన్న మరణం మరియు రాజకీయ కుతంత్రాల ద్వారా వ్యవస్థలోని అవినీతిని రచయిత విశ్లేషించారు. రాజకీయ లబ్ధి కోసం అమాయకులను ఎలా బలి చేస్తారో చూపే ఈ కథ, ప్రస్తుత గ్రామ రాజకీయాలలోని కలుషిత స్వభావాన్ని ఎండగడుతుంది.

**మార్పు :** సారా తాగే అలవాటు నుంచి బయటపడే క్రమంలో స్త్రీ ప్రేమ పాత్రను కమల ద్వారా చూపారు. వ్యసనాలకు బానిసైన కుటుంబాల్లో స్త్రీల సంఘర్షణను ఇది ప్రతిబింబిస్తుంది.

**కాలసర్పం :** బీడీ పరిశ్రమపై నిషేధం వంటి విధానాలు పేద కుటుంబాల బతుకులను ఎలా దెబ్బతీస్తాయో సుధాకర్ పాత్ర ద్వారా చెప్పారు. ప్రత్యామ్నాయం లేని సంస్కరణలు ఎంతటి అశాంతిని నింపుతాయో నేటికీ ఇది అన్వయిస్తుంది.

**మా బతుకులు :** దొరల పెత్తనం, వెట్టిచాకిరీని ఈ కథ వివరిస్తుంది. భూమి లేని గౌడ కుటుంబాల వలసల సమస్య, ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి, వలసల సమస్యకు ఒక చారిత్రక సాక్ష్యం.

**కల్లు మండువ :** వర్షాల వల్ల వృత్తి దెబ్బతినడం, పొరుగువారితో చిన్న విషయాలకు గొడవలు పడటం--- పేదరికం మనిషిలో సహనాన్ని ఎలా తగ్గిస్తుందో చూపిస్తుంది. ఇది నేటి ఆర్థిక అనిశ్చితికి నిదర్శనం.

**ధ్వంసం :** కల్లులో విషం కలపాలా? వద్దా? అనే నైతిక సందిగ్ధతను భూమన్న పాత్ర ద్వారా చూపారు. నేరప్రవృత్తికి, పేదరికం ఇచ్చే ఒత్తిడికి మధ్య ఉండే సన్నని గీతను ఇది విశ్లేషిస్తుంది.

**ముండరాలు :** విద్యావంతుడైన కొడుకు ఆలోచనలకు, సాంప్రదాయక తల్లికి మధ్య ఉన్న ఘర్షణను ఎల్లవ్వ పాత్ర ద్వారా చెప్పారు. తరాల మధ్య భావజాల మార్పును ఇది చర్చిస్తుంది.

**కాటమయ్య :** సమస్త బాధలకు పరిష్కారం "వ్యవస్థపై పోరాటం" అని చెప్పే కాటమయ్య పాత్ర, ఈ సంపుటిలో అత్యంత ముఖ్యమైన చైతన్య స్వరూపం. నేటి సామాజిక ఉద్యమాలకు ఇది మార్గదర్శకం.

**గౌడ పురాణం & రేణుక ఎల్లమ్మ :** కుల అస్తిత్వాన్ని, పురాణ మూలాలను వెతుక్కునే గౌడ సమాజం యొక్క మానసిక స్థితిని ఇవి ప్రతిబింబిస్తాయి. ఆధునిక కాలంలో ఆత్మగౌరవం కోసం పడే తాపత్రయాన్ని ఇవి సూచిస్తాయి.

**సామాజిక ఆర్థిక విశ్లేషణ**

**ఆర్థిక మరియు వృత్తిపరమైన కోణం** : గీత కార్మికుల జీవన విధానం కేవలం వారి శ్రమపైనే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలు మరియు ప్రభుత్వ విధానాలపై ఏవిధంగా ఆధారపడి ఉందో నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ గారి కథలు విశ్లేషిస్తాయి. ఈ అంశాన్ని మూడు ప్రధాన కోణాల్లో పరిశీలించవచ్చు:

**ప్రకృతి వైపరీత్యాలు - జీవనోపాధి అనిశ్చితి** : "కల్లు మండువ" మరియు "కల్పవృక్షం" కథల ద్వారా, గౌడ కార్మికులు ప్రతిరోజూ తాటిచెట్లపై ఎలా ఆధారపడతారో రచయిత స్పష్టం చేశారు. వర్షాకాలం వంటి క్లిష్ట పరిస్థితుల్లో గీత సాధ్యం కాకపోవడం వల్ల, ఆ కుటుంబాల దైనందిన ఆహార భద్రతఎలా దెబ్బతింటుందో, తద్వారా వారు ఎదుర్కొనే ఆర్థిక అనిశ్చితిని ఈ కథలు కళ్లకు కట్టినట్టు చూపిస్తాయి.

**వ్యవస్థీకృత దోపిడీ - బ్యూరోక్రసీ మరియు భూస్వామ్య పెత్తనం** : గౌడ కుటుంబాలు తరచుగా ఎక్సైజ్ కార్యాలయాల్లోని సంక్లిష్టమైన బ్యూరోక్రసీ మరియు లైసెన్సుల సమస్యలతో సతమతమవుతుంటాయి. "మా బతుకులు" కథలో చూపిన విధంగా, జగిత్యాల వంటి పట్టణ కేంద్రాల నుండి లీజుకు తీసుకుని, పల్లెల్లోని చిన్న కుటుంబాలకు ఉప-లీజుఇచ్చే క్రమంలో మధ్యవర్తులు చేసే దోపిడీ, గౌడ కుటుంబాలను ఆర్థికంగా ఎలా చితికిపోయేలా చేస్తుందో రచయిత నిశితంగా విశ్లేషించారు. స్థానిక భూస్వాములు, అధికారులు ఈ సాంప్రదాయ వృత్తులను తమ గుత్తాధిపత్యంలో ఉంచుకుని, శ్రామికుడు తన కష్టాన్ని తానే స్వతంత్రంగా అమ్ముకోలేని దుస్థితిని సృష్టించారని ఈ కథలు ఎండగడతాయి.

**పాలసీ వైఫల్యాలు - ఉపాధి సంక్షోభం** : "కాలసర్పం" కథలో, ఆరోగ్య కారణాలతో బీడీ పరిశ్రమపై విధించే నిషేధాలు లేదా ఆంక్షలు, ఆ వృత్తిపైనే ఆధారపడిన పేద కుటుంబాల మనుగడను ఏవిధంగా ప్రశ్నార్థకం చేస్తాయో రచయిత చర్చించారు. సరైన ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను చూపకుండా అమలు చేసే ప్రభుత్వ సంస్కరణలు, పేదరికాన్ని మరింత పెంచుతాయని ఈ కథ హెచ్చరిస్తుంది.

**సామాజిక మరియు లింగ వివక్ష కోణం** : శ్రామిక మహిళల భద్రత, సామాజిక గౌరవం మరియు వారి అస్తిత్వ పోరాటాలను గౌడ్ గారు అత్యంత నిశితంగా విశ్లేషించారు. ఈ అంశాన్ని ఈ క్రింది కోణాల్లో పరిశీలించవచ్చు:

**లైంగిక రాజకీయాలు - ప్రతిఘటన** : "కులవృత్తి" కథలోని విజయలక్ష్మి పాత్ర ఒక ధీరవనిత. వృత్తిని ఒక అవకాశంగా భావించే పురుషాధిక్య సమాజపు రాక్షసత్వాన్ని, వేధింపులను ఆమె ధైర్యంగా ప్రతిఘటిస్తుంది. ఆమె కన్నీళ్లు, భయం కంటే, తన మానాన్ని కాపాడుకోవాలనే ఆమె ఆత్మగౌరవం మిన్నగా కనిపిస్తుంది. శ్రామిక మహిళలు తమ పని ప్రదేశాల్లో ఎదుర్కొనే లైంగిక వేధింపులను, వాటి పట్ల సమాజం చూపే నిమ్మకు నీరెత్తిన వైఖరిని ఈ కథ ఎండగడుతుంది.

**స్త్రీ త్యాగం - మార్పు శక్తులు** : "మార్పు" కథలోని కమల పాత్ర, కుటుంబం కోసం సర్వస్వం ఒడ్డే స్త్రీ తత్వాన్ని, సహనాన్ని ప్రతిబింబిస్తుంది. రచయిత స్త్రీ ప్రేమను 'ప్రవాహం'తో పోల్చడం ద్వారా, ఎంతటి కఠిన హృదయులనైనా మార్చగల శక్తి ఆమెదని నమ్మారు. "ముండరాలు" మరియు "కులవృత్తి" వంటి కథలలో, భర్తలను కోల్పోయిన మహిళలు ఎదుర్కొనే సామాజిక అవమానాలు, ఆర్థిక కష్టాల మధ్య కూడా వారు ప్రదర్శించే మాతృప్రేమ మరియు ధైర్యం అసాధారణమైనవి. పేదరికం మరియు లింగ వివక్షల కలయికలో మహిళలు ఎలా నలిగిపోతారో ఈ కథలు అద్భుతంగా చిత్రీకరించాయి.

**సామాజిక వెలి - నైతిక కుట్రలు** : సమాజం మహిళలను కేవలం వస్తువులుగా చూడటం, వారు బయటకు వచ్చి పని చేయడాన్ని తప్పుబట్టడం, వారి నైతికతను కించపరచడానికి ప్రయత్నించే కుట్రలు నేటికీ చర్చనీయాంశాలే. ఈ కథలు అటువంటి మూస ధోరణులనుప్రశ్నిస్తాయి.

**వ్యవస్థపై సామూహిక పోరాటం :** "కాటమయ్య" కథ సామూహిక ప్రతిఘటనకు ప్రతీక. అనుభవజ్ఞుడైన కాటమయ్య, సమస్యకు కారణం వ్యక్తులు కాదని, దోపిడీకి పాల్పడే "వ్యవస్థ" అని గుర్తిస్తాడు. వ్యక్తిగత అసహనం నుండి సామూహిక చైతన్యం వైపు సమాజాన్ని నడిపించే నాయకుడిగా అతను కనిపిస్తాడు. మహిళల సమస్యలు కూడా కేవలం వ్యక్తిగతమైనవి కాదని, వ్యవస్థాత్మకమైనవని, వాటిని ఎదుర్కోవాలంటే సామూహిక పోరాటమే మార్గమని ఈ కథ సందేశమిస్తుంది.

**రాజకీయ మరియు వ్యవస్థాత్మక కోణం :** వ్యక్తిగత కక్షలు ఏ విధంగా గ్రామ రాజకీయాలను ప్రభావితం చేస్తాయో, అలాగే ప్రభుత్వ విధానాల లోపాలు పేద వర్గాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఈ కథలు శక్తివంతంగా ఎండగడతాయి. ఈ అంశాన్ని ఈ క్రింది కోణాల్లో పరిశీలించవచ్చు:

**వ్యవస్థాపక కుట్రలు - రాజకీయ ఆయుధంగా మరణం :** "కుట్ర" కథ, గ్రామీణ రాజకీయాల్లో ఒక విషాద సంఘటనను ఏ విధంగా రాజకీయ ఆయుధంగా మలుచుకుంటారో స్పష్టం చేస్తుంది. గంగన్న మరణాన్ని ఒక సామాజిక సమస్యగా కాకుండా, ప్రత్యర్థులను దెబ్బతీయడానికి ఒక 'కుట్ర'గా వాడుకోవడం ఇందులో కనిపిస్తుంది. నిజానిజాలను అణచివేసే వ్యవస్థలోని లొసుగులను, రాజకీయ లబ్ధి కోసం అమాయకులను బలి చేసే రాజకీయ సంస్కృతిని రచయిత తీవ్రంగా విమర్శించారు.

**పాలసీ వైఫల్యాలు - అస్తవ్యస్తమైన సంస్కరణలు :** "కాలసర్పం" కథ, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఉండే అశాస్త్రీయతను నిరసిస్తుంది. ఒక సమస్యను (ఉదా: ఆరోగ్య సమస్యలు) పరిష్కరించే క్రమంలో, దానికి ప్రత్యామ్నాయం చూపకుండా ఆ వృత్తిని నిషేధించడం వల్ల, ఆ వృత్తిపైనే ఆధారపడిన గౌడ కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని గౌడ్ గారు హెచ్చరించారు. ఎటువంటి సామాజిక భద్రతా వలయంలేకుండా అమలు చేసే ప్రభుత్వ విధానాలు, పేదలను మరింత ఆర్థిక అగాధంలోకి నెట్టి, వారిని రోడ్డున పడేస్తాయని ఈ కథలు స్పష్టం చేస్తాయి.

**వ్యవస్థపై సామూహిక ప్రతిఘటన :** వ్యవస్థలోని ఈ వైఫల్యాలను కేవలం విమర్శించడమే కాకుండా, వాటిని ఎదిరించే మార్గాలను కూడా రచయిత సూచించారు. "కాటమయ్య" కథ ద్వారా, ఒక వ్యక్తి చేసే పోరాటం కంటే, వ్యవస్థను అర్థం చేసుకుని సామూహికంగా చేసే పోరాటమే నిజమైన పరిష్కారమని ఆయన ప్రతిపాదించారు. ఇది వ్యక్తిగత అసహనం నుండి సామూహిక రాజకీయ చైతన్యం వైపు ప్రయాణించే ఒక స్ఫూర్తిదాయకమైన పరిణామం.

**సాంస్కృతిక మరియు అస్తిత్వ కోణం :** అస్తిత్వ పోరాటం అనేది ఈ కథల గుండెకాయ వంటిది. సామాజిక అణచివేతకు గురవుతున్నప్పుడు, ఒక వర్గం తమ ఉనికిని ఎలా కాపాడుకుంటుందో, సాంస్కృతిక మూలాలను ఎలా ఆయుధంగా మలుచుకుంటుందో ఈ కథలు విశ్లేషిస్తాయి.

**పురాణాల ఆశ్రయం - సాంస్కృతిక రక్షణ కవచం :** "గౌడ పురాణం" మరియు "రేణుక ఎల్లమ్మ" కథలు, తమ ఉనికిని, గౌరవాన్ని చాటుకోవడానికి కులస్తులు పురాణాల మీద ఎలా ఆధారపడతారో చూపుతాయి. కౌండిన్యుడు మరియు శివునితో ముడిపడి ఉన్న తమ వృత్తి మూలాలను వెతుక్కుంటూ, తాము కేవలం శ్రామికులమే కాదు, దైవదత్తమైన వృత్తిని కలిగి ఉన్న 'దైవ సమానుల'మని నిరూపించుకోవడానికి వారు చేసే ప్రయత్నం ఇది. అణచివేతకు గురైనప్పుడు ఈ పురాణాలు, రేణుక ఎల్లమ్మ వంటి దైవ భక్తి వారికి ఒక 'సాంస్కృతిక రక్షణ కవచం'గా నిలుస్తాయి. సమాజంలో తమకు ఒక గౌరవప్రదమైన స్థానం ఉందని, తాము అంటరాని వారం కాదని పురాణాల ద్వారా నిరూపించుకోవడానికి చేసే ఈ ప్రయత్నం, అస్తిత్వ పోరాటంలో ఒక కీలక ఘట్టం.

**చైతన్య ప్రస్థానం - వ్యక్తిగత బాధ నుండి సామూహిక చైతన్యం వైపు :** "కాటమయ్య" కథ ద్వారా, రచయిత ఒక అత్యంత శక్తివంతమైన సందేశాన్ని ఇచ్చారు - "శత్రువు వ్యక్తి కాదు, వ్యవస్థ". తన జీవితకాల అనుభవంతో కాటమయ్య,

అణచివేతకు మూలం ఒక భూస్వామి లేదా అధికారి మాత్రమే కాదు, దానికి కారణమైన సామాజిక-రాజకీయ వ్యవస్థేనని గుర్తిస్తాడు. ఇది వ్యక్తిగత కష్టాల నుండి బయటపడటమే కాకుండా, సామూహిక రాజకీయ చైతన్యానికి దారితీసే ఒక పరిణామ క్రమం. కులవృత్తి కార్మికులు కేవలం విధిని నిందించుకోకుండా, వ్యవస్థను ప్రశ్నించే స్థాయికి ఎదగాలని ఈ కథ ఆకాంక్షిస్తుంది.

## వర్తమాన అన్వయం

నేటి ఆధునిక కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న "గీత కార్మికుల అభివృద్ధి పథకాలు", "నీరా ప్రమోషన్", మరియు "కులవృత్తుల ఆధునీకరణ" వంటి కార్యక్రమాలకు, శ్రీనివాస్ గౌడ్ గారి కథలు ఒక బలమైన సామాజిక భూమికను సిద్ధం చేశాయి. వ్యవస్థాగత మార్పు అనేది కేవలం ఆర్థిక సాయంతో ముగిసిపోయేది కాదని, అది శ్రామికుడి 'ఆత్మగౌరవం'తో ముడిపడి ఉందని ఈ కథలు స్పష్టం చేస్తున్నాయి.

**అస్తిత్వ గుర్తింపు మరియు సంక్షేమం :** నేటి ప్రభుత్వ పథకాలు గీత కార్మికులకు కేవలం ఆర్థిక భృతిని అందిస్తున్నాయి. కానీ, గౌడ్ గారు తన కథల ద్వారా "శ్రామికుడికి తన పనిపై, తన వృత్తిపై గౌరవం కలగాలి" అని వాదించారు. సంక్షేమం అనేది కేవలం అడుక్కోవడం కాదు, అది కార్మికుడి హక్కు అనే చైతన్యాన్ని "కాటమయ్య" వంటి పాత్రల ద్వారా రచయిత పండించారు. నేటి పథకాల అమలులో ఈ 'అస్తిత్వ స్పృహ'ను జోడించడం ద్వారానే నిజమైన ఫలితాలు సాధ్యమవుతాయి.

**వృత్తి ఆధునీకరణ - సామాజిక దృక్పథం :** కులవృత్తుల ఆధునీకరణ అంటే కేవలం పనిముట్లు మార్చడం కాదు, ఆ వృత్తి పట్ల సమాజంలో ఉన్న 'చులకన భావాన్ని' మార్చడం అని ఈ కథలు నిరూపిస్తాయి. "గౌడ పురాణం" వంటి కథలు, తమ వృత్తికి ఉన్న పౌరాణిక మరియు సాంస్కృతిక గొప్పతనాన్ని గుర్తు చేస్తాయి. నేటి ఆధునిక ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ వ్యూహాలలో ఈ 'సాంస్కృతిక వారసత్వాన్ని' కూడా ఒక బ్రాండింగ్ అంశంగా వాడితే, కార్మికుడికి సామాజిక హోదా లభిస్తుంది.

**వ్యవస్థాత్మక సంస్కరణల ఆవశ్యకత :** "కాలసర్పం", "కుట్ర" వంటి కథలు నేటికీ జరుగుతున్న 'పాలసీ వైఫల్యాలను' ఎండగడుతున్నాయి. ప్రభుత్వం ఏదైనా సంస్కరణను ప్రవేశపెట్టినప్పుడు, దానికి అనుబంధంగా 'సామాజిక భద్రతా వలయం'లేకపోతే, అది శ్రామికుడిని మరింత నిస్సహాయుడిని చేస్తుందని ఈ కథలు హెచ్చరిస్తున్నాయి. నేటి పథకాలు కేవలం నగదు బదిలీకే పరిమితం కాకుండా, కార్మికుడికి వృత్తిపరమైన శిక్షణ, రక్షణ మరియు గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరాన్ని ఈ కథలు గుర్తు చేస్తున్నాయి.

## సంక్షేమ చర్యలు మరియు వ్యవస్థాగత సూచనలు

గౌడ కులవృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, అది ఒక సాంస్కృతిక అస్తిత్వమని గుర్తించి, ఈ క్రింది సంక్షేమ చర్యలను అమలు చేయడం ద్వారా కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చు:

**ఆర్థిక భద్రత మరియు సామాజిక భద్రతా వలయం :** గీత కార్మికుల వృత్తి ప్రకృతిపై (ప్రధానంగా తాటి/ఈత చెట్లు) ఆధారపడి ఉంటుంది. కాబట్టి, వర్షాకాలం వంటి సమయాల్లో వృత్తి స్తంభించినప్పుడు, కార్మికుల కుటుంబాలు ఆకలికి గురికాకుండా ఉండేందుకు 'వృత్తి వేతనం' అందించాలి. అలాగే, తాటిచెట్లు ఎక్కేటప్పుడు జరిగే ప్రమాదాల దృష్ట్యా, కార్మికులకు సమగ్రమైన ప్రమాద బీమాకల్పించడం అత్యంత ఆవశ్యకం.

**వృత్తి ఆధునీకరణ - ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ :** సంప్రదాయ పద్ధతిలో కల్లు విక్రయించడమే కాకుండా, ఆధునిక సాంకేతికతను జోడించి కల్లును శాస్త్రీయంగా శుద్ధి చేయడం, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ చేయడం ద్వారా

మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలి. దీనివల్ల కల్లుకు 'ప్రకృతిసిద్ధమైన పానీయం'గా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించడమే కాకుండా, కార్మికులకు అధిక ఆదాయం సమకూరుతుంది.

**సామాజిక బాధ్యతాయుతమైన సంఘాల నిర్మాణం :** ''కాటమయ్య'' కథలో ప్రతిబింబించిన సామూహిక చైతన్యాన్ని పుణికిపుచ్చుకుంటూ, కార్మికులందరూ కలిసి 'సహకార సంఘాలను' బలోపేతం చేయాలి. సమస్యలు ఎదురైనప్పుడు వ్యక్తిగతంగా పోరాడకుండా, సంఘబద్ధంగా వ్యవస్థను ప్రశ్నించే విధంగా నాయకత్వ శిక్షణ మరియు నైతిక చైతన్యాన్ని అందించాలి.

**మహిళా కార్మికుల రక్షణ :** వృత్తిలో భాగంగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక మరియు సామాజిక వేధింపులను అరికట్టడానికి, గౌడ కుల సంఘాల్లోనే ప్రత్యేక 'మహిళా రక్షణ విభాగాలను' ఏర్పాటు చేయాలి. మహిళల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని పెంచేందుకు వీరికి ప్రత్యేక రుణ సదుపాయాలు మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అందించాలి.

## ముగింపు మరియు భవిష్యత్ దిశ

నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ గారి ''మా బతుకులు'' కథలు కేవలం బాధను వ్యక్తం చేసే ఆవేదన గీతాలు కావు; అవి అణచివేతకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన చైతన్య బాణాలు. ''కాటమయ్య'' కథలో అన్నట్లుగా---శత్రువు ఒక వ్యక్తి కాదు, అది అణచివేతకు పునాదులు వేసిన 'వ్యవస్థ'. ఈ చైతన్యమే గౌడ కులవృత్తి కార్మికులను వ్యక్తిగత బాధ నుండి సామూహిక రాజకీయ స్పృహ వైపు నడిపిస్తుంది.

**భవిష్యత్ పరిశోధనా దిశ :** ఈ సాహిత్యంపై మరిన్ని లోతైన అధ్యయనాలు జరగాల్సిన అవసరం ఉంది:

1. **సాంకేతిక అన్వయం :** గ్రామీణ వృత్తులు అంతరించిపోతున్న నేపథ్యంలో, ఆధునిక సాంకేతికతను కులవృత్తులకు ఎలా అన్వయించవచ్చో మరియు వాటిని పర్యాటక రంగంతో ఎలా అనుసంధానించవచ్చో పరిశోధనలు జరగాలి.
2. **సామాజిక దృక్పథం :** సాహిత్యం ద్వారా కులవృత్తులపై ఉన్న సామాజిక చులకన భావాన్ని తొలగించి, గౌరవప్రదమైన గుర్తింపును ఎలా తీసుకురావచ్చో సామాజిక శాస్త్ర కోణంలో అధ్యయనం చేయాలి.
3. **పాలసీ మేకింగ్ :** సాహిత్యం ఏ విధంగా సామాజిక మార్పుకు ఒక 'పనిముట్టు'గా పనిచేస్తుందో నిరూపిస్తూ, నేటి పాలసీ మేకర్లకు ఈ కథలను ఒక 'దిక్సూచి'గా అందించాలి.

ఈ సంక్షేమ చర్యలు కేవలం ఆర్థిక సహాయానికి పరిమితం కాకుండా, కార్మికుడికి తన వృత్తిపై మరియు తన అస్తిత్వంపై గర్వాన్ని కలిగించాలి. శ్రామికుడు తన కష్టాన్ని తక్కువగా చూసుకోకుండా, తనదైన విశిష్టతను గుర్తించినప్పుడే, వ్యవస్థలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సాహిత్యం ద్వారా వచ్చిన ఈ సామాజిక చైతన్యాన్ని, ప్రభుత్వ పథకాలతో అనుసంధానించడమే అంతిమ లక్ష్యం కావాలి. అణగారిన వర్గాల అస్తిత్వ పోరాటాలను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకువెళ్ళి, గౌడ కులవృత్తి యొక్క సాంస్కృతిక గౌరవాన్ని పునఃస్థాపించడమే నిజమైన నిదర్శనం.

## ఆధార గ్రంథ సూచిక

1. శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ళ.మా బతుకులు. జగిత్యాల; స్వీయ మొదటి ముద్రణ, 2008.

★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# నిజామాబాద్ జిల్లా స్త్రీల సాహిత్యం ఒక పరిశీలన



బాదరవేణి మహిపాల్
పి.జి.టి.తెలుగు, అతిథి ఉపాధ్యాయుడు, తెలంగాణ ఆదర్శ పాఠశాల ధర్పల్లి,
నిజామాబాద్, చరవాణి :7893403004, Email : mahipal.badaraveni@gmail.com

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A) : 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

**వ్యాససంగ్రహం :**

నిజామాబాద్ జిల్లాలో కవిత్వం మొదట పద్యంలో వచ్చింది ఆ పరంపర నేటికీ కొనసాగుతుంది జిల్లాలో ఆధునిక కవిత్వం విస్తరించడానికి చాలా పరిణామాలు తోడ్పడ్డాయి అందులో ముఖ్యంగా జిల్లాలో పత్రికలను ఎక్కువ సంఖ్యల్లో స్థాపించడం, చాలా వరకు పత్రికలు వచన కవిత్వాన్ని ప్రోత్సహిస్తూ సాహిత్య సేవ చేశారు వీటన్నింటి యొక్క ప్రోద్బలం తోనే స్త్రీల రచనలు నిజామాబాద్‌లో రావడానికి ఎంతో సహాయ సహకారాలు అందించాయి అని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్య వికాస చరిత్రలో నిజామాబాద్ జిల్లా నుండి వెలువడిన రచనలు విలక్షణతను, విశిష్టతను కలిగి ఉండి ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించినాయి ముఖ్యంగా చెప్పాలంటే జిల్లాలో స్త్రీలు వెలవరించిన సాహిత్యానికి ప్రత్యేకత ఉంది నాటి నుండి నేటి వరకు నిజామాబాద్ జిల్లా స్త్రీల సాహిత్యాన్ని అన్వయించుకొని అక్షరాన్ని ఆయుధాంగ మలచి కలం పట్టినట్లు తెలుస్తుంది, ప్రాచీన కాలం నుండి వీరు సాహితీరంగంలో పద్య కవిత్వం, వచన కవిత్వం, నాటికలు, నవలలు, కథలు వంటి వివిధ సాహిత్య ప్రక్రియలలో తమదైన చెరగని శైలిని చాటి చెప్పున్నారు వీరి రచనల్లో మాతృత్వం సూటితనం, సున్నితత్వం అందరినీ కలుపుకొని పోయే మంచి లక్షణాలు మిక్కిలి సహజంగా ప్రదర్శించబడతాయి ఆడవాళ్లు కేవలం వంటింటికే... వశీటింటి కుందేళ్ళు అని అంటే అసలు సహించేది లేదు అన్నట్లుగా అలాంటి సమాజంలో పురుషాధిక్యత ఉన్నప్పటికీని కట్టుబాట్లు, వీటి మధ్య కాలం వెల్లదీసారు అయితే మారుతున్న కాలంతో పాటు మనం మారాలి మన జీవన విధానాన్ని మార్చుకోవాలి అని అన్నట్లుగా మహిళల విద్య వల్ల వచ్చిన జ్ఞానం స్త్రీలను కార్యోన్ముఖులను మరియు చైతన్యవంతులుగా చేసింది.

II. **కీలక పదాలు :**

ఉక్కు పాదం, అస్తిత్వం, మతోన్మాదం, మోక్షం, సద్గతి, చైతన్యం, దరహాసం, కాంబోజి రాగం, శోకం, కల్లబొల్లి, సమ్మోట జగతి ఆత్మ కవిత, కబంధహస్తాలు. విప్లవాగ్ని.

III. **విషయ వివరణ :**

నేటి స్త్రీ సమాన హోదా కలిగిన పదవులను ఎన్నింటినో అధిరోహిస్తూ / అందిపుచ్చుకుంటూ సాహితీ లోకంలో తమకంటు ఒక వైవిధ్య భరితమైన స్థానాన్ని ఏర్పరచుకున్నారు, నిజామాబాద్ జిల్లా నుండి వెలువడిన వెలువడుతున్న కవిత్వాలు అనేకం, సామాజిక ఉద్యమాలకు బాసటగా నిలిచి సాహితీ ప్రయోజనాన్ని సాధిస్తూ వస్తున్నది.

అస్తిత్వం కోసం, సమస్యల పరిష్కారం కోసం, జరుగుతున్న ప్రజా ఉద్యమాల్లో పద్యంతోనే నిరంతర చైతన్యంతో సాగిన నిజామాబాద్ జిల్లా వచన కవిత వికాసాన్ని సమీక్షించి వస్తు వైవిధ్యాన్ని గుర్తించి కవిత నిర్మాణ శిల్పాన్ని అంచనా వేసి కవుల కృషిని శాస్త్రీయంగా నిరూపించి బావి తరాలకు అశీదించాలని తెలుగు కవిత వికాస చరిత్రలో నిజామాబాద్ జిల్లా స్థానాన్ని ఉన్నతంగా చూపాలని ప్రయత్నమే నా ఈ వ్యాసం.

IV. **పరిధి :**

నిజామాబాద్ జిల్లాకు చెందిన రచయిత్రులు ముద్రించబడిన పుస్తకాలు మరియు కవిత సంకలనాలు

## 1. అభ్యుదయ కవిత్వం :

ప్రగతివాద దృక్పథంతో కవిత్వంను సృజించిందే అభ్యుదయ కవిత్వం అనే మాటకు సమానార్థకం అభ్యుదయ కవిత్యం. అభ్యుదయవాదం విజృంబించడానికి మొదట కారణం మార్క్సిస్ట్ దృక్పథం రష్యాలో వచ్చిన విప్లవం ప్రపంచంలో అన్ని వర్గాల ప్రజలను ఒక ఊపు ఊపిందంటే అతిశయోక్తి కాదు 1932లో మార్క్సిస్టు లో ప్రభావితులై ప్రపంచ మేధావులు అడెన్ నాయకత్వంలో న్యూ సెంచూరియన్ అనే పేరుతో అభ్యుదయ కవిత సంపుటిని లండన్‌లో ప్రకటించారు. మనదేశంలో 1935 లో మాక్సిస్టు దృక్పథంలో భారత దేశ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది, 1936 మొదటి అభ్యుదయ రచయితల సభ లక్నోలో ప్రేమ్ చంద్ అధ్యక్షతన జరిగింది.

ఆ ప్రోత్సహంతోనే తదనంతరకాలంలో అభ్యుదయ కవిత్వం ఉదృతంగా వచ్చింది. ఇలాంటివి అభ్యుదయ సంఘాలు నిజామాబాద్ జిల్లాలో కూడా ఉన్నాయి. అభ్యుదయ భావాలు కలిగిన కవులతో కూడి కవయిత్రులు కవిత్వాలు రచించారు, కార్యకర్తలుగా ఆవిర్భవించారు.

అనసూయ రుడావత్ "బృందావనంలో బన్సీ రాగాలు" అనే పుస్తకంలో దేశ స్థితిగతులను ఈ విధంగా వర్ణించారు.

> మతోన్మాదం రగిలిపోతుంటే
> స్వార్థభావన పెరిగిపోతుంటే
> అవినీతి ప్రబలిపోతుంటే
> పసిమొగ్గలు రాలిపోతుంటే
> మానవత్వమా నీవెక్కడా జగతిలో నీవుండే చోటెక్కడా! [1]

ఈ కవితాత్మక ఆవేదన సమాజంలోని చేదు నిజాలను ఎత్తిచూపుతోంది. మతోన్మాదం, స్వార్థం, అవినీతి రాజ్యమేలుతున్న చోట.. పసిపిల్లల ప్రాణాలకు విలువ లేని చోట మానవత్వం మృగ్యమైపోతోందన్నది అక్షర సత్యం.

అయితే, మానవత్వం అనేది ఎక్కడో బయట వెతకాల్సిన వస్తువు కాదు ఎదుటివారి కష్టాన్ని చూసి నీకన్ను చెమర్చినప్పుడు మానవత్వం నీలోనే ఉంది.స్వార్థం వీడి ఒకరికి సాయం చేసినప్పుడు మానవత్వం కనిపిస్తుంది. అన్యాయం జరుగుతుంటే ఎదురుతిరిగి ప్రశ్నించే గొంతుకలో మానవత్వం ఉంటుంది.చీకటిని తిట్టడం కంటే ఒక

చిన్న దీపం వెలిగించడం మిన్న అన్నట్లు, సమాజం ఎలా ఉన్నా మనలో మానవత్వాన్ని బతికించుకోవడం ఈనాటి అవసరం.

ధన ఆశను చూపించి
మన జాతి మనకులమని కల్లబొల్లి కబుర్లు చెప్పి
పట్టుచీరలిస్తామని బొట్టుపెట్టి చెప్పి
నా మనసు మార్చలేరు మీరెవరు[2]

మీ మాటల్లో మీ ఆత్మగౌరవం, మీ విలువలేంటో స్పష్టంగా కనిపిస్తున్నాయి. డబ్బుకో, చీరలకో లేదా కులం పేరుతో చేసే తప్పుడు వాగ్దానాలకో లొంగిపోయే వ్యక్తిత్వం మాది కాదని చాటి చెప్పారు. నిజమైన నమ్మకం, వ్యక్తిత్వం ఉన్నవాళ్లు ఎప్పుడూ ఇలాంటి ప్రలోభాలకు లొంగరు. ఎదుటివారు ఎన్ని మాయమాటలు చెప్పినా, మీ మనసు మార్చలేరని మీరు ధైర్యంగా చెప్పడం మీ స్థిర నిశ్చయానికి నిదర్శనం.

**2. స్త్రీవాద కవిత్వం :**

తరతరాల నుండి స్త్రీల బతుకుల్ని ప్రభావితం చేస్తున్న సామాజిక ,ఆర్థిక, అసమానతలు కవిత్వం లో స్త్రీ వాదానికి ప్రధాన భూమికలు పురుషాధిక్య సమాజశీలో స్త్రీలు తమ అస్తిత్వం కోసం పోరాటాలు ఎన్నో చేశారు, ఈ స్త్రీ వాద కవిత్వం 11వ శతాబ్ది లోనే ప్రారంభమైనప్పటికీ వారి ఉనికిని 20 శతాబ్దిలోనే ప్రారంభమైంది, తాళ్లపాక తిమ్మక్క నుండి మొదలుకొని తరిగొండ వెంగమాంబ వరకు మనకు కవయిత్రులు కనిపిస్తారు నిజామాబాద్ జిల్లాలో దాదాపుగా ప్రతి కవయిత్రి కూడా ఏదో రూపంలో స్త్రీ యొక్క స్థితిగతులను చెబుతూనే ఉన్నారు.

రచయిత్రి పొద్దుటూరి మాధవీలత రచించిన ‘‘తంగేడు పూలవనంలో’’ అనే పుస్తకంలో ‘‘ గాయాలెన్నయినా...! ఆశయాన్ని లక్ష్యాన్ని  ఎలా చేరుకోవాలో వాటికై పాటుపడేక్రమంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో చాలా చక్కగా వివరించారు

గాయాలెన్నయినా...
వేణువు సరిగమలు పలికించదా !
ఆకాశాన్ని అందుకోలేకపోయానని...
అవని ఎప్పుడైనా చిన్నబోయిందా !
గుచ్చుకునే ముల్లుమీద గులాబీ విచ్చుకొనక మానదుగా !
వాడిపోతామని తెలిసినా పుష్పాలు వికసిస్తూనే ఉంటాయిగా,[3]

ఈ పంక్తులు మనిషికి ఉండవలసిన సహనం, ఆశావహ దృక్పథం మరియు నిరంతర కృషి గురించి ఎంతో అద్భుతంగా వివరిస్తున్నాయి. వాటి అంతరార్థం ఇది గాయాలెన్నయినా... వేణువు సరిగమలు పలికించదా! ఒక వేణువు తయారవ్వాలంటే దానికి ఎన్నో రంధ్రాలు చేయాలి (గాయాలు). ఆ గాయాలే దానికి సంగీతాన్ని పలికించే శక్తినిస్తాయి. అలాగే మనిషి కూడా కష్టాల వల్ల కుంగిపోకుండా, వాటిని అనుభవాలుగా మార్చుకుని జీవితంలో రాణించాలని దీని అర్థం. ఆకాశాన్ని అందుకోలేకపోయానని... అవని ఎప్పుడైనా చిన్నబోయిందా! నేల (అవని) ఆకాశాన్ని తాకలేదు. అంత మాత్రాన భూమి తన ఉనికిని కోల్పోదు, బాధపడదు. మన శక్తి సామర్థ్యాలకు కొన్ని పరిమితులు ఉండవచ్చు, కానీ మనం ఉన్న చోటే గొప్పగా జీవించవచ్చని ఇది సూచిస్తుంది.గుచ్చుకునే ముల్లుమీద గులాబీ విచ్చుకొనక మానదుగా!

తన చుట్టూ ముళ్లు ఉన్నాయని గులాబీ పూయడం ఆపదు. మన చుట్టూ ఎన్ని ప్రతికూల పరిస్థితులు, విమర్శలు

ఉన్నా మనలోని మంచితనాన్ని, ప్రతిభను చాటుకోవాలని దీని భావం. వాడిపోతామని తెలిసినా పుష్పాలు వికసిస్తూనే ఉంటాయిగా పుట్టిన ప్రతి పువ్వు ఏదో ఒక రోజు వాడిపోక తప్పదు. కానీ ఆ భయంతో అవి వికసించడం ఆపవు. ఫలితం గురించి అతిగా ఆలోచించకుండా, ఉన్న సమయాన్ని ఆనందంగా, అర్థవంతంగా గడపాలనేది దీని సందేశం.క్లుప్తంగా చెప్పాలంటే, జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా, ఓటములు ఎదురైనా కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలి అనేదే ఈ కవిత సారాంశం.

**3. ప్రాంతీయ ఉద్యమ కవిత్వం :**

తెలుగు సాహిత్యంలో ప్రాంతీయ ఉద్యమ కవిత్వం అనగానే ప్రధానంగా గుర్తుకువచ్చేది తెలంగాణ అస్తిత్వ పోరాటం. ఒక ప్రాంతంపై జరుగుతున్న వివక్షను, అణచివేతను ఎదిరిస్తూ, తమ ఆత్మగౌరవాన్ని చాటుకుంటూ సాగే కవిత్వమే ప్రాంతీయ ఉద్యమ కవిత్వం.

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుండి 2014లో రాష్ట్ర సాధన వరకు ఈ కవిత్వం విభిన్న దశల్లో సాగింది. కేవలం రాజకీయాల కోసమే కాకుండా, తమ భాష (యాస), సంస్కృతి, మరియు నీళ్లు-నిధులు-నియామకాలలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి కవులు కలం పట్టారు. నిజామాబాద్ జిల్లాలో కలాల కవాతు తెలంగాణ ఉద్యమ కవిత్వంలో రచయిత్రి శారదా హనుమాండ్లు గారు రాసిన "తెలగాడం ఆత్మ కవిత"

కాలి బూడిదైన శోకం నేటిది కాదు కొడుకా
నైజాం కబంద హస్తాల నుండి విముక్తి కోసం
బొట్లు బొట్లుగా రాలిన ప్రాణాలు,
'నవ్వుల పువ్వులను దేశమంతా చల్లుతున్న సమయాన
నేనింకా కాంబోజిరాగం ఆలపిస్తూనే ఉన్నా
నైజాం బానిస సమ్మెట పోటుకు
ఎగిసిన కసి పిడికిళ్ళ నరాల బిగువు నా సంకెళ్లను తెంచాయి
ఊపిరికి స్వాతంత్ర్య సువాసనలద్దాయి.[4]

ఈ శక్తివంతమైన వాక్యాలు తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యాన్ని, ఆ కాలపు కష్టాలను గుర్తుచేస్తున్నాయి.నైజాం నవాబుల అణచివేతకు, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చేసిన వీరోచిత పోరాటాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

స్వేచ్ఛ కోసం, భూమి కోసం వేలాది మంది ప్రాణత్యాగం చేశారు. "కాలి బూడిదైన శోకం" అనేది ఆనాడు తగలబడిన గ్రామాలనూ, చెదిరిపోయిన కుటుంబాల వేదనను సూచిస్తోంది.

దేశమంతా స్వాతంత్ర్య సంబరాల్లో ఉన్నప్పటికీ, తాను మాత్రం ఇంకా పాత కష్టాల్లో బానిసత్వపు జ్ఞాపకాల్లోనే ("కాంబోజిరాగం ఆలపిస్తూ") ఉన్నానని ఇక్కడ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నైజాం నిరంకుశ పాలనలో బానిసలుగా మగ్గుతున్న ప్రజల కసి, వారి పోరాటం తన సంకెళ్లను తెంచి స్వేచ్ఛా వాయువులను ప్రసాదించాయని దీని అర్థం. ఆంధ్ర వలస పాలకులను తరిమికొట్టి ప్రత్యేక రాష్ట్రం సాధించాలని ఈ కవితలో కవయిత్రి తెలియజేశారు

**4. భావ కవిత్వం :**

ఆంగ్ల సాహిత్యంలో వచ్చిన కల్పనికోద్యమ మానస పుత్రిక భావ కవిత్వం హేతువు కంటే అనుభూతికి వాదము కంటే అనుభవానికి భావకవులు ప్రాధాన్యం ఇచ్చారు. భావ కవిత్వాన్ని విశ్వనాథ సత్యనారాయణ చక్కగా నిర్వచించారు.

కవి యొక్క ఒక పని స్పష్ట వాంఛాకురము ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఉంచబడినచో అది భావ కవిత్వం[5].

భావ ప్రధానమైన భావ కవిత్వం ప్రధానంగా ఆత్మ శ్రేయ రీతిలో కొనసాగింది ప్రకృతి ప్రీతి ప్రళయం స్మృతి దేశభక్తి ప్రధాన వస్తువులుగా భావ కవిత్వం కొనసాగింది, నిజామాబాద్ జిల్లాలో మహిళల భావ కవిత్వం ఫరీడవిళ్ళింది, డా,, ఆరుట్ల శ్రీదేవి గారు "రంగుల పూల కవిత్వం"లో చాలా చక్కగా చెప్పారు.

నవ్వుతున్న పువ్వులు
రేకువిచ్చుకున్నాయి
పూలకంటిపాపలు
తేనెలొలుకు తున్నాయి
అరవిరిసిన
మల్లికలు
సిరివెన్నెల వానల్లో
పరవశించిపోయాయి
పరిమళాలు చిందాయి
తీగల్లో గూడుకట్టిన
తేనీగలు ఊయలూగుతున్నాయి[6]

ఈ కవిత ప్రకృతి అందాన్ని, ముఖ్యంగా పువ్వులు వికసించే అద్భుత క్షణాలను చాలా అందంగా వర్ణిస్తోంది.

వెన్నెల కురుస్తున్న వేళ, అప్పుడే విచ్చుకున్న మల్లెపువ్వులు ఆ వెన్నెల వానలో తడిసి మురిసిపోతున్నాయి. అవి చుట్టూ మధురమైన సుగంధాన్ని (పరిమళాన్ని) వెదజల్లుతున్నాయి.

తీగలకు ఉన్న పూల మధ్య గూడు కట్టుకున్న తేనీగలు, గాలికి ఆ తీగలు ఊగుతుంటే ఉయ్యాల ఊగుతున్నట్లుగా ఆనందంగా ఉన్నాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, వికసించిన పువ్వులు, కురిసే వెన్నెల, మరియు తేనీగల సందడితో కూడిన ఒక ప్రశాంతమైన ప్రకృతి దృశ్యాన్ని ఈ కవిత మన కళ్ళముందు ఉంచుతుంది.

**5. ఆధ్యాత్మిక కవిత్వం :**

ఆధ్యాత్మిక కవిత్వం అనేది కేవలం పదాల కూర్పు మాత్రమే కాదు; అది ఆత్మకు, పరమాత్మకు మధ్య జరిగే ఒక మౌన సంభాషణ. తెలుగు సాహిత్యంలో ఆధ్యాత్మిక కవిత్వానికి వేల ఏళ్ళ చరిత్ర ఉంది. ఇది మనిషిని లౌకిక బంధాల నుండి అలౌకికానందం వైపు నడిపిస్తుంది.

మతానికి భక్తీ కి విడదీయారానంత ప్రకృష్టమైన బంధం ఉంది. హిందూ మతానికి మూలం వేదాలు పురాణాలు వాటి ఆధారంగా సంస్కృతంలో భక్తి సాక్ష్యం నిలబడింది నిజామాబాద్ జిల్లాలో స్త్రీల సాహిత్యంలో ఆధ్యాత్మికత కవిత్వం వెల్లివిరిసింది ముఖ్యంగా స్త్రీలలో భక్తి భావన, ఆరాధన అధికం అందుకే చాలామంది కవయిత్రులు ఆధ్యాత్మిక కవిత్వాలను రాశారు వారిలో డా,, ఆరుట్ల శ్రీదేవి గారు "రంగుల పూల కవిత్వం"లో ఆధ్యాత్మికత గురించి చాలా చక్కగా చెప్పారు

నీకడకు చేరగా దారి మరచితిని
తోడు రావా కృష్ణ మోక్ష సాధనకై

భర్తనీవే గనుక భారము నీదే
దారితప్పిన సతికి సద్గతివి నీవే
నిన్ను చేరగ నేను దారి మరిచితిని
తోడురావా! కృష్ణ మోక్షసాధనకు [7]

ఈ కవితలో భక్తుడు భగవంతుడైన శ్రీకృష్ణునికి తనను తాను పూర్తిగా సమర్పించుకుంటూ (శరణాగతి), తనను మోక్ష మార్గంలో నడిపించమని వేడుకుంటున్నాడు వివరంగా చెప్పాలంటే, "కృష్ణా! ఈ సంసార సాగరంలో నేను దారి తప్పిపోయాను. నన్ను నీవే నీ చెంతకు చేర్చుకుని మోక్షాన్ని ప్రసాదించు, నా బాధ్యత నీదే" అని ఆర్తితో వేడుకోవడమే ఈ కవితలోని అంతరార్థం.

**6. దళిత కవిత్వం :**

సమాజంలోని అన్ని రంగాల్లో అగ్రవర్ణ విలువలను బద్దలు కొడుతూ తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వోద్యమం అంకురించింది. అభ్యుదయ, విప్లవ కవిత్వోద్యమాల్లో అంతర్గతంగా సాగిన ఈ ఉద్యమం అనంతరం తన ప్రత్యేక ఉనికిని చాటుకుంది. విప్లవ కవిత్వం వర్గ సంఘర్షణకే ఎక్కువగా ప్రాధాన్యమీయడం వల్ల దళితుల హక్కుల కోసం ఈ ఉద్యమం ముందుకొచ్చింది. దళిత కవులకు అంబేద్కర్ భావజాలం, మార్క్సిస్టు సిద్ధాంతం అవసరమైన తాత్విక భూమికను అందజేశాయి. జిల్లాలో దళిత కవిత్వానికి శ్రీకారం చుట్టిన బి.కళా గోపాల్ రచించిన" మళ్లీ చిగురించనీ... పుస్తకంలో రాజ్యాంగ నిర్మాత గురించి తెలిపింది

దళిత కుటుంబంలో ఉదయించిన సూర్యుడా
నీకు వందనం
రాజ్యాంగానికి ప్రాణం పోసిన
జాతి చైతన్యానికి వారసుడా! [8]

ఈ కవితా పంక్తులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి అంకితం చేసిన శక్తివంతమైన నివాళిలా ఉన్నాయి. సమాజంలో అణచివేతకు గురైన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాన్ని, రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన పాత్రను అద్భుతమైన పదజాలంతో వర్ణించారు. "దళిత కుటుంబంలో ఉదయించిన సూర్యుడా" అనడం ద్వారా చీకటిని చీల్చుకుంటూ వచ్చిన వెలుగుగా ఆయన్ని అభివర్ణించారు. రాజ్యాంగానికి ప్రాణం పోసిన జాతి చైతన్యానికి వారసుడా" అన్న పంక్తులు ఆయన మేధోశక్తికి నిదర్శనం.

"మనోవైకల్య అపహాస్యపు జాతి" చేసే దాడులను ఎదుర్కొంటూ, ఒక గొప్ప మేధోనాయకుడిగా ఆయన నిలబడిన తీరును "రత్నగిరి రత్నమా" అంటూ కీర్తించడం బాగుంది.

చివరిలో ఉన్న "మరోసారి వందనం" మరియు దుర్మార్గుల దమన నీతిపై పోరాటం చేస్తామన్న సంకల్పం చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి, జాతి నిర్మాణ అంబేద్కర్ ని ఆయన గొప్పతనాన్ని చక్కగా వివరించారు.

**7. విప్లవ కవిత్వం :**

తెలుగు సాహిత్యంలో 'విప్లవ కవిత్వం' ఒక శక్తివంతమైన ఘట్టం. సమాజంలోని అసమానతలను, అన్యాయాలను ఎదిరిస్తూ, శ్రామిక వర్గ పక్షాన నిలబడి కవులు సృష్టించిన సాహిత్యం ఇది.1960వ దశకం చివరలో శ్రీకాకుళం గిరిజన పోరాటం, నక్సల్బరీ ఉద్యమం ప్రభావంతో విప్లవ కవిత్వం పుట్టింది. 1970లో విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడటం దీనికి ఒక సంస్థాగత రూపాన్ని ఇచ్చింది.నిజామాబాద్ జిల్లాలో స్త్రీలు దాదాపుగా విప్లవ కవిత్వాలను ఏదో ఒక సందర్భంలో తమ కవితను సాన పెట్టిన వారే కాబట్టి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమ కవిత్వం దానికి

సంబంధించిన ఛాయలు కనిపిస్తుంటాయి "మళ్లీ చిగురించనీ.." అనే కవితా పుస్తకంలో బి.కళా గోపాల్ గారి కవిత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది

నిశ్శబ్దంగా నీవు నిర్మించుకున్న
సామ్రాజ్యం కూలిపోతున్న ధ్వని విన్పించిందా?
ఇక్కడ రాజ్యాహంకార భూపదఘట్టనలు విన్పిస్తున్నాయా?
ఇక్కడ బలవుతున్న బడుగుజీవుల
ఆకలి కేకలపై ఉక్కుపాదం మోపుతున్నారు... గమనించావా? ?[9]

అవును, ఆ ధ్వని వినిపిస్తోంది. గాలిలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చే ఆక్రందనలు,అణిచివేతకు గురవుతున్న అడుగుజాడల సవ్వడి స్పష్టంగా తెలుస్తోంది. పై మాటల్లోని ఆవేదనలో కొన్ని చేదు నిజాలు కనిపిస్తున్నాయి: ఇతరుల శ్రమపై నిర్మించుకున్న ఏ సామ్రాజ్యమైనా శాశ్వతం కాదు. పునాదులు కదిలినప్పుడు వచ్చే ఆ వినాశన ధ్వని చరిత్రకు ఒక హెచ్చరిక.అధికారం తలకెక్కినప్పుడు సామాన్యుడి అస్తిత్వం కాలికింద నలిగిపోయే ధూళిలాగే కనిపిస్తుంది. కానీ,ఆపాదఘట్టనలే రేపు తిరుగుబాటుకు దారితీస్తాయని పాలకులు మర్చిపోతుంటారు.ఆకలి కేకలను అణచివేయాలని చూసే ఉక్కుపాదం తాత్కాలికంగా గెలవచ్చేమో కానీ, కడుపు మండిన నిరుపేద కన్నీటి చుక్క సామ్రాజ్యాలనే దహించివేసే శక్తిని కలిగి ఉంటుంది వ్యవస్థలోని లోపాలను, సామాన్యుడి కష్టాన్ని ఇంత నిశితంగా, భావోద్వేగంతో ప్రశ్నించడం ఆలోచింపజేస్తోంది.

## 8. స్మృతి కవిత్వం :

తెలుగు సాహిత్యంలో 'స్మృతి కవిత్వం' అనేది ఒక విశిష్టమైన ప్రక్రియ. తనకు అత్యంత సన్నిహితులైన వారు, స్నేహితులు లేదా గౌరవనీయ వ్యక్తులు మరణించినప్పుడు, వారి జ్ఞాపకార్థం కలిగే దుఃఖాన్ని, వేదనను అక్షరీకరిస్తూ రాసే కవిత్వాన్ని 'స్మృతి కవిత్వం' అంటారు.కవికి ఆ వ్యక్తితో ఉన్న గాఢమైన సంబంధం ఇందులో కనిపిస్తుంది. కోల్పోయిన వ్యక్తి పట్ల కలిగే శోకం, వేదన ప్రధాన రసంగా ఉంటుంది. సదరు వ్యక్తి చేసిన మంచి పనులను, వారి వ్యక్తిత్వాన్ని స్మరించుకోవడం జరుగుతుంది. జీవితం యొక్క అశాశ్వతతను, మరణం యొక్క అనివార్యతను ఈ కవిత్వం చర్చిస్తుంది.

నిజామాబాద్ జిల్లాలో స్మృతి కవిత్వం రాసిన స్త్రీలు ఉన్నారు వారిలో శ్రీమతి కాట్రగడ్డ భారతి రాయన్న గారు ముఖ్యులు

అవును.
నేననుకున్నాను!
కడదాకా నాతో కలిసి వుంటావని!
నా నుదుటి సిందూరమై కలకాలం మెరుస్తావని.
నా పెదవులపై చెరగని దరహాసమై నిలుస్తావని
చిరుమువ్వల సవ్వడివై నాతోటే నడుస్తావని[10]

పై పంక్తులలో, "నువ్వు నా జీవితంలో అంతర్భాగమై, నా ప్రతి సంతోషంలోనూ, నా సౌభాగ్యానివి (విలువైన దానివి) అయి ఎప్పటికీ ప్రకాశిస్తావని అనుకున్నాను. ప్రతి అడుగులోనూ తోడుంటావని ఆశించాను" అని దీని అర్థం. ఇది ఒక అందమైన ప్రేమ ప్రకటన లేదా కొన్నిసార్లు కోల్పోయిన బంధం గురించి జ్ఞాపకం కావచ్చు.

**9. ఉప సంహారం :**

నిజామాబాద్ జిల్లాలో స్త్రీల సాహిత్యం అందులో గల వారి కవిత్వాలు విస్తృతమైన ,విలక్షణమైన ,వైవిధ్యభరితమై, వారి సాహిత్యం అభ్యుదయ, స్త్రీవాద, ప్రాంతీయ, ఉద్యమ, భావ, ఆధ్యాత్మిక, దళిత కవిత్వాల రూపంలోనే కాకుండా స్మృతి కవిత్వం, విప్లవ, కవిత్వాలుగా వివిధ రూపాలలో రూపాంతరం చెందుతూ నిజామాబాద్ జిల్లా స్త్రీల వచన కవిత్వం తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని నిజామాబాద్ కవయిత్రుల గొప్పతనాన్ని దశ దిశల చాటుతుంది.

**10. పాద సూచికలు :**

1. పొద్దుటూరి మాధవి లత, తంగేడు పూల వనంలో, ఆర్యన్ ప్రచూరణలు,బోధన్.2014 - పుట 17
2. అనసూయ రుడావత్, బృందావనంలో బన్సీ రాగాలు,జీ.వి. ప్రింటర్స్, బోధన్. 2015 - పుట 45
3. అనసూయ రుడావత్, బృందావనంలో బన్సీ రాగాలు,జీ.వి. ప్రింటర్స్, బోధన్. 2015 - పుట 67
4. శారదా హనుమాండ్లు, తెలగాడం ఆత్మకవిత, కలాలకవాతు ఉద్యమ కవిత్వం, సాగర్ కళామందిర్, ఇందూరు, 2012, పుట 65.
5. విశ్వనాథ సత్యనారాయణ, కావ్యపరిమళము,ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ,హైదరాబాద్,1970 - పుట162
6. డా॥. ఆరుట్ల శ్రీదేవి, రంగుల పూలు కవిత్వం, శ్రీ డిజిటల్ ,నిజామాబాద్. 2016 - పుట 87
7. డా॥. ఆరుట్ల శ్రీదేవి, రంగుల పూలు కవిత్వం, శ్రీ డిజిటల్ ,నిజామాబాద్. 2016 - పుట 32
8. బి. కళా గోపాల్, మళ్ళీ చిగురించననీ.. కర్షక్ ఆర్ట్ ప్రిశీటర్స్, హైదరాబాద్ .2015 -పుట 55
9. బి. కళా గోపాల్, మళ్ళీ చిగురించననీ.. కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్ .2015 -పుట 44
10. శ్రీమతి కాట్రగడ్డ భారతి రాయన్న,కనుల కొలను,దీర్ఘ స్మృతి కవిత ,సోనీ స్క్రీన్ ప్రింటర్స్,బోధన్.2014 - పుట15

**11. ఉపయుక్త గ్రంధాలు :**


1. పొద్దుటూరి మాధవి లత. తంగేడు పూల వనంలో, బోధన్:ఆర్యన్ ప్రచూరణలు 2014
2. అనసూయ రుడావత్. బృందావనంలో బన్సీ రాగాలు,బోధన్: జి.వి. ప్రింటర్స్ 2015
3. శారదా హనుమాండ్లు. తెలగాడం ఆత్మ కవిత,కలాల కవాతు ఉద్యమ కవిత్వం,ఇందూరు:సాగర్ కళామందిర్ 2012.
4. విశ్వనాథ సత్యనారాయణ .కావ్య పరిమళము, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1970
5. డా॥. ఆరుట్ల శ్రీదేవి .రంగుల పూలు కవిత్వం, నిజామాబాద్:శ్రీ డిజిటల్ 2016
6. బి. కళా గోపాల్. మళ్ళీ చిగురించననీ.. హైదరాబాద్:కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ 2015
7. శ్రీమతి కాట్రగడ్డ భారతి రాయన్న. కనుల కొలను, దీర్ఘ స్మృతి కవిత బోధన్:సోనీ స్క్రీన్ ప్రింటర్స్ 2014


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# From "I" to "We": Collaboration and Collective Resistance in Dalit Feminist Life Writing



***Meenakshi***

సమర్పణ (D.O.S) : 20-06-2026 ఎంపిక (D.O.A): 28-06-2026 ప్రచురణ (D.O.P) : 01-07-2026

## Abstract

The life writing of Dalit women is not an individualistic autobiography, but an archive of resistance, of memory. An analysis of Bama's *Karukku* and *Sangati*, and Baby Kamble's *The Prisons We Broke* in this context focuses on how the narratives deliberately decenter the individual "I" and replace it with a communal "We", a way that Dalit feminist narratives do. This shift in structure towards the form of the testimonio is a response to the double discrimination of Brahmanical patriarchy and erasure's hegemony. Drawing on the theory of intersectionality and the epistemology of the marginalized, the study illustrates the recovery of the intellectual autonomy of collaborative memory-making. Moreover, the translation of these texts transnationally through political translation is a complementary and meta-textual layer of collaboration, shifting local traumas to become a potent means of global feminist solidarity. In conclusion, Dalit feminisms are an empowerment that is collective, and they produce a radical epistemology that does not accept the historical marginalisation of Dalits to be an individualized situation, but rather a collective emancipatory project which can be challenged and decentered by the global paradigm of defining literature as subaltern literature.

**Keywords :** Dalit feminism, testimonio, intersectionality, translation politics, life writing

## Introduction

Dalit women's struggles have been denied their voice in the dominant feminist debates in India and the anti-caste ones in India and abroad.The lived experiences of Dalit women are only heard at the periphery, in silences, of mainstream Indian feminist discourse and of anti-caste movements which are male dominated. Dalit women have been the voice of others for too long, as they are

subjected to the multiple mechanisms of caste violence and patriarchal subjugation. But the voices of contemporary Dalit women writers; primarily Bama, Baby Kamble and Urmila Pawar have broken this silence. These texts are more than self-reflection: they are a collective archive of resistance and remembrance. The autobiography has usually been used in the Western literary sphere as a means of celebrating the individual self, the sovereign. Contrastingly, Dalit women's literature is a testimonio, which is a form of narration that takes up a political act of questioning the 'I' and displacing it with a collective 'We', a narration that incorporates personal memory, the forgotten history of the entire community.

This paper examines the narratives of Dalit women and their revisioning of the notion of collaboration as a main literary theme and as a radical approach towards survival. This paper examines the way writers such as Bama and Kamble engage with the double oppression of Brahmanical patriarchy, inspired by the pioneering critiques of single-axis frameworks by Kimberlé Crenshaw (1989) and the imperative upon Dalit women of having to "talk differently" urged by Gopal Guru (1995). In addition, such partnerships influence the text beyond the confines of the book, in the act of politics. These are regional stories that circulate between languages and cultures, and as translators they are co-conspirators in the establishment of transnational feminist coalitions, who confront the difficult politics of representation. In conclusion, this paper suggests that the concept of collaboration is embedded within Dalit feminist literature and is both textually and meta-textually deployed to produce a radical epistemology, a radical epistemology which creates political power out of generational trauma and collective renewal out of intersectional marginalisation.

**Theoretical Framework: Intersectionality and the Epistemology of the Marginalized**

The first step toward understanding the radical character of modern Dalit women's life writing is to challenge and subvert the dominant analytical frameworks resting on a single axis that have so far clouded the lived experience of Dalits. Kimberlé Crenshaw is the author of a groundbreaking attack on Western antidiscrimination doctrine, in which she shows how to analyze the intersection of race and gender to effectively erase multiple burdened subjects. The single-axis approach, Crenshaw says, underscores issues of race discrimination through the eyes of otherwise-privileged black men and of sex discrimination through the eyes of race- and class-privileged white women. Thus multiple disadvantaged subjects are left in an unprotected margin, where their special subordination has to be filtered through the strait categories which lack the capacity for compound discrimination. The systemic erasure has a direct parallel in the socio-literary world of the South Asian region where Dalit women face a different type of oppression. Gopal Guru's answer to this structural problem is to historicize it by arguing that Dalit women have to talk differently since they have different struggles which are simultaneously homogenized by others (non-Dalit) and suppressed by others (Dalit). Sexual and physical violence are significantly aggravated by the caste, and mainstream Indian feminist discourse, which usually has the voice of upper caste, urban, middle class Indians is largely oblivious to this. On the other hand, the Dalit male leaders within the internal anti-caste political and cultural movements have always diminished, rejected and stifled freedom of political and literary expression of Dalit women, mirroring the same mechanisms of exclusion by their high caste opponents. To fill this theoretical gap between the two, Sharmila Rege theorizes the structural mechanism of 'Brahmanical patriarchy', a society that authorizes caste hierarchy and gender subjugation, mainly through strict regulation of women's sexuality, work and their endogamous marriage patterns (Ambedkar & Rege, 2013). Thus, Dalit women do not experience the

cumulative effect of caste and gender discrimination; rather, they are in a special position at the bottom of the hierarchy, as Guru argues from an epistemological perspective, giving them an epistemic privilege. Due to their weak position in society, they have to see the social reality in a broader perspective in order to sustain their lives and to keep living in these terms, their life writing deviates from the Western individualistic-bourgeois model of life writing. Instead, it can be expressed as a radical narrative practice, one willfully displaces the singular, isolated "I" and seeks to express a collective, historically repressed memory of the whole community, as Rege calls it, a testimonio (Ambedkar & Rege, 2013).

**The Collective "We" and the Testimonio as Narrative Resistance**

The main narrative approach in Dalit women's literature is the collective "we" that displaces the bourgeois, individualist autobiographical "I". The autobiography in Western literature is a monument of the sovereign, self-actualizing individual while Dalit women's life writing can be seen as a testimonio, a form of literature in which the individual is not a single actant but a representative actant of a history of trauma and survival (Ambedkar & Rege, 2013). Collectivization of this narrative is vividly realised in the two texts of Baby Kamble's *The Prisons We Broke* and *Sangati* of Bama, where the two texts provide a framework of collaboration that is textually and socio-politically reflective of subaltern conditions.

*The Prisons We Broke* takes the focus off Kamble, and instead represents the awakening of the entire Mahar community led by Dr. B.R. Ambedkar (Kâmbale & Pandit, 2020). Her voice is the voice of the past, of an entire generation of suffering: the Mahar, who are a group of women.Her voice is the voice of the past, the voice of an entire generation of suffering and that of a group of women called Mahar. Kamble brings out the internal patriarchy of Dalit community and how it is structurally connected to the external Brahammanical exploitation. Kamble's narration makes clear its intent to resist the sanitisation of subaltern history, by documenting the visceral aspects of domestic violence, physical mutilation and the humiliation of day-to-day foraging by the poor for scraps by the rich. The text is a collective and therefore a collaborative witness, since the voice of the author is continuously replaced by the voice of the Mahar women as the "We" of the group and the "We" of the community of witnesses.

With its episodic and open-ended narrative, Bama's *Sangati*, too, plays with the traditional generic conventions to mirror the communal living spaces of Paraiyar women (Bama et al., 2016). The narrative does not have a specific main character, rather a chorus of women, like Vellaiyamma (Paati), Pecchiamma and Maikkanni, each of whom recounts a tale of labour exploitation, domestic abuse and demonic possession that merges to create one cohesive, durable community portrait. A colloquial, colorful form of writing that retains the oral tradition of storytelling in her village is used by Bama, who sees writing as an extension of the community's spoken language. This is the language strategy which directly challenges the upper-caste homogenization of women's experiences and challenges Dalit Patriarchy that seeks to silence women's voices, as espoused by Gopal Guru (1995). In this collective framing Sangati argues that subaltern survival is a process that is always collective, that the struggle against official violence and or the local currents of discrimination is always collective, that the defense of the subaltern is always collective.

**Memory, Education, and the Epistemology of Survival**

When the structural transformation of individual to collective is used as the story line of Dalit women's testimonio, the thematic theme of this resistance is the fight for intellectual independence.

The Indian education system has played an important role historically in the denial of education as a strategy to enslave Dalit communities.Education system has been and continues to be an important system of Brahmanical patriarchy in alienating Dalit communities from the means of knowledge production. Shailaja Paik (2014) conceptualises this particular historical trauma as a double discrimination in that Dalits are denied the opportunity to improve their intellectual skills in the public sphere due to upper-caste dominance and in the private sphere due to patriarchal education system which favours the education of females which involve housework. In this context, writing and collective recall of community memory becomes a radical epistemology of survival, a means of collectively renewing history and recollection, of making the trauma of exclusion a means to collective renewal.

The trajectory is foregrounded in Baby Kamble's *The Prisons We Broke*, in which the concept of education is not only understood as institutional literacy, but as the ontological awakening of the self-respect of Ambedkarites (Kâmbale & Pandit, 2020). Kamble provides a detailed account of the complete deprivation of intellectual nourishment from the minds of the Mahar women before they were mobilized by B.R. Ambedkar. The narrative reveals the community's deeply entrenched fatalism, superstition, and ritualistic subjugation, which makes it difficult for subalterns to engage in resistance. But Kamble does not dwell on this history in order to blame the Mahar women; she writes her testimonio in a way that is more collective than personal, in order to recall their enslavements in the process of articulating their common emancipation via education. This becomes a community archive of collective renewal as the community responds to Ambedkar's appeal to educate their children. The writing by Kamble is the culmination of this educational triumph, of a process of collective memory creation which makes this event a permanent imprint of the Mahar women's political awakening.

In fact, Bama's Karukku explores the phenomenon of education as a space in which the caste hierarchy is being passed down, in an indirect yet violent manner (Bama et al., 2016). As Kamble delves into the denial of education, Bama strives to find a path through it. The Catholic Church and its convent schools in Karukku appear to be spiritual and educational uplifting zones, but are actually thoroughly permeated by a Brahmanical prejudice. Through Bama's own journey towards education and spiritual fulfillment, it is always interrupted by the recognition that the pedagogical places that Bama lives in require the eradication of her Dalitness. It is an epistemic disjuncture when she finally leaves the convent. Bama's use of the colorful, village-style Tamil of her native land, rather than the Church-approved, sanitized language of the day, restores her intellectual independence through the medium of her writing, in which she writes in the language of her home.

Both authors in their respective memoirs, show that for Dalit women, education and memory are not separate, individual endeavours. As the trauma of intellectual disenfranchisement was collective under the constraints of double discrimination (Paik, 2014), the remedy needs to be collective as well. Writing is a pedagogical act, a pedagogical action that teaches to future generations how to break the interlocking mechanisms of caste and gender to land their ideas on their own realities.

**Translation as Transnational Political Collaboration**

The co-construction of Dalit women's life writing goes beyond the internal framework of the testimonio; the politics of translation is a meta-textual way of emphasizing the collaboration. Translation is not understood as a neutral linguistic transformation but as a highly controversial space of

negotiation of ideology in which texts can challenge or reinforce the hegemonic power relations (Evans & Fernández, 2018). It is a radical act of border crossing for Dalit women, whose voices have been heard within the regional linguistic borders and are now being translated into English all around the world. In this context, the translators function as political allies and act as connectors between local and transnational feminist solidarity and local trauma, without erasing the particularities of caste oppression.

In the case of Lakshmi Holmström's English translations of Bama's *Karukku* (2016) and *Sangati* (2012), this collaborative process is apparent in the way she has translated the Bangla words from the original series. The works of Bama in Tamil have earned great praise for their subversive use of the Paraiyar women's colloquial (not standard) Tamil, which actively resists the upper castes' literary homogenization. This subaltern cadence is subjugated to the standard English text may lead to the reproduction of the very erasure experienced by multiply burdened subjects that Kimberlé Crenshaw (1989) discusses as part of single axis frameworks, in which the rich complexities of these subjects are reduced to dominant language standards. Holmström plays a role in resisting Bama, as a co-conspirator, to counteract this. This translation has not been fluent in the sense of a seamless translation, and Holmström's attempts to remain faithful to the Dalit women's voice, using their own language, idioms, and kinship terms, as well as their episodic rhythms, challenges the global reader to speak the Dalit woman's voice. Thus the translation is a space of collaboration and feminist space, which retains the epistemic privilege of the marginalized.

Similarly, Maya Pandit's translation of Baby Kamble's *The Prisons We Broke* (2020) is an important intergenerational and cross-cultural bridge. Kamble's original Marathi text is very rooted in the local history in the mid-twentieth century of the Ambedkarite awakening of the Mahar community. Pandit's contribution to the collaborative endeavor is to make this localized "We" a transnational discourse, without losing its anti-caste thrust. The specific mechanisms of Brahmanical patriarchy (that determine the brutal physical and intellectual suppression of Mahar women) become legible to a world of analysis of intersectional systemic violence through translation. It is not enough for the translator to simply carry the text – she becomes an active contributor to the creation of an international archive of resistance.

Finally, this transnational flow does not result in Ghettoisation of Dalithood (Guru, 1995) which is the danger posed by the self-organization of Dalit women to their social location. Instead, it is a powerful solidarity network that spans the globe by the Dalit author, the subaltern community she represents, and the feminist translator. Translation which portrays these stories in a translingual and trans-locational way, helps to open up the space of the collaborative epistemology of Dalit women as not just a regional socio-historical phenomenon but as an important intervention in transnational feminist theory.

## Conclusion

Dalit women's life writing is an expression of resistance that is unwritten and deeply rooted in the very experience of writing and being an activist and a member of a community. The writers such as Baby Kamble and Bama, for instance, have been able to reshape the literary expression by transforming the bourgeois "I" with the communal "We. Their testimonios are not merely about their own victimisation, but they are all about the systemic shapes of Brahmanical patriarchy and double discrimination to re-claim their intellectual and spiritual autonomy in their communities. By doing so, these writings create a radical epistemology from the very margins of society, and show

that the deepest and broadest critiques of systemic power come from those who are most burdened by the intersecting effects of systemic power.

Furthermore, the dynamics of these stories are multiplied when they are translated together through the political.What's more, the power of these stories is magnified by their collaborative translation in the political. Translation acts as an act of negotiation and not just conversion and translators negotiate between local traumas and global discourse. In this meta-textual collaboration, lived experiences of Dalit women, specific to their caste, is in every sense part of the transnational feminist archive without missing its anti-caste rhythm. The orality, the public, the collective memory of the subaltern are not erased and not flattened, but kept alive and strengthened: a solid network of solidarity, forged around the globe, for the people who have been marginalized.

In conclusion, Dalit feminisms are an interdisciplinary and transnational critique of the world's academic and political analyses and debates that adhere to a single axis. The narratives of Dalit women call for a recognition of marginalisation as a crucible for collective renewal as well as for a site of suffering. Dalit women's literature is a testament to how their suffering, which endured over many centuries, has been turned into an untouchable political force; and how emancipation, which is always in the name of all, is always a collective struggle.

**Works Cited**


1. Ambedkar, B. R., & Sharmila Rege. (2013). *Against the madness of Manu : B.R. Ambedkar's writings on Brahmanical patriarchy*. Navayana Publishing Pvt. Ltd., New Delhi.
2. Bama. (2012). *Sangati* (HolmstromL., Trans.). Oxford University Press.
3. Bama, Lakshmi Holmstrom, & Mini Krishnan. (2016). *Karukku*. Oxford University Press.
4. Bebi Kambale, & Pandit, M. (2020). *The prisons we broke*. Orient Blackswan.
5. Crenshaw, K. (1989). Demarginalizing the Intersection of Race and Sex: A Black Feminist Critique of Antidiscrimination Doctrine, Feminist Theory and Antiracist Politics. *U. Chi. Legal F., 1989*(1), 139. https://scholarship.law.columbia.edu/faculty_scholarship/3007/
6. Evans, J., & Fernandez, F. (2018). *The Routledge Handbook of Translation and Politics*. Routledge.
7. Guru, G. (1995). Dalit Women Talk Differently. *Economic and Political Weekly, 30*(41/42), 2548–2550. https://www.jstor.org/stable/4403327
8. Paik, S. (2014). *Dalit Women's Education in Modern India*. Routledge.


★★★

భావవీణ
July 2026
Journal of Arts, Literary, Culture & Language Study
Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253
Web : www.bhavaveena.com






Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002.
Andhra Pradesh, Cell : 7386529274, 7989781963, Web : www.bhavaveena.com,
E-mail : parisodhanatelugu@gmail.com, Printed at : GLS Enterprises,
Guntur - 522 002. Ph. 9494 660 509.